సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

రిపబ్లిక్‌డే కి సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్ డిస్కౌంట్ సేల్‌లో 22.5% వరకు క్యాష్‌బ్యాక్ లభించడం ఈ రిపబ్లిక్‌డే సేల్ ప్రత్యేకత.

ఈనాడు

సోనోవిజన్ రిపబ్లిక్‌డే డిస్కౌంట్ సేల్

రిపబ్లిక్‌డే కి సోనోవిజన్ అందించే డిస్కౌంట్‌లో అన్ని కంపెనీల LED, వాషింగ్‌మెషిన్స్, రిఫ్రిజిరేటర్స్, AC, ఎయిర్ కూలర్స్, మొబైల్స్&ల్యాప్‌టాప్స్ అత్యధిక డిస్కౌంట్‌తో లభిస్తున్నాయి. 0% ఫైనాన్స్ సదుపాయం కూడా ఉంది.

విజయవాడ 25-1-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 165

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్ అందించే అతిపెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్

సోనోవిజన్

రిపబ్లిక్ డే డిస్కౌంట్ సేల్

అతి తక్కువ ధరలు
Lowest Prices
GUARANTEED
Best Service
నమ్మకమైన సర్వీస్

HAPPY Republic Day

Upto 15000/- క్యాష్‌బ్యాక్
BAJAJ FINSERV
1 EMI FREE
బజాజ్ ఫైనాన్స్ కొనుగోలుదారులకు, క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు
Starting EMI 888/-

Upto 21000/- క్యాష్‌బ్యాక్
HDB FINANCIAL SERVICES
1 EMI FREE
క్రెడిట్ కార్డ్ మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, HDB ఫైనాన్స్ కొనుగోలుదారులకు

Upto 30000/- క్యాష్‌బ్యాక్
IDFC FIRST Bank
1 EMI FREE
క్రెడిట్ కార్డ్ మరియు ఇతర ఫైనాన్స్ కొనుగోలుదారులకు, IDFC కొనుగోలుదారులకు

22.5% క్యాష్‌బ్యాక్
అన్నీ క్రెడిట్ కార్డ్ కొనుగోలుదారులకు, సెలెక్టెడ్ మోడల్స్‌పై

UP TO ₹6,000 INSTANT DISCOUNT# SBI card
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹6,000 per card; Also valid on EMI Trxns.; Validity: 27 Dec 2025 - 26 Jan 2026. T&C Apply.

Conditions apply

LED UHD 4K Smart Tv's

LG: 195 Cm (77") Ultra HD 4K OLED; Home Theatre; 139 Cm (55") Ultra HD 4K Smart

SAMSUNG: 189 Cm (75") LED 4K Ultra UHD

SONY: 164 Cm (65") LED 4K Ultra HD Smart

Panasonic: 108 Cm (43") LED 4K HD

LLOYD: 108 Cm (43") Ultra 4K Google LED

TCL: 108 Cm (43") 4K Google LED

Haier: 108 Cm (43") UHD Google LED

Refrigerators

LG SAMSUNG Whirlpool Haier Godrej VOLTAS beko LLOYD

SBS Ref. 630 Ltrs | SBS Ref. 650 Ltrs | FF Ref. 272 Ltrs | DC Ref. 210 Ltrs | DC Ref. 188 Ltrs

Washing Machines

LG SAMSUNG BOSCH IFB Whirlpool LLOYD

Automatic Washing Machines

12/7 KG Front Load | 9 KG Front Load | 7 KG Top Load | 7 KG Semi Load

Air Conditioner

LG LLOYD BLUE STAR VOLTAS DAIKIN Godrej HITACHI

5Star & 3Star Inverter A.C's

5Star & 3Star Inverter A.C's

5Star & 3Star Inverter A.C's

Mobile Phones

vivo: 5G V-60e. Upto 10% Cash Back. 9/0, 10/2, 12/4 Schemes Available

oppo: 5G F-31, F-31 Pro+. 6/0, 7/0, 8/0, 11/2 Schemes Available

iPhone: 17, 17 Pro Upto 4000/- Cash Back; 17 Pro Max Upto 3000/- Cash Back; iPhone Air New Arrival. 9/0, 12/0, 24/0 Schemes Available SBI, ICICI, Kotak Credit Cards and Selected Bank Cards (Exchange Bonus)

SAMSUNG: S-25 Ultra 5G Discount Upto 10000/-; A-56 5G Instant Discount Upto 3000/-. 9/0, 12/0, 24/0 Schemes Available

ONEPLUS: 5G 15. CashBack 4500/- SBI, RBL Credit Card. 12/4 Scheme Available

realme: 5G 16 Pro, 16 Pro+. 6/0, 8/2, 10/3 Schemes Available

Redmi: 5G Note 15 Series. 6/0, 8/0, 10/2, 12/4 Schemes Available

Laptops & Mobile Accessories

Upto 10000/- cashback on Laptops

hp 12/4 Scheme Available

Lenovo 12/4 Scheme Available

DELL 15/5 Scheme Available

ASUS 12/4 Scheme Available

MacBook 24/0 Scheme Available

Smart Watch, Ear Buds

Mobile Accessories Boat, Realme, Fastrack, Hapipola

boAt JBL Sound Bar

Conditions apply

అందరికన్న తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీస్‌తో అందరి అభిమానం పొందిన షోరూం సోనోవిజన్

మా నూతన ప్రారంభమైన షోరూంల కు ఆహ్వానం

ఏలూరు రోడ్డు, ఎనికేపాడు, విజయవాడ. 8712416250, 51, 52.

దుర్గా ప్లాజా, యం.జి. రోడ్, పటమట, విజయవాడ. 8712417841

విజయవాడ, విజయప్లాజా, ఏలూరు రోడ్, విజయవాడ 9154281648, 649, 650.	విజయవాడ, ఏలూరు రోడ్, రామమందిరం దగ్గర. 9440804182, 9246666202	విజయవాడ, ప్రియదర్శిని థియేటర్ బిల్డింగ్, అరండల్‌పేట. 9246666664, 9100991701, 9440804184	విజయవాడ, యం.జి.రోడ్, ఆల్ ఇండియా రేడియో ఎదురు. 9246666203, 9154281640	
విజయవాడ, పటమట, మోహన్‌దాస్ థియేటర్ దగ్గర. 9246661616, 9100991702	విజయవాడ, కంట్రోల్ రూమ్ దగ్గర, యం.జి.రోడ్ 9440804183, 9246666209	గొల్లపూడి, ఆంధ్రహాస్పిటల్ బిల్డింగ్. 8333924930, 9154281628	విజయవాడ, కానూరు, యం.జి.రోడ్. 8712600536, 8712600537,	శ్రీనగర్ కాలని, రింగ్ రోడ్డు, విజయవాడ. 8712600531, 32, 33
మెయిన్ రోడ్డు, చికిత్స హాస్పిటల్ దగ్గర, పాయకాపురం. విజయవాడ. ఫోన్: 8712648704, 05, 06.	ఎనికేపాడు - 1, ఏలూరు రోడ్, విజయవాడ. 9100991703, 9154281626	పోరంకి, మెయిన్ రోడ్ సెంటర్. 9154281645, 46, 47	కనకదుర్గమ్మ వారధి దగ్గర, తాడేపల్లి. 7331149366, 367, 368	గుడివాడ, ఏలూరు రోడ్. 9154281178, 79
మచిలీపట్నం, కోనేరు సెంటర్, మునిసిపల్ పార్క్ ఎదురు. 7331149379, 80, 81				


ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 25-1-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 165
రూ. 8-00 పేజీలు 18+28
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

రాజధాని రెండో దశ.. 709 చ.కి.మీ.లకు మాస్టర్‌ప్లాన్

దీని పరిధిలో 50 గ్రామాలు, 1.75 లక్షల ఎకరాలు


- ప్రస్తుతం 7 గ్రామాల్లోనే భూసమీకరణ
- భవిష్యత్తులో ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి విస్తరణ ప్రణాళికలో భాగంగా రెండో దశలో మొత్తం 709.6 చదరపు కిలోమీటర్ల ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నారు. ఈ పరిధిలో రెండో దశలో ప్రస్తుతం భూసమీకరణ చేస్తున్న ఏడు గ్రామాలు సహా మొత్తం 50 గ్రామాలున్నాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆ ప్రాంతాన్ని నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేయడం, రహదారులు వంటి మౌలిక వసతుల్ని అభివృద్ధి చేసి, రాజధానితో అనుసంధానించడం లక్ష్యంగా 709.6 చ.కి.మీ.ల ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. అంతేతప్ప మొత్తం 50 గ్రామాల్లోని భూముల్ని ఇప్పటికిప్పుడు రాజధాని కోసం తీసుకోవడానికి కాదు. రాజధానిని ఆనుకుని ఉత్తరాన కృష్ణా నది నుంచి దక్షిణాన అవుటర్‌రింగ్ రోడ్డు వరకు, తూర్పున (మిగతా 2లో)



అమరావతిలో జ్యోతిరావు ఫులే స్మృతివనం

ఏప్రిల్ 11న చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన: మంత్రి సవిత లోపలి పేజీలో



అమ్మా నాన్నా... పాసవుదాం పదండి!

త్వరలోనే కీలకమైన ఇంటర్, టెన్త్ ఎగ్జామ్స్...

పిల్లలకే కాదు... అటు టీచర్లకు, ఇటు తల్లిదండ్రులకూ పరీక్షాకాలం. ఈ సమయంలో... మావాడు సరిగ్గా చదవట్లేదని, మా అమ్మాయి ఇబ్బంది పడుతోందని.. వారితో పాటు టెన్షన్ పడకుండా తల్లిదండ్రులు వ్యూహాత్మకంగా ఉండాలి. (మిగతా 2లో)

పాసు పుస్తకాలపై ఫొటోలకు ₹700 కోట్లా!

- అన్నక్యాంటీన్లు తీసేశారు.. శ్రీవారి ప్రసాదాన్నీ కల్తీ చేశారు
- జగన్‌ను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు
- కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యుత్తు ఛార్జీలు పెంచదు
- నగరి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సభలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ

ఈనాడు, చిత్తూరు: గత పాలకుడు (జగన్) ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ప్రజల భూములు కొట్టేయాలని చూశారని.. రూ.700 కోట్లతో రీసర్వే జరిపి పట్టాదారు పాసుపుస్తకాలపై ఆయన ఫొటో వేసుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. అందుకే ఎన్నికలకు ముందు కర్నూలులో పట్టాదారు పాసుపుస్తకాన్ని కాల్చేశానన్నారు. తన 48 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి వ్యక్తిని చూడలేదని ధ్వజమెత్తారు. (మిగతా 2లో)


నగరిలో స్టాల్స్ వద్ద మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు

ఫిబ్రవరి 14న బడ్జెట్?

11 నుంచి అసెంబ్లీ సమావేశాలు

ఈనాడు, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. 14వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మార్చి రెండో వారాంతం వరకు ఈ సమావేశాలు నిర్వహించవచ్చని అంటున్నారు. మొత్తమ్మీద 18 నుంచి 21 పనిదినాలు వచ్చేలా ఈ సమావేశాలు ఉండొచ్చని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. తొలి రోజున ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. (మిగతా 2లో)

భారతి సిమెంట్ అడ్డగోలు వాదన

- నిబంధనల ప్రకారమే రెండు లీజులు పొందామంటూ వివరణ
- కేంద్ర గనులశాఖ రూల్స్ ప్రకారం ఇది ఉల్లంఘనే
- ఏసీసీ, రామ్‌కో సిమెంట్ లీజులదీ ఇదే తీరు
- ప్రభుత్వానికి నివేదించిన అధికారులు
- లీజుల రద్దుకు ఉత్తర్వులు ఇవ్వడమే తరువాయి

ఈనాడు, అమరావతి: కేంద్ర గనులశాఖ నిబంధన ఉల్లంఘించి, 2024లో సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వంలో ఆయన సతీమణి భారతిరెడ్డి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్ రెండు సున్నపురాయి లీజులు పొందగా.. అందులో తప్పులేదంటూ ఆ కంపెనీ అడ్డగోలుగా వాదించింది. నిబంధనల ప్రకారమే లీజులు పొందామంటూ ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది. ఆ వివరాలు పరిశీలించిన గనులశాఖ అధికారులు.. 2015లో కేంద్ర గనులశాఖ తీసుకొచ్చిన కొత్త నిబంధనను భారతి సిమెంట్ ఉల్లంఘించినట్లుగా తేల్చింది. (మిగతా 2లో)

అమ్మా నాన్నా... పాసవుదాం పదండి!

(మొదటిపేజీ తరువాయి) సంక్రాంతి సెలవులు పూర్తయ్యాయంటే ఇక విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల సమయం ఆసన్నమైనట్లే. ఇప్పటికే ఇంటర్, పదో తరగతి పరీక్షల టైం టేబుళ్లను ప్రభుత్వాలు ప్రకటించేశాయి. దాదాపు ఏప్రిల్ నెలాఖరు వరకు ఇటు విద్యార్థులకు, అటు తల్లిదండ్రులకూ పరీక్షా సమయమే. ఉన్న సమయాన్ని సరిగా సద్వినియోగం చేసుకోవడం విద్యార్థులకు ఎంత ముఖ్యమో, వారి సమయం సద్వినియోగమయ్యేలా చూడటం, వారికి అవసరమైన అండదండలు అందించడం, నైతికంగా మద్దతుగా నిలిచి వారి భయాలు పోగొట్టడం తల్లిదండ్రుల కర్తవ్యం.

ప్రిపరేషన్‌కు 5 మెట్లు...

1 పరీక్షలకు సమయం ముంచుకొస్తోంది. ఈ సమయంలో విద్యాసంస్థలు ర్యాంకుల కోసం, వందశాతం ఫలితాలపై శ్రద్ధ పెడతాయి. టీచర్లపైనా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. దీంతో మన పిల్లలపై ప్రత్యేకంగా శ్రద్ధపెట్టే అవకాశం వారికి ఉండట్లేదు. స్టడీ అవర్స్ పేరుతో 10... 12 గంటల పాటు స్కూల్‌లోనో, కాలేజీలోనో ఉన్నా సమయం సద్వినియోగం కాకపోవచ్చు. తల్లిదండ్రులుగా మనం దృష్టిపెడితేనే సరైన ఫలితం సాధ్యమవుతుంది.

2 విద్యార్థులందరినీ ఒకే గాటన గట్టి ప్రిపరేషన్ నిర్దేశిస్తున్నారు. దీని వల్ల నష్టమే తప్ప- ఉపయోగం లేదు. ప్రతి విద్యార్థికి ప్రిపరేషన్‌లో, పాఠ్యాంశాల్లో వేర్వేరు ఇబ్బందులు ఉంటాయి. కీలక సమయంలో అందరినీ ఒకటే చదవమనడం, ఒకటే పాఠ్యాంశంపై ఎక్సర్‌సైజ్ చేయించడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. ముందు ఏ విద్యార్థికి ఏ ఇబ్బందులు ఉన్నాయో గమనించి వాటిని పరిష్కరించాలి.

3 మన పిల్లల సహజ సామర్థ్యం ఏమిటో మనకు తెలిసి ఉండాలి. త్రైమాసిక, అర్ధ సంవత్సర పరీక్షల్లో మన పిల్లలు ఏ సబ్జెక్టుల్లో ఎన్ని మార్కులు తెచ్చుకున్నారో గమనించాలి. ఇప్పటికిప్పుడు వారి సామర్థ్యాన్నీ పెంచలేం కాబట్టి ఉన్న కొద్దిపాటి సమయంలో వారిని ఎలా తీర్చిదిద్దాలన్నది ఆలోచించాలి. హఠాత్తుగా ఒత్తిడి పెంచడం వల్ల నష్టమే తప్ప ఉపయోగం ఉండదని గుర్తించాలి.

4 సామర్థ్యం ఉన్నా కృషిచేయక తక్కువ మార్కులు వచ్చే విద్యార్థులు కొందరైతే.... కృషి చేసినా పాఠాలు సరిగా అర్థం చేసుకోలేక నష్టపోయేవారు ఇంకొందరు. ఇందులో మన పిల్లలు ఏ జాబితాలో ఉన్నారో చూసుకోవాలి. విద్యార్థి లోపం, పాఠశాల లోపం, టీచర్ లోపం, తల్లిదండ్రుల లోపం... ఏది ప్రభావం చూపుతోందో తల్లిదండ్రులుగా మనం పరిశీలించాలి. సమస్యను గుర్తిస్తే పరిష్కారం కూడా తేలికవుతుంది.

5 తల్లిదండ్రులు పిల్లలతో సబ్జెక్టుల వారీగా మాట్లాడాలి. వారు చెప్పేది శ్రద్ధగా ఆలకించాలి. ఎక్కడ వెనకబడుతున్నారో గమనించాలి. ఇప్పటివరకు వాళ్లు రాసిన పరీక్షా పత్రాలను క్షుణ్నంగా పరిశీలించి ఎక్కడ ఎక్కువ మార్కులు వస్తున్నాయి... ఎక్కడ, ఎందుకు తగ్గుతున్నాయో గుర్తించాలి. ఆయా సబ్జెక్టు టీచర్లతో మాట్లాడి, రివిజన్ చేయించాలి. ఇప్పుడు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో పాఠాలు బోధిస్తున్న వారున్నారు. అవసరమైతే వారి సహకారం కూడా తీసుకోవచ్చు.



● ఇప్పుడు విద్యార్థులందరి చేతుల్లో మొబైల్స్ ఉంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. ప్రతి విషయాన్నీ అందులో పంచుకుంటున్నారు. ఇవీ విపరీతంగా ఒత్తిడిని పెంచుతున్నాయి. చర్చలు, ఛాటింగ్‌లతో సమయమంతా వృథా అవుతుంది. తెలియని ఉద్వేగం మొదలవుతుంది. అందుకే పరీక్షలు ముగిసే వరకూ పిల్లలకు నో మొబైల్ డేస్ ప్రకటించండి.

● పరీక్షల ఒత్తిడితో పిల్లలు సరిగ్గా తినరు. హడావుడిగా నాలుగు ముద్దలు తినడం, నిద్ర రాకుండా ఉండేందుకు కాఫీ, టీలు తాగడం వంటివి చేస్తుంటారు. కానీ మెదడు చురుగ్గా ఉండాలంటే తగినంత సమయం నిద్రకు కేటాయించాలి. కాసేపు వ్యాయామం చేయాలి. కుటుంబంతో కాసేపు ఆహ్లాదంగా గడపడం కూడా ముఖ్యమే. శీతల పానీయాలు, కాఫీ, టీ, జంక్‌ఫుడ్, కేకులకు దూరంగా ఉంచండి. మంచి పోషకాహారం వారికి అందేలా జాగ్రత్తలు తీసుకోండి.

పరీక్షల్లో విజయం సాధించాలంటే విషయ ప్రణాళికతో పాటు, సమయ ప్రణాళిక కూడా ఉండాలి. సమయ ప్రణాళిక అంటే మనకు అందుబాటులో ఉన్న సమయాన్ని సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలి అని ప్రణాళిక వేసుకోవడం.

విషయ ప్రణాళిక అంటే మనముందున్న సిలబస్‌ను ఎక్కడ మొదలు పెట్టి, ఎక్కడ ముగించాలి అనే ప్రణాళిక వేసుకోవడం. ఈ రెండూ సరిగ్గా ఉంటే... మంచి ఫలితం పిల్లల సొంతమవడం ఖాయం.

\- ఈనాడు, అమరావతి

పాసు పుస్తకాలపై ఫొటోలకు ₹700 కోట్లా!

(మొదటి పేజీ తరువాయి)

'నిన్న ఆయన (జగన్) మీడియా సమావేశం నిర్వహించారు. నేను చేతకాని వాడినట, నాతో తెలియదంట. ఇప్పుడు ఆయనతో పోటీ పడలేపోతున్నా న్నారు. అప్పుల్లాంటివి రద్దుచేశారు. ల్యాండ్, మైన్, వైన్, శాండ్.. అన్నింటినీ దోచేశారు. ఇలాంటి చెత్త పనులు చేయడంలో మీతో పోటీపడాలా' అని వైకాపా అధినేత జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు మాటల వ్యాఖ్యలు చేశారు. చిత్తూరు జిల్లా నగరిలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో శనివారం 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీల్లో నిర్మించిన ప్రాజెక్టులను ఆయన ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు. హరిత రాయబారులు రాజేంద్రన్, మునిరత్నం, నారాయణమ్మ, పార్వతి, నాగరాజులను సన్మానించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. షెడ్యూల్లో ఉన్న నగరి ప్రాంతీయ సుపత్రి ప్రారంభోత్సవం సీఎం రద్దు చేసుకున్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు



అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో నెలవల విజయశ్రీ, పులివర్తి నాని, పట్టాభి, గాలి భానుప్రకాశ్

రెండేళ్లలో నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళ్లు

'2028 నాటికి నా రాజకీయ ప్రస్థానానికి 50 ఏళ్లు. నేను తరచూ దావోస్ వెళ్లి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొస్తున్నా. 18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25% మనకే వచ్చాయి. త్వరలో ఏఐ డాక్టర్ వస్తాడు. సంజీవని ప్రాజెక్టుతో మీ ఆరోగ్యాన్ని కాపాడతా. 20 లక్షల ఎకరాల్లో ప్రకృతిసేద్యం చేస్తున్న రాష్ట్రం మనది ఒక్కటే' అని ముఖ్యమంత్రి తెలిపారు.

ఎక్కువ సంతానముంటేనే ఎన్నికల్లో పోటీ

'దేశవ్యాప్తంగా భూగర్భజలాల నాణ్యత గురించి ఓ నివేదిక వచ్చింది. రాష్ట్రంలో ఉన్న భూముల్లో 9.8% లవణీయత, 8.99% ఫ్లోరైడ్, 24% నైట్రోజన్ ఉన్నాయి. యూరియా, రసాయన ఎరువులతోనే ఈ పరిస్థితి వచ్చింది. దీన్ని అరికట్టేందుకు ఓ పాలసీ తెస్తా. జనాభా పెరుగుదలకు మరో పాలసీ అమలు చేస్తా. గతంలో ఇద్దరు కంటే ఎక్కువమంది పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయరాదనే నిబంధన తెచ్చా. ఇప్పుడు ఒకరి కంటే ఎక్కువమంది పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీచేసే పరిస్థితి ఉంటుంది' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని ఆగదు

'అమరావతిపై జగన్ మాట ముళ్లులాంటి ఆయన ఇప్పుడు అడ్డుకుంటామని అంటున్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాజధాని ఆగదు. గతంలో రూ.32వేల కోట్ల మేర విద్యుత్తు భారాన్ని మోపారు. రూ.1.20 లక్షల కోట్ల అప్పులు చేశారు. గతంలో విధించిన రూ.4,600 కోట్ల ట్రూఅప్ చార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటికే యూనిట్‌కు 39 పైసలు తగ్గించాం. ఏ పరిస్థితుల్లోనూ విద్యుత్తు చార్జీలు పెంచం. ఇప్పుడు రాష్ట్రంలో గంజాయి సాగు లేదు. ఈగల్‌తో ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రభుత్వోద్యోగులకు పెట్టిన రూ.25వేల కోట్ల బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

స్వచ్ఛాంధ్ర జీవనవిధానంలో భాగం కావాలి

'స్వచ్ఛాంధ్ర మన జీవనవిధానం కావాలి. ప్రతి మూడో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు అన్నీ వచ్చే ప్రజలకు డంపింగ్ యార్డుల సమస్య ఉండదు. 2026 మార్చి నాటికి 10 లక్షల టన్నుల సేంద్రియ వ్యర్థాల నిర్వహణను పాటించేలా ప్రోత్సహిస్తా. పంచాయతీరాజ్ శాఖమంత్రిగా పవన్‌కల్యాణ్ ఉన్నారు. నాలుగేళ్లలో 26వేల కిలోమీటర్ల డ్రెయిన్లను నిర్మిస్తాం. ప్రపంచస్థాయి ప్రమాణాలతో రోడ్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తాం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

● బంగారు కుటుంబాలైన దసలర్ని, గజేష్‌లను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చిన ధనంజయరాజు, సాయికుమార్‌లను సీఎం ఈ సందర్భంగా అభినందించారు. డిగ్రీ చదివి ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉన్న గజేష్‌కు ఐటీ ఉద్యోగి సాయికుమార్ తన సంస్థలో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం ఇవ్వడంతోపాటు భాగస్వామ్యం ఇస్తానని చెప్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడీ, చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాశ్, థామస్, మురళీ మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేను చేసిందే నాకు ఉపన్యసిస్తున్నారని చురకలు

వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ వ్యవసాయం గురించి సీఎంకు వివరిస్తుండగా ఆయన కొన్ని ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానం ఇవ్వలేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కేంద్రం ఇచ్చిన నిధులు ఎక్కువగా ఎందుకు ఖర్చు చేయడంలేదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్‌ను ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా పట్టాభిని ఉద్దేశించి.. మాటలకు పరిమితం కాకుండా అమలుపై దృష్టిసారించాలని, అప్పుడే సరైన నాయకులు అవుతారని సూచించారు. నేను చేసిందే నాకు ఉపన్యసిస్తున్నారంటూ చురకలు అంటించారు.

నల్లమలలో ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

ముగ్గురు సానుభూతిపరులు కూడా...




సలోమన్

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో ఇద్దరు మావోయిస్టు నేతలతో పాటు ముగ్గురు సానుభూతిపరులను తెలంగాణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ వివరాలు వెల్లడించారు. "మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సలోమన్, అతడి భార్య సన్‌బట్టి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలో సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు నిఘా పెట్టాం. అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ వైపు నుంచి అచ్చంపేట వైపు కారులో వస్తుండగా వారిద్దరితో పాటు ముగ్గురు సానుభూతిపరులు ఎడ్ల అంబయ్య, జక్క బాలయ్య, మనిశెట్టి యాదయ్యలను అరెస్టు చేసి రిమాండుకు తరలించాం. రూ.1.25 లక్షల నగదు, కారు, 20 ఏకె-47 బుల్లెట్లు, ఐదు జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన మీసాల సలోమన్ ఎలియాస్ సంతోష్ ఎలియాస్ నాగరాజ్ 1994లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాకు చెందిన సన్‌బట్టి 2005 నుంచి పార్టీలో పనిచేస్తున్నారు. 1999లో బొల్లపల్లి మండలం రెమిడిచెర్ల శివారులో పోలీసు వాహనం పేలి 10 మంది పోలీసులు మృతి చెందిన ఘటనలో, 2014లో కాసల్‌పాడు శివారులో 14 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి ఘటనలో, 2016లో కిష్టారం మండలం గాజులగుట్ట శివారులో ఐదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి ఘటనలో, 2020లో మినప్పా శివారు ప్రాంతంలో 17 మంది డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ జవాన్ల మృతి ఘటనలో, 2021లో ఐదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల మృతి ఘటనలో సలోమన్ ప్రమేయం ఉంది. సలోమన్‌పై రూ.20 లక్షలు, సన్‌బట్టిపై రూ.8 లక్షల రివార్డు ఉంది.

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ....

నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన ఎడ్ల అంబయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తెలంగాణ ప్రజాఫ్రంట్ కో-కన్వీనర్‌గా పని చేస్తున్నారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరుకు చెందిన జక్క బాలయ్య, లింగాల మండలంలోని క్యాంపు రాయవరం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు మనిశెట్టి యాదయ్యలు కొంతకాలంగా మావోయిస్టులకు సహకరించడమే కాకుండా వారికి ఆశ్రయం కల్పించారు" అని ఎస్పీ వివరించారు.

ప్రముఖ కళా విమర్శకులు వెనిగళ్ల కన్నుమూత



ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ కళా విమర్శకులు వెనిగళ్ల వెంకటరత్నం (80) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి సమీపాన ఉన్న గోవాడలో పుట్టి పెరిగిన ఆయన.. కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కాలమిస్టుగా పత్రికల్లో పలు వ్యాసాలు రాశారు. కొద్దికాలంగా హైదరాబాద్ చర్లపల్లి సమీపంలోని విద్యా హెల్త్ కేర్ సెంటర్‌లో ఉంటున్నారు. మూడు రోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వెంకటరత్నం.. శనివారం మరణించారు. మృతదేహాన్ని పటాన్‌చెరులోని టీఆర్‌ఆర్ ఆసుపత్రిలో ఉంచారు. ఆయన కుమార్తె సౌజన్య అమెరికా నుంచి వచ్చాక భౌతికకాయాన్ని టీఆర్‌ఆర్ వైద్య కళాశాలకు అప్పగించనున్నారు.

ఫిబ్రవరి 14న బడ్జెట్?

(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత శాసనసభ వ్యవహారాల సలహా మండలి (బీఏసీ) సమావేశం నిర్వహించనున్నారు. అందులో బడ్జెట్ సమావేశాల ఎజెండాను ఖరారు చేస్తారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణ తేదీలపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

భూ వివాదాలకు కారకుడు జగనే

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధ్వజం

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరుతో జగన్ పెద్ద ఎత్తున భూ వివాదాలు సృష్టించారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. విజయనగరం జిల్లాలో 70 శాతం రెవెన్యూ సమస్యలకు రీసర్వేనే కారణమన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకరులతో మంత్రి మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా... రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ చేసిన నిర్వాకం వల్ల లక్షల మంది కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు.

రాజధాని రెండో దశ.. 709 చ.కి.మీ.లకు మాస్టర్‌ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి వరకు ఉన్న ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెంట్ నియామకానికి సీఆర్‌డీఏ ఇప్పటికే గ్లోబల్ టెండర్లు పిలిచింది. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్న ప్రాంతంలో ప్రస్తుతం భూసమీకరణ చేస్తున్న ఏడు గ్రామాల విస్తీర్ణం 20,494 ఎకరాలు (82.9 చ.కి.మీ.లు) మాత్రమే. మిగతా 43 గ్రామాల్లోని భూముల విస్తీర్ణం 1,54,853.43 ఎకరాలు. మొత్తంగా రెండో దశలో 1,75,347 ఎకరాలకు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయబోతున్నారు. 43 గ్రామాల్లో గుంటూరు జిల్లాలో 29, పల్నాడు జిల్లాలో 14 ఉన్నాయి.

రెండు దశల్లో ప్రణాళిక

రాజధాని రెండో దశ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు సీఆర్‌డీఏ ఆరు నెలల గడువు నిర్దేశించింది. రెండు దశల్లో మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తారు. ప్రస్తుతం భూసమీకరణ చేస్తున్న ఏడు గ్రామాలకు సంబంధించి వివరణాత్మక మాస్టర్‌ప్లాన్‌తో పాటు, మిగతా 43 గ్రామాలకు స్ట్రక్చర్/ఇండికేటివ్ ప్లాన్ రూపొందిస్తారు. ప్రస్తుతం రెండో దశలో భూసమీకరణ చేస్తున్న ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ వంటివి ఏర్పాటు చేయబోతున్నారు. రాజధాని విస్తరణలో భాగంగా భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, అనేక ప్రాజెక్టులు ఈ ప్రాంతంలో రాబోతున్నాయి. అప్పటి అవసరాలకు తగ్గట్టు మళ్లీ భూసమీకరణ చేస్తారు. అలా కొత్తగా భూసమీకరణ చేసిన ప్రతిసారీ ఆ కొద్ది ప్రాంతానికి మాస్టర్‌ప్లాన్ చేయడం సాధ్యం కాదు. కాబట్టి రాజధానిని ఆనుకుని ఉన్న 709.6 చ.కి.మీ. ప్రాంతానికి ఇప్పుడు మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

మాస్టర్‌ప్లాన్‌లో ఏముంటాయి?

- రాజధాని అమరావతికి కొనసాగింపుగా రెండో దశలో ప్రణాళికాబద్ధమైన, సుస్థిర, సమీకృతాభివృద్ధి, స్పోర్ట్స్ సిటీ వంటి థీమాటిక్ సిటీలను అభివృద్ధి చేయడం దీని ప్రధాన లక్ష్యం.
- అమరావతిలో అభివృద్ధి చేస్తున్న ప్రధాన రహదారుల్ని రెండో దశకు విస్తరించనున్నారు. కొన్ని రహదారుల్ని అవుటర్‌రింగ్ రోడ్డుతో అనుసంధానించబోతున్నారు. ఈ అనుసంధానం ఎలా అనేదీ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరుస్తారు.
- విస్తరణ ప్రణాళిక అమలుకు మూలధన వ్యయం, అవసరమైన ఆర్థిక వనరుల సమీకరణ ప్రణాళికను కూడా మాస్టర్‌ప్లాన్‌లో వివరిస్తారు.
- ఏ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు, ప్రాజెక్టులు, డెవలప్‌మెంట్ నోడ్‌లు ఏర్పాటు చేయాలనే స్పేషియల్ ప్లానింగ్ ఉంటుంది. మౌలిక వసతుల ప్రణాళికలనూ సిద్ధం చేస్తారు.
- భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించగా సీఆర్‌డీఏకి వచ్చే భూముల్ని విక్రయించడం, దీర్ఘకాలిక లీజు, జాయింట్ డెవలప్‌మెంట్ వంటి నమూనాల ద్వారా ఆర్థిక వనరుల సమీకరణ ప్రణాళికనూ సిద్ధం చేస్తారు.
- ప్రస్తుతం ఉన్న గ్రామాల్ని ఏ మాత్రం కదిలించకుండా మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తారు.

మాస్టర్‌ప్లాన్ రూపొందించబోతున్న మిగిలిన 43 గ్రామాలు

గుంటూరు జిల్లా

గుంటూరు మండలం: 1.చినపలకలూరు, 2.జొన్నలగడ్డ
మంగళగిరి మండలం: 3.కాజ
మేడికొండూరు మండలం: 4.డోకిపర్రు, 5.మందపాడు, 6.మంగళగిరిపాడు, 7.మేడికొండూరు, 8.పేరేచర్ల, 9.సిరిపురం, 10.వరగాని, 11.వలివర్తిపాడు, 12.విశదల
పెదకాకాని మండలం: 13.అగతవరప్పాడు, 14.కొప్పురావూరు, 15.నంబూరు, 16.పెదకాకాని, 17. వెనిగళ్ల
తాడికొండ మండలం: 18.బండారుపల్లె, 19.బేజాత్‌పురం, 20.దామరపల్లె, 21.కంతేరు, 22.లచ్చన్నగుడిపూడి, 23.లాం, 24.మోతడక, 25.నిడుముక్కల, 26.పాములపాడు, 27.పొన్నెకల్లు, 28.రావెల, 29.తాడికొండ

పల్నాడు జిల్లా

అమరావతి మండలం: 30.అమరావతి, 31.ధరణికోట, 32.లింగాపురం, 33.నరుకుళ్లపాడు, 34.నెమలికల్లు, 35.ఉంగుటూరు
యడ్లపాడు మండలం: 36.కొండవీడు
పెదకూరపాడు మండలం: 37.బలుసుపాడు, 38.జలాల్‌పురం, 39.కంభంపాడు, 40.లింగంగుంట్ల, 41.ముసాపురం, 42.పాటిబండ్ల, 43.తాళ్లూరు

భారతి సిమెంట్ అడ్డగోలు వాదన

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా నివేదిక అందజేసింది. దీంతో భారతి సిమెంట్‌కు చెందిన రెండు సున్నపురాయి లీజులు, ఇదేవిధంగా లీజులు పొందిన అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ (ఏసీసీ- ప్రస్తుతం అదానీ సిమెంట్స్), రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన ఒక్కో లీజు రద్దుపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది.

నిబంధనలు పక్కనపెట్టి..

కడప జిల్లా కమలాపురం మండలంలో 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలో 235.56 ఎకరాల్లో రెండు సున్నపురాయి లీజుల కోసం రఘురామ్ సిమెంట్స్ లిమిటెడ్ గతంలో దరఖాస్తు చేయగా, 2008లో వైఎస్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాథమిక అనుమతి (ఎల్‌వోఐ) జారీ చేసింది. ఆరు నెలల్లో వివిధ అనుమతులు తెచ్చుకుంటే పూర్తిస్థాయి లీజులు మంజూరు చేస్తామని అందులో పేర్కొన్నారు. తర్వాత రఘురామ్ సిమెంట్స్ లిమిటెడ్ పేరిట ఉన్న లీజులను భారతి సిమెంట్ కార్పొరేషన్ చేజిక్కించుకుంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 2015లో మేజర్ మినరల్స్ విషయంలో కొత్త నిబంధన తెచ్చింది. ఇకపై దరఖాస్తు ద్వారా లీజులు మంజూరు చేయకూడదని, ఈ-వేలం ద్వారానే కేటాయించాలని పేర్కొంది. అప్పటికే ప్రాథమిక లీజు మంజూరు పొంది ఉంటే.. వాటికి రెండేళ్లలో (2017 నాటికి) అన్ని అనుమతులు తెచ్చుకొని, పూర్తిస్థాయి లీజు మంజూరు చేయించుకోవాలని పేర్కొంది. ఈ గడువులోపు లీజులు పొందలేకపోతే వాటికి గతంలో ఇచ్చిన ఎల్‌వోఐలు రద్దయినట్లేనని స్పష్టం చేసింది. భారతి సిమెంట్ యాజమాన్యం 2017 నాటికి అన్ని అనుమతులు తెచ్చుకొని, పూర్తిస్థాయి లీజు దక్కించుకోలేకపోయింది. దీంతో హైకోర్టును ఆశ్రయించింది. తర్వాత వివిధ నిబంధనలు చూపించి 2024 ఫిబ్రవరి 2న వైకాపా ప్రభుత్వం భారతి సిమెంట్‌కు ఆ రెండు లీజులను 50 ఏళ్ల కాలానికి మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

- ఇదే విధంగా 2023 నవంబరు 15న కడప జిల్లా మైలవరం మండలంలో 997 హెక్టార్లలో ఏసీసీకి, 2024 మార్చి 15న ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలోని 267.30 ఎకరాల్లో రామ్‌కో సిమెంట్స్‌కు సున్నపురాయి లీజులను వైకాపా ప్రభుత్వం మంజూరు చేసింది.

కేంద్ర అభ్యంతరంతో రద్దు నోటీసులు

వేలం ద్వారా కాకుండా, పాత దరఖాస్తుల ఆధారంగా భారతి సిమెంట్, ఏసీసీ, రామ్‌కో సిమెంట్స్‌లకు సున్నపురాయి లీజులు ఎలా మంజూరు చేశారంటూ గత ఏడాది కేంద్ర గనులశాఖ ప్రశ్నించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ మూడు కంపెనీలకు గత నెలలో నోటీసులిచ్చి, వివరణ కోరింది. నిబంధనల ప్రకారమే లీజులు పొందామంటూ అవి ఇటీవల వివరణలు ఇచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గనులశాఖ అధికారులు మూడు కంపెనీల వివరణలను పూర్తిగా పరిశీలించారు. 2015లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధన ప్రకారం నాలుగు లీజుల మంజూరు చెల్లదంటూ ప్రభుత్వానికి గత వారం నివేదిక పంపారు. దీంతో నాలుగు లీజులను రద్దు చేస్తూ ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

గ్రహం అనుగ్రహం

25–1–2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం

సప్తమి: రా.9-10 తదుపరి అష్టమి; **రేవతి:** మ.12-16 తదుపరి అశ్విని
వర్జ్యం: లేదు; **అమృత ఘడియలు:** ఉ.9-58 నుంచి 11-30 వరకు తిరిగి తె.4-09 నుంచి 5-40 వరకు; **దుర్ముహూర్తం:** సా.4-17 నుంచి 5-02 వరకు; **రాహుకాలం:** సా.4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.47; రథ సప్తమి

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	28.0
హైదరాబాద్	18.1	28.6
శ్రీకాకుళం	19.0	29.0
కర్నూలు	19.1	31.2
విశాఖపట్నం	20.4	30.4
అనంతపురం	20.4	32.2
రాజమహేంద్రవరం	20.5	35.0
నెల్లూరు	20.7	29.3
కడప	21.0	27.0
విజయవాడ	21.0	30.0
గుంటూరు	21.0	30.0
తాడేపల్లిగూడెం	21.0	31.0
ఒంగోలు	21.5	30.3
నరసాపురం	21.6	30.6
తిరుపతి	22.0	25.2

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కుటుంబ సభ్యులతో జస్టిస్ ఎస్వీఎన్ భట్టీ

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీవారి నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



ఆలయం వద్ద జస్టిస్ రవినాథ్ తిల్హరి, కుటుంబ సభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ రవినాథ్ తిల్హరి శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఇద్దరు న్యాయమూర్తులు.. వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకోగా, తితిదే అధికారులు స్వాగతం పలికి.. శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వారికి రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

ఒకే పంటలో రంగురంగుల రాజ్మా



రాజ్మా (ఫ్రెంచి చిక్కుడు).. అల్లూరి సీతారామరాజు జిల్లాకే ప్రత్యేకమైన పంట. స్థానికంగా చింతపల్లి రెడ్, వైట్ విత్తనాలు ఎక్కువగా సాగు చేస్తుంటారు. గూడెంకొత్తవీధి మండలం సప్పర్లకొత్తూరు గ్రామానికి చెందిన గిరి రైతు కొర్రా పోతురాజు తన పొలంలో రెండెకరాల్లో ఈ పంట వేశారు. ఇటీవల పచ్చిపాదుల నుంచి ఆయన కొన్ని కాయలను కోసి చూశారు. వాటిలోని రాజ్మా గింజలు ఎరుపు, తెలుపులో మాత్రమే కాకుండా వివిధ రంగుల్లో ఆకట్టుకున్నాయి. దీనిపై చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం సేద్యవిభాగం సీనియర్ శాస్త్రవేత్త సందీప్‌నాయక్ మాట్లాడుతూ.. 'గిరిజన ప్రాంతాల్లో రైతులు పంట దిగుబడి నుంచే కొంత మొత్తాన్ని విత్తనాల కోసం నిల్వ చేసుకుంటారు. వాటినే వచ్చే ఏడాది సాగుకు వాడుతుంటారు. కొన్నేళ్లుగా ఇలాగే చేస్తుండటంతో జన్యుపరంగా సహజంగా ఆయా రంగుల్లోకి మారి ఉండవచ్చు. రాజ్మాలో సుమారు 200 వరకు రకాలు ఉన్నాయి' అని తెలిపారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

రాలి పడిపోతున్న కాకులు, పావురాలు!

పదుల సంఖ్యలో మృత్యువాత




ఎస్కేయూలో మృతి చెందిన కాకులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజుల నుంచి పదుల సంఖ్యలో కాకులు మృత్యువాత పడుతున్నాయి. అలాగే ఎస్కేయూకు సమీపంలోని వనమిత్ర అటవీ ఉద్యాన పరిసరాల్లో పావురాలు సైతం చనిపోతున్నాయి. చెట్లపై నుంచి ఇవి ఉన్నట్టుండి కిందపడి మృతి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. శనివారం మృత్యువాత పడిన కాకులను ఎస్కేయూ వృక్ష, జంతుశాస్త్ర విభాగాధిపతి ఆచార్య రవిప్రసాద్‌రావు పరిశీలించారు. ఏఎన్ఎన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కారణంగా చనిపోతున్నాయని తెలిపారు. వాటిని తాకితే శ్వాసకోశ, కళ్లకలక వంటి సమస్యలు తలెత్తుతాయని.. క్రిమిసాయంతో భూమిలో పూడ్చటం లేదా దహనం చేయాలని సూచించారు.

కూటమిలో పొరపొచ్చాలుంటే సరిచేసుకోవాలి

మనమంతా ఒకే కుటుంబమని గుర్తుంచుకోండి • నాతో సహా ప్రతి ఎమ్మెల్యే రేటింగ్ తీస్తున్నా

• కార్యకర్తల సమావేశంలో తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు



ఈనాడు–చిత్తూరు, న్యూస్‌టుడే–పుత్తూరు, వడమాలపేట, నింద్ర, వెదురుకుప్పం: కూటమి నాయకులు, కార్యకర్తల్లో పొరపొచ్చాలు ఉంటే సరిచేసుకోవాలని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. భాజపా, జనసేన శ్రేణులకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మనమంతా ఒకే కుటుంబమని గుర్తుంచుకోవాలన్నారు. కుటుంబంలో భార్యాభర్తలు, అన్నదమ్ముల మధ్య గొడవలు సహజమని.. అయినా వారంతా కలిసుండేందుకే ప్రాధాన్యం ఇస్తారన్నారు. ఇదే సూత్రాన్ని కూటమి నాయకులూ అన్వయించుకోవాలన్నారు. శనివారం సాయంత్రం చిత్తూరు జిల్లా నగరిలో తెలుగుదేశం కార్యకర్తలతో చంద్రబాబు సమీక్షించారు. పార్టీని శాశ్వతంగా అధికారంలో ఉండేలా తెదేపా కార్యకర్తలు చూడాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. పార్టీలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నా.. వారిని సమావేశాలకు పెద్దగా పిలవడం లేదని, వారూ ఎక్కువసంఖ్యలో హాజరు కావట్లేదన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు సైకిల్ వేసుకుని ఎప్పుడూ ప్రజలతో మమేకమవుతుంటారని, ఆయన తరహాలోనే ముందుకు వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు సూచించారు.

అతివిశ్వాసంతో పోతే మీటర్ రివర్స్ అవుతుంది

'ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఉంది. అదే సమయంలో మనం చేసిన అభివృద్ధిని వివరించాలి. అతి విశ్వాసానికి పోతే మీటర్ రివర్స్ అవుతుంది. 1995లో నేను పార్టీపై దృష్టిపెట్టడంతో తర్వాత జరిగిన ఎన్నికల్లో గెలిచాం. పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాం. తర్వాత అభివృద్ధి చేయాలని పరుగెత్తి.. కార్యకర్తలను కొంత విస్మరించడంతో ఓడిపోయాం. అందుకే నేను తరచూ కార్యకర్తలతో సమావేశమవుతున్నా. ప్రతి ఒక్కరి పనితీరునూ ఐవీఆర్ఎస్ ద్వారా తెలుసుకుంటున్నా. కుప్పం ఎమ్మెల్యేగా ఉన్న నాతో సహ అందరి శాసనసభ్యుల రేటింగ్ తీస్తున్నా. అందరికీ నేను నీతులు చెప్పి గోతిలో పడటం సరిగ్గా ఉండదు. పనితీరు బాగాలేనప్పుడు హెచ్చరిస్తున్నా. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన షణ్ముగరెడ్డి అయితే ఎలా ఉంటుందని ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకున్నా. అతనితో నేనూ మాట్లాడా. సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తికి ప్రాధాన్యం ఉన్న పదవి ఇచ్చా. డబ్బులు ఉన్నవారికే పదవులు ఇస్తారనేది అపోహ. తెలుగుదేశంలో అలాంటి సంస్కృతి లేదు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జుల పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నా' అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి పాకా రాజా, నగరి పార్టీ అధ్యక్షుడు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో మెదడుపై తీవ్ర ప్రభావం

• ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

• విజయవాడలో ఈగల్ విభాగంతో కలిసి వాకథాన్ నిర్వహణ

ఈనాడు, అమరావతి – విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల దీర్ఘకాల వినియోగం మెదడులోని ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్, ఇన్సులార్ కార్టెక్స్ ప్రాంతాల్లోని గ్రే మ్యాటర్ క్రమంగా తగ్గిపోయి తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు పేర్కొన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, సామాజిక, ఆర్థిక దుష్పరిణామాలపై యువతలో అవగాహన కల్పించేందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, ఈగల్ విభాగం ఆధ్వర్యంలో 'సే.. నో టు డ్రగ్స్' వాకథాన్‌ను విజయవాడలో శనివారం నిర్వహించారు. ఇందులో డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. మత్తుమందుకు బానిసలుగా మారేవారిలో మూడోదశలో తీవ్ర అనారోగ్య సమస్యలు బయటపడతాయన్నారు. సకాలంలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే అలాంటివారిని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరా గురించి తెలిసిన వెంటనే 1972 హెల్ప్‌లైన్ నంబరుకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, డీసీపీ (ట్రాఫిక్) షిరీన్ బేగం, విద్యావేత్త డాక్టర్ ఎంసీ దాస్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఛైర్మన్ ఎం.ఎస్.రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ వద్దు ప్లకార్డును ప్రదర్శిస్తున్న సీపీ రాజశేఖర బాబు, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రమేష్ బాబు, ఛైర్మన్ రామ్మోహనరావు, ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎంసీ దాస్, ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం తదితరులు



వాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థినులు

కరవు సీమలో చియా చిగురు



కరవు సీమగా పేరున్న అనంతపురం జిల్లాలో ఇప్పుడొక కొత్త ఆశ చిగురిస్తోంది. వర్షాభావం, నీటికొరతతో సంప్రదాయ పంటలు చేతికందని పరిస్థితుల్లో కొందరు రైతులు ప్రత్యామ్నాయంగా చియా సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ నీరు, స్వల్ప మొత్తం ఖర్చుతో సాగయ్యే ఈ పంట వారికి మంచి ఆదాయాన్ని అందిస్తోంది. చియా మెక్సికోకు చెందిన పంట. ఈ గింజల్లో అత్యధిక పోషక విలువలు ఉండటంతో దేశ, విదేశాల్లో డిమాండ్ ఉంది. కొన్నేళ్లుగా కర్ణాటకకు చెందిన రైతులు సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నారు. వారి నుంచి విత్తనాలు సేకరించిన యల్లనూరు మండలం వెన్నవారిపల్లె గ్రామానికి చెందిన రైతు సాంబశివారెడ్డి చియా సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ పంటకు శీతాకాలం అనుకూలంగా ఉంటుంది. దీనికి ఎలాంటి తెగుళ్లు, చీడపీడల బెడద ఉండదు. ఎకరాకు రూ.15 వేలు ఖర్చు కాగా మూడు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో చియా గింజలు రూ.200 ధర పలుకుతోంది. ప్రస్తుతం ఆయన మూడెకరాల్లో పంట వేశారు. పెట్టుబడి రూ.45 వేలు కాగా చేతికి రూ.1.80 లక్షలు వస్తుందని చెబుతున్నారు.

– ఈనాడు అనంతపురం

భాజపా విజయ ప్రస్థానానికి విజయవాడలోనే తొలి అడుగు

• కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్

• ముగిసిన '60 వసంతాల ఏకాత్మ మానవదర్శన పునఃస్మరణ' సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్. వేదికపై కోడూరి లక్ష్మీనారాయణ, జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజు, పీవీఎన్ మాధవ్, శివప్రకాశ్ , సత్యకుమార్, సీఎం రమేశ్, విష్ణుకుమార్‌రాజు, పురందేశ్వరి

ఈనాడు, అమరావతి: ఆత్మ, శరీరం, చింతన, బుద్ధి సంతృప్తి చెందితేనే ఏకాత్మ సాధ్యమని.. ఈ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ మోదీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ పేర్కొన్నారు. శనివారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన '60 వసంతాల ఏకాత్మ మానవ దర్శన పునఃస్మరణ సదస్సు' ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 1965 జనవరి 23న విజయవాడలోని ఇదే ప్రాంగణంలో జరిగిన జనసంఘ్ 12వ జాతీయ మహాసభలో ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతాన్ని దీన్‌దయాళ్ ప్రవచించారని గుర్తుచేశారు. '60 ఏళ్ల తర్వాత పునఃస్మరణ సభ నిర్వహించడం సంతోషకరం. భాజపా శక్తిమంతంగా ఎదగడానికి విజయవాడ గడ్డపై 1965లో జరిగిన జనసంఘ్ జాతీయ సదస్సే కారణం. విజయవాడను భాజపా ఎప్పటికీ మరువదు. దీన్‌దయాళ్ విద్యార్థి దశ నుంచి చూసిన అనేక అంశాలే ఈ ఏకాత్మ మానవతా వాదం. ఇదే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, యువతకు అవకాశాలు.. ఇలా అన్నీ ఈ విధానానికి అనుగుణంగానే సాగుతున్నాయి' అని వివరించారు.

మన సంస్కృతి ఆధారంగా ..



– శివప్రకాశ్, భాజపా జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి

భారత సంస్కృతి ఆధారంగా రూపుదిద్దుకున్న ఏకాత్మ సిద్ధాంతమే ప్రపంచానికి నిజమైన సమతుల్యత అందిస్తుంది. దేశ అభివృద్ధికి ఆర్థిక పురోగతితోపాటు.. నైతిక విలువలూ అవసరం. మనిషిని కేవలం ఆర్థిక జీవిగా కాకుండా మన సంప్రదాయం, సంస్కృతి, ధర్మం అన్నీ కలిసినప్పుడే నిజమైన భారత నిర్మాణం సాధ్యం. పాశ్చాత్య దేశాల ఆర్థిక, రాజకీయ పోకడలను గుడ్డిగా అనుసరించడం కంటే.. మన దేశ సంప్రదాయాలు, ధర్మ సూత్రాలు పాటించినప్పుడే నిజమైన భారత నిర్మాణం సాధ్యమవుతుంది.

■ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ..'ఏకాత్మ మానవ దర్శనం సరళమైన ఆలోచన. త్వరలో పుస్తక రూపంలో తీసుకొస్తాం' అని తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు న్యాయశాఖ మంత్రి చొరవ చూపాలని కోరారు.

■ తమిళనాడు భాజపా ఉపాధ్యక్షుడు కనక సభాపతి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతితో ముడిపడిన స్వదేశీ ఆర్థిక విధానమే ప్రపంచానికి దిక్సూచి అని వివరించారు.

■ సీనియర్ జర్నలిస్ట్ రాకా సుధాకర్ మాట్లాడుతూ. .విదేశీ పెట్టుబడులు అత్యాధునిక సాంకేతికత అవసరమైన రంగాల్లోకి రావాలే తప్ప.. సబ్బులు, బిస్కట్లు లాంటి వినియోగ వస్తువుల తయారీలోకి రాకూడదన్నది దీన్‌దయాళ్ అభిప్రాయమన్నారు.

■ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. 'గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, నిర్ణయాధికారాలను వికేంద్రీకరించడం ద్వారానే నిజమైన వికసిత్ భారత్ సాధ్యమవుతుంది. కేంద్రం అమలుచేస్తున్న వీబీ జీ- రామ్ జీ పథకం దీన్‌దయాళ్ ఆలోచనకు ప్రతిరూపమే' అని వివరించారు.

■ రెండో రోజు సదస్సులో ఆర్థికాభివృద్ధి- వికేంద్రీకరణ, ఏకాత్మ మానవ దర్శనంలో రాజకీయ- సాంస్కృతిక కోణాలు, కాలాంశాలపై సదస్సులు జరిగాయి. బృహత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాఘవకృష్ణ, ఆర్థిక నిపుణులు బొమ్మరాజు సారంగపాణి, ఎంపీలు సీఎం రమేశ్, వినయ్ సహస్ర బుద్ధ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, దీన్‌దయాల్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ జైన్ తదితరులు ప్రసంగించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఆరెస్సెస్, భాజపా నాయకులు, కార్యకర్తలు

కారుతో ఢీకొట్టి... తొక్కుకుంటూ వెళ్లి...

• మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై గంజాయి ముఠా ఘాతుకం... పరిస్థితి విషమం



కానిస్టేబుల్ సౌమ్య



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: తనిఖీల సమయంలో వాహనాన్ని ఆపిన మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను గంజాయి ముఠాకు చెందిన దుండగులు కారుతో తొక్కుకుంటూ వెళ్లిన అమానవీయ ఘటన తెలంగాణలోని నిజామాబాద్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) సోమిరెడ్డి శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఓ కారులో గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో నిజామాబాద్ నగర శివారులోని మాధవనగర్‌లో ఎక్సైజ్ సీఐ స్వప్న, సిబ్బంది శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయంలో తనిఖీలు చేపట్టారు. రెండు కార్లు అడ్డుపెట్టి... అనుమానిత వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. ఓ కారులో వచ్చిన దుండగులు వాహనాన్ని ఆపినట్లే ఆపి... పారిపోయేందుకు యత్నించారు. ఎదురుగా నిల్చున్న కానిస్టేబుల్ జి.సౌమ్య(22)ను ఢీకొట్టి.. ఆమెను తొక్కుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. అందులో ఉన్నవారిలో మతిన్, రషీద్ పారిపోగా... నిర్మల్‌కు చెందిన మైనర్(17), సయ్యద్ సోహైల్(27) పట్టుబడ్డారు. కారు ముందు టైరు పొత్తి కడుపు మీదుగా వెళ్లడంతో సౌమ్య ఛాతీ ఎముకలు విరిగాయి. ఒక కిడ్నీ దెబ్బతింది. నడుము భాగంతోపాటు పలు అవయవాలకు గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న నిజామాబాద్‌కు చెందిన అఫ్రోజ్‌పై కేసు నమోదైందని, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ గ్రామీణ పోలీసులు తెలిపారు. కారులో మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి

విశాఖలో హెలిరైడ్ ప్రారంభోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్



హెలిరైడ్‌లో మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

విశాఖపట్నం (సాగర్‌నగర్), న్యూస్‌టుడే: పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విశాఖ ఉత్సవ్‌లో భాగంగా రుషికొండ బీచ్‌లో శనివారం హెలిరైడ్‌ను మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రులతో పాటు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటకశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తదితరులు రుషికొండ తీరం నుంచి ఆర్కే బీచ్ వరకు హెలికాప్టర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. విశాఖ అందాలను రోడ్డుమార్గం ద్వారా కాకుండా హెలికాప్టర్‌లో చూస్తే మరింత అనుభూతిని పొందవచ్చునన్నారు. దాదాపు 15 కిలోమీటర్ల మేర హెలిరైడ్ చేయడానికి ఒక్కో వ్యక్తి రూ.5వేలు చెల్లించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టూరిజం డీవీఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్.. అమరావతికి ఓ మణిహారం

• మంత్రి సత్యకుమార్ యాదవ్



ఎండీపీఎంఎస్ ప్రతిభ చూపిన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్ కుమార్ సాహా, చిత్రంలో ఎయిమ్స్ సీఈవో అహంతేమ్ శాంతాసింగ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న రాజధాని అమరావతికి మంగళగిరి ఎయిమ్స్ ఓ మణిహారంగా నిలవబోతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎయిమ్స్‌కు కేటాయించాల్సిన మరో 10 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే దాని ఉపయోగంలోకి తెచ్చేలా కృషి చేస్తానన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఎనిమిదో వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను నిర్వహించాలని తలపెడితే.. వాస్తవాలను వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేన్ పార్థసారథి, కంటైన్స్ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ సీపీఎంఎస్ డాక్టర్ ఆర్.ఎస్.రాథోర్, ఎయిమ్స్ అధ్యక్షుడు తపన్‌కుమార్ సాహా, సీఈవో అహంతేమ్ శాంతాసింగ్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలు

ఈనాడు, అమరావతి: గ్రామీణ ప్రాంత కిడ్నీ బాధితులకు వైద్యం అందేలా రాష్ట్రంలో కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వీటికోసం ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ కార్యక్రమం (పీఎంఎన్‌డీపీ) కింద రూ.11.05 కోట్లు వెచ్చిస్తున్నట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రైల్వేకోడూరు, కొండపి, కొవ్వూరు, మైదుకూరు, నందిగామలలోని సీహెచ్‌సీలకు కొత్తగా డయాలసిస్ యూనిట్లు మంజూరయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాలైన ఎస్.కోట, సీతంపేట ఆసుపత్రులకు గతంలో మంజూరైన కేంద్రాలను సేవలకు సిద్ధం చేశాం. భీమవరం, వీరేరు, వెంకటగిరి, అద్దంకి, సున్నిపెంట, జమ్మలమడుగుకు సంబంధించి టెండర్ల దశలో ఉన్నాయని వెల్లడించారు.

ప్రకటన

ఈనాడు దినపత్రికను కొందరు వ్యక్తులు తెల్లవారే సరికి ఆన్‌లైన్ నుంచి ఈనాడు ఈపేపర్‌ను పీడీఎఫ్‌గా డౌన్‌లోడ్ చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక టెలిగ్రామ్, వాట్సప్ గ్రూపులు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ విధమైన అనుమతి లేని చర్యలు కాపీరైట్ చట్టానికి విరుద్ధం మరియు శిక్షార్హమైన నేరం. ఎవరైనా వ్యక్తులు, సంస్థలు లేదా గ్రూపులు ఈనాడు పత్రికను, వ్యాసాలను పీడీఎఫ్‌లుగా అనుమతి లేకుండా అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం నేరం. అట్టి చర్యలను ఈనాడు చాలా తీవ్రంగా పరిగణించి బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

అలాగే ఈనాడు, ఈనాడు.నెట్‌లోని వార్తలను కొందరు పూర్తిగా/పాక్షికంగా కాపీ చేసి తమ వాణిజ్య ప్రయోజనాల కోసం (వెబ్‌సైట్లలో, న్యూస్ యాప్‌లలో, యూట్యూబ్ ఛానళ్లలో) వినియోగిస్తున్నట్లు కూడా మా దృష్టికి వచ్చింది. అట్టి చర్యలను ఈనాడు తీవ్రంగా పరిగణించి, బాధ్యులపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరిక జారీచేయడమైంది.

ఇట్లు/- వెల్లంకి రత్నకుమార్
చీఫ్ మేనేజర్, లీగల్ డిపార్ట్‌మెంట్

ఈనాడు

ఎత్తర జెండా ఎత్తర...

'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా...' ఎవ్వరైనా ఎదురై 'మీరెవరని' అడిగితే- 'భారతీయుణ్ని' అని బదులిస్తాం. భారతీయతే- మన జాతీయత. తరువాతే మన ప్రాంతీయతలు, కులమతాలు. ఆగస్టు 15, జనవరి 26... రెండూ- ఆ జాతీయతకు చెందిన పండుగలు. స్వాతంత్ర్య దినాన దేశ ప్రధాని జాతీయ జెండాను 'ఎగురవేస్తారు'. గణతంత్ర దినాన జెండాను రాష్ట్రపతి 'ఆవిష్కరిస్తారు'. రెండింటికీ తేడా ఉంది. దుండగీళ్ల దురాక్రమణకు జాతి ఆత్మగౌరవం అణగారిపోయిన దశలో- 'మాకొద్దీ తెల్లదొరతనము' అంటూ జనభారతం గర్జించింది. 'స్వరాజ్యం మా జన్మహక్కు' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించింది. శ్రీశ్రీ చెప్పినట్లు 'ఏ స్వాతంత్ర్య నిమిత్తం ఎవరెవరో ఎందరో దేశసేవా భాస్వంతుల్ బాల వృద్ధుల్ లారీ హతులై ఉరికొయ్యలు కవుగింట చేర్చి...' బలిదానాలు చేశారు. ఆ త్యాగాల ఫలితంగా స్వరాజ్యం సిద్ధించింది. అందుకు ప్రతీకగా నేలచూపులు చూసిన జాతి ఆత్మగౌరవ జయకేతనాన్ని గగనసీమల్లో... స్వేచ్ఛాపవనాల్లో పైపైకి సమున్నతంగా నిలబెట్టడాన్నే- జెండా ఎగురవేయడం (ధ్వజ ఆరోహణ్) అంటాం. ఆ స్ఫూర్తి ఆత్మప్రత్యయమై, ఆభిజాత్యమై అఖండదీప్తితో జన హృదయ కేతనాలను ఆకాశదేశాల్లో విహరింపచేయడమే- జెండా ఎగురవేయడంలోని ఆంతర్యం.

గణతంత్ర దినోత్సవాల్లో జరిగేది- జెండా ఆవిష్కరణ. అప్పటికే వినీలాకాశంలో స్వేచ్ఛగా సగర్వంగా రెపరెపలాడుతున్న భారతదేశ సర్వసత్తాక సార్వభౌమత్వ వికాసాన్ని దేశదేశాలకు వెల్లడిచేయడం- గణతంత్ర జెండా ఆవిష్కరణలోని అంతరార్థం. స్వరాజ్యం సిద్ధించిన దరిమిలా సురాజ్య స్థాపనదిశగా సాగుతున్న మనదేశ ప్రగతి- స్తంభం పైభాగాన జెండారూపంలో పురివిప్పుకొంటుందా రోజు. 'మేరా భారత్ మహాన్' అని చాటిచెప్పడమే ఆనాటి మువ్వన్నెల పతాకావిష్కరణ లక్ష్యం. జ్ఞానానందకవి మాటల్లో- 'సకల ప్రపంచమునకున్ స్వామిత్వముం (విశ్వగురుత్వాన్ని) పూనెడిన్' తరహా ఉద్యమస్ఫూర్తిని జాతిజనాల్లో ఆవిష్కరించే ఘట్టమది. 'ఏ పూర్వపుణ్యమో, ఏ యోగ బలమో జనియించినాడవీ స్వర్గఖండమున' అన్న రాయప్రోలు ప్రబోధగీతం జాతికి వేదమై, రణన్నినాదమై మనసును తడిపేలా... మనిషిని నడిపేలా చేసే సందర్భమిది. 'ఇది నాదేశము... నన్ను కన్నయది... నాయీదేశ సౌభాగ్యసంపదలు- ఈ విశ్వమునందు వర్ధిలగ తోడ్పాటున్ పొనర్తున్' అంటూ గుండెల్లో సంసిద్ధతను రగిలించే సన్నివేశమే- జెండా ఆవిష్కరణ. అది జాతికి ప్రేరణ.

'జెండా ఎత్తర జాతికి ముక్తిర! దండిగ వైరులు గుండులు పేల్చిన చెండుచు నెత్తురు కండలు రాల్చిన ఎత్తర ఎత్తర జెండా ఎత్తర' అంటూ జాతిని జాగృతం చేసిన అలనాటి గీత జలపాతాల అవసరం ఇప్పటికీ ఉంది. ఎందుకంటే- అణచివేతలూ అసమానతలు సాగుతూనే ఉన్నాయి. ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగట్లేదు. యుద్ధాలూ ఉగ్రవాద దాడులతో ప్రపంచ శాంతిదీపం కొడిగడుతోంది. అసహనం బుసకొడుతోంది. ఇది విశ్వానికి పరీక్షాసమయం. మనకు దీక్షాసమయం. సమీక్షాసమయం. గణతంత్ర కీర్తిని రణతంత్ర స్ఫూర్తిగా మార్చుకుని ఇంటా బయటా విరుచుకుపడుతున్న ప్రగతి నిరోధశక్తులను ఎదుర్కొనేందుకు జాతిజాతి అంతా ఏకతాటిపైకి రావాల్సిన పనిపడింది. దేశానికి దీర్ఘకాలిక ఘన ప్రయోజనాలు కోరి స్వలాభాలను పక్కకునెట్టి, కులమత రాజకీయ విభేదాలను దూరంపెట్టి... 'జయజయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి' అంటూ ముక్తకంఠంతో ముందుకు సాగేందుకు గణతంత్ర దినోత్సవం నాంది కావాలి. భారతీయతే కులమై మతమై అభిమతమై 'నేను సైతం దేశమాతకు ముద్దుబిడ్డగ నన్ను నేనే మలచుకుంటాను' అనేది మనందరి మనోరథం కావాలి. శపథం చేయాలి. గణతంత్ర వేడుకల లక్ష్యం అదే!



పిల్లలకు నాణ్యమైన విద్య అందకపోవడం సమాజం మీద ఎక్కువ ప్రభావం చూపుతుంది. చెప్పుకోవడానికి విద్యార్హతలు ఉంటాయే కానీ సామర్థ్యాలు లోపిస్తాయి. దాంతో ఉద్యోగం రాదు, వచ్చినా ఉత్పాదకత తక్కువుంటుంది, తక్కువ వేతనాలు లభిస్తాయి.

– వివేక్ దేబ్‌రాయ్, ఆర్థికవేత్త

లోక రక్షామణి

సూర్యుడు జన్మించిన శుభదినం మాఘశుద్ధ సప్తమి. ఆయన విశాఖ నక్షత్రంలో అదితి, కశ్యపులకు జన్మించాడన్నది బ్రహ్మాండ పురాణ కథనం. సూర్యజయంతినే రథసప్తమి అంటారు. సూర్యరథానికి ఏడు అశ్వాలు. కాబట్టి 'సప్తాశ్వరథారూఢుడు' అయ్యాడు. పగలు, ప్రాతఃకాలం, సంగమకాలం, మధ్యాహ్నం, సాయంకాలం- ఇవి పంచాయుధాలు. ఆరు రుతువులు చక్రంలోని ఆకులు. అర్థకామాలు ఇరుసులు. ధర్మమే రథ ధ్వజం. రథసారథి అనూరుడు.

ప్రాణికోటి అస్తిత్వమంతా సూర్యుడి మీదే ఆధారపడి ఉంది. అనాదిగా ఆయన మానవకోటికి ప్రత్యక్షదైవం, కర్మసాక్షి, ఓజస్సును, ఆయుష్షను, శక్తిని ప్రసాదించే సూర్యనారాయణమూర్తి. సర్వరోగనివారణ, సర్వబాధావిముక్తి ఆ స్వామి వల్లనే సాధ్యమవుతాయని వేదాలు ఘోషిస్తున్నాయి. రథసప్తమి నాటి పవిత్రస్నానం ముక్తికి ప్రధాన సోపానమంటారు. భానుడు ప్రాక్- పశ్చిమాలకు ప్రయాణిస్తూనే, యాజ్ఞవల్క్యుడికి, ఆంజనేయుడికి వేద శాస్త్ర వ్యాకరణాదులు నేర్పాడని, వనవాసంలో ఉన్న ధర్మరాజుకు అక్షయపాత్ర ప్రసాదించాడని ప్రతీతి. సూర్యుడు పన్నెండు మాసాల్లో ధాత, అర్యమా, మిత్ర, వరుణ, ఇంద్ర, వివస్వాన, పుషా, పర్జన్యుడు, భగ, త్వష్టా, విష్ణు, అంశుమాన్ అనే పేర్లతో ఆయా రుతువులను అనుసరించి లోకానికి వెలుగులు పంచుతున్నాడు.



అంతర్యామి

రామరావణ యుద్ధ సందర్భంలో చింతాగ్రస్తుడై ఉన్న శ్రీరాముడికి అగస్త్య మహర్షి 'ఆదిత్య హృదయం' ఉపదేశించి గొప్ప ప్రేరణ కలిగించాడు. సత్రాజిత్తు సూర్యారాధన చేసి 'శమంతకమణి'ని పొందగలిగాడు. ప్రస్కణ్వ మహర్షి సూర్యజపం చేసి, మయూరుడనే కవి సూర్యశతకం రాసి చర్మవ్యాధుల నుంచి విముక్తులయ్యారన్న కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కాంభోజి దేశాధిపతి యశోధర్ముడు తన పుత్రుడితో రథసప్తమి వ్రతం చేయించి, పట్టాభిషిక్తుణ్ని చేసినట్లు భవిష్య పురాణ కథనం.

బ్రహ్మర్షి విశ్వామిత్ర ఆవిష్కరించిన సూర్య సంబంధిత గాయత్రీ మంత్రం మానవజాతికి మహిమాన్విత మోక్షమార్గ దిగ్దర్శనం. సూర్యకృప కోసం అరుణ పారాయణం, సూర్యనమస్కారాలు చేస్తారు. శ్రీకృష్ణుడి పుత్రుడు సాంబుడి సూర్యోపాసన అనన్య సామాన్యమైంది. అనేక పురాణాల్లో సూర్యప్రభ అభివర్ణితమైంది. వైవస్వత మన్వంతరానికి మొదటి తిథి రథసప్తమే. ఈ రోజు బ్రాహ్మీ ముహూర్తంలో గ్రహనక్షత్రాల సన్నివేశం సూర్యరథాకారంలో గోచరిస్తుంది. సూర్యుడికి పాయసం ప్రీతికరమైంది. అందుకే ఈ పర్వదినాన పాలు, కొత్తబియ్యం, బెల్లంతో పాయసం చేసి భానుడికి నివేదిస్తారు. ఆదిత్యుడికి అష్టోత్తరనామ జపం కూడా చేస్తారు. వ్రతచూడామణి, ధర్మసింధువు, నిర్ణయామృతం, మదనరత్నం మొదలైన గ్రంథాల్లో సూర్యవర్ణన విస్తారంగా ఉంది.

'నమస్కారప్రియః సూర్యః'- ఒక్క నమస్కారం చేస్తే చాలు ఆదిత్యకృప సంప్రాప్తిస్తుంది. మనిషి తను చేస్తున్న పాపాలన్నీ ఎవ్వరూ చూడటం లేదని భ్రమపడతాడు. వేదపారాయణుడైన సూర్యనారాయణుడి చూపు సదా మనపై ఉంటుందన్న వాస్తవం గ్రహించి ధర్మబద్ధులమై నడుచుకోవాలి.


– చిమ్మపూడి శ్రీరామమూర్తి



ఐసోటోపుల ప్రగతి కిరణాలు

రేడియో ధార్మికత ఆధునిక అణుశాస్త్ర వికాసానికి బాటలు పరిచింది. 1896లో కనుగొన్న ఈ రేడియో యాక్టివిటీ కృత్రిమ రేడియో ఐసోటోపుల అభివృద్ధికి దోహదపడింది. తద్వారా విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. భవిష్యత్తులోనూ శాస్త్ర సాంకేతిక వికాసానికి, సుస్థిరాభివృద్ధికి రేడియో ఐసోటోపులు కీలకం కానున్నాయి.

సుమారు వందేళ్ల క్రితం ఫ్రెంచ్ శాస్త్రవేత్త హెన్రీ బెకరల్ యురేనియం లవణంపై పరిశోధనలు చేస్తున్నప్పుడు అనుకోకుండా రేడియో ధార్మికతను కనుగొన్నారు. ఈ లవణాలు సహజంగానే కిరణాలను విడుదల చేస్తున్నట్లు ఆయన గుర్తించారు. 1898లో మేరీ, పియర్ క్యూరీ దంపతులు మరింత ముందడుగు వేసి పోలోనియం, రేడియం అనే రెండు కొత్త రేడియో ధార్మిక మూలకాలను కనుగొన్నారు. ఆ సందర్భంగానే వారు 'రేడియో ధార్మికత(రేడియో యాక్టివిటీ)' అనే పదబంధాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. వీరి పరిశోధనలే కాలక్రమంలో రేడియో ఐసోటోపుల ఆవిష్కరణకు బలమైన పునాది వేశాయి. ఒకే మూలకానికి చెందిన పరమాణువుల్లో ప్రోటాన్ సంఖ్య ఒకేలా ఉన్నా, న్యూట్రాన్లు వేర్వేరుగా ఉంటే, వాటిని ఐసోటోపులు అంటారు. ఇవి స్థిరంగా ఉండవు. స్థిరత్వం కోసమని శక్తిని(రేడియేషన్) విడుదల చేస్తూ క్షీణించిపోతాయి. అణుశాస్త్రంలో ఒక మైలురాయిగా భావించే ఈ సిద్ధాంతం- అనంతర కాలంలో కృత్రిమ రేడియో ఐసోటోపుల తయారీకి ఊతమిచ్చింది. ఇవి సహజంగానే కాకుండా, అణు రియాక్టర్లు, సైక్లోట్రాన్ల వంటి సాధనాలతోనూ తయారవుతాయి. రేడియో ఐసోటోపులు విడుదల చేసే ఆల్ఫా, బీటా, గామా కిరణాలను ఉపయోగించి వ్యాధుల నిర్ధారణ, చికిత్సలు, కొలతలను కచ్చితంగా అంచనా వేయడం సాధ్యమైంది. కాలక్రమంలో, 1940లో శాస్త్రవేత్తలు కార్బన్-14 అనే రేడియో ఐసోటోపును కనుగొన్నారు. ఇది పురావస్తు రంగంలో పెద్ద విప్లవానికి దారితీసింది. కార్బన్ డేటింగ్ విధానం ద్వారా పురాతన వస్తువుల ఏళ్లనాటివో కచ్చితంగా అంచనా వేయడం సాధ్యపడింది.



వైద్యంలో ముందడుగు...

పరిశోధనల పుణ్యమా అని 1950 దశకంలో అయోడిన్-131, కోబాల్ట్-60, టెక్నీషియం-99 వంటి రేడియో ఐసోటోపుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. 'న్యూక్లియర్ మెడిసిన్' ఆధునిక వైద్యరంగం ముఖచిత్రాన్నే మార్చేసింది. నేడు రేడియో థెరపీ ద్వారా క్యాన్సర్ కణాలను నాశనం చేసి, ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతున్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక రంగాల పురోగతికి రేడియో ఐసోటోపులు కీలకమవుతున్నాయి. నైట్రోజన్-15 అనే ఐసోటోపు ద్వారా మొక్కలు నైట్రోజన్ ఎరువులను ఎంత వరకు గ్రహిస్తున్నాయి, ఎంత నష్టం జరుగుతుందనేది అంచనా వేయవచ్చు. వేర్ల అభివృద్ధికి, మొక్కల పెరుగుదలకు, పోషక లోపాల నివారణకు ఫాస్పరస్-32 ఐసోటోపు ఉపయోగపడుతోంది. ఇప్పుడు పంటల అభివృద్ధిలో 'మ్యుటేషన్ బ్రీడింగ్' కీలకమవుతోంది. ఇందులో భాగంగా కోబాల్ట్-60 నుంచి ఉత్పన్నమయ్యే గామా లేదా న్యూట్రాన్ కిరణాలను ఉపయోగించి విత్తనాల్లో నిర్దిష్ట మార్పులు చేస్తారు. దీనివల్ల వాతావరణ మార్పులనూ తెగుళ్లనూ తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నారు. మన దేశంలో వరి, గోధుమ, వేరుశనగ తదితర పంటల సేద్యంలో ఇలాంటి వంగడాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. కీటక నియంత్రణకు రేడియేషన్ ఆధారిత స్టెరైల్ ఇన్సెక్ట్ టెక్నిక్(ఎస్ఐటీ) బాగా ఉపకరిస్తోంది. దీనిద్వారా విడుదలయ్యే గామా కిరణాలు కీటకాలను నాశనం చేసి, వాటి జనాభాను నియంత్రిస్తాయి. తద్వారా ప్రమాదకర పురుగుమందుల వినియోగం తగ్గి, పంటలు ఆరోగ్యంగా ఎదుగుతాయి. దానివల్ల ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికీ మేలు జరుగుతుంది.

నేడు ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాల వినియోగం ఎక్కువైంది. అనేక చోట్ల నీటి కొరత వేధిస్తోంది. ఇటువంటి తరుణంలో భూగర్భ జల వనరుల నిర్వహణలో ఐసోటోప్ సాంకేతికలు, రేడియో ఐసోటోపులు కీలకమవుతుండటం విశేషం. ట్రిటియం, ఆక్సిజన్-18, డ్యుటీరియం వంటి ఐసోటోపుల సాయంతో ఆ ప్రాంతంలోని భూగర్భ జలాలు ఎలా సమకూరాయి? అందులో వర్షపు నీటి శాతమెంత? వాటి వయసెంత? ఎక్కడెక్కడి రీఛార్జ్ ప్రాంతాలున్నాయి? అనేది అంచనా వేస్తారు. తద్వారా ఏదైనా ప్రాంతంలో భూగర్భ జలాల స్థితిగతులేమిటో స్పష్టంగా తెలుస్తుంది. కార్బన్-14 ద్వారా వేల సంవత్సరాల నాటి భూగర్భ జలాలను ఇట్టే గుర్తుపట్టవచ్చు. ఇది ఎడారి ప్రాంతాల్లో నీటి వినియోగానికి అత్యంత కీలకమవుతోంది. క్లోరిన్-36, హీలియం-3 వంటివైతే... లోతైన భూగర్భ జలాల ప్రవాహ మార్గాలను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. పారిశ్రామిక, సాగు వ్యర్థాలు భూగర్భ జల వనరులను ఎలా కలుషితం చేస్తున్నాయో అర్థం చేసుకోవడానికి సైతం అక్కరకొస్తున్నాయి.

మానవ ప్రయోజనాలకు...


పారిశ్రామిక రంగంలో రేడియో ఐసోటోపులను నాణ్యత, భద్రతల కోసం వాడుతున్నారు. లోహాల్లోని బీటలను, పైప్‌లోని లీకేజీలను గుర్తించడం వీలవుతోంది. దీంతో భారీ ప్రమాదాలు తగ్గి, ఉత్పాదక సామర్థ్యం పెరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తి, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లోనూ రేడియో ఐసోటోపులు కీలకమవుతున్నాయి. జీవక్రియలు, అణు నిర్మాణం, పదార్థ లక్షణాలను అర్థం చేసుకోవడానికి వీటిని విరివిగా వాడుతున్నారు. భవిష్యత్తులో సామాజిక ప్రయోజనాల కోసమే కాకుండా, సాంకేతిక పురోగతిలోనూ రేడియో ఐసోటోపుల పాత్ర మరింత పెరగనుంది. వీటితో కూడిన అధ్యయనాల ద్వారా ప్రభుత్వాలు, నీటి నిర్వహణ సంస్థలు తగిన నిర్ణయాలు తీసుకోగలుగుతాయి. ప్రపంచ దేశాలు అణుబాంబుల వంటి విధ్వంసక ఆయుధాల తయారీకో, యుద్ధాల కోసమో కాకుండా... విస్తృత మానవ ప్రయోజనాల కోసమే రేడియో ఐసోటోపులను వినియోగించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు ఆలోచిస్తాయని ఆశిద్దాం. అణుశక్తి, ఐసోటోపుల వాడకంలో జాగ్రత్తగా ఉంటాయని ఆశిద్దాం.



వై.శ్రీనివాస్
విశ్రాంత 'జి' గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్
(రేడియేషన్ సేఫ్టీ), అటామిక్ ఎనర్జీ విభాగం

టీనేజీ కష్టాలు!

పిల్లలతో పిల్లల గురించి బోలెడు కబుర్లు చెప్పడం పెద్దలకు అలవాటే. వాళ్ల అల్లరిని నియంత్రిస్తారు, ఆలోచనల్ని శాసిస్తారు. తమ చిన్నప్పటి విషయాలు కూడా కథలుగా చెప్పి గొప్పలు పోతారు. కానీ పెద్దల గురించి వాళ్లేమనుకుంటున్నారో వినే ప్రయత్నం చేశారా ఎప్పుడైనా? పోనీ కథల్లో చదివారా? కుటుంబ జీవితం, అమ్మానాన్నల గురించి ఓ టీనేజర్ దృష్టికోణాన్ని ఆసక్తికరమైన నవలగా రాశారు బ్రిటిష్ రచయిత్రి సూ టౌన్సెండ్. తన పిల్లలనుంచి స్ఫూర్తి పొంది ఆమె మొదట నాటకం రాశారు. రేడియోలో ప్రసారమైన దాన్ని నవలగా మలచమని కోరారట పబ్లిషర్లు. అలా 'ద సీక్రెట్ డైరీ ఆఫ్ అడ్రియన్ మోల్, ఏజ్డ్ 13 3/4 ప్రచురితమైంది. దాన్ని ప్రభావవంత



మైన వంద నవలల్లో ఒకటిగా బీబీసీ పేర్కొంది. రాసి నలభై ఏళ్లు దాటినా ఇప్పటికీ టీనేజర్లను అలరిస్తూనే ఉంది. అడ్రియన్ మోల్ టీనేజ్ నుంచి 39 ఏళ్ల వ్యక్తిగా ఎదిగే క్రమాన్ని సూ ఏడు సీక్వెల్స్‌గా రాస్తే అన్నీ పాఠకాదరణ పొందాయి.

అడ్రియన్ మోల్‌కి పదమూడు నిండి పద్నాలుగు నడుస్తోంది. సాధారణంగా ఆ వయసు పిల్లల్లో ఉండే అయోమయం, పరిస్థితుల్ని తప్పుగా అర్థంచేసుకోవడం అతడికీ ఉంటుంది. తనని తాను తెలివిగల వాడిననుకుంటాడు. కొత్త సంవత్సరం తీర్మానాలతో కాన్ఫిడెంట్‌గా డైరీ రాయడం మొదలెడతాడు. ముందురోజు రాత్రి తండ్రి విపరీతంగా తాగి వస్తాడు. అమ్మానాన్నా ఇద్దరూ అనారోగ్యం బారిన పడతారు. అది చూసి తన తల్లిదండ్రులిద్దరూ తాగుబోతులనీ, తాను చాలా దయనీయమైన పరిస్థితుల్లో బతుకుతున్నానని అనుకుంటాడు. తానసలు తాగబోనని ఒట్టుపెట్టుకుంటాడు. తనని తాను మంచివాడిగా ఊహించుకుంటూ వాళ్లకు సేవలు చేస్తాడు. అయినా వాళ్లు సరిగా స్పందించకపోవడం అతణ్ని బాధిస్తుంది. స్కూల్లో కూడా సోషల్ సర్వీస్ టీమ్‌లో చేరి 89 ఏళ్ల వృద్ధుడికి సాయపడుతుంటాడు. తల్లిదండ్రులు తనపట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోవడం వల్లనే తన బుగ్గమీద మొటిమ వచ్చిందని బాధపడతాడు. పండోరా అనే అమ్మాయిని ఇష్టపడతాడు. కవిత్వం రాస్తాడు. ఆమె గురించి అమ్మానాన్నలకీ చెప్పాలనుకుంటాడు కానీ నిత్యం పోట్లాడుకునేవాళ్లకి కొడుకు మాటలు వినే తీరికుండదు. వాళ్లిద్దరి వివాహేతర సంబంధాలు, గొడవలు, ఆర్థిక సమస్యల మధ్య అడ్రియన్ పుట్టినరోజు వస్తుంది. నానమ్మ ఒక్కతే తనని అర్థం చేసుకుంటుందని ఆమె దగ్గరికి వెళ్లి సాంత్వన పొందుతాడు. అడ్రియన్‌ని వదిలేసి వెళ్లిపోయి యూనివర్సిటీలో చేరాలనుకుంటుంది పండోరా. ఆమెను ఇంప్రెస్ చేయడానికి కవిత రాస్తాడు కానీ అది పబ్లిష్ అవదు. ఏదో ప్రయోగం చేస్తూ గాయపడి ఆస్పత్రిలో చేరతాడు. ప్రేమ ఒక్కటే తనను కాపాడుతుందనుకుంటాడు. జీవితమంతా ఊహకందని మలుపులు చోటుచేసుకుంటున్నా, అమ్మానాన్నల ప్రోత్సాహం లేకపోయినా తనని తాను కనుగొంటూ ముందుకుసాగే అతడి నిజాయతీ పాఠకుణ్ని కట్టిపడేస్తుంది.

అడ్రియన్ ఆలోచనలు, పనులు ఒక్కోసారి నవ్వు తెప్పిస్తాయి. ఒక్కోసారి అయ్యోపాపం అనిపిస్తాయి. అప్పుడే తెలివిగా ఉంటాడు, అంతలోనే అమాయకత్వం బయటపడుతుంది. అవన్నీ కలిసి తరచూ దుస్సాహసాలకు, దురభిప్రాయాలకు దారితీస్తాయి. ఆ వయసు పిల్లల్లో సహజంగా ఉండే మానసిక సంఘర్షణ, తమను తాము పెద్దవాళ్లుగా సమర్థులుగా చూపించుకోవాలనే తపన... పాఠకులూ అడ్రియన్ పాత్రతో మమేకమయ్యేలా చేస్తాయి. అడ్రియన్ సిరీస్ అన్నీ నాటకాలుగా, టీవీ షోలుగా, కంప్యూటర్ గేమ్స్‌గా వచ్చాయి.

– మిహిర

విమానమెక్కేద్దాం!

గడచిన దశాబ్ద కాలంలో మన దేశంలో పౌరవిమానయాన రంగం బాగా విస్తరించింది. ఇండియాలో 2011లో 7.17 కోట్ల మంది విమానాల్లో ప్రయాణిస్తే- 2024లో అలాంటివారు 17.41 కోట్లకు చేరారు. దాంతో ప్రపంచంలో మూడో అతిపెద్ద డొమెస్టిక్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ మార్కెట్‌గా ఇండియా నిలిచింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా డొమెస్టిక్ విమాన ప్రయాణికుల్లో ఆయా దేశాల వాటా.... (శాతాల్లో)

అమెరికా	18.1
చైనా	16.7
ఇండియా	4.2
జపాన్	3.8
స్పెయిన్	3.4
యూకే	3.3
ఇటలీ	2.6
ఇండొనేసియా	2.2
బ్రెజిల్	2.2
తుర్కియే, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఆస్ట్రేలియా	2
మెక్సికో	1.9

(ఆధారం: ఐపీటీఏ 'ఏవియేషన్ ఇన్ ఇండియా' నివేదిక)

దర్యాప్తులో నిర్లక్ష్యం... న్యాయానికి అన్యాయం!

మహిళలను చూస్తేనే మెదడులో మురికి ఆలోచనలు వరదలెత్తే ప్రబుద్ధులకు దేశీయంగా కొదవలేదు. కారుకూతలతో రోడ్ల మీద వెంటాడి వేధించే జులాయిల నుంచి కిరాతక నేరాలకు తెగబడుతున్న నరరూప రాక్షసుల వరకు ఎవరికీ మన సమాజంలో లోటులేదు. స్త్రీల భద్రతకు ప్రాణసంకటాలుగా తయారైన అలాంటి పాపాత్ములను వెంటనే పట్టుకుని త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూడటం పోలీసుల బాధ్యత. ఈ విషయంలో ఖాకీలు ఎంతవరకు సఫలమవుతున్నారని చూస్తే ఎవరి గుండెలైనా బరువెక్కాల్సిందే. ఆధారాల సేకరణ, వాటి పరిశీలన, న్యాయస్థానాల్లో సమర్పణ తదితరాల్లో అనేక లోపాల వల్ల చాలా అత్యాచార కేసుల్లో దోషులెవరో తేలట్లేదు. ఒకవేళ కింది కోర్టుల్లో శిక్ష పడినా, పసలేని దర్యాప్తుల వల్ల పై కోర్టుల్లో ఆ కేసులు వీగిపోతున్నాయి. ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ఈ కాలంలోనూ దేశానికి పట్టిన చీడపురుగులను సమర్థంగా వదిలించలేకపోవడం ఎంత సిగ్గుచేటు!

ఎనిమిదేళ్ల కిందట గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో ఒక వివాహిత సామూహిక అత్యాచారం, హత్యకు గురయ్యింది. ఆ కేసులో సెషన్స్ కోర్టు ముగ్గురిని దోషులుగా తేల్చి వారికి మరణ శిక్ష విధించింది. కానీ- వీర్య, రక్త నమూనాలను ఎఫ్ఎస్ఎల్‌కు పంపడంలో ఆలస్యానికి తోడు ఆ సమయంలో వాటిని ఎలా భద్రపరిచారన్నది రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో గుజరాత్ హైకోర్టు ఇటీవల వారిని నిర్దోషులుగా విడుదల చేసేసింది. కీలక ఆధారాల విషయంలో యంత్రాంగం బాధ్యతారాహిత్యంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. వ్యవస్థాగత నిర్లక్ష్యం కారణంగా బాధితురాలి కుటుంబానికి జరిగిన అన్యాయమిది! దర్యాప్తులో పద్ధతీ పాడూ పాటించకపోతే అసలు దోషులకు శిక్షలెలా పడతాయి? ఉత్తర్ ప్రదేశ్‌లో ఒక మైనర్‌ను బలాత్కరించి హత్య చేసిన కేసులో అదనపు సెషన్స్ కోర్టు ఒకరికి మరణ దండన, మరొకరికి యావజ్జీవ కారాగారవాసం విధించింది. కేసు సుప్రీంకోర్టు ముందుకొచ్చాక దర్యాప్తులో లొసుగులు లెక్కకుమిక్కిలిగా బయటపడ్డాయి. ఆధారాల సేకరణ, డీఎన్ఏ పరీక్షల్లో గందరగోళం లాంటి వాటి కారణంగా న్యాయపాలిక వారిని వదిలిపెట్టాల్సి వచ్చింది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల్లో కొంతమంది ఇంతలా కళ్లు మూసుకుని పనిచేస్తుంటే మన నేర న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకమేముంటుంది?



పుణ్యభూమి

దిల్లీలో 'నిర్భయ' దారుణోదంతం తరవాత మహిళలపై దాష్టీకాలకు ఒడిగట్టే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలను పదునుతేల్చారు. అది హర్షణీయమే కానీ, దర్యాప్తులే ప్రహసన ప్రాయంగా మారుతున్నప్పుడు సెక్షన్ల కోరలకు ఎంత పదును పెట్టి ఏంటి ప్రయోజనం? మచిలీపట్నానికి చెందిన యువతి 2014లో ముంబయిలో హేయ అకృత్యానికి బలైంది. చంద్రభాన్ సనప్ అనే వ్యక్తిని ఆ దారుణానికి పాల్పడ్డాడని చెప్పి పోలీసులు అతనికి సంకెళ్లు వేశారు. ట్రయల్ కోర్టు ఆ చంద్రభాన్‌కు ఉరి శిక్షే సరని తీర్పు చెప్పింది. కానీ, సాక్ష్యాధారాల సేకరణ సక్రమంగా జరగలేదంటూ సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాసిక్యూషన్ కథనాన్నే తప్పుపడుతూ నిరుడు అతణ్ని నిర్దోషిగా ప్రకటించింది. జాతీయ రాజధాని ప్రాంతంలో కార్యాలయం నుంచి ఇంటికి వస్తున్న యువతి 2012లో సామూహిక అత్యాచారానికి గురైంది. విచారణలో లోటుపాట్లను ప్రస్తావిస్తూ బెనిఫిట్ ఆఫ్ డౌట్ కింద ముగ్గురు నిందితులపై కేసును న్యాయపాలిక కొట్టేసింది. కృష్ణా జిల్లాలో ఆయేషా మీరా, నొయిడాలోని నిఠారీ మారణకాండ... సరైన దిశాదశలేని దర్యాప్తుల మూలంగా ఇలా ఎన్నో కేసుల్లో నిజమైన నేరగాళ్లు ఎవరో సంవత్సరాలు గడిచిపోతున్నా నిగ్గుతేలట్లేదు. జుగుప్సాకర నేరాలు చేసినవారు స్వేచ్ఛాజీవులుగా విహరిస్తున్న దౌర్భాగ్య పరిస్థితుల్లో అమ్మాయిలపై లైంగిక దాడులు ఆగట్లేదు.

దేశీయంగా 2012లో స్త్రీలపై దాదాపు 25వేల అత్యాచారాలు నమోదయ్యాయి. 2023లో అవి సుమారు 30 వేలకు చేరాయి. పరిస్థితులు ఇంత ఘోరంగా ఉన్నా, 2018-2022 మధ్యలో అత్యాచార కేసుల్లో శిక్షల రేటు 28శాతానికే పరిమితమైందంటే సంబంధిత పోలీసులు ఏం పనిచేస్తున్నట్లు? 2023 చివరి నాటికి రెండు లక్షలకు పైగా రేప్ కేసుల్లో విచారణలు పెండింగ్‌లో పడి ఉన్నాయి. అంటే, అన్ని కుటుంబాలు న్యాయం కోసం కన్నీళ్లతో ఎదురుచూస్తున్నట్లే కదా! వాస్తవానికి, అత్యాచార కేసులంటేనే చాలామంది పోలీసులు చిన్నచూపు చూస్తారు. స్త్రీలు బాధితులైన సందర్భాల్లో కేసులు కట్టడానికే ఖాకీలు మీనమేషాలు లెక్కించిన ఉదంతాలు గతంలో వెలుగు చూశాయి. పైగా ఎంతో వేదనతో ఠాణాకు వెళ్లినవారిని పట్టుకుని 'కూతుళ్లని బయటికి పంపడం మీ తప్పే' అని వెకిలిగా వ్యక్తిత్వ హననం చేయడం కొందరికి పరిపాటిగా మారింది. పోలీసుల వ్యవహారశైలితో తమ మానసిక వేదన రెట్టింపైనట్లు 73 శాతం అత్యాచార బాధితులు ఒక జాతీయస్థాయి సర్వేలో వాపోయారు. ఈ దయనీయావస్థకు తోడు నానా మాటలతో కాల్చుకుతినే సమాజానికి భయపడి చాలామంది లైంగిక దాడులపై నిశ్శబ్దంగా ఉండిపోతూ తమలో తామే కుమిలిపోతున్నారు. దీనివల్ల అత్యాచార దారుణాలన్నీ పూర్తిగా బయటికే రావట్లేదు. ఇలాంటి భయానక వాతావరణంలో మహిళల శక్తి సామర్థ్యాలను దేశం ఎలా వినియోగించుకోగలుగుతుంది? జనాభాలో దాదాపు సగభాగమైన స్త్రీలకు తగిన భద్రత లేనప్పుడు అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది?

– వేణుబాబు మన్నం

వెక్కిళ్లు వస్తున్నాయా?

హాయ్! బుజ్జీ!!

వెక్కిళ్లు పట్టడం అందరికీ అనుభవమే! అకస్మాత్తుగా పట్టుకుంటాయవి. ఎంతకూ ఆగవు. అలా వస్తూనే ఉంటాయి. ఎందుకొచ్చాయో చాలాసార్లు మనకేమీ అర్థంకాదు. మరి, వెక్కిళ్లకు కారణం ఏంటి?

పొట్టలో వాయువులు పైకి ఎగదన్నుతూ ఛాతీ పొట్టమధ్య ఉండే కండర భాగమైన డయాఫ్రమ్ పైకి తన్నుకురావడంతో హిక్కప్స్ వస్తాయి. గాలి లోపలికి వెళ్లేటప్పుడు స్వరపేటిక ఒక్కసారిగా మూసుకుపోవడంతో 'హిక్' అనే శబ్దం వస్తుంది. వెక్కిళ్లనేవి ఆహారాన్నిగాని గ్యాసను గాని పొట్టలో నుంచి బయటికి పంపేందుకు శరీరం ప్రయత్నించే సందర్భంలో జరిగే అసంకల్పిత చర్య అన్నమాట. వెక్కిళ్లను రిఫ్లెక్స్ యాక్షన్‌గా పిలవచ్చు. వాంతి అనేది



బలమైన రిఫ్లెక్స్ యాక్షన్. వెక్కిళ్లు అందులో సగం రిఫ్లెక్స్‌గా చెప్పవచ్చు. వెక్కిళ్లను అన్యమనస్కంగా జరిగే వాంతులుగా భావించవచ్చు. డయాఫ్రమ్ అసంకల్పితంగా సంకోచించడంతోనూ వెక్కిళ్లు వస్తాయి. వేడి వేడి ఆహారం లోపలి మార్గాన్ని ఇరిటేషన్‌కు గురిచేస్తే వెక్కిళ్లు మొదలవుతాయి. అతిగా తినడం, వేగంగా తినడం, కారంగా ఉండే ఆహారం, శీతలపానీయాలు కూడా వెక్కిళ్లకు కారణమవుతాయి. ఆహారం తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బితే ఇలా జరుగుతుంది. ఎక్కువ గాలి మింగడం, నరాలు ఉత్తేజితమవ్వడం, ఉద్రిక్తత, ఉత్సాహం పెరగడం వంటివీ కొన్నిసార్లు కారణమవుతాయి. మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాల వ్యాధులు కూడా కొంతమందిలో ఇలాంటి సమస్యకు దారితీస్తాయి. వెక్కిళ్లు తగ్గించుకోవాలంటే, కొద్దిగా పంచదార నెమ్మదిగా తినడం, గటగటా నీళ్లు తాగడం, పుక్కిలించడం, అల్లం ముక్క నమలడం వంటి చిట్కాలు పాటించవచ్చు. శ్వాసను బిగపట్టి ప్రాణాయామం కూడా చేయవచ్చు. కొన్ని నిమిషాల్లో వెక్కిళ్లు తగ్గకపోయినా, రోజులో చాలాసేపు కొనసాగుతూ ఇతర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

– శ్రీజన్

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో ఒక జీవి పేరు దాగుంది. అదేంటో కనిపెట్టండి.

1.CROWD
2.PANT
3.BOXER
4.UNBEARABLE
5.BATTLE

జవాబు: 1.CROW 2.ANT 3.OX 4.BEAR 5.BAT



మోహినీపురం.. భక్తసంద్రం



తరలివచ్చిన భక్తజనం

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం సందర్భంగా మోపిదేవి భక్తసంద్రమైంది. శనివారం రాత్రి మోపిదేవిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నూతన రథంపై ఉంచి.. వైభవంగా రథోత్సవం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి నీరాజనాలు పలికారు. - న్యూస్‌టుడే, మోపిదేవి

27న 'డ్రగ్స్ వద్దు బ్రో' భారీ ప్రదర్శన

విజయవాడ నేరవార్తలు: మాదకద్రవ్యాల వినియోగం వాటి దుష్ఫలితాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 27న నగరంలో యువతతో భారీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో 27న సాయంత్రం 4 గంటలకు మహాత్మా గాంధీ రోడ్డులో సైకిల్ ప్రదర్శన ఉంటుంది. హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ, సీపీ, ఈగల్ ఐజీ ఇతర అధికారులు హాజరుకానున్నారు. వేలాది మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి.. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలని పోలీసులు నిర్ణయించారు.

వైదిక వివాదం.. ప్రక్షాళన తథ్యం!

ముందుగా మాస, విధుల పట్టికల రూపకల్పన

ఈనాడు, అమరావతి



దుర్గగుడిలో వైదిక కార్యక్రమాల నిర్వహణలో అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో సమూల ప్రక్షాళన చర్యలు ఆరంభమయ్యాయి. పూజల నిర్వహణలో తలెత్తే సమస్యలను తక్షణం పరిష్కరించి.. భక్తులకు మెరుగైన సేవలను అందించాల్సింది పోయి.. వాటిని వివాదాలుగా మార్చేందుకు కొందరు సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆలయ ప్రతిష్ఠ, భక్తుల మనోభావాలకు భంగం కలిగించే చర్యలు పునరావృత్తం కాకుండా ఏం చేయాలనే దానికి.. ఓ కమిటీని నియమించారు. అంతర్గత సమీక్ష సమావేశాలు నిర్వహించి లోపాలను గుర్తించారు. శ్రీచక్ర నవావరణ అర్చన పూజలో.. పాడైన పాలను వాడిన ఘటనను తీవ్రంగా పరిగణించారు. ఈనేపథ్యంలోనే.. వైదిక విధుల్లో క్రమశిక్షణ పెంచేలా.. అమ్మవారి కైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించేలా.. పటిష్ఠ చర్యలు అత్యవసరమని గుర్తించి.. కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మొదటి వారంలోనే సమీక్ష..

దేవస్థానం పూజలు, వైదిక కార్యక్రమాలపై ఇకనుంచి ప్రతినెలా మొదటి వారంలోనే సమీక్షించనున్నారు. స్థానాచార్యులు, దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి, వైదిక కమిటీ సభ్యులు, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు, ఆలయ, పూజల విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, ఇతర సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తారు.

ముందస్తు సన్నద్ధం..

తిథులు, నక్షత్రాలు, పండగల ఆధారంగా.. పంచాంగ వివరాల ఆధారంగా.. వచ్చే నెలలో విశేష అభిషేకాలు, అలంకారాలు, గ్రామోత్సవాలు, పూజలపై మాస పట్టిక రూపొందిస్తారు. దీనిని అన్ని విభాగాలకు పంపి.. ఏరోజు ఏసేవ ఉందో ముందే సన్నద్ధమయ్యేలా చూస్తారు.

పూజా సామగ్రిపై దృష్టి..

ఆగమశాస్త్రం ప్రకారం ఏ వేడుకకు ఏ పూజాసామగ్రి అవసరమనే జాబితా స్థానాచార్యులు ధ్రువీకరిస్తారు. వారం ముందే.. స్టోర్స్ నుంచి నాణ్యమైన సామగ్రి సిద్ధం చేయాలి. ప్రధానంగా పాలు, పండ్లు, పుష్పాలు, విశేష హోమ ద్రవ్యాల విషయంలో పొరబాటు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. ఉత్సవ విగ్రహాల తయారీ, ఊరేగించే వాహనాల పటిష్ఠత, అలంకరణ సామగ్రినీ తనిఖీ చేయాలి.

డ్యూటీ రోస్టర్..

సిబ్బంది, అర్చకులపై పని ఒత్తిడి లేకుండా.. ప్రతి సేవకూ ఒక బాధ్యతాయుత ప్రధాన అర్చకుడిని, సహాయకులను.. ముందే నియమించాలి. ఏ సమయంలో ఎవరు విధుల్లో ఉండాలనే డ్యూటీ రోస్టర్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించారు. అలాగే గత నెలలో వైదిక కార్యక్రమాల నిర్వహణ తీరు, ఇబ్బందులు, లోపాలను చర్చించి.. మళ్లీ తలెత్తకుండా చూడాలి.

దుర్గగుడి పాల ఘటనలో.. ఏడుగురిపై చర్యలు

ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

ఈనాడు, అమరావతి: దుర్గగుడిలో శ్రీచక్ర నవావరణ అర్చనకు పాడైన పాలను వినియోగించిన ఘటనలో ఏడుగురు సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. పూజ చేసిన అర్చకుడు డి.ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ, పూజల విభాగం గుమస్తా సుబ్రహ్మణ్యంలపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటనపై విచారణకు నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. వీరిపై పలు అభియోగాలను మోపుతూ సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది. విధుల విషయంలో నిర్లక్ష్య వైఖరి, బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడం, విధి నిర్వహణలో వైదిక ఉద్యోగ నియమావళిని ఉల్లంఘించడం వంటి అభియోగాలను.. మోపారు. ★ పూజల విభాగానికి చెందిన మరో ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను పూర్తిగా విధుల నుంచి తొలగించారు. ★ ముగ్గురు శాశ్వత ఉద్యోగులైన.. ఏఈవో బి.వి.రెడ్డి, సూపరింటెండెంట్ సునీత, స్టోర్స్ గుమస్తా సీతారామయ్యకు.. ఛార్జ్ మెమోలను జారీ చేశారు.

కోడింగ్ పేరిట కొల్లగొట్టుడే!

☛ కొరియర్ ఏజెంట్లమని నయా మోసం

☛ కాల్ ఫార్వాడింగ్‌తో నేరగాళ్ల బురిడీ

'మరో కొత్తసైబర్ నేరానికి మోసగాళ్లు తెరదీశారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయకుండా కాల్ ఫార్వాడింగ్‌తో కొల్లగొట్టేస్తున్నారు. ప్రత్యేక కోడ్‌లను డయల్ చేయించడం ద్వారా బాధితుల కాల్స్ మోసగాళ్ల మొబైళ్లకు వెళ్తాయి. ఓటీపీలు కూడా వారికే వెళ్లడంతో బ్యాంకు లావాదేవీలు నేరస్థుల నియంత్రణలో ఉంటాయి. తద్వారా ఖాతాల్లో సొమ్మును లాగేస్తున్నారు.'

యూఎస్ఎస్‌డీ ఆధారిత మోసం... అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డేటా (యూఎస్ఎస్‌డీ) కోడ్‌లను మొబైళ్లలో డయల్ చేయడం ద్వారా అంతర్జాలం లేకుండానే వినియోగదారులు సంబంధిత టెలికాం ఆపరేటర్ నుంచి పలు సేవలు పొందవచ్చు. ప్రత్యేక గుర్తులు, అంకెలు కోడ్‌లో ఉంటాయి. ఈ సదుపాయాన్ని నేరస్థులు ఉపయోగిస్తున్నారు.

✪ ముందుగా ఫోన్ చేసి.. కొరియర్ సంస్థ డెలివరీ ఏజెంట్‌మనీ..మీకు పార్శిల్ వచ్చింది.. ఎప్పుడు డెలివరీ చేయాలో చెప్పమంటారు. దీని ధ్రువీకరణకు మొబైల్‌లో వారు సూచించిన కోడ్‌లను డయల్ చేయమని.. ఎస్ఎంఎస్‌లు పంపిస్తారు. *21* కోడ్ టైప్ చేశాక వారి ఫోన్ నెంబరు ఇచ్చి డయల్ చేయమంటారు. ఆపై బాధితుడి ఫోన్‌లో కాల్ ఫార్వాడింగ్ యాక్టివేట్ అవుతుంది. కాల్స్ అటెండ్ కానప్పుడు మోసగాళ్లకు ఫోన్లు వెళ్తాయి. ఇన్‌కమింగ్ కాల్స్, చెల్లింపుల ఓటీపీ ధ్రువీకరణలు, బ్యాంకు కాల్స్ అన్నీ వారిఫోన్లకే పోతాయి. ఫోన్ నియంత్రణ వారి చేతుల్లోకి వెళ్లాక ఖాతాల డబ్బు బదిలీ చేస్తారు. వాట్సాప్, టెలిగ్రామ్ ఖాతాలూ హ్యాక్ అవుతాయి.

డీయాక్టివేట్ ఇలా...

✪ అపరిచితులు పంపిన *21*, *61*, *67*, తదితర అంకెలతో మొదలయ్యే యూఎస్ఎస్‌డీ కోడ్‌లకు ఎట్టిపరిస్థితుల్లో డయల్ చేయకూడదు. * మీ కాల్స్‌ను డైవర్ట్ చేసినట్లు అనుమానం వస్తే.. ##002# కు డయల్ చేయాలి. వెంటనే కాల్ ఫార్వాడింగ్ సర్వీసులన్నీ రద్దవుతాయి. ★ అధికారిక యాప్స్‌నే డౌన్‌లోడ్ చేసుకోవాలి. ★ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌లో వచ్చే లింక్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు.

☛ గుంటూరువాసి ఇటీవల ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసిన కాసేపటికే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మీకు కొరియర్‌లో పార్శిల్ వచ్చింది. వివరాల ధ్రువీకరణకు ఓ ఫోన్ నెంబరు ఇచ్చి.. దాని ముందు *21* అని డయల్ చేయమన్నాడు. ఇదినమ్మి.. అతను సూచించినట్లే డయల్ చేశాక... బాధితుడి వాట్సాప్ హ్యాక్ చేసి, అర్జెంటుగా డబ్బులు పంపాలని స్నేహితులకు సందేశాలు వెళ్లాయి. నిజమని నమ్మిన మిత్రులు మోసగాళ్ల సూచించిన ఖాతాలకు డబ్బులు పంపారు.

– ఈనాడు అమరావతి, – న్యూస్‌టుడే విజయవాడ నేరవార్తలు

జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఏటా జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ క్రమంలో నగరంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆదివారం ఉదయం 8.00 గంటలకు జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు తదితరులు హాజరుకానున్నారు. 20 మందితో సైకిల్ ర్యాలీని నిర్వహిస్తారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ మీదుగా తుమ్మలపల్లి కళా క్షేత్రం వరకు ర్యాలీ ఉంటుంది. రాష్ట్ర స్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తదితరులు హాజరుకానున్నారు.

ఓటరు సేవలు మరింత సులువు

■ అందుబాటులో సరికొత్త ఈసీఐ నెట్ యాప్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే



ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవాలా? ఓటరు కార్డు చిరునామా మార్చుకోవాలా? కొత్త ఓటరు నమోదు చేసుకోవాలా?.. మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకోవాలా.. ఈ సేవలన్నీ ఇకపై ఒకే వేదికలో లభ్యమవుతున్నాయి. అదే ఎలక్షన్ కమిషన్ ఇండియా వారి సరి కొత్త 'ఈసీఐనెట్'. యాప్‌తోపాటు వెబ్ ఆప్షన్‌లోనూ అందుబాటులో ఉంది. వీటి ద్వారా అన్ని రకాల ఓటరు సేవలు సులువుగా పొందవచ్చు. అయితే ముందుగా ఇందులో మీరు మీ చరవాణి నంబరు, ఓటరు కార్డు నంబరుతో రిజిస్టర్ చేసుకుని ఉండాలి. ఓటర్లకు కావాల్సిన సకల సమాచారం ఇందులో తెలుసుకోవచ్చు.

యాప్ రూపంలో... గూగుల్ ప్లే స్టోర్‌లో నుంచి ఈసీఐనెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. గతంలో మీ చరవాణి నంబరు, ఓటరు కార్డు నంబరుతో ఎన్నికల పోర్టల్‌లో నమోదై ఉంటే.. దీనిలో సులువుగా లాగిన్ అవ్వొచ్చు. చరవాణి నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. దీని ద్వారా ఈసీఐనెట్ యాప్‌లోకి వెళతారు.

అన్ని రకాల సేవలు ఇక్కడే... కొత్త ఓటరుగా ఫారం 6 ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. చిరునామా మార్చుకోవచ్చు. చనిపోయిన వారి ఓటర్లను జాబితా తొలగించడానికి దరఖాస్తు చేయవచ్చు. మీ దరఖాస్తు ఏ దశలో ఉందో ట్రాక్ చేసుకోవచ్చు. కార్డులో తప్పులు ఉంటే.. ఫిర్యాదు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జాబితాలో మీ పేరు వెతుక్కోవచ్చు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఫిర్యాదులు చేసే వెసులుబాటు అందుబాటులో తెస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి బయోడేటా, అఫిడవిట్లు ఇవన్నీ కూడా ఎన్నికల సమయంలో అందుబాటులో ఉంచుతారు. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా తెలుసుకోవచ్చు. అదే విధంగా వెబ్ ఆప్షన్‌లోనూ ఇవి ఉన్నాయి. ఇంగ్లిషు, తెలుగు భాషలతో పాటు దేశంలోని అన్ని భాషల్లోనూ ఈ సేవలు పొందవచ్చు.

బుడమేరు యూటీ విస్తరణకు పచ్చజెండా

ఈనాడు, అమరావతి: విజయవాడ వరద ముప్పు నుంచి తప్పించేందుకు తలపెట్టిన బుడమేరు యూటీ విస్తరణ పనులకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి దస్త్రం అప్రూవల్ కమిటీ ముందుంచగా.. తాజాగా ఆమోదం లభించింది. గుత్తేదారుడితో ఒప్పందం పూర్తి చేసి వర్క్ ఆర్డర్ కూడా జారీ చేశారు. జనవరి-27 నుంచి పనులు మొదలుపెట్టే అవకాశాలున్నాయి.

● యూటీ విస్తరణ చేపట్టే క్రమంలో ఈ ఏడాది పంటలకు నీరు ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ కాలువ తవ్వాల్సి ఉంది. కాలువ తవ్వే ప్రాంతంలో 4 ఎకరాల దేవాదాయ శాఖ భూమిని ఓ రైతు కౌలుకు చేస్తున్నారు. ప్రారంభంలో ఈ భూమి ఇచ్చేందుకు కొంత ఇబ్బంది ఏర్పడినా.. ఇరిగేషన్, ఎండోమెంట్ అధికారులు రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. యూటీ పనులను ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేస్తారా? లేదా? అన్న అంశంపై స్పష్టత లేదు. గతంలో బుడమేరుకు 30 వేల క్యూసెక్కుల వరద రావడంతో విజయవాడ అతలాకుతలం అయింది. ఈ యూటీ నిర్మాణం పూర్తయితే దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద వచ్చినా విజయవాడకు వరద ముంపు ఉండదు.

అక్రమ సొమ్ము.. అప్పులపాలు

కమీషన్లు వచ్చినా ఆర్థికంగా అధోగతే ☛ అద్దె ఖాతాల కేసులో కొత్త కోణాలు

ఈనాడు, అమరావతి: అమాయకులతో మ్యూల్ ఖాతాలు తెరిపించి.. వాటిద్వారా కమీషన్లు పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న నిందితుల కలలు కల్లలయ్యాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు జైలు ఊచలు లెక్కబెట్టడమే కాకుండా ఆర్థికంగా చితికిపోయారు. అన్నివిధాలా తీవ్రంగా నష్టపోయారు. ప్రధాన నిందితుడు సూర్య మొదలు మిగిలిన వారిదీ ఇదే పరిస్థితి. ఖాతాల్లో పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిగినా.. వీరికి దక్కింది అంతంతే కావడంతో అప్పులపాలైనట్లు తేలింది.

విచ్చలవిడిగా ఖాతాలు... ప్రధాన నిందితుడు సూర్య (ఏ1).. తొలుత అతని స్వగ్రామం పల్నాడు జిల్లా చాగల్లులో జిరాక్స్ షాప్ తెరిచాడు. డిగ్రీ, ఏవియేషన్ కోర్సు పూర్తి చేశాక తెరిచిన ఈ షాపు కొన్నాళ్లే నడిపాడు. తర్వాత మూసేసి.. అద్దె ఖాతాలు తెరిపిస్తూ కమీషన్ల రూపంలో సంపాదించడం ప్రారంభించాడు. అతని విలాసాలు చూసి స్నేహితులు అతని పంచన చేరారు. ఈ కేసులో అరెస్టయిన బొలిశెట్టి వెంకటేశ్వరరావు (ఏ9).. మొదట్లో భవనాల సీలింగ్, ఇంటీరియర్ పనులు చేస్తుండేవాడు. సూర్య సంపాదన చూసి తన పనులు వదిలిపెట్టాడు. అద్దె ఖాతాలు తెరిపించే పనిలో పడ్డాడు. స్వయంగా విజయవాడలో పొదుపు, కరెంటు ఖాతాలు తెరిచాడు. వాటిని సూర్యకు అందజేసి కమీషన్ తీసుకునేవాడు.

విలాసాలకే అధిక వ్యయం... అప్పనంగా వస్తున్న డబ్బుతో సూర్య విలాసాలకు అలవాటుపడ్డాడు. మద్యానికి బానిసగా మారి.. విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడు. పలువురు స్నేహితురాళ్లు కూడా ఉన్నారని తేలింది. ఖర్చులు అదుపు తప్పడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. చివరకు క్రెడిట్ కార్డులపై రూ.3.50 లక్షల వరకు కొనుగోళ్లు చేశాడు. నిందితులు కృష్ణారెడ్డి (ఏ3), సౌభాగ్యలక్ష్మీదీ (ఏ4) ఇదే పరిస్థితి. టీస్టాల్ నడిపేవీరు.. వ్యాపారాన్ని నిర్లక్ష్యం చేసి కమీషన్లపైనే ఆధారపడడంతో ఆర్థిక పరిస్థితి దిగజారింది. మరోవైపు... చెక్ బుక్‌లు సూర్యకు ఇచ్చేక్రమంలో 1-2 చెక్కులు తీసి... ఉంచుకొని తర్వాత డ్రా చేసుకునేవాడు. ఇలా కృష్ణారెడ్డి కొంత సొమ్ము లాగేసినా ఆర్థికంగా గట్టెక్కలేకపోయాడు.

రూ.111 కోట్ల లావాదేవీలు... సూర్య ముఠా సేకరించి, నేరగాళ్లకు దాదాపు 300 బ్యాంకు ఖాతాలు ఇచ్చింది. వీటితో రూ.111 కోట్ల మేర లావాదేవీలను గుర్తించారు. ఏడు రాష్ట్రాల్లో నేరాలు, లావాదేవీలకు ఈ ఖాతాలను ఉపయోగించారు. ఓ ఖాతాలో అత్యధికంగా రూ.2.58 కోట్ల లావాదేవీలు జరిగాయి. బెట్టింగ్, పెట్టుబడుల నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాలకు వాడారు. వీటిలో చాలా ఖాతాలు నిధులు మళ్లించి మూసేసినట్లు తేలింది.

మన మొవ్వన్నెలు..!

దిల్లీ గణతంత్ర వేడుకలకు విశిష్ట అతిథులుగా మొవ్వ విద్యార్థినులు

మొవ్వ (కూచిపూడి), న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గర్వకారణంగా నిలిచారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ 2024- 2025లో అద్భుత ప్రతిభ చూపి.. కృష్ణా జిల్లా మండల కేంద్రం మొవ్వ పీఎంశ్రీ మండవ కనకయ్య జడ్పీ పాఠశాల విద్యార్థినులు దిల్లీలో నిర్వహించే 77వ గణతంత్ర దినోత్సవానికి ప్రత్యేక అతిథులుగా హాజరు కానున్నారు. రాష్ట్రపతి భవన్ నుంచి అందిన ఆహ్వానం మేరకు.. 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్'కు మొవ్వ జడ్పీ పాఠశాలకు చెందిన దావు స్నేహ, కాకి సౌమ్య ప్రదర్శించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగించేలా ప్రాజెక్ట్ రూపొందించి పంపారు.



విద్యార్థినులు స్నేహ, సౌమ్యతో ప్రధానోపాధ్యాయిని ఉమశ్రీ

ఎలా చేశారంటే.. మొవ్వ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా సైన్స్ ఉపాధ్యాయుడు మహ్మద్ జాకీర్ అహ్మద్ వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థినులు తరచూ ఇందులో ప్రయోగాలు చేసేవారు. ఈ క్రమంలో జాతీయ పోటీలకు మంచి అంశంతో పోటీ పడితే బాగుంటుందని భావించారు. ప్రపంచంలో సగానికి పైగా ఉన్న మహిళలకు అతి చిన్న రుగ్మతగా ప్రారంభమై ప్రాణాంతకంగా మారే రొమ్ము క్యాన్సర్‌పై దృష్టి సారించాలని ఉపాధ్యాయుడు వారికి సూచించారు. దీనిపై విద్యార్థినులు మరింత అవగాహన పెంచుకున్నారు. క్యాన్సర్‌ను పసిగట్టడంలో ఆలస్యంతోనే అనేక మంది మహిళలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్లు గుర్తించారు. ప్రారంభ దశలో వ్యాధిని కనిపెట్టి జాగ్రత్తలు తీసుకునే అవకాశాల కోసం అన్వేషించారు. పరిశీలన అనంతరం నెల వ్యవధిలో ఉపాధ్యాయుడి సలహాలతో యాప్ తయారు చేసి.. దాన్ని ద్వారా క్యాన్సర్ వైద్యుడి సాయంతో రోగులను, సామాన్య మహిళలను పరీక్షించారు. అనంతరం పరిశీలించి.. రోగిలో మార్పులు వచ్చాయా లేదా అన్నది చూశారు. క్యాన్సర్ ఉన్న వారిలో మార్పు కనిపించింది. సామాన్య మహిళలో కనిపించలేదు. యాప్ ఉపయోగించి వారి కణజాలంలో వచ్చే మార్పులను గమనించి.. మొదటి దశలోనే జాగ్రత్తలు పడేందుకు అవకాశం ఉందని తెలుసుకున్నారు. ఈ ప్రయోగంతో పోటీలకు వెళ్లారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి.. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా
రూ.2.02 లక్షల జరిమానా

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసిన వారికి రూ. 2,02,000లు, అక్రమ రవాణా చేసిన వాహన యజమానులకు రూ. 47,000 మేర జరిమానా విధించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఎస్.ఇలక్కియా ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖకు సంబంధించి శనివారం కోర్టును నిర్వహించి, పలు కేసులు విచారించారు. అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న 365.64 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ప్రభుత్వపరం చేస్తూ ఆమె ఉత్తర్వులు ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -149 చిల్లర ధర 170 స్కిన్ తో 247 స్కిన్ లెస్ 281. ఉభయగోదావరి జిల్లాల్లో (ఫారం) ... ధర - 165, 174, 185 చికెన్ విత్ స్కిన్ - 320 చికెన్ స్కిన్‌లెస్ - 380.


కీలక ఘట్టానికి తిరుపతమ్మ రంగుల మహోత్సవం

28న జగ్గయ్యపేట నుంచి తిరుగు పయనం

పెనుగంచిప్రోలు, నందిగామ, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే

పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత తిరుపతమ్మ రంగుల మహోత్సవం కీలక ఘట్టానికి చేరుకుంది. ఇందులో భాగంగా పల్లకీల్లో తిరుగు పయనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలోని సమ్మక్క-సారక్క జాతర తరహాలో ఇక్కడ అమ్మవారి రంగుల మహోత్సవం జరుగుతుంది. అమ్మవారు, సహదేవతల 11 విగ్రహాలను రంగులు వేయించడానికి ఎడ్ల బండ్లపై ఈ నెల 5వ తేదీన జగ్గయ్యపేటకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే.

22 కి.మీ.. 48 గంటల సమయం.. జగ్గయ్యపేట నుంచి విగ్రహాలు పెనుగంచిప్రోలులోని ఆలయం వద్దకు(22 కి.మీ) చేరుకోవడానికి అధికారులు 48 గంటల సమయం కేటాయించారు. జగ్గయ్యపేటలోని రంగుబజారు విడిది వద్ద 28వ తేదీ ఉదయం 5.16 గంటలకు అమ్మవారితో పాటు సహ దేవతల విగ్రహాలను పల్లకీల్లో ఉంచి ఊరేగింపుగా బయలుదేరనున్నారు. ఈ నెల 30వ తేదీన ఉదయం ఐదు గంటల సమయంలో అమ్మవారి ఆలయంలో విగ్రహాలు చేరుకున్న అనంతరం గద్దెనెక్కించి పూజలు చేస్తారు.



తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలు

వచ్చేనెల ఒకటో తేదీ నుంచి పెద్ద తిరునాళ్లు.. ఫిబ్రవరి ఒకటో నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల జరగనున్నాయి. అమ్మవారి దీక్ష స్వీకరించిన స్వాములు అదేరోజున ఆలయం వద్ద తిరుముడి సమర్పించి దీక్ష ముగిస్తారు. ఒకటో తేదీ రాత్రి 9.05 గంటలకు అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

వేడుకలకు భారీగా ఏర్పాట్లు.. అమ్మవారి ఉత్సవాలకు దేవాదాయ, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జగ్గయ్యపేట నుంచి అమ్మవారు వచ్చే మార్గంలో డొంక రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. రూ.1.30 కోట్ల అంచనాతో పనులు నిర్వహిస్తున్నారు. పోలీసు అధికారుల సూచన మేరకు ఈసారి కల్యాణానికి ఎక్కువ మంది వస్తారనే అంచనాతో ఆలయానికి ఈశాన్యంలో విశాలమైన ప్రాంగణంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. 20 వేల మంది కూర్చునేలా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా 70 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పుతో కల్యాణ వేదిక నిర్మించనున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆలయ ఈఈ రమాదేవి తెలిపారు.

2 కిలోల బంగారు నగలు స్వాధీనం

గవర్నర్‌పేటలోని దుకాణాలపై దాడులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట రాజగోపాలాచారివీధిలోని బంగారు నగల దుకాణాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) అధికారులు శుక్రవారం దాడులు చేశారు. హాల్ మార్క్ లేకుండా నగలను విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు పలు దుకాణాల్లో నగలను తనిఖీ చేశారు. ఒక దుకాణంలో దాదాపు 2 కిలోల బంగారు నగలకు హాల్‌మార్క్ లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నారు. యజమానిపై కేసు నమోదు చేశారు.



స్టీల్ బాటిల్‌లో నీరు తాగి మంత్రి సత్యకుమార్‌కు అందజేస్తున్న కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్. పక్కనే శివప్రకాశ్‌జీ, సోము వీర్రాజు

ప్లాస్టిక్ రహితం.. ఆరోగ్య హితం

విజయవాడలో నిర్వహించిన జనసంఘ్ ఏకాత్మ మానవ దర్శన పునస్మరణ సదస్సు ప్రాంగణంలో తాగునీటిని ప్లాస్టిక్ రహితంగా అందించారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మొదలుకొని, ముఖ్యులకు స్టీల్ బాటిళ్లలో నీటిని నింపి ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల భాజపా నాయకులు, కార్యకర్తలకు కూడా స్టీల్ గ్లాసుల్లోనే నీటిని సరఫరా చేశారు. ప్లాస్టిక్ రహితంగా నీటిని అందించడంతో అందరూ మెచ్చుకున్నారు. - ఈనాడు, అమరావతి



నర్సులతో ఎంపీ కేశినేని శివనాథ్, సూపరింటెండెంట్ ఏవీ రావు తదితరులు

నర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శనివారం ఆయన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సులతో సమావేశమై వారి నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రోజూ నాలుగు వేలకు పైగా ఓపీ చూసే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నచిన్న సమస్యలున్నాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. బ్యాక్ ఎండ్ ఆపరేటర్ల అవసరమని, తాత్కాలిక ఉద్యోగుల నియామకంలో కొంత సమస్య ఉన్నట్లు తెలిపారు. సూపరింటెండెంట్ డా.ఏవీ రావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుమ్మడి కృష్ణారావు, ఆర్‌ఎంవో మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం అవసరం

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. బాలోత్సవ భవన్‌లో శనివారం 'రజకుల సమస్యలు-ప్రభుత్వ విధానాలు' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ... మాట్లాడుతూ.. వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం చేస్తామన్న కూటమి ప్రభుత్వ హామీని అమలు చేయాలని కోరారు. జీవో నంబర్ 27 ప్రకారం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల్లో ధోబీ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. ధోబీఘాట్ స్థలాలపై రజకులకు పూర్తి హక్కులు కల్పించి, రానున్న బడ్జెట్‌లో సమాఖ్యకు రూ.1000కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సావిత్రి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలకు భద్రత కరవైందన్నారు. రజకుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్.. సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చిక్కవరపు వెంకట రెడ్డయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, ఆయా సంఘాల ప్రతినిధులు అనిల్, రామ్మోహన్, పి.వెంకట్రావు, బుద్ధవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని ఆర్టీసీ సెంట్రల్ డిస్పెన్సరీలో లయన్స్ క్లబ్ ఎన్టీఆర్ జిల్లా సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ టి.సాయిచరణ్ తేజ తెలిపారు. శిబిరాన్ని విజయవాడ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు సుమారు 60 మంది రక్తదానం చేసినట్లు చెప్పారు. అనంతరం డ్రైవర్స్ డే సందర్భంగా డ్రైవర్లకు గులాబీలు అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీటీఎం పీఎన్‌బీఎస్ ఎస్‌హెచ్ పవన్ కుమార్, గవర్నర్‌పేట-1 డిపో మేనేజర్ బసవయ్య, విజయవాడ డీఎం, మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ సిబ్బంది, లయన్స్ క్లబ్ ఎన్టీఆర్ జిల్లా మేనేజర్ వినోద్ కుమార్, వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



శిబిరంలో విజయవాడజోన్-2 ఈడీ విజయరత్నం, అధికారులు

29లోగా భూముల విలువలపై అభ్యంతరాల స్వీకరణ

ఎన్టీఆర్ కలెక్టరేట్: భూముల మార్కెట్ విలువ, మార్గదర్శక విలువలపై ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 29వ తేదీలోగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాత పూర్వకంగా తెలియజేయాలని జేసీ ఎస్.ఇలక్కియా శనివారం ఓ ప్రకటనలో సూచించారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన మార్కెట్ విలువ, మార్గదర్శకా విలువలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, అధికారి వెబ్ సైట్‌లోనూ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన కమిటీ సమావేశం నిర్వహించి పరిశీలన చేస్తారని, అనంతరం 31న మార్కెట్ విలువ, మార్గదర్శకాల విలువలకు తుది ఆమోదం తెలపనున్నట్లు వివరించారు. ఆమోదం పొందిన మార్కెట్ విలువ ఫిబ్రవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తుందని ఆమె వెల్లడించారు.

అప్రెంటీస్‌షిప్‌నకు ఆహ్వానం

కొండపల్లి: అప్మెల్(ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజినీరింగ్ లిమిటెడ్)లో అప్రెంటీస్‌షిప్ చేయదలచిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అప్మెల్ ఛైర్మన్ ఎన్వీకే శ్రీనివాస్ తెలిపారు. కొండపల్లిలోని పరిశ్రమలో ప్రస్తుతం ఈ అవకాశం కల్పించినట్లు ఆయన చెప్పారు. వెల్డర్స్, ఫిట్టర్స్, ఎలక్ట్రీషియన్లకు అవకాశం ఉందని ప్రకటించారు. సంబంధిత విభాగాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కొండపల్లిలోని అప్మెల్ కార్యాలయంలో ఈ నెల 31 వరకూ అందివచ్చన్నారు.

ధర మురిసింది.. దిగుబడి తగ్గింది

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

ముందస్తు మామిడి ధర రైతులను మురిపిస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో దిగుబడులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఆశించిన స్థాయిలో కాయలు రాకపోవడంతో లోకల్ మార్కెట్లలో రవాణాకే వ్యాపారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. లారీల్లో ఎగుమతులు చేయాల్సిన తరుణంలోనూ మూటలకే పరిమితమయ్యాయని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

ముందస్తుగా అక్కడి నుంచే..

జిల్లాలో సుమారు 62 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. ప్రస్తుతం మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోనే అందులో మూడొంతులకు పైగా తోటలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని రెడ్డిగూడెం మండలంలో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా సాగు చేస్తుండగా రాష్ట్రంలో ముందస్తు మామిడి అక్కడి నుంచే ఎగుమతి అవుతోంది. అయితే ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఆ మండల రైతుల్లోనూ నిరాశ నింపింది. అక్కడి నుంచి సహజంగా జనవరి మొదటి వారం నుంచి పెద్ద ఎత్తున మామిడి ఎగుమతి చేసేవారు. చుట్టు పక్కల మండలాల్లోని తోటలను దృష్టిలో ఉంచుకుని విజయవాడ మార్కెట్ తర్వాత రెండు నియోజకవర్గాల పరిధిలోనే మామిడి వ్యాపార కేంద్రాలున్నాయి.

నాణ్యమైన కాయల దిగుబడికి ఉద్యాన శాఖ పేపరు సంచులను ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా తక్కువ పరిమాణంలో ఉండగానే సంచులను వాటికి కట్టడం ద్వారా చీడపీడలు, తెగుళ్ల దూరంగా ఉండి నాణ్యమైన కాయలొచ్చే పరిస్థితు లున్నాయి. దాంతో పలు ప్రాంతాల్లో రైతులు వీటిని ఏర్పాటు చేయగా బంగినపల్లి కాయలు టన్నుకు రూ.1.5 లక్షల వరకు ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. కొద్ది మొత్తంలోనే ఉండటంతో వాటికి గిరాకీ పెరగ్గా తోటల్లోనే కొనుగోలు చేస్తున్నారు.

సంచి కడితే రూ.1.5 లక్షలు

సాధారణ రకాలకు గిరాకీ

జిల్లాలోని చంద్రగూడెం, రెడ్డిగూడెం, విస్సన్నపేట, చీమలపాడుల్లో వ్యాపార కొనుగోలు కేంద్రాలున్నాయి. కాయల దిగుబడి లేకపోవడంతో ప్రస్తుతం చంద్రగూడెంలోనే కొంటున్నారు. ముదురుగా వచ్చిన బంగినపల్లి, రసాలు, తోతాపురి వంటి వివిధ రకాలన్నీ కలిపి రోజుకి 10 టన్నులు కూడా మించడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడంతో సాధారణ బంగినపల్లి కిలో రూ.80 వరకు, రసాలు రూ.115, తోతాపురి రూ.90 వరకు ధరలు పలుకుతున్నాయి. అయితే ఇతర రాష్ట్రాల్లోని ప్రధాన మార్కెట్లకు ఎగుమతి చేసే పరిమాణంలో దిగుబడులు లేకపోవడంతో లోకల్ మార్కెట్లకే సంచుల్లో తరలిస్తున్నారు. పూతల ఆలస్యం, ఇప్పటికే పేను ఆశించడంతో దిగుబడులు తక్కువగానే ఉంటాయని భావిస్తుండగా ధరలు కొనసాగితే కొంత మేరకు ఆదాయం వస్తుందని రైతులు ఆశపడుతున్నారు.



చంద్రగూడెం మార్కెట్‌లో ఎగుమతికి సిద్ధం చేస్తున్న మామిడి కాయలు

కృష్ణా నదిలో దిగి బాలుడి గల్లంతు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఈత సరదాతో కృష్ణా నదిలోకి దిగిన బాలుడు గల్లంతైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వండ్రంగిగా పనిచేస్తూ జీవనాన్ని సాగించే కొనగంటి ఈశ్వరరావు కుటుంబంతో పాయకాపురం న్యూరాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడైన గణేష్ మణికంఠ(14) అదే ప్రాంతంలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయాన్నే పాఠశాలకు వెళ్లిన బాలుడు పాఠశాల ఒంటిపూట వరకే ఉండడంతో మధ్యాహ్నానికి ఇంటికి చేరుకున్నాడు. అనంతరం బయటకు వచ్చిన బాలుడు అదే ప్రాంతానికి చెందిన స్నేహితులతో కలిసి కృష్ణా నదికి ఈతకు వెళ్లాలని అనుకున్నారు. ఆ క్రమంలో గణేష్ మణికంఠ అతని స్నేహితులైన తంగెళ్లమూడి కేశవ నరసింహరాజు, అన్నపుశెట్టి జశ్వంత్, దేవర గణేష్, యండ్రపల్లి ఉదయ్ జస్వంత్, గొర్రెముచ్చు ఉదయరాజులు మూడు సైకిళ్లపై ప్రకాశం బ్యారేజీ సమీపంలోని సీతమ్మవారిపాదాల ఘాట్ వద్దకు చేరుకున్నారు. సైకిళ్లను పార్కింగ్ చేసి ఆరుగురు కృష్ణా నది లోపలకు వెళ్లారు. ఒడ్డున దుస్తులు విడిచి ఒక్కొక్కరుగా నది లోపలకు వెళ్లి ఈత కొడుతుండగా వారిలో మణికంఠ మిగిలిన వారికి దూరంగా వెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో మిగిలిన పిల్లలు ఆందోళన చెంది 100కు ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. దీంతో అప్రమత్తమైన కృష్ణలంక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎస్డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించడంతో వారు మరబోటు సాయంతో గాలింపు చేపట్టారు. రాత్రి 8 గంటల వరకు గాలింపు చర్యలు కొనసాగించినా బాలుడి ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేపట్టారు.




గణేష్ మణికంఠ

హత్య కేసు నిందితుడు.. శవమై తేలాడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ, కేదారేశ్వరపేట 8వ లైనులో హుస్సేనా (39) అనే మహిళను హత్యచేసి పరారైన ఆటోడ్రైవర్ సాయి శివకుమార్.. బందరుకాలువలో శవమై తేలాడు. గుంటూరు జిల్లా నులకపేటకు చెందిన అతడు.. 14 సంవత్సరాలుగా హుస్సేనాతో సహజీవనం చేస్తున్నాడు. వీరిద్దరి మధ్య గొడవ నేపథ్యంలో ఈ నెల 16న ఆమెను హత్య చేసి పారిపోయాడు. అప్పటి నుంచి అతని కోసం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గాలింపు చేపట్టారు. బందరు కాలువలో దూకాడని సమాచారం అందింది. దీంతో కాలువ పరివాహక ప్రాంతంలో కొద్ది రోజులుగా గాలింపు చేపట్టారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బందరుకాలువలో లాకుల వద్ద గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉందని సమాచారం రావడంతో.. అక్కడకు వెళ్లి పరిశీలించారు. కుళ్లిపోయిన స్థితిలో ఉండడంతో ఆనవాళ్లు గుర్తించటం కష్టంగా మారింది. సాయి శివకుమార్ కుటుంబ సభ్యులను పిలిపించారు. దుస్తుల ఆధారంగా.. శివకుమార్‌గా నిర్ధారించారు. సహజీవనం చేస్తున్న మహిళను చంపి, ఆమె కుమార్తెను కొట్టి భయంతో పారిపోయి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గవర్నర్‌పేట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతి వేగం.. రైతు దుర్మరణం

జి.కొండూరు, న్యూస్‌టుడే : టిప్పర్‌ను అతి వేగంగా నడిపి రైతును ఢీకొట్టిన సంఘటన చెరువు మాధవరంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మండలంలోని చెరువు మాధవరానికి చెందిన చెన్నంశెట్టి సాంబశివరావు(60) వ్యవసాయ పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. కందులపాడు గంగినేనిపాలెం ఎర్రుపాలెం(కేజీవై) ఆర్‌అండ్‌బీ రహదారి పనులు చెరువు మాధవరంలో జరుగుతుండగా ఎస్ఈపీఎల్ సంస్థకు చెందిన టిప్పర్ లారీ వెట్‌మిక్స్ అన్‌లోడు చేసి ఒక్కసారిగా వెనక్కు వెళ్లింది. దీంతో రోడ్డు పక్కన తన ద్విచక్ర వాహనంతో నిలిచి ఉన్న సాంబశివరావు పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో డ్రైవర్ మాత్రమే ఉండడం, క్లీనర్ లేకపోవడం, లారీని అతి వేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మృతునికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు.



సాంబశివరావు (పాత చిత్రం)

తిరువూరు

• తిరువూరు • మైలవరం


మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పరిటాల రవికి ఘన నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : మాజీ మంత్రి దివంగత పరిటాల రవీంద్ర వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు లితీష్, వెంకట నారాయణ, అంకరాజు, ప్రేమ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెనుగొలను సమీప మెట్టగుట్టలోని గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శ్యామ్ సుందర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కంభంపాడులోని గంగా విజయదుర్గ సమేత నాగమల్లేశ్వర స్వామి గుడిలో రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


మెట్టగుట్టలో శ్రీనివాస స్వామి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: తిరువూరు పట్టణం 12వ వార్డులోని డ్రెయిన్లలో దోమలు పెరుగుతున్నాయని స్థానికుడు రామకోటేశ్వరరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి డ్రెయిన్లలో దోమల మందు పిచికారీ చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి ఎస్టీ కాలనీకి చెందిన పాలపర్తి భవాని(30) గత నెల 29న మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ రూ.లక్ష చెక్కును విడుదల చేశారు. ఆ చెక్కును పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను మృతురాలి తండ్రి నాగేశ్వరరావుకు శనివారం అందజేశారు.

ఓటు హక్కు... భవిష్యత్తుకు తొలిమెట్టు

జాతీయ ఓటర్ల దినోత్సవం నేడు

ప్రజాస్వామ్యంలో 'ఓటే' వజ్రాయుధం. పాలకులను ఎన్నుకునే హక్కు మనకు ఓటు ద్వారానే సొంతం. 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడు ఆ హక్కును పొందవచ్చు. రాజ్యాంగం కల్పించిన హక్కును బాధ్యతగా సద్వినియోగం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో ఏటా జనవరి 25న ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 'జాతీయ ఓటర్ల దినోత్సవం' నిర్వహిస్తారు. ఇందులో భాగంగా భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు వినియోగంపై శ్రద్ధ చూపిస్తోంది. అందుకే కొత్త ఓటర్ల నమోదు నుంచి జాబితాల్లో తొలగింపులు, సవరణలకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల జాబితాలు ఎప్పటికప్పుడు చేర్పులు, మార్పులతో సిద్ధంగా ఉంచేందుకు బూత్ స్థాయి అధికారులను(బీఎల్వో) నియమించారు.

మహిళలే అధికం: తాజా జాబితా మేరకు తిరువూరు నియోజకవర్గంలోని 234 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,08,185 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో సీనియర్ సిటిజన్స్ 1,470, కొత్త ఓటర్లు 2,827, దివ్యాంగులు 2,939, ఎన్ఆర్ఐలు 39, సర్వీసు ఓటర్లు 47 ఉన్నారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ఏడాదిలో 585 మంది ఓటర్లు పెరిగారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

2026 జనవరి నాటికి ఓటర్ల వివరాలు ...

మండలం పేరు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
గంపలగూడెం	69	29,052	29,860	0
తిరువూరు పట్టణం	27	13,598	14,755	3
తిరువూరు గ్రామీణం	39	17,101	17,565	1
విస్సన్నపేట	56	23,114	23,877	2
ఎ.కొండూరు	43	19,593	19,664	0

★ నూతనంగా ఓటు హక్కు పొందేందుకు ఫారం- 6 దరఖాస్తు వినియోగించాలి. ★ ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు(అభ్యంతరాలు) ఫారం- 7ను దరఖాస్తు చేసుకోవాలి. ★ పేర్ల మార్పులకు(సవరణలు) ఫారం- 8ను వినియోగించాలి. ★ నియోజకవర్గ పరిధిలోని ఒక పోలింగ్ స్టేషన్ పరిధి నుంచి మరొక దానికి మారితే ఫారం-8 ఏ దరఖాస్తు చేయాలి. ★ ఒక నియోజకవర్గం నుంచి వేరొక నియోజకవర్గానికి మారితే ప్రస్తుత ఉన్న దానిలో ఫారం- 7, కొత్త దానిలో ఫారం- 6 దరఖాస్తు వినియోగించాలి. ★ ప్రవాస భారతీయులు ఓటు కోసం ఫారం- 6 బీ దరఖాస్తు చేసుకోవచ్చు. పాస్‌పోర్ట్ కూడా జత చేయాలి. - గంపలగూడెం, న్యూస్‌టుడే

'జైలుకెళ్లొచ్చినా జోగి తీరు మారలేదు'

గొల్లపూడి, న్యూస్‌టుడే : కల్తీ మద్యం సరఫరా చేసిన జోగి రమేష్ ప్రజల ప్రాణాలతో ఆడుకున్నారని గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు ఆరోపించారు. శనివారం గొల్లపూడిలోని తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యం కేసులో జైలుకెళ్లి వచ్చినా జోగికి బుద్ధి రాలేదని మండిపడ్డారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ ఊరేగింపుగా జైలు నుంచి ఇంటికెళ్లడం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు నారద, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొర్రా తిరుపతిరావు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: బెయిల్‌పై విడుదలైన జోగి రమేష్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను తెదేపా ఇబ్రహీంపట్నం నేతలు ఖండించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు మాట్లాడారు. కక్ష సాధింపు అంటూ జోగి చేస్తున్న ప్రచారం సానుభూతి కోసమేనన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట నూతన ఎస్సైగా నియమితులైన యం.అర్జున్ రాజు శనివారం తిరువూరు ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు మెచ్చేలా సమర్థవంతమైన పోలీసింగ్ నిర్వహించాలని ఎస్సైకు సూచించారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు దాబా శ్రీను, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల రాధా ఎస్సై అర్జున్ రాజును స్థానిక పోలీస్ స్టేషన్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలకు నిధుల మంజూరు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నిధులు కేటాయిస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, గోపాలపురం, పోలిశెట్టిపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న పలు సీసీ రహదారులకు ఆయన శనివారం భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, సర్పంచ్ బి.చిట్టిబాబు, తెదేపా నాయకులు ఎ.కృష్ణారెడ్డి, ఐ.దేవీదీరాజు, రామారావు, బి.రాంబాబు, గోపిరాజు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. అధికారులు, తెదేపా నాయకులు ప్రసాద్, నాగులు, లోకేశ్వరరావు, వేమన తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం


ప్రసంగిస్తున్న మురళీ కృష్ణప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే : పీఎం స్వనిధితో వీధి వ్యాపారుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే లక్ష్యమని మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో కొండపల్లి పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెప్మా డైరెక్టర్ మురళీ కృష్ణప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీను, కమిషనర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈ- నారీ, సీఆర్పీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ- నారీ, సీఆర్పీలు చేయాల్సిన పనులు, విధులు, బాధ్యతలను వెలుగు ఏపీఎం బి.రామకృష్ణ వివరించారు.


మైలవరంలో ఆర్థిక సాయం అందిస్తున్న జయప్రకాశ్‌రెడ్డి


కొండపల్లి : జవివే అందించిన పుస్తకాలతో విద్యార్థులు

బాలికల విద్యే.. సమాజాభివృద్ధికి బలమైన పునాది

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్, సేఫ్టీ క్లబ్, ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలోని ఇద్దరు బాలికలకు రూ.5 వేల చొప్పున కళాశాల గౌరవ ఛైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి అందించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'ఎదిగే ఆడ పిల్ల ఏమి తెలుసుకోవాలి' అనే పుస్తకాన్ని క్రాంతి పాఠశాల విద్యార్థులకు అందజేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక బాలికోన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు స్ఫూర్తి, భవితకు భరోసా పుస్తకాలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యే సమాజాభివృద్ధికి బలమైన పునాది అని తెలిపారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెదకొమిర కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో తిరువూరు సీడీపీవో పి.కృష్ణకుమారి ఆధ్వర్యంలో బాలికలకు చదువు ఆవశ్యకత, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బాలికల గురుకుల పాఠశాలలో పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.


తిరువూరు : పుస్తకాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే శ్రీనివాసరావు


పెదకొమిర కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రదర్శన ర్యాలీ

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ


మైలవరం : ప్రదర్శనలో తహసీల్దార్, ప్రిన్సిపల్ తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : ఓటు ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని మైలవరం తహసీల్దార్ అబ్దుల్ దరియా తెలిపారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక వీధుల గుండా ప్రదర్శన ర్యాలీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటే వజ్రాయుధమని చెప్పారు. ప్రిన్సిపల్ పి.రంగారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. కల్చరల్ కోఆర్డినేటర్ ఎం.దేవానంద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నులు, ప్యాడ్ల పంపిణీ

తిరువూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ జన్మదిన సందర్భంగా తిరువూరు పట్టణ తెదేపా ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు పెన్నులు, పరీక్షలకు అవసరమైన ప్యాడ్లు పంపిణీ చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గోసవీడులో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, తెలుగు మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని లోకేశ్ చిత్రపటంతో గ్రామంలో ప్రదర్శన చేశారు.

యువత మత్తుకు బానిస కావొద్దు


మైలవరంలో ఆసుపత్రి సిబ్బంది, వివిధ సంఘాల ప్రదర్శన

మైలవరం, న్యూస్‌టుడే : యువత జీవితాలను నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భవిష్యత్తు లక్ష్యసాధనకు కృషి చేయాలని స్థానిక ప్రముఖ వైద్యుడు జి.వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ ఎండీ పి.రమేష్ బాబు ఆధ్వర్యంలో శనివారం మైలవరంలో 'నో టు డ్రగ్స్' వాకథాన్ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాసరావు, ఈగల్ ఎస్సై రాంబాబు, స్థానిక ఎస్సై సుధాకర్, ఎల్బీఆర్ సీఈ, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వైకాపా నేతల మద్యం స్కాంతో రాష్ట్ర ఆదాయం తగ్గింది: మంత్రి కొల్లు

పటమట, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ పాలనలో వైకాపా నేతలు చేసిన మద్యం స్కాం వల్ల ప్రజల ఆరోగ్యాన్ని, రాష్ట్ర ఆదాయాన్ని నష్టపోయిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం పటమటలోని తెదేపా నేత బొప్పన భవకుమార్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ అండతో ఒక లిక్కర్ స్కామర్ అని ప్రజలందరికీ తెలుసన్నారు. వైకాపా హయాంలో మద్యం స్కాం ద్వారా విచ్చలవిడిగా రాష్ట్ర ఆదాయాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ స్కాంలో వైకాపా నేతలు భాగస్వాములున్నారని విజయసాయిరెడ్డే తెలిపారని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు జగన్ సూచనల మేరకు మాజీ మంత్రి జోగి రమేష్ కల్తీ మద్యం దందా నడిపారని, జైలుకు వెళ్లి బెయిల్ వచ్చే సరికి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం వద్ద జోగి రమేష్ అనుచరులు పోలీసులపై దాడికి ప్రయత్నించడం దారుణమన్నారు.


మైలవరం ఏఎంసీలో మొక్క నాటుతున్న నవ్యశ్రీ, అధికారులు



మైలవరం పంచాయతీ ఆధ్వర్యంలో ప్రదర్శన


ఇబ్రహీంపట్నం సీ.కాలనీలో ప్రతిజ్ఞ చేస్తూ..

పరిశుభ్రత.. మన అందరి బాధ్యత

మైలవరం, న్యూస్‌టుడే : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఏఎంసీలో ఛైర్మన్ పి.నవ్యశ్రీ పరిసరాలను శుభ్రం చేయించి మొక్కలు నాటారు. కార్యదర్శి శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు. మైలవరం పంచాయతీ ఆధ్వర్యంలో 4వ గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటిన అనంతరం ప్రదర్శన చేశారు. సర్పంచి మంజుభార్గవి, ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ అబ్దుల్ దరియా, కార్యదర్శి రఫి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం సీ.కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు మొక్కలు నాటారు. ఇంజినీర్లతో పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

గంపలగూడెం: పెదకొమిరలో ఎంపీడీవో టి.సరస్వతి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్రపై ప్రదర్శన నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. సర్పంచి రాణి తదితరులు పాల్గొన్నారు.



పెదకొమిరలో అధికారులు, సిబ్బంది


రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ధాన్యం విక్రయాలతో అన్నదాతలకు లబ్ధి


రంగాపురంలో ధాన్యం కాటా వేస్తున్న హమాలీలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2,587 మంది రైతులు 14,813 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారు. దీని విలువ సుమారు రూ.33.81 కోట్లు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 11 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ప్రస్తుతం 3,813 టన్నుల అధికంగా అమ్మకాలు జరగడం ద్వారా అన్నదాతలు లబ్ధి పొందినట్లు మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పాడి రైతులను ఆదుకోవాలనే పశు వైద్య శిబిరాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : పాడి రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో పశు ఆరోగ్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్యులు శైలు మాధురి, స్వాతి, సుజని, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని వామకుంట్లలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పది పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో పి.రమేష్‌బాబు అన్నారు. రెడ్డిగూడెం, నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగిన క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశాల్లో ఆయన పాల్గొని వారితో మాట్లాడారు. హెచ్ఎంలు ధర్మశీల, వరలక్ష్మి పాల్గొన్నారు.


రెడ్డిగూడెం : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు


పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో..

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని ప్రభుత్వ విద్యాలయాల ఉపాధ్యాయులకు క్లస్టర్ల వారీగా సముదాయ సమావేశాలు నిర్వహించారు. దీక్షా యాప్ చరవాణిలో లాగిన్ అవ్వడంపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరంగా శిక్షలు తప్పవు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో మార్పును, వివక్షతను మార్చగల శక్తి విద్యకు మాత్రమే ఉందని స్థానిక అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జి.వందన పేర్కొన్నారు. శనివారం నందిగామ డాన్‌బాస్కో ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికల స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. లింగవివక్ష, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా శిక్షలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు, న్యాయవాదులు గుర్రాల వెంకటరత్నం, పి.రామచంద్రారెడ్డి, వజ్రయ్య, షేక్ సైదా, గంగాజ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పటమట: ఉయ్యూరుకు చెందిన యువకుడు, ఇబ్రహీంపట్నంకు చెందిన యువకుడు ఇద్దరూ స్నేహితులు.. గంజాయికి అలవాటు పడడంతో వచ్చే డబ్బు సరిపోక గంజాయి స్మగ్లింగ్ చేయడం ప్రారంభించారు. దీనికోసం విజయవాడ నగరంలో ఖరీదైన స్పోర్ట్స్ ద్విచక్ర వాహనాలు చోరీ చేసి వాటిపై ఆంధ్రా-ఒడిశా బోర్డర్ సమీపంలో మన్యం ప్రాంతానికి వెళ్లేవారు. చోరీ చేసిన ద్విచక్ర వాహనాలను అక్కడ ఇచ్చేసి బదులుగా గంజాయి తెచ్చుకునే వారు. ఇలా పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలను అక్కడ ఇచ్చినట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది.

బయట పడింది ఇలా.. పటమట చెక్‌పోస్ట్ సెంటర్‌కు చెందిన యువకుడి ద్విచక్ర వాహనం తన ఇంటి ముందు నిలిపి ఉంచగా చోరీకి గురైంది. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ చేసింది ఉయ్యూరు, ఇబ్రహీంపట్నంకు చెందిన ముఠాగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు చోరీ చేసిన ద్విచక్ర వాహనాల సంఖ్య బయటకు వచ్చినట్లు సమాచారం. ఇప్పటికి సుమారు 10 ద్విచక్ర వాహనాలను రికవరీ చేశారు. మరో 20 ద్విచక్ర వాహనాలు రికవరీ చేయాల్సి ఉంది. ఈ ముఠా వెనుక మరో నలుగురు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులతో పాటు చోరీ అయిన ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

క్రాస్ కంట్రీ పరుగు పందెం విజేత ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల



పురుషుల పరుగు పందెం విజేతలకు జ్ఞాపిక అందజేస్తూ..

గుడివాడ, న్యూస్‌టుడే : నిత్యం వ్యాయామంతో ఆరోగ్యం చేకూరుతుందని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలు శనివారం నిర్వహించారు. విశ్వ విద్యాలయం పరిధిలో 10 కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల ప్రథమ, గుడివాడ ఏఎన్నార్ కళాశాల ద్వితీయ, విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగంలో ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల ప్రథమ, గుడివాడ ఏఎన్నార్ కళాశాల ద్వితీయ, గుడివాడ కేటీఆర్ మహిళా కళాశాల తృతీయ స్థానాలు సాధించాయి. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆలిండియా క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, కృష్ణా విశ్వ విద్యాలయం ఎంపిక కమిటీ సభ్యులు డాక్టర్ బొమ్మలూరి ఉదయ్‌కుమార్, డాక్టర్ నవుడు హేమ వెంకటలక్ష్మి, పి.చంద్రబాబు, కళాశాల పీడీ వీర్ల గోపీ పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టు



జట్టు సభ్యులతో ఆచంట సునీత, వినయ్ శేఖర్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చెన్నైలోని అన్నా వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరిగే దక్షిణ మండలం అంతర్ వర్సిటీల మహిళా క్రికెట్ టోర్నీలో తలపడే కృష్ణా వర్సిటీ జట్టును వర్సిటీ జట్టు ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ ఆచంట సునీత శనివారం వెల్లడించారు. ఈ జట్టుకు కళాశాల వ్యాయామ సంచాలకుడు ఎల్.వినయ్ శేఖర్ కోచ్, మేనేజరుగా నియమితులయ్యారు. జట్టులో కేవీఎంవీ వర్థిని, ఎం.పూజిత(నలంద డిగ్రీ కళాశాల), ఎ.ఎస్తేర్‌రాణి(ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా కళాశాల), కె.కీర్తి, ఎండీ మెహక్(నలంద పీజీ కళాశాల), ఎం.లేఖన, వి.వేణుమాధవి, డి.గౌతమి(పీబీ సిద్ధార్థ కళాశాల), పి.లేఖన, డి.చంద్రజ, కె.జోషిత(కేబీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల), ఎన్.అహల్యా, ఎం.కృష్ణశ్రీ(ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల), కె.లోహిత, పి.జ్యోతిర్మయి(డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల), పి.రంగలక్ష్మి(ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల)లు స్థానం సాధించారు.

క్యారెట్టు.. అదిరేట్టు!

నారింజరంగులో నోరూరించేలా ఉంటుంది క్యారెట్. పచ్చిదైనా పసందుగా తినేయొచ్చు. కళ్లకు మేలుచేసే క్యారెట్‌తో.. ఇడ్లీ, ఉప్మా బర్ఫీ, లడ్డూ, దోశ, శాండ్‌విచ్, కుర్మా, కూటు, ఖీర్, సూప్, పుడ్డింగ్, పాయసం, కిచిడీ, పులావ్, కబాబ్, సలాడ్, కోసాంబరీ, స్ప్రింగ్ రోల్స్- ఇలా ఎన్నెన్నో వెరైటీలు చేయొచ్చు. మీ కోసం కొన్ని ప్రత్యేక రెసిపీలు..



స్మూదీ

కావలసినవి: క్యారెట్లు - 2, కాచి చల్లార్చిన పాలు - కప్పు, అరటిపండు - 1, తేనె - 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - చిటికెడు, బాదం, జీడిపప్పులు - 3 చొప్పున, అల్లం ముద్ద - పావు స్పూన్

తయారీ: బాదంపప్పులను నానబెట్టి పొట్టు తీసి పక్కనుంచాలి. క్యారెట్లను ఉడికించి చల్లారనివ్వాలి. అందులో పాలు, అరటి పండు, తేనె, యాలకుల పొడి, అల్లం ముద్ద, బాదం, జీడిపప్పులు వేసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. అంతే.. నోరూరించే క్యారెట్ స్మూదీ తయారైపోతుంది. తేనె లేకుంటే పంచదార వేసుకోవచ్చు.



పరోటా

కావలసినవి: గోధుమ పిండి - 2 కప్పులు, క్యారెట్ తురుము - కప్పు, ఉప్పు - రుచికి తగినంత, జీలకర్ర - అర స్పూన్, వాము - పావు స్పూన్, పచ్చిమిర్చి - 1, కొత్తిమీర - గుప్పెడు, నూనె - 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి - 2 స్పూన్లు

తయారీ: గోధుమపిండిలో క్యారెట్ తురుము, ఉప్పు, జీలకర్ర, వాము, పచ్చిమిర్చి, కొత్తిమీర, నెయ్యి వేసి కలపాలి. అందులో కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ మెత్తటి పిండి అయ్యేలా బాగా కలపాలి. దాని మీద మూత పెట్టి పక్కనుంచాలి. అరగంట తర్వాత.. ఎనిమిది సమాన భాగాలు చేసి.. చపాతీకర్రతో రొట్టెలు చేయాలి. అన్నీ అయ్యాక.. కాలుతున్న పెనం మీద కాస్త నూనె వేసి రెండు వైపులా కాల్చుకోవాలి. ఇక వేడి వేడి క్యారెట్ పరోటా తిని ఆనందించడమే తరువాయి.



క్యారెట్ చీజ్ బాల్స్

కావలసినవి: క్యారెట్లు - 4, చీజ్ - కప్పు, బంగాళదుంప - 1, బ్రెడ్ పొడి - అర కప్పు, మొక్కజొన్న పిండి - 2 టేబుల్‌స్పూన్లు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - స్పూన్, పచ్చిమిర్చి - 2, ఉప్పు - రుచికి తగినంత, మిరియాల పొడి - అర స్పూన్, గరం మసాలా - పావు స్పూన్, కొత్తిమీర తరుగు - చారెడు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: బంగాళదుంపను ఉడికించి పొట్టు తీసి మెదపాలి. క్యారెట్లను కడిగి, తురమాలి. అందులో మెదిపిన ఆలూ, చీజ్, అల్లం-వెల్లుల్లి పేస్ట్, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉప్పు, మిరియాల పొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. దీనికి బ్రెడ్ పొడి, మొక్కజొన్న పిండి జతచేసి మరోసారి కలపాలి. ఈ మిశ్రమంతో చిన్న బాల్స్‌లా చేయాలి. కడాయిలో నూనె వేడి చేసి, మధ్యస్థమైన సెగ మీద బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. వాటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే అదనపు నూనెను పీల్చేసుకుంటుంది. ఇక టొమాటో లేదా చిల్లీ సాస్‌తో వేడిగా వడ్డించండి.



హల్వా

కావలసినవి: క్యారెట్లు - కిలో, చిక్కటి పాలు - లీటర్, పంచదార - కప్పు, నెయ్యి - 6 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూన్, జీడిపప్పులు - పావు కప్పు, ఎండుద్రాక్ష - టేబుల్ స్పూన్, బాదం, పిస్తా - 10 చొప్పున, ఖోవా - కొద్దిగా

తయారీ: క్యారెట్లను తురమాలి. కడాయిలో సగం నెయ్యి వేడిచేసి డ్రై ఫ్రూట్స్‌ను వేయించాలి. అవి కాస్త వేగాక.. క్యారెట్ తురుము చేర్చాలి. రెండు నిమిషాలు వేయించి.. పాలు జతచేసి సన్న సెగ మీద ఉడికించాలి. మధ్యమధ్యలో కలియతిప్పుతుండాలి. కొంచెం దగ్గరగా అయ్యాక.. పంచదార, యాలకుల పొడి జోడించి కలుపుతుండాలి. చిక్కగా అయ్యేకొద్దీ అడుగంటకుండా కింది నుంచి పైకి కలియబెడుతూనే ఉండాలి. చివర్లో మిగిలిన నెయ్యి, ఖోవా కూడా వేసి.. ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. ఇది సహజంగానే చక్కటి రంగుతో ఆకర్షణీయంగా ఉంటుంది కాబట్టి ఫుడ్‌కలర్ అవసరం లేదు. మరింత రంగు రావాలంటే దిల్లీ క్యారెట్లు ఉపయోగించవచ్చు.



ఊరగాయ

కావలసినవి: క్యారెట్లు - కిలో, ఉప్పు - అర కప్పు, నూనె - పావు లీటర్, ఆవపిండి - 100 గ్రాములు, కారం - 125 గ్రా, మెంతుల పొడి - టేబుల్ స్పూన్, వెల్లుల్లిపాయలు - 2, పసుపు - స్పూన్, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు

తయారీ: క్యారెట్లను కడిగి తడి లేకుండా తుడవాలి. పొడవుగా, సన్నగా ముక్కలు కోసి, రెండు మూడు గంటలు నీడలో ఆరబెట్టాలి. వాటిని వెడల్పాటి పాత్రలో వేసి.. ఉప్పు, పసుపు, ఆవపొడి, మెంతుల పొడి, కారం, నిమ్మరసం, పొట్టు తీసిన వెల్లుల్లి చేర్చి బాగా కలపాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా నూనె పోస్తూ అంతా కలిసేలా కలియబెట్టాలి. మూత పెట్టేసి.. మర్నాడు పొడి గరిటెతో పచ్చడి కలపాలి. ఇంకో రెండు రోజులు అలా కలిపితే ఘుమఘుమలాడే క్యారెట్ ఊరగాయ సిద్ధం. దీన్ని తడి లేని సీసాల్లోకి తీసి.. తేమ లేని చల్లని ప్రదేశంలో ఉంచాలి. తడి స్పూన్ ఉపయోగించినా, ఉప్పు తగ్గినా పచ్చడి పాడవుతుంది.



క్యారెట్-కొబ్బరి ఫ్రై

కావలసినవి: క్యారెట్ తురుము - 2 కప్పులు, తాజా కొబ్బరి తురుము - అర కప్పు, నూనె - 2 టేబుల్ స్పూన్లు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, ఎండుమిర్చి - 2, కరివేపాకు - 2 రెబ్బలు, పచ్చిమిర్చి - 3, ఉప్పు - రుచికి తగినంత, పసుపు - చిటికెడు, నిమ్మరసం - ముప్పావు స్పూన్

తయారీ: కడాయిలో నూనె వేడయ్యాక.. ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు వేయాలి. ఆవాలు చిటపటలాడుతుండగా.. జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు జతచేయాలి. అవి వేగాక.. పచ్చిమిర్చి వేసి కాస్త వేయించాలి. అందులో క్యారెట్ తురుము, పసుపు, ఉప్పు చేర్చి కలియతిప్పి.. మూత పెట్టాలి. సన్న సెగ మీద ఉడికిస్తూ మధ్యమధ్యలో కలుపుతుండాలి. క్యారెట్ మెత్తబడినుకున్నాక.. కొబ్బరి తురుము జోడించి రెండూ మూడు నిమిషాలు వేయించాలి. సెగ తీసేసి.. నిమ్మరసం చల్లాలి. ఇది వేడివేడి అన్నంలో సూపర్‌గా ఉంటుంది.



ఆరోగ్య సిరి ఉసిరి కాయలతో పౌడర్ చేసి ఉంచితే.. అనేక వంటల్లో ఉపయోగించవచ్చు. పదార్థాలకు రుచీ వస్తుంది, శరీరానికి సి-విటమిన్ అందుతుంది.

ఆమ్లా పౌడర్ ఇంట్లోనే..

ఎలా చేయాలంటే.. పెద్దవి, తాజావి అయిన పది ఉసిరికాయలు తీసుకోవాలి. వాటిని బాగా కడిగి తడి లేకుండా తుడవాలి. చిన్న చిన్న ముక్కలుగా కోసి విత్తనాలు తీసేయాలి. ఈ ముక్కలను శుభ్రమైన వస్త్రం మీద పరిచినట్లుగా ఉంచి.. రెండు మూడు రోజులు ఎండబెట్టాలి. వాటిని ప్యాన్‌లోకి తీసి సన్న సెగ మీద వేయించాలి. నూనె వేయనవసరం లేదు. ముక్కలు వేగి.. కరకరలాడేలా ఉండాలి. చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఒకసారి జల్లించి.. బరకగా ఉన్నదాన్ని మళ్లీ గ్రైండ్ చేయాలి. ఈ పౌడర్‌లో ఉప్పు, నూనె వంటివేమీ కలపకూడదు. దీన్ని గాలి చొరబడని సీసాలోకి తీసి.. తేమ లేని చల్లని ప్రదేశంలో ఉంచాలి.

తడి స్పూన్ వాడకూడదు. ఇలా చేస్తే చాన్నాళ్లు నిలవుంటుంది.

ఎలా ఉపయోగించాలంటే..: టొమాటోపప్పు, వంకాయ, బీరకాయ వంటి కూరలు, చారు, రసం, రోటిపచ్చళ్లు, మజ్జిగ పులుసు, సూప్స్- ఇలా ఎందులో వేసినా.. వాటికి అదనపు రుచి వస్తుంది. దీంతో ఆమ్లారైస్ కూడా చేయొచ్చు.



వారం వారం ఒక్కో క్యాండీ తయారీ గురించి తెలుసుకుంటున్నాం కదా! ఈసారి సోంపుతో క్యాండీ చేసుకుందాం..

ఈ క్యాండీ.. సూపర్ టేస్టీ!

కావలసినవి: సోంపు - అర కప్పు, పంచదార - కప్పు, నెయ్యి - 2 స్పూన్లు, యాలకుల పొడి - పావు స్పూన్, ఫుడ్ కలర్ - కొద్దిగా

తయారీ: సోంపును కడిగి తడి లేకుండా ఆరబెట్టాలి. అర కప్పు నీళ్లలో పంచదార వేసి.. మరిగించాలి. తీగ పాకం వచ్చాక.. యాలకుల పొడి, సోంపు, ఫుడ్ కలర్, స్పూన్ నెయ్యి వేసి కలియతిప్పాలి. చిక్కగా అయ్యాక.. సెగ తీసేయాలి. మిగిలిన నెయ్యి ప్లేట్‌లో రాసి.. సోంపు మిశ్రమాన్ని సమంగా సర్దాలి. గట్టిపడక ముందే నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. పూర్తిగా చల్లారిన తర్వాత గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి.



మజారే మటన్ పెప్పర్ ఫ్రై

మటన్ వెరైటీల్లో పెప్పర్ ఫ్రై ఒకటి. మిరియాల సువాసన, నేతి రుచితో అందరికీ నచ్చేసే ఈ రెసిపీని ఇలా చేశారంటే అదిరిపోతుంది..

కావలసినవి: మాంసం - అరకిలో, ఉప్పు - రుచికి తగినంత, ఉల్లి తరుగు - కప్పు, పచ్చిమిర్చి - 2, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి - 2 స్పూన్లు, జీలకర్ర, ధనియాలు, సోంపు పొడులు, కారం, గరం మసాలా - అర స్పూన్ చొప్పున, కరివేపాకు - 2 రెబ్బలు, కొత్తిమీర తరుగు - గుప్పెడు, నూనె - 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి - రెండు స్పూన్లు



తయారీ: మటన్ ముక్కల్లో తగినన్ని నీళ్లు, ఉప్పు, అల్లం-వెల్లుల్లి పేస్ట్‌లో సగం, అర స్పూన్ మిరియాల పొడి వేసి.. 3 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. కడాయిలో నూనె వేడి చేసి.. జీలకర్ర, కరివేపాకు వేయాలి. అవి వేగాక.. ఉల్లితరుగును బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. అందులో పచ్చిమిర్చి ముక్కలు, మిగిలిన అల్లం-వెల్లుల్లి పేస్ట్ జతచేయాలి. నిమిషం వేయించి.. ధనియాలు, సోంపు పొడులు, కారం, ఉడికించిన మటన్ జోడించాలి. ముక్కలకు మసాలా పట్టేలా కలిపి.. మధ్యస్థమైన సెగ మీదుంచి.. మధ్యమధ్యలో కలుపుతుండాలి. ఏడెనిమిది నిమిషాల తర్వాత.. మిగిలిన మిరియాల పొడి, గరం మసాలా వేసి కలియతిప్పాలి. చివర్లో కొత్తిమీర, నెయ్యి వేసి దించేస్తే 'మటన్ పెప్పర్ ఫ్రై' తయారైపోతుంది. ఇది అన్నం, రోటీ, చపాతీ.. ఎందులోకైనా బాగుంటుంది. మిరియాలపొడి మొదట్లోనే మొత్తం వేసేస్తే అంత ఫ్లేవర్ రాదని గుర్తుంచుకోవాలి. చివర్లో నెయ్యి వేయడం వల్ల అదనపు రుచి వస్తుంది.

పాఠక వంట

ఆమ్లాతో ఉప్మా, పరోటా

ఉసిరికాయలతో పచ్చడి, క్యాండీ, మురబ్బాలే కాదు.. పరోటా, ఉప్మా లాంటివీ చేయొచ్చు. వీటిలో ఔషధగుణాలుంటాయి కాబట్టి ఇవి దొరికే రోజుల్లో ఈ ఫలహారాలు ప్రయత్నించి చూడండి..

ఆమ్లా ఉప్మా : రవ్వ - కప్పు, ఉప్పు - రుచికి తగినంత, ఉసిరికాయలు - 2, ఉల్లి తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - 2, అల్లం ముక్కలు - స్పూన్, జీడిపప్పులు, పల్లీలు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, ఆవాలు - అర స్పూన్, కరివేపాకు - 2 రెబ్బలు, నూనె - టేబుల్ స్పూన్, నిమ్మరసం - ముప్పావు స్పూన్, శనగపప్పు, మినప్పప్పు - స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, అన్ని పప్పులు, కరివేపాకు వేసి వేయించాలి. అందులో ఉల్లి, మిర్చి, అల్లం జోడించాలి. ఉల్లి తరుగు కాస్త మెత్తబడ్డాక.. ఉసిరికాయల తురుము, ఉప్పు చేర్చాలి. నిమిషం వేయించి.. రెండు కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. అందులో రవ్వ వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. సన్నసెగ మీద ఉడికించి నిమ్మరసం వేసి దించేయాలి.



ఆమ్లా పరోటా: పెద్ద ఉసిరికాయలు - 2, గోధుమపిండి - ఒకటిన్నర కప్పులు, పచ్చిమిర్చి - 1, తురిమిన అల్లం - స్పూన్, కారం, ధనియాల పొడి, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, ఉప్పు - రుచికి తగినంత, నూనె - 3 స్పూన్లు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ఉసిరికాయలను ఉడికించి, గింజలు తీసి తురమాలి. ఒక గిన్నెలో గోధుమపిండి, ఉప్పు, తగినన్ని నీళ్లు, ఉసిరి, పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర, ధనియాల పొడి, కారం వేసి మెత్తటి పిండి తయారయ్యే వరకూ కలపాలి. మూత పెట్టి కొంతసేపు పక్కనుంచాలి. నానిన పిండితో పరోటాలు చేయాలి. అన్నీ అయ్యాక.. కాలుతున్న పెనం మీద.. కొద్దిగా నూనె వేసి రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకూ కాల్చుకుంటే 'ఆమ్లా పరోటా' సిద్ధమైపోతుంది.

– జి.జ్యోతి, తూర్పుపాలెం, కోనసీమ జిల్లా

కిచెన్.. చికెన్ రంగు పులుముకుంది!

బ్యాచిలర్స్ కిచెన్

ఇబ్రహీంపట్నంలో బీటెక్ సీఎస్ఈ చేస్తున్న రోజులవి. కొన్నాళ్లు హాస్టల్లో తిన్నాక.. తిండి మీదే విరక్తి కలిగింది. ఇక లాభంలేదని కిరణ్, భాస్కర్‌లతో కలిసి ఓ గది అద్దెకు తీసుకున్నా. మొదటిరోజే వంట మొదలెట్టేశా. వేలకొద్దీ యూట్యూబ్ వీడియోలుండగా ఫికరెందుకన్నది ధీమా. గదిలో సామాన్లు దించామో లేదో చికెన్ తెచ్చేశా. వెంటనే రంగంలో దిగిపోయా. కుక్కర్‌లో రెండు గరిటెల నూనె వేడిచేసి.. పోపు గింజలు, ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు వేశా. అవి కొంచెం వేయించి.. చికెన్ జోడించి మూత పెట్టా. యూట్యూబ్ మామ తగినంత కారం, ఉప్పు వేయమన్నాడు. దాన్ని ఫాలో అవుతూ చిన్న స్పూన్‌తో ఉప్పు, పెద్ద గరిటెతో కారం వేశా. అది చాలదని భాస్కర్ ఇంకా వేశాడు. వీడియోలో మూడు విజిల్స్ రావాలన్నారు. రెండు విజిళ్లు రాగానే పళ్లెంలో అన్నం వడ్డించేసుకుని రెడీ అయిపోయాం. ఇక మొదలైంది ట్విస్ట్. మూడో విజిల్ ఎంతకీ రాలేదు. చిరాగ్గా చూస్తోంటే.. విజిల్ బదులు బుస్సుమని గ్యాస్ రావడం మొదలైంది. ముగ్గురం ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం. పక్కింటి ఆంటీని పిలుద్దాం అనుకునేలోపే.. 'ఢమాల్'మని శబ్దం! విజిల్ ఎగిరెళ్లి కిటికీ అద్దానికి తగిలింది. కిచెన్ గోడలు చికెన్ పులుసుతో కొత్తరకం పెయింటింగ్‌లా మారిపోయాయి. గబుక్కున స్టవ్వు కట్టేశా. కాస్తాగి.. కూర వేసుకున్నాం. ఒక ముక్క తినబోతే.. అది చికెనా లేక టైర్ ముక్కా- అనిపించింది. కారం ఎక్కువై కళ్లల్లో నీళ్లొచ్చాయి. చివరికి అర్థమైంది ఏంటంటే.. చికెన్ ఉడకలేదు కానీ, ఆ వేడికీ, కంగారుకీ నేను ఉడికిపోయాను. వంట చేయడం అంటే ఫోన్ స్క్రీన్ స్క్రోల్ చేసినంత ఈజీ కాదని ఆ రోజే అర్థమైంది. చేసేదేముంది.. బిర్యానీ ఆర్డర్ పెడితే.. జొమాటో ఆపద్బాంధవుడు తెచ్చిచ్చాడు. కానీ జరిగిందానికి భయపడకపోగా పట్టుదలతో వంట నేర్చుకున్నా. ఎంత భేషుగ్గా అంటే.. ప్రతి ఆదివారం ఫ్రెండ్సంతా రూమ్‌కి వచ్చేసి.. మెచ్చుకుంటూ తినేవాళ్లు.

– మధుకర్, హైదరాబాద్



గ్రేప్ కాన్సంట్రేట్.. సులువే!

ద్రాక్షరసం రుచే కాదు.. ఆరోగ్యం కూడా. బండ్ల మీద అమ్మే జ్యూస్ పరిశుభ్రంగా ఉండదు కాబట్టి ఇంట్లోనే చేసుకోవడం మంచిది. ఇది కొన్నాళ్లు నిలవుండేలా చిక్కటి పానీయమూ చేయొచ్చు.

కావలసినవి: పంచదార, నల్ల ద్రాక్ష - కిలో చొప్పున, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, సిట్రిక్ యాసిడ్ - అర స్పూన్, నీళ్లు - కప్పు

తయారీ: ద్రాక్షపండ్లను బాగా కడిగి గింజలు తీసేయాలి. సీడ్‌లెస్ అయితే మరీ మంచిది. వీటిని అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలోకి తీసి.. కప్పు నీళ్లు జోడించి.. మధ్యస్థమైన సెగ మీద సుమారుగా 15 నిమిషాలు ఉడికించాలి. ద్రాక్ష మెత్తబడిన తర్వాత సెగ తీసేయాలి. చల్లారాక.. పల్చటి వస్త్రంలో వేసి వడకట్టి పిప్పి తీసేయాలి. ఈ ద్రాక్ష రసంలో పంచదార వేసి.. కలియతిప్పుతూ మరిగించాలి.

చిక్కగా సిరప్‌లా అయ్యే వరకూ ఉంచి.. దించేయాలి. కాస్త చల్లారాక.. నిమ్మరసం, సిట్రిక్ యాసిడ్ జోడించాలి. పూర్తిగా చల్లారాక.. తడిలేని పొడి సీసాలోకి తీయాలి. దీన్ని రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే మూడు వారాల వరకూ తాజాగా ఉంటుంది. తాగదలచినప్పుడు.. గ్లాసు నీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల ద్రాక్ష కాన్సంట్రేట్ కలిపితే సరిపోతుంది. సిట్రిక్ యాసిడ్ లేకపోతే నిమ్మరసం ఇంకొంచెం ఎక్కువ వేసుకోవచ్చు.



చిత్రంగా..

ప్లేటులో సూర్యబింబాలు!

పొద్దున్నే ఉదయిస్తున్న అందాల బాల బానుణ్ణి చూశామంటే.. మన రోజు ఆనందంగా మొదలవుతుంది. ఈ రోజు రథసప్తమి.. ఆ ప్రత్యక్ష దైవం జయంతి. దివాకరుణ్ణి స్మరించుకుంటూ పదార్థాలతో సూర్యబింబాల్ని రూపొందించారు. ఆదిత్యుడు కూడా ఆనందించేలా ఉన్నాయి కదూ!





వసుంధర

vasundhara@eenadu.in



భవన నిర్మాణం అంటే సిమెంట్, స్టీల్ మాత్రమే కాదు... ఇల్లు అంటే నాలుగు గోడల మధ్య బతకడం అంతకన్నా కాదు... మనిషికీ, మనసుకీ భద్రతను ఇచ్చే స్థలం. ప్రకృతితో మనిషిని కలిపే వేదిక. కానీ నేటి నిర్మాణ రంగంలో ప్రకృతితో అనుబంధాన్ని కోల్పోతున్నాం. ఈ పరిస్థితిని మార్చేందుకే సస్టెయినబుల్ ఆర్కిటెక్చర్‌తో కొత్త పరిష్కారాలు చూపిస్తున్నారు సాత్విక తాడూరు. ఆమె లింక్ ఎకో గ్రీన్ వ్యవస్థాపకురాలు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో క్లైమెట్ కన్వర్సేషన్స్ విభాగంలో పాల్గొన్న ఆమెను వసుంధర పలకరించింది.

సాత్విక

మనసుతో డిజైన్ చేస్తున్నా!

నాన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ కావడంతో ఏటా కొత్త ప్రాంతానికి మారుతూ ఉండాల్సి వచ్చేది. అలా హరియాణా, జమ్మూ-కాశ్మీర్, గ్వాలియర్, బాపట్ల...ఇలా పలు చోట్ల నా చదువు సాగింది. చిన్నప్పుడు అమ్మానాన్నలు నన్ను తరచూ విహారయాత్రలకు తీసుకెళ్లేవారు. అలా నేను ఎక్కువ చారిత్రక ప్రదేశాలు తిరిగేదాన్ని. ముఖ్యంగా పురాతన గుడులు, గుహలు, కోటలు ఆసక్తిగా చుట్టొచ్చేదాన్ని. రాయితో చెక్కిన విగ్రహాలు, గోడల మీద కథలు చెప్పే శిల్పాలు, నిర్మాణాలు... ఇవన్నీ వందల ఏళ్లుగా నిలిచి ఉంటున్నాయి. కానీ, ఇప్పుడు కడుతున్న ఇళ్లు ఎందుకు అలా లేవు? అన్న ప్రశ్నలే నాలో ఆర్కిటెక్చర్ పట్ల ఆసక్తిని రేకెత్తించాయి. దీనికోసం ఆలిండియా స్థాయిలో మంచి ర్యాంకు సాధించి విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో చేరా. కానీ, అక్కడ నేర్చుకున్నది సిమెంట్, స్టీల్, గాజుతో కూడిన మోడరన్ బిల్డింగ్స్ గురించి మాత్రమే. పురాతన సాంకేతికత, నిర్మాణ శైలి, మెటీరియల్స్, ప్రకృతికి అనుగుణమైన డిజైన్లు... ఇలా వీటికి సంబంధించిన విషయాలేవీ పాఠ్యాంశాల్లో కనిపించలేదు. 2015లో నా చదువు పూర్తయ్యింది. అదే సమయంలో నేపాల్‌లో ఘోర భూకంపం వచ్చింది. ఊళ్లకు ఊళ్లే నేలమట్టం అయ్యాయి. ఎన్నో జీవితాలు రోడ్డున పడ్డాయి. ఈ వార్తల్ని చూసిన నేను అక్కడికి వెళ్లాలన్న నిర్ణయానికి వచ్చా. ముఖ్యంగా డిస్ట్రక్షన్ తర్వాత రీకన్‌స్ట్రక్షన్ ఎలా జరుగుతుంది? ఒక ఆర్కిటెక్ట్‌గా సమాజానికి నేను ఏం చేయగలను? అనుకుంటూనే ఆ దేశంలో అడుగుపెట్టా. పునరావాస పనుల్లో నిమగ్నమైన కాన్షియస్ ఇంపాక్ట్ అనే అంతర్జాతీయ ఎన్జీవోతో కలిసి పనిచేయడం ఆరంభించా. టెంట్లలో నివసిస్తూ, మా వంట మేమే చేసుకుంటూ గడిపేశాం. 80శాతం మట్టి 20 శాతం ఇసుక కొద్దిగా సున్నం లేదా సిమెంట్ వాడి... బట్టీల్లో కాల్చకుండా 60 రోజుల పాటు ఎండలో ఆరబెట్టి రెడ్ బ్రిక్స్ కంటే నాణ్యమైన భారీ ఇటుకల్ని తయారుచేశాం. కాబట్టి పిల్లర్స్ లేకుండానే మూడంతస్తుల నిర్మాణం చేయొచ్చు. అలా భూకంప ప్రభావిత ప్రాంతంలో ఇరవై ఇళ్లు, ఓ స్కూల్, మహిళా సహకార సంఘ భవనం నిర్మించాం. స్థానిక మేస్త్రీలకు ఈ టెక్నాలజీ నేర్పించాం.

భారత్‌లోనూ...

భారత్‌కు తిరిగివచ్చాక గుజరాత్‌లోని హున్నార్‌శాల ఫౌండేషన్లో చేరా. ఇక్కడ ఆర్కిటెక్చర్‌కు కొత్త అర్థం దొరికింది. భవనాలు కాదు ముందు మనుషులే ముఖ్యం అనిపించింది. మహారాష్ట్ర అహ్మద్‌నగర్ సమీపంలో జరిగిన స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో 150 కుటుంబాలతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఇళ్లను డిజైన్ చేశాం. ఇదో గొప్ప అనుభవం. కొవిడ్ సమయంలో అమ్మానాన్నల దగ్గరకు హైదరాబాద్ తిరిగొచ్చా. ఇక్కడే ఉండాలనుకోవడంతో పాటు సైకాలజీలో మాస్టర్స్ చేయాలనే నిర్ణయించుకున్నా. మనిషి భావోద్వేగాలు అర్థం కాకుండా ఇల్లు డిజైన్ చేయడం సాధ్యం కాదు అనే నమ్మకమే ఇందుకు కారణం. ఆ తర్వాతే... 'లింక్ ఎకో గ్రీన్' పేరుతో సంస్థను ఆరంభించా. మా సంస్థ లక్ష్యం... బయోఫిలిక్ డిజైన్‌లతో మనిషికీ ప్రకృతికీ మధ్య దూరాన్ని తగ్గించే దిశగా ముందడుగు వేస్తున్నా. డెవలపర్స్‌తో సస్టైనబుల్ లే అవుట్స్‌పై పనిచేస్తున్నా. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నమూనా ఇళ్లను నిర్మించాం. సస్టైనబిలిటీని ఖరీదైన ట్రెండ్‌గా కాకుండా అవసరమైన మార్గంగా చూపించాలనుకుంటున్నా.

నా గోళ్లెందుకు విరుగుతున్నాయి...?

నేను కార్పొరేట్ ఉద్యోగినిని. నిత్యం ఒత్తిడి ఉంటుంది. దానికీ గోళ్ల ఆరోగ్యానికీ ఏమైనా సంబంధం ఉందా? ఎందుకంటే అవి బిరుసుగా ఉండి తరచూ విరిగిపోతున్నాయి. ఎందుకిలా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. - ఓ సోదరి

డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

మీ గోళ్లు బలహీనంగా ఉన్నాయి అంటున్నారు. ఈ స్థితిని బ్రిటల్ నెయిల్స్ ప్రాబ్లమ్‌గా పిలుస్తారు. ఇలా కావడానికి చాలా కారణాలే ఉన్నాయి. సబ్బు, సర్ఫ్ నీళ్లల్లో తరచూ నానడం, రసాయనాల ప్రభావానికి నేరుగా ప్రభావితం కావడం, గోళ్ల రంగు వేసుకోవడం, తుడవడం వంటివీ ఎప్పుడూ చేస్తుండటం వల్ల నెయిల్ ప్లేట్ పాడై విరిగిపోతుంటాయి. అలానే పోషకాల లోపం అంటే... విటమిన్ డి, కాల్షియం, రైబోఫ్లెవిన్, బీ12, ఫోలిక్ యాసిడ్, ప్రొటీన్ వంటివి శరీరానికి తగినంతగా అందనప్పుడు కూడా ఈ పరిస్థితి ఎదురవుతుంది. అలానే కాలేయ, కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలు, సొరియాసిస్ వ్యాధితో బాధపడుతున్నప్పుడు ఇలా గోర్లు బిరుసుగా మారి విరిగిపోతుంటాయి. ముందుగా మీరు ఏదైనా పోషకలోపంతో బాధపడుతున్నారేమో చూసుకుని దాన్ని సరిదిద్దుకోండి. నెయిల్ పెయింట్ చేయడం, తొలగించడం వంటివి కొన్ని రోజులు ఆపండి. పాలు, పాల ఉత్పత్తులు, ఆకుకూరలు, గుడ్లు, చికెన్, పప్పు ధాన్యాలు, రాగులు, నట్స్-సీడ్స్ వంటివి తినండి. వీటినుంచి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందుతాయి. రోజూ రెండు పండ్లను తీసుకోండి. అలానే, గోళ్లు, జుట్టుకి అవసరమైన విటమిన్ ప్యాక్స్ లభిస్తాయి. ఈ సప్లిమెంట్స్‌ను కొన్నాళ్లపాటు రెగ్యులర్‌గా వేసుకోవడం మంచిది. వీటితో పాటు నెయిల్ స్ట్రెంతనింగ్ క్రీములనూ అప్లై చేయడం ద్వారా గోళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



బామ్మ చిట్కా

పప్పులు పురుగుపట్టకుండా...

తీరిక లేని జీవనశైలి వల్ల నిత్యావసర సరకులన్నీ ఒక్కసారే కొని పెట్టుకోవాలి. అలాగని వాటిని నేరుగా డబ్బాల్లో పోస్తే పురుగు పట్టి పనికిరాకుండా పోతాయి. నిల్వ చేసే ముందు ఓ రోజంతా ఎండలో ఉండనివ్వండి. అంతేకాదు, కాస్త పెద్ద డబ్బాని నిల్వకూ, చిన్న డబ్బాని రోజువారీ వినియోగానికి పెట్టుకోవాలి. లేదంటే తడి తగిలి పాడవుతాయి. వాటిల్లో కాసిని వేప ఆకులు లేదా లవంగాలు వేసినా మేలే.

కొండలు, కోనలు చూస్తూ పెరిగిన అమ్మాయి ప్రియదర్శిని పంచపాకేశన్. తన పసితనంతోపాటే అటవీ అందాలూ తరిగిపోవడం చూసింది. భవిష్యత్తు తరాలకు వన జీవనం, గిరి ప్రాంతాలు కాల్పనిక కథలుగా మిగిలిపోకూడదు అనుకుంది. అందుకు ఆమె ఏం చేస్తోందో మనతో పంచుకుందిలా...

అలా మొదలైంది..!



ప్రియదర్శిని

కొడైకెనాల్... నేను పుట్టిపెరిగింది అక్కడే. చుట్టూ చెట్లు, పక్షుల కిలకిలరావాలు, నదీ ప్రవాహాలు ఒకటా రెండా... ఇలా చెప్పుకొంటూ పోవాలే కానీ వర్ణించలేని సహజ అందాలన్నీ ఇక్కడ కొండల సొంతం. అందుకే నా స్థానికత చెప్పిన ప్రతిసారీ అందరూ 'వావ్ మీరు చాలా అదృష్టవంతులు' అంటుంటారు. కానీ కాలక్రమేణా ఈ సహజ అందాలన్నీ ఒక్కొక్కటిగా దూరమవుతూ వచ్చాయి. మానవ తప్పిదాలు, ఆక్రమణలే ఇందుకు కారణం. రెండుమూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లి చూస్తే కానీ తెలియదు... మనం కోల్పోయిందేంటో. అవన్నీ నేటి తరానికి తెలియాలి. అప్పుడే వాళ్లకు మంచి చెడులకు వ్యత్యాసం, ప్రస్తుత సమస్యలకు కారణం తెలుస్తుంది.

విద్యార్థి దశ నుంచే...

ఇంటర్ చదువుతున్నప్పుడు పర్యావరణ పరిరక్షణ మీద మాకు స్పెషల్ అసైన్మెంట్లు ఇచ్చారు. దాంతో వీటిపై మరింత అవగాహన పెరిగింది. కాలేజీ రోజుల నుంచే పోరాటం చేయడం మొదలుపెట్టా. పత్రికలకు ఇక్కడి సమస్యల మీద కాలమ్స్ రాస్తుండేదాన్ని. కానీ వాటిని వివరించి అప్పుడు కొండ ప్రాంతాలు ఇలా ఉండేవి అని చెప్పేవారు ఎవరూ లేరనిపించింది. ముఖ్యంగా పిల్లలకు వారి చుట్టూ జరుగుతున్న విధ్వంసం తెలియాలి అనిపించింది. అప్పుడే వాళ్లు పర్యావరణ పరిరక్షకులుగా మారతారన్న ఆలోచన వచ్చింది. దానికి అమ్మ మధు, నాన్న పంచపాకేశన్ ప్రోత్సాహం తోడైంది.

కథే మాధ్యమం...

వృత్తిరీత్యా నేను ఉపాధ్యాయురాలిని. ప్రస్తుతం హైదరాబాద్ అగాఖాన్ అకాడమీలో ఆంగ్లం బోధిస్తున్నా. తొమ్మిదేళ్లుగా ఈ రంగంలో ఉన్నా. అదే నాకు ప్లస్ పాయింట్ అయ్యింది. పిల్లలకు ఏ విషయం తెలియాలన్నా.. అర్థం అవ్వాలన్నా కథే మాధ్యమం. అందుకే కొడైకెనాల్‌లోని పర్వతాల సంగతులను చిన్న చిన్న కథలుగా రాయడం మొదలుపెట్టాను. దీని కోసం దాదాపు ఏడాదిన్నర రీసర్చ్ చేశాను. పన్నెండేళ్లకోసారి పూసే కురుంజి పువ్వు, వాటి కోసం అడవి అంతా కలయతిరిగే పిల్లలు, విరిగి పడుతున్న కొండచరియలు వాటి వల్ల స్థానికులకు జరిగిన నష్టాలు ఇవే కథాంశాలు. అలా నా మొదటి పుస్తకం 'ద పోస్ట్ విమెన్ అండ్ అదర్ స్టోరీస్' ప్రచురితమైంది. అనతి కాలంలోనే మంచి ఆదరణను సంపాదించుకుంది.

అవగాహన కోసం...

అలా రెండు మూడు పుస్తకాలు రాశాక ప్రఖ్యాత రచయిత్రి జై విట్‌కర్‌తో పరిచయం ఏర్పడింది. 'నీ పుస్తకాలన్నీ పిల్లలూ, పెద్దలూ అందరూ చదవడానికి అనుకూలమైనవి' అంటూ ఆమె ప్రశంసించడం ఇప్పటికీ మరచిపోను. తర్వాత స్థానిక స్కూళ్లకు వెళ్లి బయోడైవర్సిటీ, వాతావరణ మార్పుల మీద పిల్లలకు అవగాహన కల్పించడం మొదలుపెట్టా. బెంగళూరు, హైదరాబాద్‌లోనూ చాలా పాఠశాలలకు వెళ్లా. వెళ్లిన ప్రతి చోటా పిల్లలు అడిగే ప్రశ్నలు, చూపించిన ఆసక్తి నేను సరైన దిశలోనే వెళ్తున్నాను అన్న నమ్మకాన్ని కలిగించాయి.

నీలగిరి కథలు...

తర్వాత నేను రాసిన పుస్తకం 'ది మిత్ ఆఫ్ వైల్డ్ గౌర్' అడవిలో రారాజులా తిరుగుతూ.. దొరికిన వన్యప్రాణుల్ని తింటూ మిగతా వాటిని భయభ్రాంతులకు గురి చేసే అడవి దున్న కథ ఇది. చదువుతున్నంత సేపూ, చెబుతున్నంత సేపూ పిల్లలంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యేవారు. దీని తర్వాత ఫిక్షన్ రైటర్‌గా పేరు సంపాదించుకున్నా. అయితే నా కథలు ఏవీ కల్పితాలు కాదు. ఏం రాయాలన్నా ఏడాది పాటు రీసర్చ్ చేసి స్థానికతను జోడిస్తూ రాస్తా. పిల్లలు చదవడమే నా ఉద్దేశం కాబట్టి భాష, శైలి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటా. ఇప్పుడు రాయబోయే నీలగిరి పర్వతాలు మరో పెద్ద సవాల్. అక్కడ జరిగే దోపిడీ, అక్రమాలు, గిరి ప్రాంతానికి కలిగించిన ముప్పు ఏళ్లు కష్టపడినా పూడ్చలేనిది. ప్రస్తుతం అక్కడి పరిస్థితుల్నే కథలుగా రాస్తున్నా. అదే ఈరోజు సెషన్లో చెప్పా కూడా.

మీకు తెలుసా

వారానికి కనీసం 13 గంటలు (రోజుకు 2 గంటల్లోపు) ఆరుబయట గడిపే పిల్లల్లో మయోపియా(హ్రస్వ దృష్టి) తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బయట నుంచి వచ్చే సూర్య కాంతి రెటీనాను ఉత్తేజపరిచి కంటి చూపుని మెరుగుపరుస్తుందట.

మంచి 'కిక్కు'న్న గ్రామం!

అదో పాఠశాల మైదానం... ఉదయం ఆరింటికే గ్రామంలోని అమ్మాయిలంతా అక్కడకు చేరుకున్నారు. ఫుట్‌బాల్‌ని తన్నుతూ, గోల్‌పోస్ట్‌లోకి పంపిస్తూ... ప్రాక్టీసులో తలమునకలైపోయారందరూ. అలాగని ఆ గ్రామం బ్రెజిల్‌లోనో, అర్జెంటీనాలోనో లేదు... హరియాణాలో ఉంది. మినీ బ్రెజిల్‌గా ప్రఖ్యాతి అయిన ఆ గ్రామ ప్రత్యేకత ఏంటంటే...





హరియాణా అంటేనే క్రీడలకు ప్రసిద్ధి. కుస్తీ, షూటింగ్, బాక్సింగ్... ప్రతి క్రీడలోనూ అబ్బాయిలతోపాటు అమ్మాయిలూ రాణిస్తున్నారు. ఆ రాష్ట్రంలోని అలఖ్‌పురా ఇప్పుడు 'మినీ బ్రెజిల్'గా గుర్తింపు సాధిస్తోంది. ఎందుకంటే ఆ ఊరి అమ్మాయిలు ఫుట్‌బాల్‌లో పతకాల పంట పండిస్తున్నారు. సంజూ యాదవ్, పూజా జఖ్డ్, పారుల్, ముస్కాన్, హిమాన్షు, రీతూ... వీళ్లంతా ఇక్కడి వాళ్లే. సంజూ యాదవ్ జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ జట్టులో సభ్యురాలు. మిగతా వాళ్లంతా జాతీయ అండర్-20 జట్టు సభ్యులు. ఇదే గ్రామానికి చెందిన శ్వేత అండర్-17 జట్టుకు ఎంపికైంది. సంజూ ప్రస్తుతం తుర్కియేలో భారతజట్టుతో ఉంది. మిగతావాళ్లంతా దేశంలోని వేర్వేరు క్యాంపుల్లో ఉన్నారు. ఊళ్లోని ప్రతి ఇంట్లో బాలికలు ఫుట్‌బాల్ ఆడటం ఒక అలవాటుగా మార్చుకున్నారు. గ్రామంలో దాదాపు 200 మంది అమ్మాయిలు రోజూ స్కూల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ప్రాక్టీసు చేస్తారు.

రెండు దశాబ్దాల్లో...

2005 ప్రాంతంలో గోవర్ధన్ శర్మ అలఖ్‌పురా ప్రభుత్వ పాఠశాలకు వ్యాయామ ఉపాధ్యాయులుగా వచ్చారు. ఆయన మొదట్లో అబ్బాయిలకు కబడ్డీలో శిక్షణ ఇచ్చారు. వాళ్లను చూసి అమ్మాయిలూ నేర్చుకున్నారు. కానీ అబ్బాయిల నుంచి అనుకున్న ఫలితాలు రాకపోవడంతో అమ్మాయిలకూ ఫుట్‌బాల్ నేర్పడం మొదలుపెట్టారు. స్వల్ప వ్యవధిలో అమ్మాయిలు జిల్లా, రాష్ట్రస్థాయుల్లో పతకాలు గెలవడం మొదలుపెట్టారు. ఖేలో ఇండియా, యూనివర్సిటీ గేమ్స్‌లోనూ పతకాలు తెచ్చారు. శాఫ్ క్రీడల్లోనూ భాగమవుతున్నారు.

సామాజిక మార్పు...

దిల్లీ వేదికగా జరిగే ప్రఖ్యాత అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీ 'సుబ్రతో టోర్నీ'లో వివిధ జట్ల తరపున అలఖ్‌పురా నుంచి చాలామంది అమ్మాయిలు పాల్గొన్నారు. అమ్మాయిలు ఆటల్లో రాణిస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుండటం విశేషం. గ్రామం నుంచి 30 మంది వరకూ ప్రభుత్వ ఉద్యోగాలు తెచ్చుకున్నారు. పూజా తండ్రి కొన్నేళ్ల కిందట చనిపోగా... ఆమెకు వచ్చే నగదు బహుమతులు, స్కాలర్‌షిప్‌లే ఇప్పుడు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఇలాంటి కథలు కొత్తతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. 'పతకాలు గెల్చిన అమ్మాయిలకు ఎంతో గుర్తింపు లభిస్తుంది. వాళ్లను చూసి పిల్లలూ ఫుట్‌బాల్‌లో కిక్‌ని ఆస్వాదిస్తున్నారు' అని చెబుతారు పాయల్. ఇటీవల ఈమె ఆర్మీలో ఉద్యోగం సాధించారు. ఆటతో గ్రామానికీ, దేశానికీ పేరు తేవడమే తమ లక్ష్యమని చెబుతున్నారీ అమ్మాయిలు.

ముప్పైల్లో అడుగుపెడుతున్నారా..!



మహిళలకు ముప్పైఏళ్లు రాగానే మన జీవనశైలిలో వీటిని భాగం చేసుకోమంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు, యవ్వనంగా కనిపించేలానూ చేస్తాయి.

- మనకి ముప్పై ఏళ్లు దాటిన తరవాత ఎముక సాంద్రత తగ్గుతూ వస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే రోజూ పిల్లలకి పాలు తాగించడమే కాదు, మనల్నీ పాలు తాగమంటున్నారు. వీటితోపాటు కాల్షియం ఎక్కువగా ఉండే నువ్వులు, రాగులు, మునగాకు వంటి వాటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.
- హార్మోనుల్లో మార్పు కారణంగా ప్రతి పదేళ్లకోసారి 3-8శాతం కండరాలు వాటి ద్రవ్యరాశిని కోల్పోతాయి. దీనినే సార్కోపెనియాగా చెబుతున్నారు శాస్త్రవేత్తలు. దీనివల్ల నెలసరి క్రమం తప్పడం, అలసట, బరువు తగ్గడం జరుగుతున్నాయి. దీన్ని అదుపు చేయాలంటే 15-20గ్రా. ప్రొటీన్ ప్రతీ భోజనంలోనూ అందేలా ఆహార నియమాలు పాటించాలి.
- వ్యాయామం అనగానే నడక మాత్రమే అనుకుంటాం. కానీ వారంలో కనీసం 3-5రోజులు స్ట్రెంత్ ట్రైనింగ్ తప్పనిసరిగా చేయాలి. ఈ వ్యాయామాలు కండరాలకు శక్తినివ్వడంతోపాటు, వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తాయి.
- ఏటా ప్రతి నలుగురిలో ఒకరు యాంగ్జయిటీ బారిన పడుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే ఒత్తిడిని దాచుకోకుండా మనసుకి దగ్గరైన స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకుంటే దీన్నుంచి బయటపడొచ్చు. యోగ, ధ్యానం, డ్యాన్స్ వంటివి రొటీన్‌లో భాగం చేసుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- నిద్ర ఏడు గంటలకు తక్కువ కాకుండా చూసుకోవాలి. రోజూ పనులతో అలసిపోయిన మన శరీరం తిరిగి శక్తి పుంజుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. నిద్ర తక్కువైన మహిళల్లో కార్టిసాల్ స్థాయులు పెరగడం, బరువు పెరగడం వంటివి వృద్ధాప్యానికి దారి తీస్తున్నాయి.

అన్ని ఆటల్నీ పరిచయం చేయొచ్చు...

కిడ్స్ కార్నర్


ఆరుబయట ఆటలాడే పిల్లల సంఖ్య బాగా తగ్గిపోయింది. చిన్నారులందరికీ డిజిటల్ తెరలతోనే కాలక్షేపం. అలాంటి వాళ్లని క్రీడలవైపు ప్రోత్సహించాలంటే ఆ ప్రయత్నం ఇంటి నుంచే మొదలవ్వాలి. అందుకు సహకరిస్తాయీ బోర్డు గేమ్స్. ఆటల్లో ప్రాథమిక నైపుణ్యాలు, నియమనిబంధనలు తెలుసుకోవడానికీ ఉపయోగపడతాయి.



ఏకాగ్రత పెరగాలంటే...

నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్, గెలుపోటముల విలువ తెలియాలంటే ఫుట్‌బాల్ కన్నా మేలైన ఆట ఇంకొకటి ఉండదు. చిన్నారుల్లో చిన్నప్పట్నుంచే దీనిపై ఆసక్తి కలగాలంటే... ఈ 'టేబుల్ టాప్ ఫుట్‌బాల్ బోర్డు గేమ్'ని బహుమతిగా ఇవ్వండి. బోర్డుపై ఇరు పక్షాల ఆటగాళ్లు ఉంటారు. వాళ్లని నియంత్రించడానికి స్ప్రింగ్ సాంకేతికత ఉంటుంది. చేతితో ఆటగాళ్లని పుల్ చేస్తే... బాల్ పుష్ అవుతుంది. అవతలి వాళ్లు దాన్ని గోల్ పడకుండా అడ్డుకోవాలి. ఇలా అడ్డుకునేందుకు లీవర్ అందుబాటులో ఉంటుంది. మొదట్లో కష్టంగా ఉన్నా... ఆడుతున్న కొద్దీ దాన్ని ఇష్టపడతారు పిల్లలు.






మల్టీటాస్కింగ్‌కోసం...

మోటారు నైపుణ్యాల అభివృద్ధికీ, ఆత్మవిశ్వాసం పెరగడానికీ, క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవడానికీ బాస్కెట్ బాల్ మంచి ఎంపిక. ఇప్పుడు ఇది కూడా 'టేబుల్ టాప్ బాస్కెట్‌బాల్ బోర్డు గేమ్'లా అందుబాటులో ఉంది. బోర్డుమీద ఇద్దరు ఆటగాళ్లు ఉంటారు. వాళ్లని నియంత్రించేందుకు వీలుగా రెండు హ్యాండిల్స్ ఉంటాయి. వాటికి బాల్‌ని పట్టుకునే విధంగా చేయి ఆకారాలు ఉంటాయి. హ్యాండిల్ ఉపయోగించి బాల్ పట్టుకోవాలి, త్రో చేయాలి... అదే సమయంలో అవతలి వాళ్లకి గోల్ పడకుండా అడ్డుకోవాలి. ఇలా ఏకకాలంలో వివిధ పనులు చేయడంతో ఏకాగ్రత, సమయస్ఫూర్తి, మల్టీటాస్కింగ్ నైపుణ్యాల్ని పిల్లలు సులువుగా నేర్చుకుంటారు.



ఒత్తిడి తగ్గడానికీ...

చదువులు, పరీక్షలు, సిలబస్ అంటూ పిల్లలకీ ఒత్తిడి ఉంటుంది. దాన్నుంచి బయటపడాలంటే మంచి ఇండోర్ ఆటలు వాళ్లకు పరిచయం చేయాల్సిందే. అలాంటి వాటిల్లోనే ఒకటి ఈ 'ఫ్రాగ్ బౌలింగ్ గేమ్'. బోర్డు మీద ఒక వైపు 6 పిన్స్ ఉంటాయి. గోల్ చేయడానికి బంతులు ఉంటాయి. బంతిని ఉపయోగించి పిన్లని పడగొట్టాలి. ఈ ఆట ఏకాగ్రత, చేతి-కంటి సమన్వయానికి ఉపయోగపడుతుంది.



బంగారం - వెండి

24న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,60,260	1,46,900	3,65,000
విజయవాడ	1,56,160	1,45,400	3,40,700
ప్రొద్దుటూరు	1,62,100	1,49,130	3,43,000
రాజమహేంద్రవరం	1,60,260	1,46,900	3,65,000
విశాఖపట్నం	1,58,320	1,45,400	3,44,000
తమిళనాడు	-----	1,47,500	3,65,000

అవును.. బంగ్లా ఆడదు

టీ20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్

బీసీబీకి ఐసీసీ ఈ-మెయిల్

దిల్లీ



భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు ఆడుతుందా లేదా అనే ఉత్కంఠకు తెరపడింది. ఆ జట్టును టోర్నీ నుంచి ఐసీసీ తప్పించింది. దాని స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రపంచకప్ కోసం ఎంపిక చేసింది. ఈ మేరకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ ఈ-మెయిల్ పంపడమే కాక.. అధికారిక ప్రకటన కూడా చేసింది. ఐసీసీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని బీసీబీ పేర్కొంది. "టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఇక భాగం కాదు. షెడ్యూల్ ప్రకారం టోర్నీలో పాల్గొనడానికి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) నిరాకరించింది. భారత్‌లో మ్యాచ్‌లు ఆడే విషయమై బీసీబీ ఆందోళనను తీర్చడానికి సుదీర్ఘంగా చర్చలు జరిపిన అనంతరం ఈమేరకు నిర్ణయం తీసుకున్నాం" అని ఐసీసీ పేర్కొంది. ఐపీఎల్ నుంచి తమ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్‌ను తప్పించినందుకు నిరసనగా.. టీ20 ప్రపంచకప్‌నకు తమ జట్టును పంపడానికి బీసీబీ నిరాకరించిన సంగతి తెలిసిందే. భారత్‌లో తమ ఆటగాళ్లు, సిబ్బంది భద్రతకు ముప్పు ఉందని పేర్కొంటూ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బీసీబీ.. ఐసీసీని కోరింది. అయితే బంగ్లా ఆటగాళ్లకు భారత్‌లో ముప్పు ఉన్నట్లు ఎలాంటి సంకేతాలు లేవని తమ నివేదిక ద్వారా తేల్చిన ఐసీసీ.. బీసీబీ విజ్ఞప్తికి అంగీకరించలేదు. భారత్‌కు రావాలా వద్దా అన్నది తేల్చుకోవడానికి బుధవారం వరకు గడువు విధించగా.. బీసీబీ మాత్రం తమ జట్టును ఇక్కడికి పంపడానికి తమ ప్రభుత్వం నుంచి అనుమతి లేదని తేల్చేసింది. మరోవైపు ఐసీసీ బోర్డు సమావేశంలో బంగ్లాదేశ్ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించడాన్ని మెజారిటీ దేశాలు వ్యతిరేకించాయి. కేవలం బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాత్రమే ఇందుకు అనుకూలంగా ఓట్లు వేశాయి. అయినా బీసీబీ తీరు మారకపోవడంతో ఐసీసీ.. ర్యాంకింగ్స్ ఆధారంగా బంగ్లా స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రపంచకప్ కోసం ఎంపిక చేసింది. ఈ మెగా టోర్నీ కోసం సిద్ధంగా ఉండాలని స్కాట్లాండ్ జట్టుకు ఇప్పటికే ఐసీసీ నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. బంగ్లా స్థానంలో ఆ జట్టు ఫిబ్రవరి 7న టోర్నీ తొలి రోజే వెస్టిండీస్‌తో మ్యాచ్ ఆడుతుంది. ఆ తర్వాత 9న ఇటలీతో, 14న ఇంగ్లాండ్‌తో, 17న నేపాల్‌తో గ్రూప్ మ్యాచ్‌ల్లో తలపడుతుంది.

పాక్ ఏం చేయబోతోంది?: తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ డిమాండుకు మద్దతుగా నిలుస్తూ వచ్చిన పాకిస్థాన్.. ఇప్పుడా దేశాన్ని టోర్నీ నుంచి తప్పించిన నేపథ్యంలో ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరం. బంగ్లాకు బాసటగా పాక్ కూడా టోర్నీ నుంచి తప్పుకొంటుందా అన్న చర్చ మొదలైంది. దీనిపై పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ స్పందించాడు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయమే తమకు శిరోధార్యమన్నాడు. "మా ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన రాగానే సలహా కోరతాం. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నడుచుకుంటాం. మా ప్రభుత్వం వద్దంటే వాళ్లు ఇంకో జట్టును ఆహ్వానించవచ్చు" నఖ్వీ అన్నాడు. బంగ్లాదేశ్‌కు ఐసీసీ అన్యాయం చేసిందని నఖ్వీ అభిప్రాయపడ్డాడు. "బంగ్లాదేశ్ ఐసీసీలో కీలక పాత్రధారి. వారితో అన్యాయంగా వ్యవహరించారు. బుధవారం ఐసీసీ సమావేశంలో కూడా నేను ఇదే చెప్పా. భారత్‌కు బంగ్లా జట్టును పంపకూడదన్న నిర్ణయం వెనుక చాలా కారణాలున్నాయి. ఇక్కడ ఒక దేశం (భారత్‌ను ఉద్దేశించి) అన్నింటినీ నిర్దేశిస్తోంది. ఇంతకుముందు భారత్, పాకిస్థాన్‌ల కోసం ఐసీసీ వేదికలను మార్చినపుడు.. బంగ్లాదేశ్ కోసం అలా ఎందుకు చేయరు" అని నఖ్వీ ప్రశ్నించాడు.

నష్టం భారీగానే..

బీసీసీఐ, ఐసీసీ నుంచి జట్టు భద్రతకు పూర్తి హామీ లభించినప్పటికీ సహేతుకమైన కారణం లేకుండా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగినందుకు బంగ్లాదేశ్ భారీ మూల్యమే చెల్లించుకోబోతోంది. ముందుగా టోర్నీలో పాల్గొన్నందుకు లభించే 5 లక్షల డాలర్లను (రూ.4.5 కోట్లు) ఆ జట్టు కోల్పోతుంది. దీంతో పాటు టోర్నీ స్పాన్సర్ల నుంచి వచ్చే ఆదాయమూ దక్కదు. మరోవైపు ఐసీసీ నుంచి బీసీబీకి వచ్చే వార్షిక ఆదాయంలోనూ కోత పడుతుంది. ఏటా ఆ దేశానికి ఐసీసీ నుంచి రూ.247 కోట్ల ఆదాయం వస్తుంది. ఇది బీసీబీ వార్షిక బడ్జెట్లో 60 శాతం. వీటన్నింటికీ మించి బీసీబీకి జరిగే పెద్ద నష్టం.. భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆగిపోవడం. సమీప భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటించే అవకాశం లేదు. ఆ జట్టునూ తమ దేశానికి రానివ్వదు. మరో దేశంతో ద్వైపాక్షిక సిరీస్‌తో వచ్చే ఆదాయంతో పోలిస్తే భారత్‌తో సిరీస్ ద్వారా పది రెట్లు ఎక్కువ ఆర్జిస్తుంది బంగ్లాదేశ్. దీన్ని బట్టి భారత్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆగిపోవడం వల్ల ఆ దేశం ఏ స్థాయిలో నష్టపోతుందో అంచనా వేయొచ్చు.

ఛాంపియన్స్

సాధిస్తారా సిరీస్

రాత్రి 7 నుంచి

కివీస్‌తో భారత్ మూడో టీ20 నేడు

న్యూజిలాండ్‌కు వన్డే సిరీస్ కోల్పోయినప్పటికీ, ఆ ప్రభావం ఏమాత్రం కనిపించనివ్వకుండా టీ20ల్లో చెలరేగిపోతున్న టీమ్‌ఇండియా.. సిరీస్ మీద గురి పెట్టింది. వరుసగా మూడో విజయంతో సిరీస్ చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ఆదివారం మూడో టీ20లో బరిలోకి దిగుతోంది.



శాంట్నర్, సూర్యకుమార్

గువాహటి: బౌలర్లు విఫలమవుతున్నప్పటికీ, బ్యాటర్ల జోరుతో కివీస్‌తో టీ20 సిరీస్‌లో దూసుకెళ్తున్న భారత జట్టు.. హ్యాట్రిక్, సిరీస్ విజయం మీద కన్నేసింది. గువాహటిలోని బర్సపరా స్టేడియంలో ఆదివారం జరిగే మూడో టీ20లో ఈ రెండు జట్లు తలపడనున్నాయి. సూపర్ ఫామ్‌లో ఉన్న బ్యాటింగ్ లైనప్.. భారత్‌కు మరో విజయం సాధించి పెడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

ఇక సంజు వంతు: కివీస్‌తో టీ20 సిరీస్ సాగే కొద్దీ బ్యాటింగ్‌లో భారత్‌కు బాగా కలిసొస్తోంది. సుదీర్ఘ కాలంగా ఫామ్‌తో తంటాలు పడుతున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రెండో టీ20లో ఫామ్ అందుకుని 82 పరుగుల అజేయ ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్లకు పైగా విరామం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ సైతం ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. తొలి టీ20లో అభిషేక్ శర్మ అదరగొట్టాడు. హార్దిక్ పాండ్య, రింకు సింగ్, శివమ్ దూబె కూడా తమ బ్యాట్ వాడి చూపించారు. ఇక బ్యాటింగ్ ఆర్డర్లో కొంత ఆందోళన రేకెత్తిస్తున్నది సంజు శాంసన్ ఒక్కడే. శుభ్‌మన్ గిల్‌పై వేటు పడడంతో అభిషేక్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా అతనే ఖరారయ్యాడు. కానీ తొలి రెండు టీ20ల్లో అతను 10, 6 పరుగులతో నిరాశపరిచాడు. మూడో టీ20లో అయినా సంజు తనదైన శైలిలో చెలరేగుతాడేమో చూడాలి. కివీస్‌కు కూడా బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న నేపథ్యంలో మొదట బ్యాటింగ్ చేస్తే వీలైనంత ఎక్కువ స్కోరు చేయాలి. మొదట బౌలింగ్ చేస్తే.. భారీ లక్ష్య ఛేదనకు సిద్ధంగా ఉండాలి. భారత బౌలింగ్ అయితే అంత గొప్పగా సాగట్లేదు. పేసర్లు, స్పిన్నర్లు ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. రెండో టీ20లో వికెట్ తీయకుండా 53 పరుగులిచ్చిన అర్ష్‌దీప్‌పై ఆదివారం వేటు పడొచ్చు. గత మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న బుమ్రా అతడి స్థానంలో ఆడతాడు. హర్షిత్ రాణా తుది జట్టులో కొనసాగే అవకాశముంది. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె కూడా పేస్ బౌలింగ్‌లో సహాయ పాత్ర పోషిస్తారు. తొలి రెండు టీ20ల్లో కివీస్ ఓడినప్పటికీ.. ఆ జట్టు బ్యాటింగ్ బాగానే సాగింది. డెవాన్ కాన్వే, టిమ్ సీఫర్ట్, రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, డరిల్ మిచెల్, చాప్‌మన్, శాంట్నర్‌లతో ఆ జట్టుకు లోతైన బ్యాటింగ్ లైనప్ ఉంది. బౌలింగ్‌లో మాత్రం ఆ జట్టు భారత్ కన్నా ఎక్కువ ఇబ్బంది పడుతోంది. పేసర్లు హెన్రీ, డఫీ.. స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధిలపై ఆ జట్టు ఎక్కువ ఆశలతో ఉంది. గువాహటి పిచ్ బ్యాటింగ్‌కు బాగానే అనుకూలిస్తుంది. వికెట్ నుంచి పేసర్లకు కొంత సహకారం ఉంటుంది.

4 గువాహటిలో భారత్ ఆడిన టీ20లు. ఒకటి నెగ్గి, రెండు ఓడింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

బెంగళూరుకు బ్రేక్

డబ్ల్యూపీఎల్-4లో తొలి ఓటమి

- దిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం



నందని

వడోదర: డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్లో అప్రతిహతంగా సాగిపోతున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బ్రేక్ పడింది. అయిదు వరుస విజయాలతో ఇప్పటికే ప్లేఆఫ్స్ చేరిన ఆ జట్టు.. ఆరో మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమి పాలైంది. శనివారం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తా చాటిన డీసీ.. 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సీజన్లో తొలిసారిగా బెంగళూరు బ్యాటింగ్ తేలిపోవడంతో మొదట ఆ జట్టు 20 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. నందని శర్మ (3/26), మరిజేన్ కాప్ (2/17), మిన్ను మణి (2/18), షినెలీ హెన్రీ (2/22) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు.

బెంగళూరు జట్టులో కెప్టెన్ స్మృతి మంధాన (38; 34 బంతుల్లో 6×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడింది. ఆమె కాకుండా రాధ యాదవ్ (18), జార్జియా వోల్ (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. పదో ఓవర్లో స్మృతి ఔటయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 62/2. ఆ తర్వాత దిల్లీ బౌలర్లు పోటీ పడి వికెట్లు తీయడం, భాగస్వామ్యాలు నమోదు కాకపోవడంతో ఆర్సీబీ స్వల్ప స్కోరుకు పరిమితమైంది. అనంతరం లారా వోల్వార్ట్ (42 నాటౌట్; 38 బంతుల్లో 4×4, 1×6) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో లక్ష్యాన్ని డీసీ.. 15.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు లిజెలీ లీ (6), షెఫాలి వర్మ (16) త్వరగా వెనుదిరిగినప్పటికీ.. కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (24), మరిజేన్ కాప్ (19 నాటౌట్)లతో కలిసి భాగస్వామ్యాలు నెలకొల్పిన లారా జట్టును గెలిపించింది. బెంగళూరు బౌలర్లలో సయాలీ సత్ఘరే (2/18), రాధ యాదవ్ (1/10) రాణించారు. 6 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో ఇప్పటికే బెంగళూరే అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. 4 మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉన్న డీసీ.. ఆ తర్వాత వరుసగా రెండో విజయంతో రెండో స్థానానికి ఎగబాకడం విశేషం.

బెంగళూరు: 20 ఓవర్లలో 109 ఆలౌట్ (స్మృతి మంధాన 38, రాధ యాదవ్ 18; నందని శర్మ 3/26, మరిజేన్ కాప్ 2/17, మిన్ను మణి 2/18, షినెలీ హెన్రీ 2/22)

దిల్లీ: 15.4 ఓవర్లలో 111/3 (లారా వోల్వార్ట్ 42 నాటౌట్, జెమీమా 24, మరిజేన్ కాప్ 19 నాటౌట్; సయాలి సత్ఘరే 2/18, రాధ 1/10)

గుకేశ్ చేజేతులా..

విజ్క్ ఆన్ జీ: టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు అనూహ్య పరాజయం. శనివారం ఆరో రౌండ్లో పెద్ద తప్పిదం చేసిన అతడు చేజేతులా ఓడాడు. అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్)తో పోరులో గుకేశ్ ఆరంభంలో బాగానే ఆడాడు. ఈ గేమ్ డ్రా అయ్యేలా కనిపించింది. అయితే 36వ ఎత్తు వద్ద కోలుకోలేని తప్పిదం చేసిన అతడు.. ఓటమిని అంగీకరించాడు. మరోవైపు మతియాస్ బ్లూబమ్ (జర్మనీ)తో గేమ్‌లో అర్జున్ ఇరిగేశి పాయింట్ పంచుకున్నాడు. ప్రజ్ఞానంద-ఫెదొసీవ్ (రష్యా), అరవింద్ చిదంబరం-సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్) గేమ్‌లు కూడా డ్రా అయ్యాయి. గుకేశ్, అర్జున్ ఖాతాలో చెరో 3 పాయింట్లున్నాయి. అబ్దుసతారోవ్ 4.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.

ఇంగ్లాండ్ గెలుపు

కొలంబో: జో రూట్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌లో ఇంగ్లాండ్ నిలిచింది. రెండో వన్డేలో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మొదట శ్రీలంక 49.3 ఓవర్లలో 219 పరుగులకు ఆలౌటైంది. అసలంక (45), ధనంజయ డిసిల్వా (40) మాత్రమే ఓ మోస్తరుగా ఆడారు. జేమీ ఓవర్టన్ (2/21), ఆదిల్ రషీద్ (2/34), జో రూట్ (2/13) బంతితో మెరుగైన ప్రదర్శన చేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రూట్ (75) బ్యాట్‌తోనూ అదరగొట్టడంతో ఇంగ్లాండ్ 46.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (42) రాణించాడు. ధనంజయ డిసిల్వా, వాండర్సే రెండేసి వికెట్లు తీశారు.

జకోవిచ్ @ 400

- ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశం
- సినర్, స్వైటెక్, పెగులా కూడా



జకోవిచ్

మెల్‌బోర్న్

గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా 400 మ్యాచ్‌లు నెగ్గాడు సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్. ఆస్ట్రేలియన్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్ చేరే క్రమంలో మూడో రౌండ్లో 6-3, 6-4, 7-6 (7-4)తో బొటిక్ వాండి (నెదర్లాండ్స్)పై గెలిచాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో 400 విజయాలు సాధించిన తొలి ప్లేయర్‌గా జకోవిచ్ ఘనత సాధించాడు. రోజర్ ఫెదరర్ (369), రఫెల్ నాదల్ (314) వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో 102 మ్యాచ్‌లు నెగ్గిన జకోవిచ్.. ఫెదరర్‌ను సమం చేశాడు. రాడ్‌లేవర్ ఎరీనాలో ఇప్పటికే 10సార్లు ఛాంపియన్‌గా నిలిచిన నొవాక్.. 25వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించి చరిత్ర సృష్టించాలనే సంకల్పంతో కదులుతున్నాడు.

సినర్ కష్టంగా..: రెండో సీడ్ యానిక్ సినర్ కాస్త కష్టంగా ప్రిక్వార్టర్స్ చేరాడు. అతడు 4-6, 6-3, 6-4, 6-4తో స్పిజిరి (అమెరికా)ను ఓడించాడు. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు కాళ్లు పట్టేయడంతో చాలా ఇబ్బంది పడిన సినర్.. తొలి సెట్లో 4-2తో ఆధిక్యంలో ఉన్న స్థితి నుంచి వెనుకబడ్డాడు. బలమైన సర్వీసులతో విజృంభించిన స్పిజిరి.. ఈ సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచాడు. కానీ సినర్ బలంగా పుంజుకున్నాడు. తర్వాతి మూడు సెట్లలో ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి విజయాన్ని అందుకున్నాడు. మ్యాచ్‌లో ఈ ఇటలీ స్టార్.. 17 ఏస్‌లు, 56 విన్నర్లు కొట్టాడు. అయిదో సీడ్ ముసెటి (ఇటలీ), ఎనిమిదో సీడ్ షెల్టన్ (అమెరికా), తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా), పన్నెండో సీడ్ రూడ్ (నార్వే) ప్రిక్వార్టర్స్ చేరారు. ముసెటి 5-7, 6-4, 6-2, 5-7, 6-2తో మచాక్ (చెక్)ను ఓడించగా.. ఫ్రిట్జ్ 7-6 (7-5), 2-6, 6-4, 6-4తో మాజీ ఛాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) పోరాటానికి తెరదించాడు. 40 ఏళ్ల వావ్రింకా ఆస్ట్రేలియన్ ఓపెన్లో ఆడడం ఇదే చివరిసారి. రూడ్ 6-4, 6-4, 3-6, 7-5తో సిలిచ్ (క్రొయేషియా)ను ఓడించాడు. పదహారో సీడ్ కచనోవ్ (రష్యా) 6-7 (5-7), 6-3, 3-6, 4-6తో డార్డెరి (ఇటలీ) చేతిలో.. మెన్సిక్ (చెక్) 6-2, 7-6 (7-5), 7-6 (7-5)తో క్విన్ (అమెరికా)ను ఓడించాడు.



వావ్రింకా

స్వైటెక్ తడబడినా..: టైటిల్ ఫేవరెట్ ఇగా స్వైటెక్ ప్రిక్వార్టర్స్ చేరింది. కలిన్‌స్కయా (రష్యా)తో మ్యాచ్‌లో ఆమె తడబడినా.. పుంజుకుని విజయాన్ని అందుకుంది. రెండో సీడ్ స్వైటెక్ 6-1, 1-6, 6-1తో కలిన్‌స్కయాను ఓడించింది. తొలి సెట్‌ను చాలా తేలిగ్గా గెలుచుకున్న స్వైటెక్‌కు.. రెండో సెట్లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీ ఎదురైంది. రెండో గేమ్‌లో సర్వీస్ కోల్పోయిన స్వైటెక్.. 1-4తో వెనుకబడి సెట్‌ను చేజార్చుకుంది. మూడో సెట్లో స్వైటెక్ విజృంభించింది. 5-0తో ఆధిక్యంలోకి వెళ్లిన ఈ పోలెండ్ తార.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లో స్వైటెక్ 2 ఏస్‌లు, 24 విన్నర్లు కొట్టింది. నాలుగోసీడ్ అనిసిమోవా (అమెరికా) 6-1, 6-4తో స్టెర్న్స్ (అమెరికా)ను ఓడించగా.. ఆరో సీడ్ పెగులా (అమెరికా) 6-3, 6-2తో సెలెక్‌మెటెవా (రష్యా)పై నెగ్గింది. మెర్టిన్స్ (బెల్జియం) 6-0, 6-4తో బర్ట్రాన్‌కోవా (చెక్)పై, రిబకినా (కజకిస్థాన్) 6-2, 6-3తో వాలెంటోవా (చెక్)పై, వాంగ్ (చైనా) 7-5, 6-4తో నోస్కోవా (చెక్)పై గెలిచారు. మాజీ ఛాంపియన్ నొవొమి ఒసాకా (జపాన్) టోర్నీ నుంచి వైదొలిగింది. గాయం కారణంగా మాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా) తో మూడో రౌండ్ మ్యాచ్‌లో ఆమె ఆడలేదు.

యుకి జంట ముందంజ: పురుషుల డబుల్స్‌లో యుకి బాంబ్రి (భారత్)-గొరాన్‌సన్ (స్వీడన్) జంట మూడో రౌండ్లో ప్రవేశించింది. రెండో రౌండ్లో యుకి ద్వయం 4-6, 7-6 (7-5), 6-3తో గొంజాలెజ్ (మెక్సికో)-డేవిడ్ (నెదర్లాండ్స్) జంటను ఓడించింది. శ్రీరామ్ బాలాజీ (భారత్)-నీల్ (ఆస్ట్రియా) జోడీ 5-7, 1-6తో మార్సెలో (ఎల్ సాల్వడార్)-పవిచ్ (క్రొయేషియా) జంట చేతిలో ఓడింది.



అంబ్రిష్

ఎదురులేని యువ భారత్

- కివీస్‌పై ఘనవిజయం
- మెరిసిన ఆయుష్, అంబ్రిష్, హెనిల్

బులవాయో: అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురేలేదు. హ్యాట్రిక్ విజయంతో ఆయుష్ మాత్రే బృందం సూపర్ సిక్స్‌కు దూసుకెళ్లింది. శనివారం గ్రూప్-బి ఆఖరి మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. వర్షం కారణంగా 37 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో మొదట 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అంబ్రిష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) ధాటికి న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌటైంది. కాలమ్ (37), సెల్విన్ సంజయ్ (28), కాటర్ (23) మాత్రమే రాణించారు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2×4, 6×6), వైభవ్ సూర్యవంశీ (40; 23 బంతుల్లో 2×4, 3×6) మెరుపులతో భారత్ 13.3 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో గ్రూప్-బిలో ఆడిన మూడు మ్యాచ్‌లూ గెలిచిన యువ భారత్.. 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ గ్రూప్ నుంచి బంగ్లాదేశ్ (3), న్యూజిలాండ్ (2) కూడా సూపర్ సిక్స్ చేరాయి. అమెరికా టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం ఆరంభమయ్యే సూపర్ సిక్స్‌లో మొత్తం 12 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడతాయి. గ్రూప్-2లో ఉన్న భారత్.. 27న జింబాబ్వే, ఫిబ్రవరి 1న పాకిస్థాన్‌తో తలపడనుంది.



ఆయుష్

ఆయుష్, వైభవ్ దూకుడు: ఛేదనలో ఆరంభంలోనే భారత్.. ఆరోన్ జార్జి (7) వికెట్ కోల్పోయింది. 4 ఓవర్లకు స్కోరు 27/1. అక్కడ నుంచి వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే సిక్సులు, ఫోర్లతో విరుచుకుపడ్డారు. 8 ఓవర్లకు 87/1తో భారత్ విజయం దిశగా దూసుకెళ్లింది. వైభవ్ ఔటైనా.. ఆయుష్ దూకుడు కొనసాగించాడు. ఈ క్రమంలో 24 బంతుల్లోనే అర్ధసెంచరీ అందుకున్నాడు. అర్ధసెంచరీ చేశాక ఆయుష్ వెనుదిరిగినా.. వేదాంత్ (12 నాటౌట్), విహాన్ (16 నాటౌట్) పని పూర్తి చేశారు. భారత్ మరో 141 బంతులు ఉండగానే విజయాన్ని అందుకుంది. అంతకుముందు అంబ్రిష్, హెనిల్ పటేల్ విజృంభించడంతో న్యూజిలాండ్ నిలవలేకపోయింది. 22 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఆ తర్వాత కోలుకోలేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు.. న్యూజిలాండ్: 36.2 ఓవర్లలో 135 ఆలౌట్ (కాలమ్ 37 నాటౌట్, సెల్విన్ సంజయ్ 28, జాకబ్ కాటర్ 23; అంబ్రిష్ 4/29, హెనిల్ పటేల్ 3/23, ఖిలాన్ పటేల్ 1/26, మహ్మద్ ఇనాన్ 1/26, కనిష్క్ చౌహాన్ 1/30) **భారత్:** 13.3 ఓవర్లలో 130/3 (ఆయుష్ మాత్రే 53, వైభవ్ సూర్యవంశీ 40, విహాన్ 17 నాటౌట్, వేదాంత్ 13 నాటౌట్; మాసన్ క్లార్క్ 1/29, జస్కరణ్ సంధు 1/34, సంజయ్ 1/22)

గెలుపు దిశగా ముంబయి

హైదరాబాద్ 166/7

ఈనాడు, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-డి మ్యాచ్‌లో హైదరాబాద్‌పై ముంబయి గెలుపు లాంఛనమే. ఆ జట్టు ఇన్నింగ్స్ విజయం సాధిస్తుందా లేదా అన్నదే తేలాలి. మూడో రోజు ఆట ముగిసేసరికి ఆతిథ్య హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 166/7తో ఓటమి అంచున నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 138/2తో శనివారం ఉదయం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ 267 పరుగులకు ఆలౌటవడంతో ఫాలో ఆన్ తప్పలేదు. రాహుల్ సింగ్ (96) ఒంటరి పోరాటం చేశాడు. ముంబయి బౌలర్లలో హిమాన్షు సింగ్ (3/39) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ హైదరాబాద్ బ్యాటర్లలో ఎలాంటి మార్పు లేదు. రాహుల్ సింగ్ (33), హిమతేజ (43) కాసేపు నిలిచారు. చామా మిలింద్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. మోహిత్ అవస్థి (3/31), ముషీర్ ఖాన్ (3/38) హైదరాబాద్‌ను దెబ్బతీశారు. ఇన్నింగ్స్ తేడాతో లేదా 10 వికెట్లతో నెగ్గితే ముంబయికి ఒక బోనస్ పాయింట్ లభిస్తుంది.

ఆంధ్ర 93/1

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎలో విదర్భతో పోరులో ఆంధ్ర విజయానికి 166 పరుగుల దూరంలో ఉంది. 259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు మూడో రోజు ఆట చివరికి 26 ఓవర్లలో 93/1తో నిలిచింది. షేక్ రషీద్ (50 బ్యాటింగ్) కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అతడికి తోడు శ్రీకర్ భరత్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 4/0తో ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 191 పరుగులకే ఆలౌటైంది. అమన్ మోఖడే (51), యశ్ రాఠోడ్ (56) రాణించారు. సాయితేజ (4/28) విజృంభించడంతో ఆ జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 295 పరుగులు చేయగా.. ఆంధ్ర 228కు ఆలౌటైంది.

భారత జట్టులో వైష్ణవి, ప్రతీక

దిల్లీ: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఏకైక టెస్టులో తలపడబోయే భారత జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. ఫిబ్రవరి 15న మొదలుకానున్న ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ మూడేసి టీ20లు, వన్డేలు, ఓ టెస్టు ఆడనుంది. 2025 వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో భాగమైన ప్రతీక రావల్ తొలిసారి టెస్టులకు ఎంపికైంది. గాయం కారణంగా ప్రపంచకప్ సెమీఫైనల్, ఫైనల్ ఆడలేకపోయిన ఆమె.. కోలుకోవడంతో సెలక్టర్లు అవకాశమిచ్చారు. గత ఏడాది అండర్19 ప్రపంచకప్‌లో ఆకట్టుకున్న ఎడమ చేతి వాటం స్పిన్నర్ వైష్ణవికి తొలి ఛాన్స్ దక్కింది. నిరుడు వన్డేల్లో ఆరంగేట్రం చేసి 15 మ్యాచ్‌ల్లో 23 వికెట్లు పడగొట్టిన పేసర్ క్రాంతి గౌడ్ కూడా టెస్టు జట్టులోకి వచ్చింది. పేసర్ సయాలి సత్ఘరే కూడా ఎంపికైంది. గాయం కారణంగా టీ20, వన్డే సిరీస్‌లకు దూరమైన వికెట్ కీపర్ కమలిని స్థానాన్ని ఉమ ఛెత్రీ భర్తీ చేసింది. మార్చి 6న పెర్త్‌లో ఏకైక టెస్టు ఆరంభమవుతుంది. టీ20లు, వన్డేలకు ఇప్పటికే జట్టును ప్రకటించారు.

డబ్ల్యూఎస్‌కే ఛాంపియన్‌షిప్‌లో అతిక

లా కోన్‌కా (ఇటలీ): భారత సంచలనం అతిక మీర్ రేసింగ్‌లో వడివడిగా అడుగులు వేస్తోంది. డబ్ల్యూఎస్‌కే ఛాంపియన్‌షిప్‌లో ఆమె పోటీపడబోతోంది. కార్టింగ్ 'ఫార్ములా వన్'గా పేరున్న ఈ టోర్నీలో మెడెనా రేసింగ్ టీమ్ తరఫున అతిక బరిలో దిగనుంది. ఆదివారం డబ్ల్యూఎస్‌కే సూపర్ మాస్టర్ సిరీస్ రౌండ్-1లో ఆమె పోటీపడనుంది. ఫార్ములా వన్ అకాడమీ స్పాన్సర్‌గా ఉన్న ఈ భారత బాలిక.. గతేడాది జూనియర్ విభాగంలో సత్తా చాటింది. ఫార్ములావన్ దిగ్గజాలు లూయిస్ హామిల్టన్, మ్యాక్స్ వెర్‌స్టాపెన్, సెబాస్టియన్ వెటల్ కూడా కెరీర్ ఆరంభంలో డబ్ల్యూఎస్‌కే ఛాంపియన్‌షిప్‌లో పోటీపడ్డారు.

బిలియర్డ్స్ జాతీయ విజేత సౌరవ్ కొఠారి

బహదూర్‌గఢ్: జాతీయ ప్రీమియర్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో సౌరవ్ కొఠారి విజేతగా నిలిచాడు. సీనియర్ పురుషుల విభాగంలో 4-0తో శ్రీకృష్ణను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. విజయానంతరం అతడు భావోద్వేగానికి గురయ్యాడు. ఈ ఛాంపియన్‌షిప్‌నకు కొన్ని రోజుల ముందు సౌరవ్ తండ్రి మనోజ్ కొఠారి మరణించారు. ఆయన కూడా ప్రపంచ బిలియర్డ్స్ మాజీ ఛాంపియన్ కావడం విశేషం.




ఈ 'రోటీ' కేంద్రం

వీధికుక్కలు, ఆవుల కోసం..

గుజరాత్‌లోని అహ్మదాబాద్ శివారులో గల శిలాజ్‌లో విజయా బెన్ (63) అనే మహిళ వీధికుక్కలు, ఆవుల కోసం ఓ రోటీ సెంటర్‌ను ప్రారంభించి గత 35 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ఈమె సేవాభావం స్ఫూర్తితో ఇప్పుడు మరో ఆరుగురు మహిళలు ఈ కార్యక్రమంలో జత కలిశారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 15 కిలోల గోధుమ, 10 కిలోల చిరుధాన్యాలతో రోటీలు తయారు చేస్తారు. పెంపుడు జంతువుల యజమానులు కొందరు నిత్యం ఈ కేంద్రానికి వచ్చి రోటీలు తీసుకుపోతారు. వీరందరి ఆర్థిక సహకారంతో ఈ కేంద్రం నడుస్తోంది. గత పదిహేనేళ్లుగా ఇక్కడి నుంచి కుక్కల కోసం తాను రోటీలు తీసుకుపోతున్నట్లు బల్దేవ్‌భాయ్ ఠాకుర్ అనే వ్యక్తి తెలిపారు. –ఈటీవీ భారత్

హంగులు కాదు... ఆపదలు చూడండి!

ఒత్తైన, పట్టులాంటి, మెరిసే జుట్టు.. అమ్మాయిలకే కాదు అబ్బాయిలకూ కలే. దీని కోసం వివిధ రకాల షాంపూలతో కుస్తీ పడుతుంటారు. రంగు, సువాసన కోసం వాడే రసాయనాలతో క్యాన్సర్ ముప్పు తప్పదంటున్నారు నిపుణులు.



తల స్నానం చేస్తే.. మట్టి, జిడ్డు పోయి జుట్టు శుభ్రమవుతుందని భావిస్తాం. దీనికోసం పలురకాల షాంపూలను వాడుతుంటాం. జుట్టు నిగారింపును చూసి మురిసిపోతాం. కురులు సిల్కీగా మారాయని ఆనందపడిపోతాం. కానీ.. కొన్ని షాంపూల్లోని రసాయనాలు క్యాన్సర్‌కు దారితీస్తాయని చాలా మందికి తెలీదు. ముఖ్యంగా నురగను ఉత్పత్తి చేసేందుకు వాడే రసాయనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సల్ఫేట్లు:
- షాంపూల్లో క్లెన్సింగ్ (శుభ్రపరిచే) ఏజెంట్లుగా సోడియం లారిల్ సల్ఫేట్, సోడియం లారిల్ ఈథర్ సల్ఫేట్‌లను ఉపయోగిస్తారు.
- ఇవి తల, చర్మం నుంచి సహజమైన నూనెలను తొలగిస్తాయి.
- చర్మం పొడిబారి, దురద, వాపు (ఇన్‌ఫ్లమేషన్) తలెత్తే అవకాశం ఉంది.
- ఇవి శరీరంలోకి ప్రవేశిస్తే క్యాన్సర్ కారకాలుగా మారతాయి.

థాలేట్స్:
- షాంపూలు, కండిషనర్లలో సువాసన కోసం వీటిని వినియోగిస్తారు.
- ఇవి శరీరంలోకి వెళ్తే.. పునరుత్పత్తి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

కృత్రిమ వాసనలు, రంగులు
- వాసన, రంగూ బాగుండే అనేక షాంపూలు చర్మానికి, జుట్టుకు హానికలిగిస్తాయి.
- సువాసన కోసం హానికర పెట్రో రసాయనాలు, రంగులను బొగ్గు, తారు, పెట్రోలియం నుంచి తీసుకుని తయారుచేస్తారు.
- ఈ పదార్థాల కారణంగా ఉబ్బసం, క్యాన్సర్, జుట్టు రాలిపోవడం, సంతాన సమస్యలు తలెత్తుతాయి.

పారాబెన్స్:
- వీటిని షాంపూలు, కండిషనర్లలో వినియోగిస్తారు.
- ఈ హానికర రసాయన ప్రిజర్వేటివ్‌లు చర్మ క్యాన్సర్ ముప్పును మరింత పెంచుతాయి.
- జుట్టు రాలేలా చేస్తాయి. హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి.
- బ్యుటైల్, ఇథైల్, మిథైల్, ప్రొపైల్ వంటి పారాబెన్లు ఉపయోగించిన ఉత్పత్తులను ఎక్కువ వాడకపోవడమే ఉత్తమం.

సిలికాన్లు:
- జుట్టు చిక్కును తొలగించి మృదువుగా కనిపించేలా చేసేందుకు వీటిని ఉపయోగిస్తారు.
- కుదుళ్లకు పోషకాలు, తేమ వెళ్లకుండా అడ్డుకుంటాయి. దీంతో తలపై చర్మం పొడిబారి దురదగా ఉంటుంది.
- క్యాన్సర్‌ను కలిగించే అవకాశమూ ఎక్కువే.

లేబుళ్లను పరిశీలించండి..

షాంపూను కొనుగోలు చేసే ముందు లేబుళ్లపై ప్రధానంగా గమనించాల్సినవి..



- సల్ఫేట్‌రహిత, కొబ్బరి, మొక్కల నుంచి తీసిన సహజమైన క్లెన్సర్లు ఉన్న ఉత్పత్తులను ఎంపిక చేసుకోవాలి.
- సల్ఫేట్లు, పారాబెన్స్, థాలేట్స్ విడుదల చేసే పదార్థాలున్న ఉత్పత్తులను కొనుగోలు చేయకూడదు.
- తలపై ఉండే చర్మం సున్నితమైనదయితే సువాసన, రంగులు లేని షాంపూను ఎంచుకోవాలి.
- కుంకుడు కాయలు, శీకాకాయ, కలబంద తదితర పదార్థాలున్న షాంపూలు జుట్టుకు పోషణనిస్తాయి

- ఈనాడు, అమరావతి



ఒకే వేదికపై...

నిఖా.. కల్యాణం

హరియాణాలోని నూహ్ జిల్లా పినాంగవాన్ పట్టణంలో 'సర్వసమాజ్ కన్యా వివాహ సమితి' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం మతసామరస్యానికి అద్దం పట్టింది. ఒకే ఆవరణలో ఒకవైపు హిందూ సంప్రదాయాల ప్రకారం వేద మంత్రాల సాక్షిగా వివాహాలు నిర్వహించగా, మరోవైపు ముస్లింల ఆచారాలతో నిఖాలు జరిగాయి. 13 హిందూ, 2 ముస్లిం జంటలు కొత్త జీవితంలోకి అడుగు పెట్టాయి. ఇరు మతాల బంధుమిత్రులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. సర్వసమాజ్ నిర్వహించిన అయిదో సామూహిక వివాహ వేడుక ఇది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుమార్తెల వివాహాలకు ఇబ్బందులు పడుతున్న పేద తల్లిదండ్రులకు ఇది ఒక వరంలా నిలుస్తోంది. ఈ కార్యక్రమాలన్నీ ఉచితంగా జరిపించటమే కాకుండా సమాజ్ తరఫున ప్రతి జంటకు 101 పాత్రలు, గృహోపకరణాలను అందజేశారు. –ఈటీవీ భారత్



నేను రెడీ.. కుందేలు ఎక్కడ?

పడిపడిగా అడుగులు వేస్తూ పరుగు పందెంలో కుందేలుని ఓడించిన తాబేలు కథ అందరికీ తెలిసిందే. ఈ చిత్రంలోని కూర్మం కూడా మరో పందేనికి నేను సిద్ధం అన్నట్టుంది కదూ..? నిజానికి ఇది తాబేలు కాదు. . ఓ కంద దుంప. గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన అమ్మిశెట్టి రవి తాడేపల్లి కరకట్ట ప్రాంతంలోని పొలంలో కంద సాగు చేశారు. వాటిల్లో ఓ దుంప అచ్చం తాబేలులా ఉండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. –న్యూస్‌టుడే, మంగళగిరి అర్బన్



మూగమనసుల ఐక్యతారాగం

అందరిలాగే వీరి జీవితాలు.. బంధుమిత్రులను కలిసేందుకు సమయం ఉండదు. కుటుంబసభ్యులతో మనసు విప్పి మాట్లాడేందుకు నాలుగు నిమిషాలు వెచ్చించలేని పరిస్థితి. ఎదుటి వారు చెప్పింది వినలేరు, తమ భావాలను నోటితో చెప్పలేని బధిరులు వీరు. అయినా ప్రతి శని, ఆదివారాల్లో ఖమ్మం నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సమావేశమవుతుంటారు. సాధారణ ప్రజలకు అంతగా అర్థం కాని సంజ్ఞాభాషలో తమలో తాము మనసు విప్పి హాయిగా మాట్లాడుకుంటారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చేసిన వీరంతా ప్రభుత్వ ఉపాధి అవకాశాల గురించి చర్చించుకుంటారు. కష్టసుఖాలు పాలుపంచుకుంటారు. అంతేకాదు సమావేశానికి హాజరు కాని తోటివారికి వీడియో కాల్ చేసి పలకరిస్తారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నత విద్యనభ్యసించిన వీరంతా ఏళ్లుగా ఇలా క్రమం తప్పకుండా కలుసుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. తమ సమస్యల గురించి ఉన్నతాధికారులకు, నాయకులకు వినతి పత్రాలు అందించే క్రమంలో ఖమ్మం జిల్లా డెఫ్ అండ్ డంబ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల వీరయ్య కుమార్తె తన్మయి వీరికి ట్రాన్స్‌లేటర్‌గా వ్యవహరిస్తున్నారు. – ఈనాడు, ఖమ్మం

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి రూ.1.20 కోట్లతో టేకు రథం



కృష్ణా జిల్లా మోపిదేవిలోని స్వయంభువు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సినీ నిర్మాత ఆట్లూరి నారాయణరావు రూ.1.20 కోట్లతో టేకు రథాన్ని తయారు చేయించారు. ఈ రథాన్ని శనివారం నటుడు నారా రోహిత్ ఆలయానికి అందజేశారు. స్వామి వారు టేకు రథంపై కొలువుదీరి గ్రామంలో విహరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావాలని ఎన్నికల సమయంలో స్వామికి మొక్కుకున్నానని.. ఆ మేరకు రథం చేయించినట్లు దాత నారాయణరావు తెలిపారు. – న్యూస్‌టుడే, మోపిదేవి



చిట్టి చిలకమ్మా.. కంకి బాగుందా!

ఆకాశంలో విహరిస్తున్న చిలుకల గుంపునకు జొన్న చేను కనిపించింది. అంతే.. కొన్ని అక్కడ వాలిపోయాయి. కంకులు తిందామనుకునే సరికి... పైనుంచి దూసుకుపోతున్న వాహన శబ్దాలకు భయపడ్డాయి. దీంతో ముక్కుతో నేరుగా కంకుల విరిచి.. సమీపంలోని విద్యుత్తు తీగలపైకి చేరి తిన్నాయి. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల సమీపంలో కనిపించిన దృశ్యమిది. –ఈనాడు, ప్రకాశం

75 ఏళ్ల ప్రయాణానికి గుర్తుగా..



భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ముంబయి టంకశాల ద్వారా రూ.75 ప్రత్యేక స్మారక నాణేన్ని ఇటీవల విడుదల చేసింది. దీన్ని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు. 35 గ్రాముల బరువున్న ఈ నాణెంలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, నికెల్, జింక్ చెరొక 5 శాతం ఉన్నాయని ఆయన వివరించారు. రూ.9,439కు కొనుగోలు చేసినట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

కేరళ క్రిస్మస్, న్యూ ఇయర్ లాటరీలో

అజ్ఞాతవ్యక్తికి రూ.20 కోట్ల జాక్‌పాట్



మలయాళీలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే క్రిస్మస్ - నూతన సంవత్సర బంపర్ లాటరీ ఫలితాలు విడుదలయ్యాయి. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో ఈ డ్రా జరిగింది. ఎక్స్‌సీ 138455 నంబరు టికెటును కొన్న అజ్ఞాతవ్యక్తికి జాక్‌పాట్ తగిలింది. మొదటి బహుమతిగా రూ.20 కోట్లు గెలుచుకున్నాడు. ఈ టికెటును కొట్టాయం జిల్లాలోని కంజిరపల్లి బస్టాండు సమీపాన దుకాణం నడుపుతున్న ఏజెంటు విక్రయించారు. ఈ ఏడాది లాటరీ టికెట్లు రికార్డు స్థాయిలో 55 లక్షల మేర అమ్ముడుపోయాయి. ఒక్క పాలక్కాడ్ జిల్లాలోనే 15 లక్షల టికెట్లు కొన్నారు. ఈ లాటరీ టికెట్లను 10 సిరీస్‌లలో జారీ చేసి, రూ.400 ధరగా నిర్ణయించారు. రూ.20 కోట్లు జాక్‌పాట్ కొట్టిన విజేతకు ఏజెంటు కమీషను, ఇతర ఛార్జీలు పోగా రూ.12.4 కోట్లు మిగులుతాయి. 20 మంది విజేతలకు రెండో బహుమతి కింద రూ.కోటి చొప్పున, మూడో బహుమతిగా 20 మందికి చెరో రూ.10 లక్షలు అందనున్నాయి. నాలుగో బహుమతిగా 20 మందికి రూ.3 లక్షల చొప్పున, 5వ బహుమతిగా మరో 20 మందికి చెరో రూ.2 లక్షలు అందుతాయి.

'క్విట్ ఇండియా'తో శ్రీకారం..

వందేళ్ల వయసులోనూ యోగా



మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు తారాచంద్ జైన్ వందేళ్ల వయసులోనూ నిత్యం 45 నిమిషాలు యోగా చేస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నారు. హైస్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడే స్నేహితులతో కలిసి 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశ స్వాతంత్ర్యం కోసం నినాదాలు చేసిన తారాచంద్ ఆర్నెల్లు జైలు జీవితాన్ని గడిపారు. జైలులో యువ యోధులు అఖాడా (కుస్తీ కేంద్రం) ఏర్పాటు చేసుకొని శిక్షణ పొందేవారు. అలా ప్రారంభమైన అఖాడా అభ్యాసం జీవితకాలం కొనసాగిందని, ఓ బంధువు సలహాతో యోగా కూడా అలవాటు చేసుకొన్నట్లు తారాచంద్ జైన్ వివరించారు



రాత్రికి రాత్రే వంతెన చోరీ

కోర్బా: ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా పట్టణంలో 70 అడుగుల పొడవున్న 10 టన్నుల స్టీలు వంతెనను రాత్రికిరాత్రే కొందరు దుండగులు దొంగిలించారు. హస్దియో లెఫ్ట్ కెనాల్‌పై 40 సంవత్సరాలుగా పాదచారుల నడకదారిగా ఉన్న వంతెన తెల్లారేసరికి కనిపించకపోవడంతో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. స్థానిక కార్పొరేటర్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్ట్‌చేశారు. వంతెనను దొంగిలించేందుకు వాడిన వాహనాన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఏడు టన్నుల ఉక్కును కాలువలో దాచినట్లు వారు ఇచ్చిన సమాచారంతో దాన్ని వెలికి తీశారు. మొత్తం 15 మంది కలిసి, వంతెనను చిన్న భాగాలుగా కోసి, వాటిని పాత ఇనుముగా అమ్మాలనుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇందుకోసం గ్యాస్ కట్టర్లను వాడినట్లు తెలుస్తోంది. అదుపులో ఉన్న నిందితులు నేరాన్ని అంగీకరించారని, మిగతా 10 మంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.



జీవితంలో అద్భుతం జరగాలంటే..

ఏదైనా అద్భుతం జరిగి జీవితం మారకపోతుందా అని చాలా మంది ఎదురుచూస్తుంటారు. కానీ ఆ అద్భుతం మీరు వాయిదా వేస్తూ వస్తున్న పనిలోనే దాగుందని తెలుసుకోండి. ఎంత త్వరగా మీరు ఆ పనిని ప్రారంభిస్తారో, అంత త్వరగా మీ జీవితం అద్భుతంగా మారుతుంది.

– క్రిస్ విలియమ్సన్, యూట్యూబర్

విదేశీ ఒప్పందాలతో

యువతకు కొత్త అవకాశాలు: మోదీ

దిల్లీ: ప్రపంచ దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న వాణిజ్య, వలస విధానాల ఒప్పందాలు కూడా దేశ యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువతీయువకులు భారత్‌లో ఉన్నారని, వారి ఉపాధి అవకాశాల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన 18వ రోజ్‌గార్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 61వేల మంది యువతకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రారంభించి ప్రసంగించారు. 'అందుకున్న నియామకపత్రాలను దేశ నిర్మాణం కోసం అందిన ఆహ్వానపత్రాలుగా, సంకల్ప పత్రాలుగా యువత భావించాలి. మీరంతా తోటి ఉద్యోగులతో కలిసి దేశ రక్షణ, ఆరోగ్యం, విద్య, ఇంధన రంగాలను బలోపేతం చేయాలి. రాజ్యాంగానికి కట్టుబడి బాధ్యతలు నిర్వర్తించాలి. నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే మా సర్కారు లక్ష్యం. ఇందుకోసమే వివిధ రాష్ట్రాల్లో 40 ప్రాంతాల్లో రోజ్‌గార్ మేళాలను నిర్వహించాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



2 లక్షల స్టార్టప్‌లు.. 21 లక్షల ఉద్యోగాలు

'భారత్‌లో స్టార్టప్‌లు చాలా బాగా పనిచేస్తున్నాయి. వాటివల్ల లక్షలమంది యువతకు ఉద్యోగావకాశాలు ఏర్పడ్డాయి. డిజిటల్ ఇండియా మిషన్ వల్ల భారత ఆర్థిక వ్యవస్థ కొత్త రూపాన్ని సంతరించుకుంది. దేశంలో దాదాపు 2 లక్షల రిజిస్టర్డ్ స్టార్టప్‌లున్నాయి. వీటిలో 21 లక్షల మందికిపైగా యువత పనిచేస్తున్నారు' అని మోదీ చెప్పారు.

ఇక మీ భద్రత మీదే

- మిత్రదేశాలకు అమెరికా సంకేతం

వాషింగ్టన్: ఇన్నాళ్లూ కలసికట్టుగా భద్రతా సవాళ్లను ఎదుర్కొంటున్న నాటోదేశాలు ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరితో సంకటస్థితిని అనుభవిస్తున్నాయి. మిత్రదేశాల భద్రత విషయంలో అమెరికా కాడి జారేస్తోంది. ఇక మీ భద్రత మీదేనని నాటో కూటమి దేశాలకు విస్పష్ట సంకేతాలు ఇస్తోంది. అమెరికా మీద అతిగా ఆధారపడకూడదనీ, ఇకపై ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాలపై తమ ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపైనే దృష్టి కేంద్రీకరిస్తామని అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ శుక్రవారం విడుదలచేసిన జాతీయ రక్షణ వ్యూహపత్రం స్పష్టంచేసింది. 2022లో నాటి అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో విడుదలైన రక్షణ వ్యూహ పత్రం చైనాను ప్రధాన ప్రత్యర్థిగా ప్రకటించగా.. ట్రంప్ ప్రభుత్వం చైనాతో శాంతియుత, గౌరవప్రద సంబంధాలను, న్యాయమైన వ్యాపారాన్ని కోరుకుంటున్నామని ఉద్ఘాటించింది. తైవాన్‌కు చైనా నుంచి భద్రత కల్పిస్తామనే హామీ ఏదీ తాజా వ్యూహపత్రంలో లేదు. పైగా ఐరోపా, ఆసియాలలోని తమ మిత్రులు ప్రాంతీయ భద్రత గురించి తామే పూచీ వహించాలని సూచించింది. ఐరోపాలోని నాటో కూటమి దేశాలకు రష్యా నుంచి ముప్పు ఎదురవుతూనే ఉన్నా.. దాన్ని ఎదుర్కొనే సత్తా నాటోకు ఉందని స్పష్టంచేసింది. ఉక్రెయిన్ సరిహద్దుల్లోని అమెరికా సేనలను తగ్గిస్తామని ప్రకటించింది. అమెరికా పరిమిత మద్దతుతోనే దక్షిణ కొరియా దేశం ఉత్తర కొరియా ప్రమాదాన్ని ఎదుర్కోవాలని పేర్కొంది. గ్రీన్‌లాండ్, పనామా కాల్వలపై అదుపును అమెరికా తన చేతుల్లోకి తీసుకోవాలనుకొంటోందని వ్యూహపత్రం పునరుద్ఘాటించింది.



భారత్‌పై సుంకాలు తగ్గొచ్చు

అమెరికా ఆర్థిక మంత్రి

ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌పై అమెరికా విధించిన సుంకాలు సగానికి తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ సూచనప్రాయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా ప్రభుత్వం అదనపు సుంకాలు(25 శాతం) విధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాకు భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలు అమలవుతున్నాయి. స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 25 శాతం సుంకాలు విధించాం. అయితే ఈ కొనుగోళ్లను భారత్ తగ్గించుకుంది. అది భారీ విజయం. ఇప్పటికీ టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి. వాటిని తొలగించడానికి ఒక మార్గం ఉందని అనుకుంటున్నాను' అని సుంకాల తొలగింపు గురించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు.. 27న అఖిలపక్ష భేటీ

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో వివిధ అంశాలు చర్చించడానికి ప్రభుత్వం 27న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. సభలో చర్చనీయాంశాలు, ఇతర విషయాలను దీనిలో చర్చించనున్నారు. ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసే ప్రసంగంతో పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయి. ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఫిబ్రవరి రెండు నుంచి నాలుగు వరకు చర్చ కొనసాగే అవకాశం ఉంది. ఫిబ్రవరి 13 వరకు తొలిదశ సమావేశాలు కొనసాగుతాయి. మళ్లీ మార్చి 9న మొదలై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి.



అమెరికాలో భార్యను, బంధువులను

కాల్చి చంపిన భారత సంతతి వ్యక్తి

- భయంతో మరో గదిలో దాక్కొన్న పిల్లలు

న్యూయార్క్: అమెరికాలో భారత సంతతికి చెందిన వ్యక్తి.. తన భార్యతోపాటు మరో ముగ్గురిని కాల్చి చంపాడు. జార్జియాలోని లారెన్స్‌విల్ నగరంలో శుక్రవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఈ ఘటనకు సంబంధించి విజయ్ కుమార్(51) అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మీడియా కథనాల ప్రకారం.. కాల్పుల విషయం పోలీసులకు ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకోగా.. అక్కడ నలుగురు భారత సంతతి వ్యక్తులు విగత జీవులుగా పడి ఉన్నారు. మృతులను కుమార్ భార్య మీము డోగ్రా(43), బంధువులు గౌరవ్ కుమార్(33), నిధి చందర్(37), హరీష్ చందర్(38)గా గుర్తించారు.



భార్యతో విజయ్ కుమార్

కుటుంబ తగాదాల వల్లే విజయ్ కుమార్ వీరిని కాల్చి చంపాడని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కాల్పుల సమయంలో ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఆత్మరక్షణ కోసం వారు ఒక గదిలో దాక్కున్నారని పోలీసులు తెలిపారు. వారిలో ఒకరు తమకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతోనే.. విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. నిందితుడు అరెస్టయ్యాడని.. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొంది.

అమెరికాను కప్పేసిన మంచు తుపాను

- 10 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దు

డాలస్: అమెరికాను భారీ మంచు తుపాను తాకింది. టెక్సాస్ నుంచి వర్జీనియా వరకు దాదాపు 11 దక్షిణాది రాష్ట్రాల్లో భారీస్థాయిలో మంచు వర్షంతో పాటు అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. టెక్సాస్, ఓక్లహోమాపై పంజా విసురుతోన్న ఈ భీకర మంచు తుపాను కారణంగా పలు రాష్ట్రాల్లో విమాన సర్వీసులకు ఆటంకం కలిగింది. శనివారం 3,300, ఆదివారం దాదాపు 7 వేల విమాన సర్వీసులు రద్దయినట్లు అధికారులు వెల్లడించారు. మంచు తుపాను కారణంగా అమెరికాలోని 20 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రభావితం కానున్నారని, అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని హెచ్చరికలు జారీచేశారు.



ఓక్లహోమాలో విరివిగా కురుస్తున్న మంచులోనే వెళ్తున్న వాహనాలు

ఎయిరిండియాపై ప్రభావం

అమెరికాలో మంచు తుపాను కారణంగా ఈ నెల 25, 26 తేదీల్లో న్యూయార్క్, న్యూజెర్సీలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమాన సర్వీసులను రద్దుచేసినట్లు ఎయిరిండియా శనివారం ప్రకటించింది. ప్రయాణికులకు ఈ మేరకు అడ్వైజరీ జారీచేసింది. ముందస్తు టికెట్ కొనుగోలు చేసుకున్న వారికి తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొంది.

వాతావరణ హెచ్చరికలతో అమెరికాలోని పలు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. కెంటకీ, వర్జీనియా, కాన్సస్, ఆర్కాన్సాస్, జార్జియా, మిసిసిపి సహా పలు రాష్ట్రాలు అత్యయిక పరిస్థితిని విధించాయి. మిసిసిపి, ఫ్లోరిడా వంటి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ప్రమాదకర స్థాయిలో చలి వాతావరణం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

మా మంచి మాస్టారు..!



ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి కొనిచ్చిన బస్‌పాస్‌లతో విద్యార్థులు

తరగతి గదిలో పాఠాలు చెప్పడమే కాదు.. తన విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనా తన బాధ్యతే అనుకున్నారు ఓ మాస్టారు. అనుకోవడమే కాదు ఇప్పటి వరకు రూ.50 లక్షల విలువైన పనులు చేపట్టారు.. ఇంకా చేస్తున్నారు. మూడేళ్ల క్రితం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన వాకా వెంకటేశ్వరరెడ్డికి విద్యార్థులంటే అమిత ప్రేమ. వారి ఇబ్బందులను దూరం చేస్తేనే చదువుపై శ్రద్ధ పెట్టి ఎదుగుతారని భావించారు. అందుకు అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. తొలుత సమీప గ్రామాల నుంచి బడికి వచ్చేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని గుర్తించి రూ.2 లక్షలతో అద్దెకు ఆటోలు నడిపించారు. ప్రస్తుతం విద్యార్థులకు గత ఏడాది రూ.1.6 లక్షలతో పాస్‌లు ఇప్పించి ఉదయం, సాయంత్రం విద్యార్థుల వద్దకే బస్సు వచ్చేలా కృషి చేశారు. అంతే కాకుండా గత ప్రభుత్వంలో పునాది దశలో నిలిచిపోయిన అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల పనులను ఏకంగా రూ.30 లక్షల సొంత నిధులతో పూర్తి చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక నిర్మాణం, క్రీడా సామగ్రి, మైదానం మరమ్మతులకు రూ.6 లక్షలు వెచ్చించారు. రూ.2.5 లక్షలతో పాఠశాల భవనాలకు రంగులు వేయించి, కార్పొరేట్ హంగులు కల్పించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న వెంకటేశ్వరరెడ్డి మాస్టారు. . పాఠశాలలోనే నివాసముంటూ ఉదయం, సాయంత్రం స్థానిక పిల్లలకు చదువు చెబుతున్నారు. యోగా, ధ్యానం, క్రీడల్లోనూ శిక్షణ ఇప్పిస్తున్నారు.

– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, టంగుటూరు





రూ.30 లక్షల నిధులతో పూర్తిచేసిన తరగతి గదులు, మరుగుదొడ్లు



విశాఖ ఉత్సవ్ వేదికపై ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

ఉల్లాసంగా విశాఖ ఉత్సవ్

సాంస్కృతిక కార్యక్రమాలతో కార్నివాల్

అలరించిన సంగీత ప్రదర్శన

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ సాగర తీరం ఉత్సవ శోభ సంతరించుకుంది. తొమ్మిది రోజులపాటు నిర్వహించే 'విశాఖ ఉత్సవ్' శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. బాణసంచా వెలుగులు, సంగీత, సాంస్కృతిక ప్రదర్శనలు, వాటిని తిలకించడానికి తరలివచ్చిన ప్రజలతో ఆర్కే బీచ్ రోడ్డంతా సందడి నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో పర్యాటకశాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రాష్ట్రానికి వస్తున్న పలు కీలక ప్రాజెక్టులతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో పర్యాటకశాఖకు నూతన జవసత్వాలు వచ్చాయన్నారు. ఇప్పటికే విజయవాడలో దసరా ఉత్సవాలు, అమరావతి..ఆవకాయ్ ఉత్సవం, తిరుపతిలో ఫ్లెమింగో ఉత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ తరహా వేడుకలతో స్థానికులకు ఉపాధితో పాటు ప్రజలు ఆనందంగా గడపడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. విశాఖ ఉత్సవ్‌ను భవిష్యత్తులో అంతర్జాతీయ ఉత్సవంగా నిర్వహిస్తామన్నారు.

మంత్రి అనిత మాట్లాడుతూ విశాఖతో పాటు అనకాపల్లి, అరకు ఉత్సవాలు భారీగా నిర్వహిస్తామన్నారు.

అంతకుముందు బీచ్ రోడ్‌లో జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ నుంచి కాళీమాత ఆలయం వరకు కార్నివాల్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర కళాకారుల వేషధారణలు, డప్పు నృత్యాలతో ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాణసంచా ప్రదర్శన, గాయని సునీత గీతాలాపన అలరించాయి. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విప్ గణబాబు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



విశాఖ ఉత్సవ్ వేదికపై సహచర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, అనిత, ప్రజాప్రతినిధులు, అధికారులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి కందుల దుర్గేష్



సాగర తీరంలో విశాఖ ఉత్సవ్ సందడి

రాష్ట్రాలకు వయోభారం!

పెరుగుతున్న వృద్ధ జనాభా

60 ఏళ్లు పైబడిన వారిలో.. ఐదో స్థానంలో ఏపీ

ఆర్బీఐ నివేదిక వెల్లడి

ఈనాడు, దిల్లీ: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన మన దేశంలో శ్రమశక్తికి ఆధారమైన మానవ వనరులు క్రమంగా తగ్గిపోతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యువ జనాభా తగ్గిపోతూ వయోధికులు అధికమవుతున్న దిశగా కొనసాగుతున్న పరిణామమే దీనికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్బీఐ) తాజాగా విడుదల చేసిన 'స్టేట్ ఫైనాన్సెస్' నివేదిక ఈ మార్పు పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయో వివరించింది. వయోధికులు అధికంగా ఉండే రాష్ట్రాల్లో శ్రామిక శక్తి తగ్గిపోయి ఆదాయం కుంచించుకుపోయే ప్రమాదం ఉంది.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) గణాంకాల ప్రకారం.. 60 ఏళ్ల పైబడిన జనాభా 15% మించితే ఆ రాష్ట్రాలకు వయోభారం పెరిగినట్లు లెక్క. అదే 10-15% మధ్యలో ఉంటే నడి వయసులో ఉన్నట్లు, 10%లోపు ఉంటే యుక్తవయసులో ఉన్నట్లు అంచనా. దీని ప్రకారం చూస్తే 2016 నాటికి దేశంలో ఏ రాష్ట్రమూ వయోభారం జాబితాలో లేదు. అయితే, 2026 నాటికి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. 60 ఏళ్ల పైబడిన జనాభా శాతం అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్-5, తెలంగాణ-10వ స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలోని మొత్తం జనసంఖ్య పరంగా చూస్తే ఆంధ్రప్రదేశ్-10, తెలంగాణ-13వ స్థానంలో ఉన్నాయి. 2036 నాటికి అత్యధిక వయోధికుల శాతం విషయంలో ఆంధ్రప్రదేశ్-4, తెలంగాణ-7వ స్థానానికి చేరుకుంటాయి.

■ 2026 నాటికి కేరళ, తమిళనాడులు 15శాతానికి మించిన 60 ఏళ్లపైబడిన జనాభా కారణంగా వయోభారం రాష్ట్రాల జాబితాలోకి వచ్చాయి. ఈ జాబితాలోకి 2031 నాటికి 9 రాష్ట్రాలు, 2036 నాటికి 12 రాష్ట్రాలు చేరనున్నట్లు ఆర్బీఐ అంచనా వేసింది. 22% వాటాతో కేరళ మొదటి స్థానాన్ని ఆక్రమించనుంది. 2036 నాటికి దేశంలోని ఏ రాష్ట్రమూ యుక్తవయసు జాబితాలో ఉండదని తేల్చింది. బిహార్ ఒక్కటే (10.9% మంది 60ఏళ్ల పైబడిన జనాభాతో) అన్నింటి కంటే తక్కువ వయసు రాష్ట్రంగా ఉండనుంది.

పర్యవసానం ఏమిటంటే...

జనాభా వయసులో వచ్చే మార్పులు రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వం, ఆదాయంపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి. మానవ వనరుల వల్ల ఒనగూరే ప్రయోజనాలు (డెమొగ్రాఫిక్ డివిడెండ్) తగ్గిపోవడం వల్ల ఆయా రాష్ట్రాల్లో విధాన నిర్ణయాలను ఉద్యోగ కల్పన నుంచి వయోధికులకు మద్దతు కోసం మళ్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపుల్లోనూ మార్పులు చేయాల్సి వస్తుంది.

■ యుక్తవయసు రాష్ట్రాల్లో శ్రామిక శక్తి అధికంగా ఉంటుంది కాబట్టి తగిన రీతిలో ఉద్యోగాలు కల్పిస్తే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రాబడి పెరుగుతుంది. వ్యవసాయం నుంచి పట్టణీకరణకు మళ్లే క్రమంలో పన్ను ఆదాయం పెరుగుతుంది. వయోభార రాష్ట్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా తయారవుతుంది. దీర్ఘకాల వృద్ధి క్షీణిస్తుంది. మధ్యవయసు రాష్ట్రాలు కొంత స్థిరత్వాన్ని ప్రదర్శించగలుగుతాయి.

60 ఏళ్ల పైబడిన జనాభా(శాతాల్లో) రాష్ట్రాల వారీగా..

రాష్ట్రం	2011	2016	2021	2026	2031	2036
కేరళ	12.7	14.5	16.5	18.7	20.9	22.8
తమిళనాడు	10.6	12.0	13.6	15.8	18.2	20.8
హిమాచల్‌ప్రదేశ్	10.4	11.6	13.1	14.9	17.1	19.6
పంజాబ్	10.5	11.4	12.6	14.3	16.2	18.3
ఆంధ్రప్రదేశ్	10.1	11.2	12.4	14.1	16.4	18.9
పశ్చిమబెంగాల్	8.6	9.7	11.3	13.3	15.7	18.3
మహారాష్ట్ర	10.0	10.7	11.7	13.1	15.0	17.1
ఒడిశా	9.3	10.3	11.5	13.0	15.0	17.0
కర్ణాటక	9.6	10.3	11.5	13.0	15.0	17.2
తెలంగాణ	9.2	10.1	11.0	12.5	14.5	17.1



పసుపు మిర్చి.. పసిడి ధర!

పల్నాడు జిల్లా మాచర్ల పరిసర ప్రాంతాల్లో కొందరు రైతులు పసుపు రంగు మిర్చి సాగు చేశారు. కాయ తొలుత ఆకుపచ్చగా ఉన్నా.. తర్వాత పసుపుగా మారుతోంది. ఎండినా అదే రంగులో ఉంటోంది. సాధారణ మిర్చి ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి ఇస్తే.. ఈ రకం 25 క్వింటాళ్లు వస్తోంది. దిగుబడి తక్కువైనా ధర ఎక్కువ పలుకుతోంది. సాధారణ రకం క్వింటాకు రూ.18 వేలు కాగా ఇది రూ.49,200 పలుకుతోందని ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు చెప్పారు. వీటిని రెస్టారెంట్లలో, సాస్ తయారీలో వినియోగిస్తారని తెలిపారు.

– ఈనాడు, నరసరావుపేట; న్యూస్‌టుడే, రాజుపాలెం

నంద్యాలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్



600 మెగావాట్ల ప్రాజెక్టు

● కొలిమిగుండ్ల మండలం నందిపాడులో ఏర్పాటు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో 600 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) రాబోతోంది. ఇందులో రెండు సైకిల్స్‌లో 1,200 మెగావాట్ల విద్యుత్‌ను స్టోర్ చేసి పీక్ అవర్స్‌లో ఉదయం 2 గంటలు, సాయంత్రం 2 గంటలు వాడుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇది త్వరలో కార్యరూపం దాల్చనుంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెకి) ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం కానుంది. కొలిమిగుండ్ల మండలం నందిపాడులో ఈ ప్రాజెక్టు స్థాపనకు కేంద్రం 2025 నవంబరులో అనుమతులిచ్చింది. ప్రాజెక్టు ఏర్పాటుకు 140 ఎకరాలు అవసరం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం 38.4 ఎకరాల భూమిని కేటాయించింది. మిగతా భూమిని సెకి సమకూర్చుకోనుంది. 2026 డిసెంబరు నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎప్పుడైనా విద్యుత్ సరఫరా

ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తయ్యే హరిత విద్యుత్తును సమర్థంగా వినియోగించుకోవచ్చు. పీక్ అవర్స్‌లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందించడంతో పాటు గ్రిడ్ స్థిరత్వాన్ని పెంపొందించుకోవచ్చు. ఎప్పటికప్పుడు ఉత్పత్తి చేసిన విద్యుత్తును నిల్వ చేసి, అవసరమైనప్పుడు గ్రిడ్‌కు సరఫరా చేసేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో ఎంత విద్యుదుత్పత్తి చేసినా నిల్వ చేయలేరు. సింగిల్ బ్యాటరీ ఎనర్జీ ప్రాజెక్టు ద్వారా విద్యుత్‌ను ఎప్పటికప్పుడు నిల్వ చేసుకుని అవసరమైన వేళల్లో సరఫరా చేయొచ్చు. 2024లో ఛత్తీస్‌గఢ్‌లో ఇదే తరహా ప్రాజెక్టు ప్రారంభించినా దాని సామర్థ్యం 200 మెగావాట్లు మాత్రమే. ఈ ప్రాజెక్టు ద్వారా తక్కువ ధరకు, కాలుష్యరహితంగా విద్యుత్తును అందించగలరు.

765 కేవీ టవర్ల ఏర్పాటు

ప్రాజెక్టు ఏర్పాటులో భాగంగా నందిపాడు వద్ద 765 కేవీ ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణం జరగనుంది. ప్రాజెక్టుకు చేరుకునేందుకు ప్రధాన రహదారి నుంచి అంతర్గత రహదారులను నిర్మించనున్నారు. సంస్థ ప్రతినిధులు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూమితో పాటు మరికొంత భూమిని కేటాయించాలని కోరారు. ప్రాజెక్టు గత ఏడాది అక్టోబరులో తెరపైకి రాగా కలెక్టర్ రాజకుమారి నేతృత్వంలో కొద్ది సమయంలోనే భూమి కేటాయింపులు చేశారు. సింగిల్‌విండో విధానంలో అనుమతులు తెప్పించారు. నిర్మాణ సమయంలో జిల్లాలోని వారికే ఉపాధి కల్పించనున్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి ఉపాధి లభిస్తుంది.

సివిల్ సర్వీస్ క్యాడర్ కేటాయింపుల్లో మార్పులు



● జోనల్ స్థానంలో కొత్త గ్రూపింగ్ విధానం అమల్లోకి

ఈనాడు, దిల్లీ: సివిల్ సర్వీస్ క్యాడర్ కేటాయింపు విధానాల్లో కేంద్రం సవరణలు చేసింది. అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఓఎస్ క్యాడర్ కేటాయింపులకోసం కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాలశాఖ ఇదివరకు ఉన్న జోనల్ విధానం స్థానంలో కొత్తగా గ్రూప్ విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రాలను అక్షర క్రమంలో 4 గ్రూపులుగా విభజించింది. ఈ సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులను ఇకమీదట ఈ గ్రూపులవారీగా క్యాడర్‌కు కేటాయిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించిన మీదట కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ కొత్త విధానాన్ని నోటిఫై చేసింది. దీంతో 2017 నుంచి ఉన్న జోనల్ విధానం స్థానంలో కొత్త గ్రూపు విధానం అమల్లోకి రానుంది. క్యాడర్ కేటాయింపుల్లో నిష్పాక్షికమైన, పారదర్శకతను పాటించడం కోసం అన్ని రాష్ట్రాల క్యాడర్, జాయింట్ క్యాడర్లను విభజించినట్లు వెల్లడించింది. అభ్యర్థుల ప్రాధాన్యం, ర్యాంకు, కేటగిరీ, ఆయారాష్ట్రాల్లో ఉన్న ఖాళీల ఆధారంగా సాధారణంగా క్యాడర్ కేటాయింపును చేస్తారు. ఇదివరకు రాష్ట్రాలను ప్రాంతాలవారీగా జోన్‌లుగా విభజించగా, ఇప్పుడు ఆ విధానాన్ని పక్కనపెట్టి అక్షరక్రమంలో గ్రూపింగ్‌చేశారు.

తీరనున్న కొరత: ఇదివరకు అభ్యర్థులు కొన్ని పాపులర్ క్యాడర్‌కు ప్రాధాన్యం ఇచ్చేవారని, దాని వల్ల మిగతా ప్రాంతాలు కొరతను ఎదుర్కొనేవన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ఈ కొత్త విధానంతో ఆ లోపం కొంతవరకు తీరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ సమగ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ కొత్త క్యాడర్ కేటాయింపు విధానాన్ని తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. దీనివల్ల అధికారులు విభిన్న సంస్కృతి, భాషలు, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి వీలవుతుందని, అది వారిని మరింత బలంగా మార్చుతుందన్న విశ్లేషణ ఉంది.

క్యాడర్ కేటాయింపులకు కొత్తగా ఏర్పాటుచేసిన గ్రూపులు

గ్రూప్–1: ఏజీఎంయూటీ, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మేఘాలయ, బిహార్, ఛత్తీస్‌గఢ్

గ్రూప్–2: గుజరాత్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్

గ్రూప్–3: మహారాష్ట్ర, మణిపుర్, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు

గ్రూప్–4: తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్

పాత జోనల్ విధానం ఎలా ఉంది?

జోన్–1: ఏజీఎంయూటీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, రాజస్థాన్, హరియాణా

జోన్–2: ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, ఒడిశా

జోన్–3: గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్

జోన్–4: పశ్చిమబెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయ, మణిపుర్, నాగాలాండ్, త్రిపుర

జోన్–5: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్. వేదికపై కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ కిరణ్మయి

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

● జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

అవనిగడ్డ, న్యూస్‌టుడే : మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించడానికి న్యాయవాదులు సహకరించాలని, ఈ విధానంపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ సూచించారు. శనివారం జరిగిన కృష్ణాజిల్లా అవనిగడ్డ కోర్టు శతాబ్ది ఉత్సవంలో ఆయన.. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాల కృష్ణారావు, జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ కిరణ్మయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు వేడుకల శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మెగా జాతీయ లోక్ అదాలత్‌లో రాష్ట్రంలో 3 లక్షల కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు చెప్పారు. జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ న్యాయస్థానాల ద్వారా సామాన్యులకు సత్వర న్యాయం అందాలని తెలిపారు. జస్టిస్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో నిందితులను శిక్షించడమే కాకుండా వారిలో పరివర్తన తీసుకురావాలని చెప్పారు. జస్టిస్ గోపాలకృష్ణారావు మాట్లాడుతూ తాను అవనిగడ్డలో న్యాయవాదిగా పనిచేసి.. హైకోర్టు న్యాయమూర్తిగా ఈ రోజు ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. జస్టిస్ కిరణ్మయి మాట్లాడుతూ.. రవాణా సౌకర్యం లేని రోజుల్లో అవనిగడ్డలో కోర్టు ఏర్పాటు కావడం విశేషమన్నారు. కోర్టు ప్రాంగణంలో రెండు మంచి నీటి పథకాలను హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించారు. అవనిగడ్డ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సనకా రఘురామ్ ప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ప్రియుడి భార్యపై వైరస్ ఇంజెక్షన్‌తో దాడి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రియుడు దూరం పెడుతున్నాడని ఆయన భార్యపై ప్రాణాంతక ఇంజెక్షన్‌తో దాడి చేసింది ఓ మహిళ. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన కర్నూలులో చోటుచేసుకుంది. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, సీఐ శేషయ్య శనివారం తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నగరానికి చెందిన ఓ వైద్యుడు, వసుంధర అనే స్థానిక మహిళతో సన్నిహితంగా ఉండేవాడు. కొన్నాళ్ల కిందట వైద్యుడికి వివాహం కావడంతో వసుంధరను నిర్లక్ష్యం చేశాడు. దీంతో ఆమె వైద్యుడి కుటుంబంపై కక్ష పెంచుకుంది. ఈనెల 9న వైద్యుడి భార్య ద్విచక్రవాహనంపై బయటికి వెళ్లగా.. ఆమె వాహనంపైనుంచి కిందపడిపోయేలా చేసింది. అలా రోడ్డుపై వైద్యుడి భార్య పడిపోగానే సాయం చేస్తున్నట్లు నటించిన ముగ్గురు వ్యక్తులు ఆమెను ఆటోలో ఎక్కించారు. అప్పటికే ఆటోలో ఉన్న వసుంధర ఆమెపై వైరస్ ఇంజెక్షన్‌తో దాడికి దిగారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో వారంతా అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలు వెంటనే ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవడంతో ప్రమాదం తప్పింది. బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా పుటేజీ, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా వసుంధర, ఆమెకు సహకరించిన మరో ముగ్గురిని అరెస్టు చేశారు.

ప్రియుడి కుటుంబంపై పెట్రోలుతో దాడి

చేబ్రోలు, న్యూస్‌టుడే: ప్రియుడిపై కోపంతో అతని కటుంబసభ్యులపై ఓ మహిళ పెట్రోలు పోసి నిప్పంటించారు. ఈ ఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని సుద్దపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సుద్దపల్లికి చెందిన మల్లేష్‌కు తెనాలికి చెందిన దుర్గ అనే మహిళతో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. అప్పటికే దుర్గకు వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీనిపై శనివారం తెనాలిలో పంచాయితీ పెట్టారు. దీంతో కోపం పెంచుకున్న దుర్గ సుద్దపల్లికి చేరుకుని.. మల్లేష్ భార్యతో వివాదానికి దిగారు. ఆమెపై, కుమారుడిపై, మల్లేష్ తల్లిపై పెట్రోలు పోసి.. తెనాలిలో ఉన్న మల్లేష్‌కు ఫోన్ చేసి బెదిరిస్తూ నిప్పంటించారు. ఈ క్రమంలో దుర్గ శరీరంపైనా పెట్రోలు పడడంతో ఆమెకూ నిప్పంటుకుంది. మంటలను అదుపుచేసేందుకు వచ్చిన ఆరుగురు స్థానికులకూ గాయాలయ్యాయి. బాధితులందరినీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడిచేసిన దుర్గతో పాటు తీవ్రంగా గాయపడినవారిని వడ్లమూడిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



ఉండ్రాజవరంలో నూతనంగా నిర్మించిన మైత్రేయ బుద్ధవిహార్

బుద్ధం శరణం గచ్ఛామి..

● ఉండ్రాజవరంలో బుద్ధ విహార్

● నేడు కలశ ప్రతిష్ఠ

పదకొండేళ్ల క్రితం తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరంలో ఓ బౌద్ధ భిక్షువు ఏర్పాటు చేసిన బౌద్ధ ధర్మపీఠం. . నేడు మైత్రేయ బుద్ధ విహార్‌గా రూపుదిద్దుకొని సేవా పథంలో ముందుకు సాగుతోంది. బౌద్ధ ధర్మపీఠం ద్వారా ఇన్నాళ్లు విద్య, వైద్యంలో సేవ, పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. చిన్నారులకు నృత్యం, యోగ, ధ్యానం, కరాటే, వక్తృత్వం, చిత్రలేఖనంలోనూ శిక్షణ ఇచ్చారు. కొత్తగా నిర్మించిన విహార్‌లో రాజ్యాంగ పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలు, సైన్సును పోలిన బౌద్ధధర్మాలను ప్రజలకు వివరించనున్నట్లు బౌద్ధ ధర్మపీఠాధిపతి అనాలయో తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో ఉన్న మైత్రేయ బుద్ధ విహార్‌కు ఈ నెల 25న కలశ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఆ రోజు తణుకు నుంచి ఉండ్రాజవరంలోని విహార్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు అనాలయో తెలిపారు. ఇందుకు దేశంలోని పలు ప్రాంతాల బౌద్ధ భిక్షువులు హాజరుకానున్నారని వివరించారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం



బుద్ధవిహార్‌లో బుద్ధుడి ప్రతిమ



రథసప్తమి సందర్భంగా పుష్పాలు, విద్యుత్ దీపాల అలంకరణతో తిరుమల శ్రీవారి ఆలయం

తిరుమలేశుడి వాకిట రథసప్తమి కిటకిట

- నేడు ఏడు వాహనాలపై శ్రీవారి విహారం

తిరుమల, న్యూస్‌టుడే: సూర్య జయంతి సందర్భంగా ఆదివారం తిరుమలలో రథసప్తమి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి తితిదే ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆదివారం సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు శ్రీమలయప్పస్వామివారు ఏడు విభిన్న వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అనుగ్రహించనున్నారు. ఈ వేడుక నేపథ్యంలో ఆలయ మహాద్వారం నుంచి స్వామివారి సన్నిధి వరకు వర్ణరంజిత పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇందుకు పది టన్నుల సంప్రదాయ పుష్పాలు వినియోగించారు. స్వామివారు విహరించనున్న తిరువీధుల్లో సకల ఏర్పాట్లూ చేశారు. మూలమూర్తికి తెల్లవారుజామున నిత్యకైంకర్యాలు పూర్తయ్యాక ఉదయం 5.30 గంటలకు మలయప్ప స్వామివారు ఆలయం నుంచి వాహన మండపానికి చేరుకుంటారు. అక్కడ విశేష సమర్పణ అనంతరం సూర్యోదయానికి ముందే సర్కారు హారతితో వాహనసేవ ప్రారంభమవుతుంది. ఉప బ్రహ్మోత్సవాలుగా పిలిచే ఈ వేడుకలో ఒకేరోజు స్వామివారు ఏడు ప్రధాన వాహనాలపై విహరిస్తారు. ఉదయత్పూర్వం సూర్యప్రభ సేవతో వాహనసేవలు మొదలై రాత్రి చంద్రప్రభ సేవతో వాహనసేవలు ముగుస్తాయి.



ఊంజల్ సేవ సమయంలో గ్యాలరీల బయట వేచి ఉన్న భక్తులు

వరుస సెలవుల కారణంగా తిరుమలకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్‌ఎస్‌డీ) టోకెన్లు జారీ చేయకపోవడంతో భక్తులు నేరుగా తిరుమలకు వచ్చి క్యూలైన్లలోకి ప్రవేశిస్తున్నారు. శనివారం సాయంత్రానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి, రింగురోడ్డులోని సేవాసదన్ వరకు వరుసల్లో వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి 16 గంటలు పడుతోంది.

ఏఐతో నిపుణులుగా మారే అవకాశం

- విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ముగిసిన ఏపీ స్పేస్ టెక్ సమిట్-26

పొన్నూరు, న్యూస్‌టుడే: 'ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని కాదు అపోహ. ఏఐ సాధ్యాలను నేర్చుకుంటే ఉన్నతస్థాయి నిపుణులుగా మారే అవకాశం ఉంది' అని హైదరాబాద్‌లోని ఏపీ ఎంఎస్‌సీఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఏపీ స్పేస్‌టెక్ సమిట్-26, సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 'ఏపీలో అంతరిక్ష సాంకేతిక రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సమిట్ నిర్వహించడం అభినందనీయం. ఏపీ స్పేస్ అకాడమీ, స్పేస్ సైన్స్ అకాడమీ, భారతీయ విశ్వవిద్యాలయాలతో కలిసి నెక్స్ట్ జెన్ టెక్నాలజీల్లో భాగస్వాములు కావాలి. రైతులకు ఉపయోగపడేలా సమాచార సేకరణ, డేటా ప్రాసెసింగ్, భద్రతా కమ్యూనికేషన్ సాంకేతికతలను అభివృద్ధి చేయాలి' అని అభిప్రాయపడ్డారు. 'ఏపీని క్వాంటమ్ టెక్నాలజీలో అగ్రగామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య సమన్వయం పెంచి ఏపీని క్వాంటమ్ ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడమే లక్ష్యం' అని ఏపీ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. 'ప్రతి విద్యార్థి తనకు తానే ఒక చాట్ జీపీటీని తయారుచేసుకునే స్థాయికి ఎదగాలి. విద్యార్థులు ఏఐని భయపడాల్సిన అవసరం లేదు. అది మనకు సాధనం మాత్రమే. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అని ఐబీఎం క్వాంటమ్ ఇనిషియేటివ్ లీడ్ డాక్టర్ ఎల్.వెంకటసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ.. 'అంతరిక్ష పరిశోధనలే ఆధునిక జీవనానికి ఆధారం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలి. వచ్చే ఏడాదికి విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులు చిన్న ఉపగ్రహాన్ని నిర్మించే ప్రక్రియలో భాగస్వాములు కావాలి' అని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ఏపీఎంఎస్‌సీఎస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ

ఐఏఎస్, ఐపీఎస్ జంట.. నిరాడంబరంగా వివాహం

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మకమైన ఐఏఎస్, ఐపీఎస్ హోదాలో ఉండి నిరాడంబరంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకుంది ఓ జంట. తెలంగాణలోని చౌటుప్పల్‌లో ఉన్న కార్యాలయంలో శనివారం వధూవరులు ప్రమాణం చేసి దండలు మార్చుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ సందీప్ వీరి పెళ్లిని రిజిస్టరు చేసి, ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. వధువు... యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ శివారు లింగారెడ్డిగూడేనికి చెందిన సురకంటి శేషాద్రినిరెడ్డి. 2020లో సివిల్ సర్వీసు పరీక్షలో 401 ర్యాంకుతో ఐపీఎస్ సాధించి తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. వరుడు.. ఏపీలోని కడప జిల్లా చెన్నూరు ఓల్డ్ గాంధీనగర్‌కు చెందిన నెలటూరు శ్రీకాంత్‌రెడ్డి. ఆయన 2025 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ముస్సోరిలో శిక్షణ పొందుతున్నారు. వీరికి పెద్దలు వివాహం కుదిర్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మధ్యాహ్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి దండలు మార్చుకున్నారు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహం చేసుకున్న శ్రీకాంత్‌రెడ్డి, శేషాద్రినిరెడ్డి

30న జేఎన్‌టీయూకేలో 'హలో లోకేశ్'

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జేఎన్‌టీయూలో 30న హలో లోకేశ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ క్యాంపస్‌కు తొలిసారి వస్తున్న మంత్రి లోకేశ్.. విద్యార్థులతో నేరుగా మాట్లాడనున్నారు. హాస్టల్ భవన సముదాయాన్ని ప్రారంభించనున్నారు. అధికారులు శనివారం జేఎన్‌టీయూ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీ సానా సతీష్‌బాబు, జేఎన్‌టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్‌లతో చర్చించారు.



జూనియర్లతో సంభాషణ ఎలా ఉండాలంటే..

- మీకన్నా ఎక్కువ జ్ఞానం ఉన్నవారిని కలిసినప్పుడు- వారిని అధ్యయనం చేయండి.
- పెద్దలతో మాట్లాడుతున్నప్పుడు- వారిని గౌరవించండి.
- జూనియర్లతో సంభాషిస్తున్నప్పుడు- వారిలో స్ఫూర్తి నింపండి.
- పిల్లలతో ముచ్చటిస్తున్నప్పుడు- వారిలో జిజ్ఞాసను పెంచే ప్రయత్నం చేయండి.
- చిత్తశుద్ధితో కష్టపడే వ్యక్తులను కలిసినప్పుడు- వారికి ప్రోత్సాహం అందించండి.

– లిల్లీ, లైఫ్ కోచ్

పోలవరానికి రూ.5,929 కోట్ల నిధులివ్వండి

- స్పర్శ్ తరహాలోకి మార్చి ఇస్తామన్న కేంద్రం
- సింగిల్ నోడల్ ఏజెన్సీ ద్వారానే కావాలన్న రాష్ట్రం
- తాజాగా లేఖ.. త్వరలో నిధుల విడుదల!

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం కేటాయించిన నిధుల్లో మూడో విడత అడ్వాన్సుగా రూ.5,929 కోట్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు కేంద్రాన్ని ఇప్పటికే కోరారు. ఈ అంశం కేంద్ర జలశక్తి, ఆర్థిక శాఖల పరిశీలనలో ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో కేంద్రం ఇప్పటికే రెండు విడతలుగా అడ్వాన్సు నిధులిచ్చింది. వీటిలో రాష్ట్రం 80% పైగా ఖర్చు చేసింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు మూడో విడత ఇవ్వాలంటూ లేఖ రాసింది. ఈ నిధులిచ్చే విధానాన్ని మార్చాలని కేంద్ర అధికారులు తొలుత భావించారు. ఇప్పుడు ఆ విధానం మారిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, ఇప్పటి వరకు ఇస్తున్న సింగిల్ నోడల్ ఖాతా విధానాన్నే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ అధికారులు తాజాగా లేఖ రాశారు. దీంతో మూడో విడత అడ్వాన్సు నిధులు కేంద్రం నుంచి రానున్నాయి.

'సింగిల్ నోడల్' కాకుంటే ఇబ్బంది

కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఆర్థికశాఖ రెండు విధానాల్లో (స్పర్శ్ విధానం, సింగిల్ నోడల్ ఏజెన్సీ) నిధులు విడుదల చేస్తోంది. ఇంతవరకు పోలవరం ప్రాజెక్టుకు సింగిల్ నోడల్ ఖాతా విధానంలోనే నిధులిచ్చింది. ఇప్పుడు దీన్ని మార్చి స్పర్శ్ నమూనాలో విడుదల చేస్తామని పేర్కొంది. ఇందుకు పోలవరం, రాష్ట్ర ఆర్థిక శాఖల అధికారులు సమ్మతించలేదు. ఈ ఏడాది జూన్ వరకు పోలవరంలో పనులు ముమ్మరంగా సాగనున్నాయని, నిధులు అత్యవసరమని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కేంద్రానికి శనివారం లేఖ రాశారు. ఇప్పుడు స్పర్శ్ విధానానికి మారిస్తే ఆ విధివిధానాలన్నీ పూర్తి చేసేందుకు సమయం పడుతుందని, అవసరమైనప్పుడు నిధుల లభ్యత లేకుండా పోతుందని లేఖలో పేర్కొన్నారు.

ఏమిటీ సింగిల్ నోడల్ ఏజెన్సీ విధానం?

ఈ విధానంలో కేంద్రం తొలుత నిధులు కేటాయించి, తర్వాత వాటిని రాష్ట్రానికి విడుదల చేస్తుంది. ఈ పథకం అమలు చేసే ఏజెన్సీ జీరో బ్యాలెన్సు నిధులతో సింగిల్ నోడల్ ఖాతా నిర్వహిస్తుంది. ఎప్పుడు బిల్లు చెల్లించాల్సి వస్తే అప్పుడు ఆ ఖాతాకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. బడ్జెట్ విడుదల ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత చేసిన పనికి బిల్లులు సమర్పిస్తారు. అప్పుడు ఆ పథకం నిర్వహించే మేనేజర్ సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు నిధులు విడుదల చేస్తారు.

స్పర్శ్ విధానంలో ఇలా..

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు తాజాగా స్పర్శ్ విధానంలో నిధులిస్తోంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర వాటా నిధులు ఒకేసారి సంబంధిత పథకం అమలు చేసే ప్రభుత్వ శాఖకు చేరతాయి. ఆ ప్రభుత్వ శాఖే సంబంధిత డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారులకు నిధులు పంపిణీ చేస్తుంది.

పోలవరం ప్రాజెక్టుపై నిధుల ఖర్చు (అంకెలు రూ.కోట్లలో)

2025 డిసెంబర్ 31 వరకు చేసిన ఖర్చు: 26,236.18
జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత చేసింది: 21,505.47
ఇంత వరకు కేంద్రం ఇచ్చిన మొత్తం నిధులు: 20,658.67
రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటయ్యాక అడ్వాన్సుగా ఇచ్చినవి: 5,052.71
ఇందులో ఖర్చు చేసినవి: 4,318.96
కేంద్ర తాజా బడ్జెట్ కేటాయింపులు: 5,936
తాజాగా కేంద్రాన్ని అడిగిన అడ్వాన్సు: 5,929

ఆ మూడు రాష్ట్రాల్లో ఎన్డీయేదే అధికారం

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- ప్రధాని రోజ్‌గార్ మేళాలో... ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాల అందజేత

తాటిచెట్లపాలెం(విశాఖపట్నం), న్యూస్‌టుడే: త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలోకి వస్తుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళాలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 392 మందికి విశాఖ నగరం సాలగ్రామపురంలోని సాగరమాల ఆడిటోరియంలో శనివారం నియామక పత్రాలను ఆయన అందించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీకి సినీ తారలను మించి స్టార్ ఇమేజీ ఉందని, తమిళనాడులో పొత్తులపై పార్టీ అధిష్ఠానం కొద్దిరోజుల్లో మాట్లాడుతుందన్నారు. 'విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆందోళనను అర్థం చేసుకున్నాం కాబట్టే రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్ మేరకు ప్యాకేజీ ఇచ్చాం. దీని వెనుక కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల కృషి ఉంది. స్టీల్‌ప్లాంట్‌పై ఆర్థిక భారం తొలగించాలనే ఆలోచనతోనే సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తగ్గించారు. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. వచ్చే నెల 4న ఉక్కుశాఖ కార్యదర్శి విశాఖ వచ్చి పది రోజులు ఇక్కడే ఉండి ప్లాంట్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు' అని శ్రీనివాసవర్మ వివరించారు. సమావేశంలో సీఐఎస్ఎఫ్ ఐజీ శరవణన్, డీఐజీ రాఘవేంద్రకుమార్, పోర్టు సెక్రటరీ రమణమూర్తి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ. చిత్రంలో సీఐఎస్ఎఫ్ అధికారులు తదితరులు

పవన్ తనయుడు అకీరానందన్‌పై ఏఐ వీడియో.. వ్యక్తి అరెస్ట్

సర్పవరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనయుడు అకీరానందన్‌పై ఏఐ వీడియో రూపొందించిన వ్యక్తిని కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ బి.పెద్దిరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన డా.మద్దినేని వెంకటరమణ కొంత కాలంగా వైద్య వృత్తికి దూరంగా ఉంటూ ఏఐతో వీడియోలు తయారు చేస్తున్నాడు. అనుమతి లేకుండా ఏఐతో అకీరానందన్‌పై లవ్ స్టోరీ పేరుతో సినిమా తీసి యూట్యూబ్‌లో విడుదల చేశాడు. దీనిపై జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తాటికాయల వీరబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటరమణను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అనుమతులు లేకుండా ఏఐతో ప్రముఖుల చిత్రాలు, గుర్తింపులు ఉపయోగించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు గుర్తించామని, దీనిలో ఇంకెవరిదైనా ప్రమేయం ఉందా అని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అమరావతిలో జ్యోతిరావు ఫులే స్మృతివనం

మంత్రి సవిత వెల్లడి

ఈనాడు, అమరావతి: అమరావతిలో మహాత్మా జ్యోతిరావు ఫులే స్మృతివనం నిర్మించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. ఈ ఏప్రిల్ 11న ఫులే ద్విశత జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఫులే జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. విజయవాడలోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల నేతలతో సవిత శనివారం సమావేశమయ్యారు. బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను సవిత వివరించారు. సంఘాల వారీగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. "పాలనలో మహిళలు, బీసీల్ని భాగస్వాములు చేసిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన స్ఫూర్తితో చంద్రబాబు పాలన చేస్తున్నారు. బీసీల కుల వృత్తిదారులకు భరోసా ఇచ్చేలా ఆదరణ, ఆదరణ 2.0 అమలు చేశారు. త్వరలో రూ.1,000 కోట్లతో ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేయనున్నాం. అమరావతిలో ఐదెకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తాం. దీనికి జ్యోతిరావు ఫులే పేరు పెడతాం. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవనాలు నిర్మిస్తాం. బీసీ స్టడీ సర్కిళ్లు లేని జిల్లాల్లో కొత్తవి ఏర్పాటు చేస్తాం" అని సవిత వివరించారు. రాష్ట్రంలో కులగణనకు త్వరలో డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎన్టీ కులాలకు గుర్తింపు కార్డులు అందజేయాలని మంత్రిని బీసీ సంఘాల ప్రతినిధులు కోరారు. సమావేశంలో యరసాని నాగేశ్వరరావు, వై.నూకాలమ్మ, ఎల్.వెంగళరావు, ఎ.ఆదిశేషు, వీరవల్లి శ్రీనివాసులు, బత్తుల రమణయ్య, పి.జయప్రకాశ్, ఎ.వరప్రసాద్ యాదవ్, బి.వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

1,500 మీటర్ల పొడవైన.. మువ్వన్నెల జెండా ప్రదర్శన

రాజానగరం, న్యూస్‌టుడే: వందేమాతర గేయం భారతీయుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, భరతమాత బానిస సంకెళ్లను తెంచేందుకు ఊతమిచ్చిందని సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలోని నన్నయ విశ్వవిద్యాలయంలో శనివారం 1,500 మీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారు. వైస్ ఛాన్సలర్ ఎస్.ప్రసన్నశ్రీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 20 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ జెండాను విశాఖపట్నానికి చెందిన స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు బసవ కృష్ణమూర్తి సమకూర్చారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రిజిస్ట్రార్ కేవీ స్వామి పాల్గొన్నారు.



నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రదర్శించిన భారీ జాతీయ జెండా



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆన్‌లైన్‌లో ఇంటర్ ప్రాక్టికల్స్ హాల్‌టికెట్లు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. విద్యార్థి మొదటి సంవత్సరం హాల్‌టికెట్ నంబర్, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ నమోదుచేసి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. 'మనమిత్ర' వాట్సప్ యాప్ నంబరు 9552300009 ద్వారానూ విద్యార్థులు హాల్‌టికెట్లు పొందవచ్చు. పై వాట్సప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపి, 'ఎడ్యుకేషన్ సర్వీసెస్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తమ కళాశాలల లాగిన్ నుంచి సైతం హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్‌టికెట్లపై ప్రిన్సిపల్ సంతకం, కళాశాల స్టాంప్ అవసరం లేదు. జనరల్ విభాగాల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి ఒకటి నుంచి 10 వరకు రోజుకు రెండు విడతల్లో నిర్వహించనున్నారు.

అదృశ్యమైన కానిస్టేబుల్ తొలగింపు చెల్లదు

- కుటుంబ సభ్యులు కేసు పెట్టలేదంటూ సర్వీసు ప్రయోజనాలు నిరాకరించరాదని తెలంగాణ హైకోర్టు తీర్పు
- ఇలాగైతే ఎవరూ సీఆర్‌పీఎఫ్‌కు పిల్లలను పంపడానికి ఆసక్తి చూపరని వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తూ కాలు కోల్పోవడంతో వృత్తిపరమైన శిక్షణ పొందుతూ అదృశ్యమైన కానిస్టేబుల్ ఎం.శ్రీకాంత్‌ను శాఖాపరమైన విచారణ జరిపి తొలగించడం చెల్లదని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. అదృశ్యమైన కుమారుడి ఆచూకీ కోసం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేయలేదన్న కారణంగా కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు పెన్షన్ ప్రయోజనాలను నిరాకరించడం సరికాదంది. అదృశ్యమైన ఉద్యోగి పట్ల అధికారులు ఇలాంటి వైఖరిని అనుసరిస్తే భవిష్యత్తులో తల్లిదండ్రులెవరూ తమ పిల్లలను సీఆర్‌పీఎఫ్‌కు పంపడానికి ఆసక్తి చూపరని వ్యాఖ్యానించింది. తన కుమారుడు కనిపించలేదన్న కారణంగా సర్వీసు నుంచి తొలగించడంతోపాటు పెన్షన్ ప్రయోజనాలను కల్పించకపోవడాన్ని సవాలు చేస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా రొంపిచర్లకు చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ తండ్రి ఎం.అప్పారావు 2021లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది. రంగారెడ్డి జిల్లాలో శ్రీకాంత్ సర్వీసులో ఉండగా 2011లో కాలు కోల్పోవడంతో కంప్యూటర్ కోర్సు నిమిత్తం సీఆర్‌పీఎఫ్ దిల్లీలోని కేంద్రానికి 2015లో పంపింది. 2015 జూన్ 1 నుంచి అతను కనిపించకపోవడంతో దిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే సమయంలో రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్‌కు సమాచారం ఇవ్వగా, అది కోర్టుకు ఫిర్యాదు చేయడంతో అరెస్టు వారెంట్ జారీ అయింది. గుంటూరు ఎస్పీకి వారెంట్‌లను పంపగా అతని ఆచూకీ దొరకలేదని నివేదిక సమర్పించారు. ఇదే సమయంలో శ్రీకాంత్‌పై శాఖాపరమైన విచారణ చేపట్టి నోటీసులకు స్పందించకపోవడంతో తొలగిస్తూ 2017లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు కుటుంబానికి సర్వీసు ప్రయోజనాలు కల్పించకపోవడంపై తండ్రి హైకోర్టును ఆశ్రయించారు. సీఆర్‌పీఎఫ్ తీరును తప్పుబట్టిన హైకోర్టు క్యాంపులో ఉండగా శ్రీకాంత్ అదృశ్యమైన నేపథ్యంలో మీ బాధ్యత నుంచి తప్పించుకోలేరంది. కానిస్టేబుల్‌ను పదేళ్ల క్రితం అదృశ్యమైన వ్యక్తిగా పరిగణించి సర్వీసు, పెన్షన్ ప్రయోజనాలను కల్పించడానికి ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

గురుకుల విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదిగాం

- తెలంగాణ రాష్ట్ర సీఎస్ రామకృష్ణారావు
- వేడుకగా 'అనంత ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానం


ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు. చిత్రంలో సాహితీ గగన్‌మహల్ ట్రస్టు అధ్యక్షుడు జూటూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ డీజీపీ అరవిందరావు, ఎండియా పార్టనర్స్ సంస్థ ఎండీ సతీష్ అంధ్ర, ఆదాయ పన్ను హైదరాబాద్ విభాగం విశ్రాంత చీఫ్ కమిషనర్ నర్సింహప్ప, ఐఎంఐ మొబైల్ ఫౌండర్ విశ్వనాథ ఎల్లూరి, తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు

ఈనాడు, పుట్టపర్తి: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో సీటు రావడం తమ జీవితాలను మలుపు తిప్పిందని, విద్యతోనే తాము ఉన్నత స్థానాలకు ఎదిగామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పేర్కొన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో 'అనంత ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న 21 మంది ప్రతిభావంతులకు సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు జూటూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ కె.అరవిందరావుతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రొఫెసర్ వై.నరహరి, డాక్టర్ గురుకులం గణపతిరెడ్డి, ఐఎంఐ మొబైల్ ఫౌండర్ విశ్వనాథ్ ఎల్లూరి, డాక్టర్ జీకే అనంతసురేశ్, డాక్టర్ ఎల్.జయంతిరెడ్డి, కె.కళ్యాణి, డాక్టర్ చింత చైతన్యకుమార్‌రెడ్డి, డి.చట్టనాథన్, మురళి బుక్కపట్నం, కేవీ రమణ, యు.గోపాల్, ఆర్.రామకృష్ణ గుప్తా, బి.అనూష, ఎం.అనూష, పెద్దక్క, డి.ఉపేంద్ర, కుంచె తిప్పేస్వామి, కె.ఆదినారాయణలకు పురస్కారాలు ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి సినీనటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ 'ఈ నేల బలం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అంచలంచెలుగా ఎదిగాను. ఐఏఎస్ సాధించి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశాను. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదకొండున్నరేళ్లు ఆర్థిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించాను. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసే అవకాశం దక్కింద'ని గుర్తు చేసుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులను న్యాయమూర్తి అభినందించారు.

వర్సిటీల నిధులు ఎస్‌ఎఫ్‌సీలో పెట్టండి

విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యామండలికి చెందిన నిధుల్లో కొంత మొత్తాన్ని రాష్ట్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ)లో డిపాజిట్ చేయాలని ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల వద్ద ఉన్న నిధుల్లో కొంత మొత్తాన్ని జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్లు చేయగా.. మరికొంత ఖాతాల్లో ఉన్నాయి. వర్సిటీల రోజువారీ వ్యవహారాలకు సరిపడా నిధులు ఉంచుకొని, మిగతావాటిని రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎస్‌ఎఫ్‌సీలో పెట్టాలని అధికారులు ఆదేశించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి ఉన్నత విద్యామండలి, నాగార్జున విశ్వవిద్యాలయంతో పాటు మరికొన్ని వర్సిటీలకు ఫోన్లు చేసి, డిపాజిట్ చేయాలని సూచించారు. జాతీయ బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీని ఎస్ఎఫ్‌సీ ఇస్తుందని, ప్రతినెలా వడ్డీ మొత్తాన్ని బ్యాంకు ఖాతాకు జమచేస్తుందని సూచించారు. కొన్ని విశ్వవిద్యాలయాలు దీనిపై ఆసక్తి చూపట్లేదు. వడ్డీ ఎక్కువగా వస్తున్నా వర్సిటీకి అవసరమైనప్పుడు కార్పొరేషన్ వెంటనే తిరిగి ఇస్తుందా.. లేదా? అనేదానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. వైకాపా హయాంలో విశ్వవిద్యాలయాలు, ఇంటర్మీడియట్ బోర్డుకు చెందిన నిధులు రూ.608 కోట్ల వరకు ఎస్‌ఎఫ్‌సీలో డిపాజిట్ చేశారు. వీటికి కార్పొరేషన్ వడ్డీని జమచేస్తోంది. ఇంటర్మీడియట్ బోర్డు రూ.100 కోట్లు, ఉన్నత విద్యామండలి రూ.48 కోట్లు, కాకినాడ, అనంతపురం జేఎన్‌టీయూలు, ఆంధ్ర, ఆదికవి నన్నయ వర్సిటీలు రూ.10 కోట్ల చొప్పున డిపాజిట్ చేశాయి. ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ సుమారు రూ.400 కోట్ల వరకు డిపాజిట్ చేసింది.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఒకరి మృతి.. ఆరుగురికి గాయాలు
- కాకినాడ జిల్లాలో దుర్ఘటన


సుంగ రమేష్


ప్రమాదానికి గురైన బస్సు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం తప్పింది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తున్న ఫ్లిక్స్ ట్రావెల్స్ బస్సు శనివారం తెల్లవారుజాముున రెండు గంటల సమయంలో తుని మండలం వి.కొత్తూరు జాతీయ రహదారి పరిధిలో ఇనుపరాడ్ల లోడుతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయవాడకు చెందిన బస్సు సహ డ్రైవర్ సుంగ రమేష్(45) అక్కడికక్కడే మృతి చెందారు. విజయవాడ గన్నవరానికి చెందిన బస్సు ప్రధాన డ్రైవర్ వెంకటసాయిగణేష్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. హైవే అథారిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తుని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. చలిలో రోడ్డుపై తీవ్ర అవస్థలు పడుతున్న మిగిలిన ప్రయాణికులను వివిధ ట్రావెల్స్ బస్సుల్లో ఎక్కించి పంపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని రూరల్ ఎస్సై కృష్ణామాచారి తెలిపారు.

జోగి ర్యాలీపై కేసు నమోదు

- ట్రాఫిక్ అవాంతరం సృష్టించినందుకు జోగి రమేష్ అనుచరులపై ఎఫ్ఐఆర్

ఈనాడు, అమరావతి: వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము బెయిల్‌పై విడుదలైన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి తీసిన ర్యాలీపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుచరులను సమీకరించి, ప్రదర్శన నిర్వహించిన జోగి రమేష్ బంధువు స్వామి, అతనికి సహకరించిన నాగిరెడ్డి, రాంబాబు మరికొందరిని నిందితులుగా చేర్చారు. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి సోదరులు శుక్రవారం రాత్రి విజయవాడ కారాగారం నుంచి విడుదలయ్యారు. ఈ క్రమంలో భారీ వాహన శ్రేణితో, అనుచరుల ర్యాలీ మధ్య ఇబ్రహీంపట్నంలోని ఇంటికి బయలుదేరారు. దీంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. 'ర్యాలీలో బాణసంచా కాల్చడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ప్రదర్శనకు ముందస్తు అనుమతి తీసుకోకపోగా.. డీజే పెట్టేందుకు చూడగా అడ్డుకున్నాం. ర్యాలీ వద్దని జోగి సోదరులకు సూచించినా... వినకుండా చులకనగా మాట్లాడారు' అని పోలీసులు తెలిపారు. ర్యాలీ సమయంలో ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సురేష్ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ 126 (2), 292, రెడ్‌విత్ 189 (2) సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరికొందరిని నిందితులుగా చేర్చే అవకాశం ఉంది.



వాదనలో గెలవడం కన్నా బంధాలు ముఖ్యం

ప్రతి బంధంలోనూ అప్పుడప్పుడు అభిప్రాయ భేదాలు రావడం సహజమే. అయితే ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అని వాదించుకోవడం వల్ల అవి సమసిపోవు. వాదనలో గెలవడం కన్నా బంధాన్ని కాపాడుకోవడం ముఖ్యమని గ్రహించాలి. మనం చేసిందే సరైనది అని నిరూపించుకుంటే మన అహం సంతృప్తి చెందుతుందేమో కానీ, వ్యక్తులకు విలువ ఇస్తేనే బంధాలు నిలుస్తాయి.

– గౌర్ గోపాల్ దాస్, ఆధ్యాత్మికవేత్త

EENADU Vol: 52, Issue: 165 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

సంక్రాంతి బరిలో మరోసారి!


వెంకటేశ్


కథానాయకుడు వెంకటేశ్.. దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి సంక్రాంతి బరిలో వినోదాలు పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఇద్దరి కలయికలో గతేడాది పండక్కి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీస్ బరిలో భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ పండగ మ్యాజిక్‌ను పునరావృతం చేసేందుకు వాళ్లిద్దరూ మరోసారి చేతులు కలిపినట్లు సమాచారం. 'మన శంకరవరప్రసాద్‌గారు' విజయం తర్వాత అనిల్ తెరకెక్కించనున్న చిత్రమిది. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని.. ఈసారి మరో సరికొత్త వినోదాత్మక కథతో వెంకీ - అనిల్‌ల కాంబో అలరించనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇది జూన్ నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశమున్నదని తెలుస్తోంది. 2027 సంక్రాంతి లక్ష్యంగా ముస్తాబు కానున్న ఈ సినిమాని సాహు గారపాటి నిర్మించనున్నట్లు తెలిసింది. ఇక వెంకటేశ్ ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' అనే సినిమా చేస్తున్నారు. అలాగే 'దృశ్యం 3' చేయాల్సి ఉంది.

తమిళంలో ఇంకొకటి?


శ్రీలీల


"సింగారాల సీతాకోకని.." అంటూ ఇటీవలే 'పరాశక్తి' సినిమాతో తెరపై సందడి చేసింది కథానాయిక శ్రీలీల. ఆమె నటించిన తొలి తమిళ చిత్రమిదే. ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉన్న ఈ తార.. ఇప్పుడు మరో తమిళ చిత్రానికి పచ్చ జెండా ఊపిందా? అంటే అవుననే అంటున్నాయి సినీవర్గాలు. యువహీరో ప్రదీప్ రంగనాథన్ ఓ సైన్స్ ఫిక్షన్ సినిమాకి దర్శకత్వం వహించబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఇందులో ఆయన సరసన అందాల తార మీనాక్షి చౌదరిని ఎంపిక చేశారు. తాజాగా ఈ చిత్రంలో మరో కథానాయికగా శ్రీలీలను తీసుకోబోతున్నట్లు సమాచారం. చర్చలు చివరి దశలో ఉన్నాయని, పూర్తి వివరాల్ని త్వరలో అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. మరి అన్నీ సవ్యంగా జరిగితే.. ప్రదీప్ ఈ ఇద్దరు తారలతో ఎలాంటి హంగామా చేస్తాడో చూడాలి.

నాకు భయం లేదు నేనే విధ్వంసాన్ని


షారుక్ ఖాన్

రెడీ టు రోర్.. కింగ్ అంటూ బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ నటిస్తున్న 'కింగ్' సినిమా విడుదల తేదీని ప్రకటించింది చిత్ర బృందం. ఈ ఏడాది డిసెంబరు 24న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఎక్స్‌లో అధికారికంగా వెల్లడించింది. ఈ సందర్భంగా 'నాకు భయం లేదు నేనే విధ్వంసాన్ని' అనే షారుక్ డైలాగ్‌తో టైటిల్ ప్రకటన వీడియోను పంచుకుంది. ఈ సినిమాని సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్నారు. 'పఠాన్' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న మరో పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్, దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్ నటిస్తున్నారు.

అనుబంధాల 'చాయ్ వాలా'


వీసీ సజ్జనార్, శివ కందుకూరి, ప్రమోద్ హర్ష, రాజీవ్ కనకాల

"చాయ్ వాలా'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది" అన్నారు హీరో శివ కందుకూరి. ఇప్పుడాయన.. తేజు అశ్విని జంటగా ప్రమోద్ హర్ష తెరకెక్కించిన ఈ సినిమాని రాధా వి పాపుడిప్పు నిర్మించారు. రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ వేడుకలో సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్, సీలోహర్ ఫౌండర్ బాబూరావు, కిమ్స్ ఎండీ రవికిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ.. "టైటిల్ గీతం బాగుంది. ఈ సినిమా యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని నమ్ముతున్నా. ఇందులో తండ్రీ కొడుకుల అనుబంధంతో పాటు చాలా అంశాలున్నట్లు అర్థమవుతోంది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకముంది" అన్నారు. "ఈ సినిమాలో తండ్రీ కొడుకుల ఎమోషన్ చాలా బాగుంటుంది. అలాగే చాయ్‌కి.. షాప్ ఓనర్‌కీ మధ్య అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది" అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రమోద్ హర్ష, ప్రశాంత్ ఆర్ విహారి, వెంకట్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

మారిన స్వయం భూ.. విడుదల


నిఖిల్

ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రావాల్సిన 'స్వయం భూ' వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా ప్రకటిస్తూ కొత్త విడుదల తేదీని పంచుకుంది. దీన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. నిఖిల్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని భరత్ కృష్ణమాచారి తెరకెక్కించారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. దీన్ని తొలుత ఫిబ్రవరి 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ.. వీఎఫ్ఎక్స్ పనుల వల్ల వేసవికి వాయిదా వేశారు. చారిత్రక అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ డ్రామాలో వీఎఫ్ఎక్స్ అద్భుతంగా ఉండనుందని.. అందుకే కావాల్సినంత సమయం తీసుకొని దీన్నొక అద్భుత విజువల్ వండర్‌లా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకి సంగీతం: రవి బస్రూర్, కూర్పు: తమ్మిరాజు, ఛాయాగ్రహణం: కేకే సెంథిల్ కుమార్.

పులి కనిపించే వరకే వేటగాడు


రవి మోహన్

ఇటీవలే 'పరాశక్తి' సినిమాలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించారు నటుడు రవిమోహన్. తాజాగా ఆయన తదుపరి చిత్రం 'కరాతే బాబు'ని ప్రకటించారు. పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి గణేశ్ కె.బాబు దర్శకత్వం వహిస్తున్నారు. రవిమోహన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న ఈ సినిమాలో కాళి వెంకట్, వీటీవి గణేశ్, శక్తి వాసుదేవన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాలలో అధికారిక టీజర్‌ను ఆవిష్కరించింది చిత్రబృందం. "బాబు గురించి తెలుసా?" "రాజకీయాలు మీకు జీవనాధారం.. కానీ అదే నా పని' ' "పులి కనిపించే వరకే పట్టణం వేటగాడిని ప్రశంసిస్తుంది.."లాంటి ఆసక్తికర సంభాషణలతో సాగుతోందీ ట్రైలర్. ఇందులో రాజకీయ నాయకుడిగా రవి మోహన్ కనిపించిన తీరు మాస్ సన్నివేశాలతో ఆకట్టుకునేలా ఉన్నాయి.

'మాతృభూమి'ని ప్రేమించే వారికి!


సల్మాన్ ఖాన్

"దేశాన్ని తమకంటే ఎక్కువగా ప్రేమించే ప్రతి ఒక్కరికీ.." అంటూ 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' చిత్రబృందం 'మాతృభూమి' అనే గీతాన్ని విడుదల చేసింది. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. నిర్మిస్తున్న చిత్రమిది. చిత్రాంగద సింగ్ కథానాయిక. అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాటలో సల్మాన్ ఓ వైపు యుద్ధభూమిలో సైనికుడిగా వీరత్వం ప్రదర్శించడంతో పాటు.. మరోవైపు కుటుంబ సభ్యులతో ప్రేమగా ఉండే సన్నివేశాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. సమీర్ అంజన్ సాహిత్యమందించగా ఈ గీతాన్ని అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. ఈ సినిమాని ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో భారత్, చైనా జవాన్ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణలో మన సైనికులు కొందరు వీర మరణం పొందారు. ఈ సంఘటన ఆధారంగానే ఈ సినిమా రూపొందుతోంది.

వాస్తవ సంఘటనల స్ఫూర్తితో... 'దేవగుడి'


అభినవ్, అనుశ్రీ

స్నేహం... ప్రేమ... కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో రూపొందించిన 'దేవగుడి' అందరినీ అలరిస్తుందన్నారు బెల్లం రామకృష్ణారెడ్డి. ఆయన దర్శకనిర్మాణంలో... అభినవ్ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. బెల్లం సుధారెడ్డి సమర్పకులు. ఈ నెల 30న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ "వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కించిన చిత్రమిది. కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయి" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "ఇలాంటి చిన్న చిత్రాల్ని ఆదరిస్తేనే మాలాంటి కొత్తతరంలోని ప్రతిభ బయటకొస్తుంది" అన్నారు. అనుశ్రీ మాట్లాడుతూ "ఒక తెలుగమ్మాయి చిత్ర పరిశ్రమలోకి వస్తే చాలా మంది వ్యతిరేకంగా మాట్లాడుతుంటారు. నేను ఈ సినిమా చేస్తున్నప్పుడూ అలాగే మాట్లాడారు. వాళ్లే ఈ సినిమా ప్రచార చిత్రాలు చూసి ప్రశంసించారు" అన్నారు. అన్నిరకాల వాణిజ్యాంశాలున్న చిత్రమిదన్నారు నటుడు రఘు కుంచె.

త్రిముఖ వ్యూహం


సన్నీ లియోన్

"కామెడీ, థ్రిల్లింగ్ అంశాలు నిండిన కథతో రూపొందిన సినిమా 'త్రిముఖ'" అన్నారు దర్శకుడు రాజేశ్ నాయుడు. ఆయన దర్శకత్వం వహించిన ఈ బహుభాషా చిత్రంలో యోగేశ్ కల్లె హీరోగా నటించారు. సన్నీ లియోన్ ప్రధాన పాత్ర పోషించారు. ఆకృతి అగర్వాల్, సాహితీ దాసరి, ప్రవీణ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రాజేశ్ మాట్లాడుతూ.. "ఇది మంచి కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన సినిమా. ప్రథమార్ధం వినోదాత్మకంగా.. ద్వితీయార్ధం థ్రిల్లింగ్‌గా ఉంటుంది. దీంట్లోని ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది" అన్నారు. "ఈ చిత్రంలో సన్నీ లియోన్ పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ సినిమాతో ఆమెకు నటిగా మంచి పేరొస్తుంది" అన్నారు హీరో యోగేశ్ కల్లె.

ప్రయత్నం లేకుండా విజయమే రాదోయీ...


త్రిగుణ్

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వర్క్ ఫ్రమ్ హోం చేసుకుంటూనే... పొలం బాట పట్టాడు. మరి ఆయన సేద్యం ఎలా ముందుకు సాగిందో తెలియాలంటే 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' చూడాల్సిందే. త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రమిది. మధుదీప్ చెలికాని దర్శకత్వం వహిస్తున్నారు. అర్వింద్ మండెం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నీ అడుగు తాకి ఈ నేల... నేడే కొత్త రంగు పులిమేనా! చెమటే చిరుజల్లుని చిలికేనా? కాలం నవ చరితను రాసేనా? ప్రయత్నం లేకుండా విజయమే రాదోయీ...' అంటూ సాగే పాటని శనివారం విడుదల చేశారు. అరుణ్ చిలువేరు, ప్రకాశ్ చెరుకూరి స్వరకల్పనలోని ఈ గీతాన్ని అర్వింద్ మండెం రచించగా, బాబా సెహగల్ ఆలపించారు. వ్యవసాయం ప్రాముఖ్యతని చాటుతూనే, అందులో ఆధునిక సాంకేతికత ఎలాంటి పాత్ర పోషిస్తుందో వివరించే పాట ఇదని, ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందుతోందని సినీ వర్గాలు చెప్పాయి.

నాలాంటి వాళ్లకే ఇలా జరిగితే...
కొత్త నాయికల పరిస్థితేంటి?


మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ఓ కార్యక్రమంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణాలో జరిగిన ఓ వేడుకలో కొందరు ఫొటోల పేరుతో తనపై వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. "కర్నాల్‌లో ఒక కార్యక్రమం జరిగింది. తాత వయసున్న ఇద్దరు అతిథుల ప్రవర్తన పట్ల నాకు అసహ్యం కలిగింది. వేదికపైకి వెళుతుండగా ఆ ఇద్దరు, వారి కుటుంబ సభ్యులు(పురుషులందరూ) ఫొటోల పేరుతో నా నడుముపై చేతులు వేశారు. వెంటనే 'సర్ దయచేసి మీ చేతులు తీయండి' అని చెప్పాను. అంతేకాదు స్టేజ్‌పై ఉండగా ఇద్దరు వ్యక్తులు అసభ్యకరమైన రీతిలో సైగలు చేస్తూ ఇబ్బంది పెట్టారు. వీడియోలు తీశారు. దీంతో ప్రదర్శనను అనుకున్న సమయానికన్నా ముందే ముగించేయాల్సి వచ్చింది. ఇంత జరిగినా వారి కుటుంబ సభ్యులుగానీ, కార్యక్రమ నిర్వాహకులుగానీ ఆపే ప్రయత్నం చేయలేదు. నాలాంటి వారికే ఇలా జరిగితే కొత్తగా పరిశ్రమలోకి వచ్చే అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించగలను. అక్కడ భరించలేని వారి ప్రవర్తనకు నాకు అవమానంగా అనిపించింది. ఈ ఘటనపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. మేం నిజాయతీగా జీవనోపాధిని పొందేందుకు ప్రయత్నిస్తున్న కళాకారులం. నటులుగా కొన్ని వేడుకలలో భాగమవుతుంటాం. మేము వారి అతిథులమైనప్పటికీ మమ్మల్ని వారు ఇలా వేధిస్తారా?"అంటూ తన ఆవేదనని ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేసింది మౌనీరాయ్. గతేడాది 'సలాకార్' సిరీస్‌తో ప్రేక్షకుల్ని అలరించి... ప్రస్తుతం 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'లో నటిస్తోంది మౌని. దీంతో పాటు చిరంజీవి ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న 'విశ్వంభర'లో ప్రత్యేక గీతంలో ఆడిపాడనుంది.

మగాడి మీద జాలి పడేదెవ్వడు!


రాజ్‌కుమార్ కసిరెడ్డి, పవన్, వైష్ణవి

ప్రస్తుత తరానికి తగ్గట్లు భార్యాభర్తల బంధాన్ని వివిధ కోణాల్లో స్పృశిస్తూ తీసిన సినిమా 'పురుష:'. పవన్ కల్యాణ్, సప్తగిరి, రాజ్‌కుమార్ కసిరెడ్డి, వైష్ణవి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని వీరు ఉలవల తెరకెక్కించారు. బత్తుల కోటేశ్వరరావు నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. "జాలి పడేదెవ్వడు.. మగాడి మీద జాలి పడేదెవ్వడు" అంటూ సాగిన ఈ పాటను శ్రవణ్ భరద్వాజ్ స్వరపరచగా.. అనంత శ్రీరామ్ సాహిత్యమందించారు. ఎం.ఎం కీరవాణి ఆలపించారు. "ప్రేక్షకుల్ని ఆద్యంతం నవ్వించే కథతో రూపొందిన చిత్రమిది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి కూర్పు: కోటి, ఛాయాగ్రహణం: సతీశ్ ముత్యాల.

పాతబస్తీ 'జమాన'


స్వాతి, సూర్య

సూర్య శ్రీనివాస్, సంజీవ్‌కుమార్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం...'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తేజస్వి అడప నిర్మాత. సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాని ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో సాగే కథ ఇది. నేటి యువతరం ఆలోచనలకి అద్దం పట్టే కథ, కథనాలతో, అనూహ్యమైన మలుపులతో ఉత్కంఠ రేకెత్తిస్తుంది" అన్నారు. కొత్తతరహా కథనం, ఎడిటింగ్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్మాత చెప్పారు. స్వాతి కశ్యప్, జారా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జగన్.ఎ, సంగీతం: కేశవ కిరణ్, కూర్పు: ఎం.ఆర్.వర్మ.

నా కుట్టీ సుమతీ.. చిట్టీ సుమతీ!


శైలి, అమర్ దీప్

అమర్ దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా ఎంఎం నాయుడు తెరకెక్కించిన చిత్రం 'సుమతీ శతకం'. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. మహేశ్ విట్ట, మిర్చి కిరణ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మైత్రీ మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. "నా కుట్టీ కుట్టీ సుమతీ.. నా చిట్టీ చిట్టీ సుమతీ" అంటూ సాగిన ఆ ప్రేమ పాటకు సుభాష్ ఆనంద్ స్వరాలు సమకూర్చగా.. కృష్ణ మాదినేని సాహిత్యమందించారు. గోల్డ్ దేవరాజ్ ఆలపించారు. "ఈతరం యువత మెచ్చే అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని చిత్ర బృందం తెలిపింది.

అతి ప్రేమ భయానకం


నిఖిత, జయ శివసూర్య

జయ శివసూర్య, నిఖిత శ్రీ జంటగా తెరకెక్కిన చిత్రం '100 డేస్ లవ్ స్టోరీ'. అతి ప్రేమ భయానకం... అనేది ఉపశీర్షిక. ఇషా మనోహరి ప్రియ మరో కథానాయిక. విజయమిత్ర దర్శకత్వం వహించారు. వి.వెంకటరమణ మూర్తి శర్మ నిర్మాత. ఫిబ్రవరి 13న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. నిర్మాత సాయివెంకట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "ప్రేమ పేరుతో యువతరం వేస్తున్న అడుగులు వాళ్ల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తోందో ఇందులో ఆసక్తికరంగా చూపించార"న్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

ఈనాడు బిజినెస్ వారాంతం

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.3,446 కోట్లు



దిల్లీ: కోటక్ మహీంద్రా బ్యాంక్ 2025-26 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ.3,446 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలం లాభం రూ.3,305 కోట్లతో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ. ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.16,050 కోట్ల నుంచి రూ.16,741 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.13,428 కోట్ల నుంచి రూ.13,903 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్‌ఐఐ) రూ.7,196 కోట్ల నుంచి రూ.7,565 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్‌ఐఎం) 4.93 శాతం నుంచి 4.54 శాతానికి తగ్గింది. ఏకీకృత ప్రాతిపదికన బ్యాంక్ లాభం రూ.4,701 కోట్ల నుంచి 5 శాతం పెరిగి రూ.4,924 కోట్లకు చేరింది.


✦ ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.5 శాతం నుంచి 1.3 శాతానికి మెరుగైంది. నికర ఎన్‌పీఏ నిష్పత్తి సైతం 0.41 శాతం నుంచి 0.31 శాతానికి తగ్గింది. కేటాయింపులు మాత్రం రూ.794 కోట్ల నుంచి రూ.810 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ మూలధన కనీస నిష్పత్తి 22.79 శాతం నుంచి 22.63 శాతానికి చేరింది. 2025 డిసెంబరు 31 నాటికి మొత్తం ఖాతాదార్ల ఏయూఎం (నిర్వహణలోని ఆస్తులు) రూ.7,87,950 కోట్లకు చేరింది. ఏడాది క్రితం ఇదే సమయంలో ఇవి రూ.6,85,134 కోట్లుగా ఉన్నాయి.

✦ 'క్రెడిట్ కార్డు విభాగంలో వార్షిక ప్రాతిపదికన ప్రతికూల వృద్ధి నమోదైంది. మొత్తం వ్యాపారాన్ని సమీక్షిస్తున్నాం. కొత్త ఉత్పత్తులు ఆవిష్కరిస్తున్నాం. నిర్మాణ సామగ్రి పరిశ్రమ నెమ్మదించింది. పరిశ్రమ స్థాయిలోనే మా వృద్ధి కూడా నమోదైంది. స్టాండర్డ్ చార్టర్డ్ నుంచి కొనుగోలు చేసిన వ్యక్తిగత రుణ పోర్ట్‌ఫోలియో ఊహించిన దాని కంటే మెరుగ్గా ఉంద'ని కోటక్ మహీంద్రా ఎండీ, సీఈఓ అశోక్ వాస్వానీ ఫలితాలు ప్రకటించిన అనంతరం వెల్లడించారు.

వెండి కొండ.. కరుగుతుందా?

- పారిశ్రామిక గిరాకీ తగ్గే ప్రసక్తే లేదు
- ఈ లోహానికి ప్రత్యామ్నాయం కష్టమే
- ధర హెచ్చుతగ్గులు తప్పవు
- కొనుగోళ్లకు 'ట్రైపాడ్' విధానం మంచిది
- విశ్లేషకుల అభిప్రాయాలు

ఈనాడు వాణిజ్య విభాగం



ఏ రోజుకారోజు పెరుగుతున్న వెండి ధరలను చూసి మదుపరులకు పాలుపోవడం లేదు. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాములు) వెండి ధర తొలిసారిగా 100 డాలర్లను అధిగమించింది. దేశీయంగానూ కిలో రూ.3,33,000కు పైగా చేరింది. ఈ సమయంలో మరింతగా ధర పెరుగుతుందా, లేదంటే వెనక్కి వస్తుందా అని మదనపడుతున్నారు. ఇప్పటికే కొనుగోళ్లు చేసినవారు ఏం చేయాలి. అమ్మాలా ఇంకా కొనుగోలు చేయాలా? కొత్తగా వెండి కొనుగోలు చేసే వారు సైతం ముందడుగు వేయాలా.. వద్దా ఆగాలా అని ఆలోచిస్తున్నారు. మరి విశ్లేషకులు ఏమంటున్నారు. గత 5 దశాబ్దాలుగా వెండి ధర ప్రస్థానాన్ని ఒకసారి చూద్దాం. చాలా కాలంగా దాని వాస్తవ ధర కంటే దిగువనే చలిస్తూ వస్తోంది. ఇప్పటికి ఒక శక్తిమంత, వ్యూహాత్మక, భర్తీ చేయలేని పారిశ్రామిక లోహంగా మారింది. ఆర్థిక వ్యవస్థలో మిళితమై సరికొత్త సాధనంగా నిలిచిందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

కీలక లోహంగా ఇలా..

✦ హరిత ఇంధనం, సౌర పీవీ ✦ విద్యుత్ మౌలిక వసతులు ✦ ఎలక్ట్రానిక్స్-సెమీకండక్టర్స్ ✦ ఈవీలు, బ్యాటరీలు

ఇలా పలు రంగాల్లో కీలక లోహంగా ఇది మారింది. అప్పట్లో కృత్రిమంగా తక్కువ ధరల్లో కొనసాగిన వెండి ధర ఇపుడు సర్దుబాటు అవుతోంది. ఇందుకు గత ఐదు సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న కొరత కూడా కలిసివచ్చింది. సరఫరాతో పోలిస్తే గిరాకీ భారీగా ఉండడంతో ధర భగ్గుమనడానికి కారణమైంది. దీంతో అంతర్జాతీయంగా పలు దేశాలు పరోక్షంగానో, ప్రత్యక్షంగానో వెండి నిల్వలను అట్టిపెట్టుకుంటున్నాయి. తద్వారా సరఫరా వ్యవస్థకు భంగం కలగకుండా చూసుకుంటున్నాయి. జాతీయ భద్రత, ఇంధన స్వాతంత్య్రం, సాంకేతిక సార్వభౌమత్వానికి ఇది ఒక కేంద్ర బిందువుగా మారడం ఇందుకు కారణం.

గిరాకీ తగ్గుతుందా?

ప్రభుత్వాలతో పాటు సంస్థలు, వ్యక్తులు కూడా హెడ్జింగ్ కోసం వెండిని కొంటున్నారని 'ఈనాడు'తో కోటక్ సెక్యూరిటీస్ హెడ్ ఆఫ్ కమొడిటీ, కరెన్సీ రీసెర్చ్ అనింద్య బెనర్జీ తెలిపారు. 'పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యీకరణ నిమిత్తం వెండిని చేర్చుకుంటున్నారు. కంపెనీలైతే ధరలు మరింత పెరుగుతాయేమోనన్న భయంతో నిల్వలు పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారీ స్థాయి ప్రైవేటు ఇన్వెస్టర్లు అధిక మొత్తంలో భౌతిక వెండిని తక్కువ ధరల్లో కొని పెట్టుకుని ఉన్నార'ని చెప్పారు. ఇక ఈ సమయంలో గిరాకీ తగ్గుతుందా అన్న అనుమానాలూ రావొచ్చు. అయితే..

- పరిశ్రమలు ఎప్పటికీ వినియోగాన్ని తప్పించుకోలేవు.
- ఆధునిక సాంకేతికతకు వెండి తప్పనిసరిగా మారింది.
- అంతర్జాతీయ మందగమనం వంటిదేదో ఎదురైతే తప్ప గిరాకీ తగ్గే ప్రసక్తే లేదని విశ్లేషకులు అంటున్నారు.

ఇపుడు కొనాలా.. వద్దా?

'వెండి ధరపై దీర్ఘకాలంలో బులిష్‌గానే ఉన్నాం. అయితే ఊగిసలాటలు మాత్రం తప్పవ'ని బెనర్జీ తెలిపారు. 'దిద్దుబాటు 10-15% వరకు కనిపించడం సాధారణమే. ఒక వేళ ఆస్తులు పెరిగితే 20-25% వరకూ పతనం కొనసాగొచ్చు. మదుపర్లు సరైన సమయం కోసం ఎదురుచూడడం కంటే 'ట్రైపాడ్' వ్యూహం అవలంబించడం మంచిది. అంటే ఒక భాగం ప్రస్తుతం, క్రమంగా కొద్ది కాలం పాటు ఇంకో భాగం, మూడో భాగం భారీ దిద్దుబాటు కోసం అట్టిపెట్టుకుంటేనే మంచిది. ఇక పోర్ట్‌ఫోలియోలో వెండిని జత చేసుకోవాలి. అంతే తప్ప దానిని మాత్రమే పరిగణించరాదు. మొత్తం పోర్ట్‌ఫోలియోలో వెండి, బంగారం 25-30% వరకు కేటాయించుకోవచ్చు. ఇందులోనూ బంగారం, వెండిని 60:40/70:30 నిష్పత్తిలో ఉంచుకోవచ్చ'న్నారు.

ఏటా సమీక్ష తప్పనిసరి..

'వెండికి ఉన్న 'హైబీటా' తత్వం వల్ల ఊగిసలాటలు అధికంగా ఉంటాయి. కాబట్టి ఆ నిష్పత్తులు సరిపోతాయ'ని వివరించారు. ప్రస్తుతం రికార్డు గరిష్ఠాలకు వెండి చేరింది కదా అని స్వల్పకాల లాభాల స్వీకరణపై దృష్టి పెట్టడం మంచిది కాదు. అసెట్ అలోకేషన్, పీరియాడిక్ రీబ్యాలెన్సింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డీ డాలరైజేషన్ వేగవంతమవుతోన్నందున అన్ని అసెట్ విభాగాల్లోనూ ఊగిసలాటలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా పోర్ట్‌ఫోలియోను సమీక్షించుకునే వరం తప్పనిసరి అని చెప్పారు. వెండి అనేది నిర్మాణాత్మకంగా బలంగా కనిపిస్తున్నా.. ఊగిసలాటలు భారీగా ఉంటాయి. అందుకే భావోద్వేగ నిర్ణయాల కంటే, క్రమశిక్షణతో కేటాయింపులు చేసుకోవడం మంచిది.

అల్ట్రాటెక్ సిమెంట్ లాభం రూ.1,729.44 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి అల్ట్రాటెక్ సిమెంట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.1,729.44 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో నికర లాభం రూ.1,363.44 కోట్లుగా నమోదైంది. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.17,778.83 కోట్ల నుంచి రూ.21,829.68 కోట్లకు చేరింది. ఇండియా సిమెంట్స్, బిర్లా వైట్ వాల్‌కేర్ (ఇంతకుముునుపు వండర్ వాల్‌కేర్), యూఏఈకి చెందిన ఆర్‌ఏకేడబ్ల్యూ సీటీలను కొనుగోలు చేయడం వల్ల 2025-26 అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలను ఏడాదిక్రితం ఇదే సమయం నాటి ఆర్థిక ఫలితాలతో పోల్చిచూడలేమని కంపెనీ వెల్లడించింది. అల్ట్రాటెక్ సిమెంట్‌లో కేశోరామ్ ఇండస్ట్రీస్‌కు చెందిన సిమెంట్ వ్యాపార విలీనం 2025 మార్చి 1 నుంచి అమల్లోకి రావడం కూడా ఇందుకు మరో కారణంగా పేర్కొంది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇతర ఆదాయంతో కలిపి కంపెనీ మొత్తం ఏకీకృత ఆదాయం 15 శాతం పెరిగి రూ.21,965.26 కోట్లకు చేరింది. విక్రయాలు 15 శాతం అధికమై 33.85 మెట్రిక్ టన్నులుగా నమోదయ్యాయి.

✦ కేబుళ్లు, వైర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టే ప్రణాళిక పైనా కసరత్తు చేస్తున్నామని సంస్థ పేర్కొంది.

14.94 కోట్ల ఖాతాల లాగిన్ వివరాలు లీక్!

ఎక్స్‌ప్రెస్‌వీపీఎన్ నివేదిక

దిల్లీ: జీమెయిల్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, నెట్‌ఫ్లిక్స్.. ఇలా వివిధ సంస్థల వద్ద నమోదైన 14.94 కోట్ల ఖాతాల లాగిన్‌కు సంబంధించిన యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ల వివరాలు బయటకు వచ్చాయని ఎక్స్‌ప్రెస్‌వీపీఎన్ నివేదిక తెలిపింది. లాగిన్ వివరాలు లీక్ అయిన వాటిల్లో జీమెయిల్ ఖాతాలు 4.8 కోట్లు, ఫేస్‌బుక్ 1.7 కోట్లు, ఇన్‌స్టా 65 లక్షలు, యాహూ 40 లక్షలు, నెట్‌ఫ్లిక్స్ 34 లక్షలు ఉన్నాయి. '96 జీబీ వరకు ఉన్న ఈ బహిర్గతమైన డేటాబేస్‌లో 14,94,04,754 ఖాతాల యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ వివరాలు ఉన్నాయి. ఇ-మెయిల్స్, యూజర్ నేమ్స్, పాస్‌వర్డ్‌లు, ఖాతాకు లాగిన్ అయ్యేందుకు యూఆర్ఎల్ లింక్‌లు సహా వేల సంఖ్యలో ఫైల్స్ ఇందులో ఉన్నట్లు నేను గమనించాన'ని సైబర్‌భద్రతా పరిశోధకులు జెరామియా ఫౌలర్ తెలిపారు. వివిధ దేశాలకు సంబంధించిన '.గవ్' డొమైన్‌ల క్రెడెన్షియల్స్ (గోప్యతా వివరాలు) భద్రత పైనా జెరామియా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. ఎయిరిండియాకు రూ.1,100 కోట్ల బీమా సొమ్ము

ఇంటర్నెట్‌డెస్క్: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన నేపథ్యంలో ఎయిరిండియాకు పలు బీమా కంపెనీలు, రీఇన్సూరర్ల నుంచి పరిహారం అందింది. రూ.1,100 కోట్లకు పైగా కంపెనీకి చెల్లించినట్లు ఇన్సూరెన్స్ వర్గాలను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం.. టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే కుప్పకూలింది. ఈ ఘటనలో విమానం తునాతునకలైంది. అది పూర్తిగా ధ్వంసం కావడంతో బీమా కంపెనీలు, రీఇన్సూరర్లు 125 మిలియన్ డాలర్ల (రూ.1,100 కోట్లకుపైగా) బీమా మొత్తాన్ని చెల్లించాయి. అలాగే ప్రమాదంలో మరణించిన మృతుల బంధువులకు 25 మిలియన్ డాలర్ల (సుమారు రూ.227 కోట్ల) పరిహారం చెల్లించే ప్రక్రియ మొదలైనట్లు ఆ సంస్థలు పేర్కొన్నాయి. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉందని వెల్లడించాయి.



✦ ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒకే ఒక వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు. విమానం వైద్య విద్యార్థులుండే హాస్టల్‌పై పడటంతో మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. వీరి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేలా టాటా గ్రూప్ ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం కోసం ఆ ట్రస్ట్ నిధులను వినియోగిస్తున్నారు.

ధనలక్ష్మీ బ్యాంక్ లాభంలో 20% వృద్ధి



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ధనలక్ష్మీ బ్యాంక్ నికర లాభం 20 శాతం పెరిగి రూ.24 కోట్లకు చేరింది. 2024-25 ఇదే కాలంలో నికర లాభం రూ.20 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.377 కోట్ల నుంచి పెరిగి రూ.456 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం కూడా రూ.128 కోట్ల నుంచి రూ.154 కోట్లకు పెరిగింది. 2025 డిసెంబరు నాటికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 3.53 శాతం నుంచి 2.36 శాతానికి తగ్గింది. అయితే నికర నిరర్థక ఆస్తులు 0.86 శాతం నుంచి 1.11 శాతానికి పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 12.79 శాతం నుంచి 17.19 శాతానికి పెరిగింది.

కోడి గుడ్లు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	510
తూ/ప గోదావరి	480
విశాఖపట్నం	480
చిత్తూరు	543

గృహ రుణ వడ్డీ మినహాయింపు రూ.5 లక్షలకు పెంచాలి

- అద్దె ఇళ్ల కొరతకు పరిష్కారం చూపాలి
- ప్రభుత్వానికి క్రెడాయ్ వినతి

దేశంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, పెరుగుతున్న వలసల నేపథ్యంలో రానున్న కేంద్ర బడ్జెట్‌లో జాతీయ అద్దె గృహాల మిషన్ (నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్)ను ప్రారంభించాలని నిర్మాణ రంగ సంస్థల సమాఖ్య క్రెడాయ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మిషన్ కింద కేవలం డెవలపర్లకే కాకుండా, అద్దెదారులకూ పన్ను ప్రోత్సాహకాలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా, గృహరుణాలపై ప్రస్తుతం ఉన్న వడ్డీ మినహాయింపు పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని సూచించింది.

ఉద్యోగులకు ఉపయుక్తం..

పట్టణీకరణ కారణంగా నగరాలకు వలసలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, దేశంలో వ్యవస్థీకృత అద్దె గృహాల విభాగం ఇంకా అభివృద్ధి చెందలేదని క్రెడాయ్ పేర్కొంది. ఈ నేపథ్యంలో మొదటి, రెండో శ్రేణి నగరాల్లో భారీ ఎత్తున అందుబాటు ధరల్లో అద్దె ఇళ్లను నిర్మించేందుకు నేషనల్ రెంటల్ హౌసింగ్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపింది. డెవలపర్లకు ఆర్థిక ప్రోత్సాహకాలు, అద్దెదారులకు పన్ను వెసులుబాట్లు కల్పించడం ద్వారా అద్దె మార్కెట్‌ను క్రమబద్ధీకరించేందుకు వీలవుతుందని పేర్కొంది. దీనిద్వారా అసంఘటిత నివాసాలను అరికట్టేందుకు వీలవుతుందని, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి ఇది ఎంతో మేలు చేస్తుందని వివరించింది. ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు గృహ నిర్మాణ రంగం చోదక శక్తిగా ఉందని క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ పటేల్ తెలిపారు.

నిర్వచనం మారాలి..

ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా 'అందుబాటు ధరల గృహాల' అర్హత ప్రమాణాలను సవరించాలని క్రెడాయ్ తన బడ్జెట్ విజ్ఞప్తులలో పేర్కొంది. 2017 నుంచి ఈ నిర్వచనంలో ఎలాంటి మార్పులు లేవని, ప్రస్తుతం మెట్రో నగరాల్లో 60 చదరపు మీటర్లు, ఇతర నగరాల్లో 90 చ.మీటర్ల విస్తీర్ణం, రూ.45 లక్షల ధర పరిమితి ఉందని గుర్తు చేసింది. పెరిగిన భూమి, నిర్మాణ వ్యయాల దృష్ట్యా ఈ రూ.45 లక్షల పరిమితి ప్రస్తుత వాస్తవ ధరలకు సరిపోవడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మెట్రో నగరాల్లో కార్పెట్ ఏరియా పరిమితిని 90 చదరపు మీటర్లు, ఇతర నగరాల్లో 120 చ.మీటర్లకు పెంచాలని క్రెడాయ్ తన ప్రతిపాదనల్లో కోరింది. రూ.45 లక్షల ధరల పరిమితిని పూర్తిగా తొలగించాలని తెలిపింది. ప్రస్తుతం అందుబాటు ధరల ఇళ్లపై ఒక శాతం జీఎస్‌టీ అమలవుతోంది.



విఝింజం పోర్ట్ అభివృద్ధికి రూ.30,000 కోట్ల పెట్టుబడి

అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ



తిరువనంతపురం: విఝింజం ఓడరేవు అభివృద్ధికి అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజెడ్) మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడిని పెట్టనున్నట్లు ఆ సంస్థ ఎండీ కరణ్ అదానీ తెలిపారు. రెండో విడత కింద అదనంగా రూ.16,000 కోట్లనూ వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తం పెట్టుబడులతో 2029 కల్లా పోర్టు సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 1 మిలియన్ టీఈయూ (20 ఫీట్ ఈక్వివలెంట్ యూనిట్స్) నుంచి 5.7 మిలియన్ టీఈయూలకు పెంచుతామని వెల్లడించారు. విఝింజం పోర్టును ఏపీఎస్ఈజెడ్ నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. 'కేరళ రాష్ట్రంలో ఒక సంస్థ పెట్టబోతున్న అత్యధిక పెట్టుబడి ఇదే. భారత ఉపఖండం నుంచి అతిపెద్ద రవాణా ఓడరేవుగా విఝింజం అవతరించనుంది. అంతేకాకుండా దేశంలో అత్యంత అధునాతన సాంకేతికతతో కూడిన ఓడరేవుగాను ఇది నిలవనుంద'ని పోర్టు రెండో విడత విస్తరణను ప్రారంభించిన సందర్భంగా కరణ్ తెలిపారు.

ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ వాణిజ్య కార్యకలాపాలు

ఫిబ్రవరి 1 నుంచి ముంబయి-ఫ్రాంక్‌ఫర్ట్ మార్గంలో..

దిల్లీ: టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా, తన కొత్త బోయింగ్ 787-9 విమానాలను కొన్ని పరిమితులతో నడపనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బిజినెస్ క్లాస్ సూట్‌లలో స్లైడింగ్ ప్రైవసీ డోర్లు, 18 ఎకానమీ సీట్ల కోసం అమెరికా నియంత్రణ సంస్థ ఎఫ్ఏఏ (ఫెడరేషన్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఆమోదం కోసం వేచి చూస్తోంది. 2022 జనవరిలో ఎయిరిండియాను టాటా గ్రూప్ స్వాధీనం చేసుకున్న తర్వాత, మొట్టమొదటి కస్టమ్-మేడ్ డ్రీమ్‌లైనర్ విమానం ఫిబ్రవరి 1 నుంచి ముంబయి-ఫ్రాంక్‌ఫర్ట్ మార్గంలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించబోతోంది. ఈ విమానంలో 296 సీట్లు ఉన్నాయి. వీటిలో 30 బిజినెస్ క్లాస్, 28 ప్రీమియం ఎకానమీ, 238 ఎకానమీ క్లాస్ సీట్లు ఉన్నాయి. వీటిలో 18 ఎకానమీ క్లాస్ సీట్లు ఎఫ్ఏఏ ఆమోదం పొందే వరకు ఉపయోగించడానికి అందుబాటులో ఉండవని తెలుస్తోంది.

✦ డిసెంబరు ప్రారంభంలో భారీ కార్యాచరణ అంతరాయాలు ఎదుర్కొన్న తర్వాత, దేశంలోనే అతి పెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో శీతాకాల విమానాలను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) 10 శాతం తగ్గించింది. దీంతో వివిధ దేశీయ విమానాశ్రయాల్లో 700కు పైగా స్లాట్‌లను ఇండిగో ఖాళీ చేసింది.

6 ఐటీ కంపెనీలపై రూ.5,400 కోట్ల భారం

కొత్త లేబర్ కోడ్ అమలు నేపథ్యం

దిల్లీ: కొత్త కార్మిక చట్టాల అమలు కారణంగా దేశంలోని 6 ఐటీ కంపెనీలపై సుమారు రూ.5,400 కోట్ల మేర అదనపు భారం పడింది. ఈ కంపెనీలు అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి ప్రకటించిన లాభాల్లోనూ ఈ మేరకు ప్రభావం కనిపించింది.

✦ కొత్త కార్మిక చట్టాల అమలు కోసం అత్యధికంగా టీసీఎస్ రూ.2,128 కోట్ల కేటాయింపులు చేసింది. ఇన్ఫోసిస్ రూ.1,289 కోట్లు, హెచ్‌సీఎల్ టెక్ రూ.956 కోట్లు, టెక్ మహీంద్రా రూ.272 కోట్లు, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ రూ.590 కోట్లు చొప్పున కేటాయించాయి. కొత్త కార్మిక చట్టాల అమలుకు, రీకన్‌స్ట్రక్షన్ ఛార్జీలతో కలిసి రూ.302.80 కోట్లను కేటాయించినట్లు విప్రో తెలిపింది.

✦ పై కేటాయింపుల ప్రభావంతో అక్టోబరు-డిసెంబరులో టీసీఎస్ 13.9%, ఇన్ఫోసిస్ 2.2%, హెచ్‌సీఎల్ టెక్ 11.2%, విప్రో 7%, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 11% చొప్పున లాభంలో తగ్గుదలను నమోదు చేశాయి. టెక్ మహీంద్రా మాత్రమే లాభంలో 14 శాతం వృద్ధిని ప్రకటించింది.

వృద్ధుల గృహ విభాగంలోకి డీఎల్ఎఫ్

దిల్లీ: వృద్ధుల గృహ (సీనియర్ లివింగ్ హౌసింగ్) విభాగంలోకి స్థిరాస్తి దిగ్గజ సంస్థ డీఎల్ఎఫ్ అడుగుపెట్టనుంది. గురుగ్రామ్‌లో దాదాపు రూ.2,000 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును ప్రస్తుత త్రైమాసికంలో ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. విస్తరణ ప్రణాళికల్లో ఇది భాగమని డీఎల్ఎఫ్ ఎండీ అశోక్ త్యాగి వెల్లడించారు. గురుగ్రామ్‌లో గృహాలకు మంచి గిరాకీ ఉందన్నారు. డిసెంబరు త్రైమాసికంలో విక్రయాల బుకింగ్‌లు నిరాశజనకంగా ఉన్నప్పటికీ.. పూర్తి ఆర్థిక సంవత్సరం (2025-26)లో రూ.20,000-22,000 కోట్ల విక్రయాల బుకింగ్స్ లక్ష్యాన్ని సాధిస్తామని డీఎల్ఎఫ్ ధీమా వ్యక్తం చేసింది.

భారతీయ ఉద్యోగులే నైపుణ్యాల్లో భేష్..



- ఒత్తిడితోనే ఇబ్బంది
- అసంతృప్తి ఉన్నా.. ఉద్యోగాన్ని వదలరు
- మ్యాన్‌పవర్ గ్రూపు నివేదిక

ఈనాడు, హైదరాబాద్: 'తమకున్న నైపుణ్యాలపై భారతీయ ఉద్యోగులు ఎంతో ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. అదే సమయంలో.. తీవ్రమైన పని ఒత్తిడి, అనిశ్చితితో సతమతమవుతున్నారు' అని మ్యాన్‌పవర్ గ్రూప్ గ్లోబల్ టాలెంట్ బారోమీటర్-2026 నివేదిక వెల్లడించింది. ఉద్యోగుల శ్రేయస్సు సూచీలో భారత్ 77 శాతంతో అగ్రస్థానంలో నిలిచినా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అంత ఆశాజనకంగా లేదని పేర్కొంది. తమ విధులను నిర్వర్తించడంలో తమకున్న పట్టుపై 95 శాతం మంది భారతీయ ఉద్యోగులు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. ఇది ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ.

మితిమీరిన పనివేళలతో..

ఇక కృత్రిమ మేధ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలోనూ 90 శాతం మంది తమ సంసిద్ధతను వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడంలో తాము ఎవరికీ తీసిపోమని భారతీయ ఉద్యోగులు నిరూపిస్తున్నారు. ఈ విశ్వాసం ఉద్యోగ సంతృప్తిగా మారడం లేదు. కేవలం 64 శాతం మందే తమ ప్రస్తుత ఉద్యోగంపట్ల సంతృప్తిగా ఉన్నారు. నైపుణ్యాలు, పని సామర్థ్యం విషయంలో ధీమాగా ఉన్న ఉద్యోగులు, పనిభారం విషయంలో మాత్రం ఏకంగా 75 శాతం మంది తాము తీవ్రమైన మానసిక, శారీరక అలసట అంచున ఉన్నట్లు తెలిపారు. మితిమీరిన వేళలు, పనిభారం ఇందుకు ప్రధాన కారణాలు. దాదాపు 53 శాతం మంది ఉద్యోగులు ప్రతి రోజూ మోస్తరు పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని అంగీకరించారు. ముఖ్యంగా జెన్-జీ మహిళా ఉద్యోగుల్లో ఈ ఒత్తిడి తీవ్రత మిగతా వారి కంటే ఎక్కువగా ఉంది. ప్రస్తుతం కార్పొరేట్ వర్గాల్లో 'జాబ్ హగ్గింగ్' అనే కొత్త ధోరణి కనిపిస్తోంది. చేస్తున్న ఉద్యోగం పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ, ఆర్థిక అనిశ్చితి భయంతో ఉద్యోగాన్ని వదలకుండా అందులోనే కొనసాగడాన్ని ఇలా పిలుస్తున్నారు. సుమారు 48 శాతం ఉద్యోగులు ఇదే తరహా ఆలోచనతో ఉన్నారని నివేదిక పేర్కొంది. అదే సమయంలో 84 శాతం మంది తాము ఉద్యోగాన్ని మారేందుకు ఉన్న అవకాశాలను చూస్తున్నామని తెలిపారు. అంటే, ఉద్యోగులు సంస్థలో ఉంటున్నారే తప్ప, మనసు పెట్టి పని చేయడం లేదని నివేదిక వెల్లడించింది.

ఐటీలోనే ధీమా..

రాబోయే ఆరు నెలల్లో మరో ఉద్యోగం దొరుకుతుందనే నమ్మకం ఐటీ, పరిశ్రమల రంగాల ఉద్యోగుల్లో ఎక్కువగా ఉంది. అదే సమయంలో ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి, ఆర్థిక సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం తమ ఉద్యోగ భద్రతపై తీవ్ర ఆందోళనలో ఉన్నారు. దాదాపు 41 శాతం మంది తమ ఉద్యోగం ఏ క్షణమైనా పోవచ్చనే భయంతో ఉన్నట్లు సర్వే వెల్లడించింది. బ్లూ కాలర్ ఉద్యోగుల్లో శ్రేయస్సు స్కోరు అత్యల్పంగా 68 శాతమే నమోదైంది. పనికి తగిన గుర్తింపు లేకపోవడంతోపాటు, ఆధునిక సాంకేతికతలు తమ ఉద్యోగాలను తీసేసుకుంటాయన్న భయం 62 శాతం మందిలో ఉంది. అంతర్జాతీయ నైపుణ్యాల హబ్‌గా భారత్ మారుతున్న తరుణంలో ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించకపోతే ఉత్పాదకత దెబ్బతింటుందని మ్యాన్‌పవర్ గ్రూప్ ఇండియా ఎండీ సందీప్ గులాటి తెలిపారు. ఉద్యోగుల్లో విశ్వాసం ఉన్నప్పటికీ, సంస్థలు వారి శ్రేయస్సును పట్టించుకోవాలని సూచించారు. పని-జీవిత సమతుల్యత, ఉద్యోగంలో వృద్ధి తదితరాలపై సంస్థలు ఉద్యోగులకు తగిన విధంగా మార్గనిర్దేశం చేయాలన్నారు.

భారత చక్కెర ఉత్పత్తిలో 22% వృద్ధి: ఐఎస్ఎంఏ

దిల్లీ: 2025-26 సీజనులో జనవరి 15 వరకు భారత్‌లో చక్కెర ఉత్పత్తి 22 శాతం పెరిగి 15.9 మిలియన్ టన్నులకు చేరింది. చెరకు సరఫరా పెరగడం, అధిక దిగుబడి ఇందుకు దోహదం చేశాయని ఇండియన్ షుగర్ అండ్ బయో-ఎనర్జీ మ్యాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐఎస్ఎంఏ) తెలిపింది. జనవరి 15 వరకు దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చక్కెర మిల్లుల సంఖ్య 518 కాగా.. గత సీజనులో ఇదే సమయానికి ఈ సంఖ్య 500గా ఉందని పేర్కొంది. చక్కెర అధికంగా ఉత్పత్తి అయ్యే మహారాష్ట్రలో చక్కెర ఉత్పత్తి 4.27 మిలియన్ టన్నుల నుంచి 51 శాతం పెరిగి 6.45 మిలియన్ టన్నులకు చేరింది. ఉత్తర ప్రదేశ్‌లో 4.28 మి.టన్నుల నుంచి 4.6 మి.టన్నులకు, కర్ణాటకలో 2.75 మి.టన్నుల నుంచి 3.1 మి.టన్నులకు చక్కెర ఉత్పత్తి పెరిగింది. చెరకుకు అధిక ధరలు, చక్కెర ధరల మార్జిన్ తగ్గడం వల్ల మిల్లుల ఆదాయాలపై ప్రభావం పడుతోందని, దీని వల్ల చెరకు రైతులకు చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని ఐఎస్ఎంఏ తెలిపింది. అందువల్ల చక్కెరకు కనీస విక్రయ ధరను సవరించడంపై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఫిబ్రవరి 24-26న డిఫ్‌శాట్

దిల్లీ: రక్షణ రంగంలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వ్యూహాత్మక నిపుణులు, విధాన నిర్ణేతలు, వ్యవస్థాపకులు వచ్చే నెలలో 3 రోజుల పాటు మేధో మథన సెషన్‌ను నిర్వహించనున్నారు. డిఫ్‌శాట్-2026 పేరిట నాలుగో ఎడిషన్ ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు ఇక్కడి మానెక్‌షా సెంటర్‌లో జరగనుంది. 'అంతరిక్షాన్ని కీలకమైన మౌలిక సదుపాయంగా గుర్తించడంతో పాటు అంతరిక్ష సాంకేతికతను దేశ రక్షణకు ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశంపై డిఫ్‌శాట్ 2026లో చర్చలు జరుగుతాయ'ని ఎస్ఐఏ-ఇండియా ప్రెసిడెంట్ సుబ్బారావు పావులూరి వెల్లడించారు. సాయుధ దళాలు, ప్రభుత్వం, పరిశ్రమ, యూనివర్సిటీలు, అధికారులు, అంతర్జాతీయ రక్షణ వర్గాల నుంచి 1000కి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు.

పాన్ మసాలా విక్రయ ధరకు సూచనలు

దిల్లీ: పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తుల రిటెయిల్ విక్రయ ధర (ఆర్ఎస్‌పీ) ఆధారిత గణన కోసం జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) తాజాగా సూచనలు జారీ చేసింది. ఇ-ఇన్‌వాయిస్, ఇ-వే బిల్లు, నెలవారీ అమ్మకాల రిటర్న్ ఫారం జీఎస్‌టీఆర్-1, ఇన్‌వాయిస్ ఫర్నిషింగ్ ఫెసిలిటీ (ఐఎఫ్ఎఫ్) వంటి వాటిని వెల్లడించడానికి ఇవి దోహదపడతాయి. పాన్ మసాలా తయారీపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్‌ను ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. ఫిబ్రవరి 1 నుంచి వీటిపై అత్యధికంగా 40 శాతం జీఎస్‌టీని విధించనున్నారు. దీంతో వీటిపై పన్నులు 88 శాతానికి చేరనున్నాయి. ప్రస్తుతం పాన్ మసాలాపై 28 శాతం జీఎస్‌టీ, పరిహార సెస్‌ను విధిస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా రిటెయిల్ విక్రయ ధరలో ఒక శాతంగా జీఎస్‌టీని విధిస్తారు. తయారీదారు ఉత్పత్తి సామర్థ్యాల బట్టి సెస్‌ను వసూలు చేయనున్నారు. జీఎస్‌టీఎన్ జారీ చేసిన సూచనల ప్రకారం.. పన్ను విధించదగిన విలువలో నికర అమ్మకపు విలువను చెల్లింపుదారులు వెల్లడించాల్సి ఉంటుంది. ఆర్ఎస్‌పీ ఆధారిత విలువ ఆధారంగా పన్ను మొత్తాలు ఉంటాయి.

భారత రాజ్యాంగ లక్షణాల్లో ప్రాథమిక హక్కులు అత్యంత ముఖ్యమైనవి. రాజ్యాంగంలోని మూడో భాగంలో 12 నుంచి 35 వరకు ఉన్న అధికరణలు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తాయి. ఈ 3వ భాగాన్ని 'భారత మాగ్నాకార్టా'గా పేర్కొంటారు. ప్రాథమిక హక్కులను అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి గ్రహించారు. దేశ పౌరులకు సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, వివక్ష నుంచి రక్షణ కల్పించడానికి రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. ఈ హక్కులకు ప్రభుత్వం ద్వారా లేదా ఇతర ఏ విధంగానైనా భంగం వాటిల్లితే సుప్రీంకోర్టు, హైకోర్టు ద్వారా కాపాడుకోవచ్చు.

సమానుల్లో మాత్రమే అమలయ్యే సమానత్వం!



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు

1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 7 ప్రాథమిక హక్కులు ఉండేవి. ప్రస్తుతం 6 ప్రాథమిక హక్కులు ఉన్నాయి. అవి:

- సమానత్వపు హక్కు (14 - 18)
- స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు (19 - 22)
- పీడనాన్ని నిరోధించే హక్కు (23 - 24)
- మత స్వాతంత్ర్యపు హక్కు (25 - 28)
- విద్యా, సాంస్కృతిక హక్కు (29, 30)
- ఆస్తి హక్కు (31)
- రాజ్యాంగ పరిహారపు హక్కు (32)

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా జనతా ప్రభుత్వ కాలంలో ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు.

సమానత్వపు హక్కు (14 - 18)

14వ నిబంధన

చట్టం ముందు అందరూ సమానమేనని ఈ నిబంధన తెలియజేస్తుంది. కుల, మత, వర్గ, వర్ణ, లింగం ఆధారంగా చట్టం ఏ వ్యక్తికీ సమానత్వాన్ని నిరాకరించడానికి వీల్లేదు. ప్రజలందరూ చట్టం దృష్టిలో సమానమే. ఈ నిబంధనలో రెండు నియమాలున్నాయి. అవి:

- చట్టం దృష్టిలో సమానత్వం
- చట్టం మూలంగా సమాన రక్షణ

చిరంజిత్ లాల్ vs యూనియన్ ఆఫ్ ఇండియా: ఈ కేసులో సుప్రీంకోర్టు సమానుల్లో మాత్రమే సమానత్వం అమలుపర్చడం జరుగుతుందని తీర్పునిచ్చింది.

సమానత్వానికి మినహాయింపులు/ పరిమితులు

భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లు వారి అధికార విధుల నిర్వహణ సమయంలో ఏ న్యాయస్థానానికీ జవాబుదారీ కాదు. వారు పదవిలో ఉన్న సమయంలో అరెస్ట్ చేయడం లేదా కారాగార శిక్ష విధించేలా ఏ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయకూడదు. వీరి చర్యలను ఏ న్యాయస్థానం ప్రశ్నించడానికి వీల్లేదు.

- రాష్ట్రపతి, గవర్నర్లు పదవిలో ఉండగా వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వీల్లేదు. ఒకవేళ సివిల్ కేసు పెట్టాలంటే 2 నెలల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది.
- పార్లమెంటరీ చట్టాన్ని అనుసరించి విదేశీ రాయబారులు, దౌత్యవేత్తలు, విదేశీ ప్రతినిధులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు కొన్ని మినహాయింపులు ఉంటాయి. (14వ నిబంధన వీరికి వర్తించదు)

15వ నిబంధన

15(1): రాజ్యం కులం, మతం, జాతి, లింగ భేదం, జన్మస్థలం కారణంగా ఏ పౌరుడిపై వివక్ష చూపరాదు.

15(2): కేవలం కుల, మత, జాతి, లింగ, జన్మస్థలం లేదా వాటిలో ఏదో ఒకదాని ఆధారంగా పబ్లిక్ స్థలాల్లో ఏ వ్యక్తి పట్ల వివక్ష చూపరాదు.

15(2)(ఎ): దుకాణాలు, పబ్లిక్ రెస్టారెంట్లు, బహిరంగ వినోద ప్రదేశాల ప్రవేశంపై వివక్ష చూపరాదు.

15(2)(బి): ప్రభుత్వ ధన సహాయంతో లేదా ప్రజలందరి ఉపయోగార్థం నిర్దేశించిన బావులు, చెరువులు, స్నానపు ఘట్టాలు, రహదారులు, బహిరంగ విహార స్థలాల్లో వివక్ష చూపకూడదు.

15(3): స్త్రీలు, పిల్లలకు కల్పించే ప్రత్యేక సదుపాయాలు/వసతులను వివక్షగా భావించరాదు.

15(4): ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్యా సంస్థల్లో కల్పించే ప్రత్యేక రిజర్వేషన్లను వివక్షగా భావించరాదు. ఈ నిబంధనను మొదటి రాజ్యాంగ సవరణ చట్టం 1951 ద్వారా 15(4) క్లాజ్‌గా చేర్చారు.

15(5): సామాజికంగా, విద్యాపరంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు కల్పించడాన్ని వివక్షగా పరిగణించరాదు.

15(6): EWS రిజర్వేషన్లకు సంబంధించింది. దీన్ని 103వ రాజ్యాంగ సవరణ చట్టం 2019లో చేర్చారు. దీనిద్వారా EWS వర్గాలకు విద్యా సంస్థల్లో 10% రిజర్వేషన్లు కల్పించారు.

16వ నిబంధన

ఈ నిబంధన ప్రభుత్వ ఉద్యోగాల్లో పౌరులందరికీ సమాన అవకాశాలు ఉండాలని తెలియజేస్తుంది.

16(1): ఈ నిబంధన ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందే విషయంలో పౌరులందరికీ సమాన అవకాశాలు ఉండాలి.

16(2): ఉపాధి అవకాశాలు కల్పించేటప్పుడు పౌరుల పట్ల కేవలం కుల, మత, జాతి, లింగ, వారసత్వం, జన్మస్థలం, నివాస స్థలం ప్రాతిపదికపై వివక్ష చూపరాదు.

16(3): కొన్ని రకాల ఉద్యోగాలను కొన్ని నివాస ప్రాంతాల వారికే రిజర్వ్ చేయడం వివక్షగా భావించరాదు. దీని ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలు - నివాస అర్హతల చట్టం (1957)ను పార్లమెంట్ రూపొందించింది.

16(4): కొన్ని వెనుకబడిన తరగతుల (ఎస్సీ, ఎస్టీ, బీసీ) వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం అనుకుంటే వారికోసం కొన్ని ఉద్యోగాలను రిజర్వు చేయవచ్చు. దీన్ని వివక్షగా పరిగణించరాదు.

❖ రిజర్వేషన్లను కేవలం రెండు రకాల కారణాలపై ఆధారపడి మాత్రమే కల్పించారు. అవి:

- విద్యా, సామాజిక వెనుకబాటుతనం
- తగినంత ప్రాతినిధ్యం లేదని భావించినప్పుడు

16(4)(ఎ): ప్రభుత్వ ఉద్యోగాల్లో తగినంత ప్రాతినిధ్యం లేని (ఎస్టీ, ఎస్సీ) వారికి ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు కల్పించడం వివక్షగా పరిగణించరాదు. ఈ క్లాజ్‌ను 77వ సవరణ చట్టం 1955లో చేర్చారు.

16(4)(బి): ఒక ఏడాదిలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్ల కోటా భర్తీ కాకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో భర్తీకాని ఖాళీలను తర్వాతి సంవత్సరాల్లో కలుపుతారు. అయితే మొత్తం 50% రిజర్వేషన్ల పరిమితిని పరిగణించకుండా, ఆ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను ప్రశ్నించకూడదు.

16(5): ఈ నిబంధన ప్రకారం మతపరమైన సంస్థల నిర్వహణ కోసం నియమితులయ్యే ఉద్యోగులు, యాజమాన్య హోదాలో ఉండే వారందరూ ఆ మతానికి చెందిన వారై ఉండవచ్చు.

16(6): ఈ నిబంధన ద్వారా EWS వర్గాలకు ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మాత్రమే ఈ రిజర్వేషన్లు అమలవుతాయి.

17వ నిబంధన

ఈ నిబంధన అంటరానితనం/అస్పృశ్యతను పాటించడాన్ని నేరంగా (నిషేధం) పరిగణిస్తుంది.

- ఈ నిబంధనను సమర్థవంతంగా అమలుపరిచే నిమిత్తం భారత ప్రభుత్వం అస్పృశ్యత నేరాల చట్టాన్ని రూపొందించింది.
- పఖు బండారి vs బనామలీదాస్ మధ్య జరిగిన వ్యాజ్యంలో అంటరాని కులాలకు చెందిన వ్యక్తికి క్షవరం చేయడాన్ని నిరాకరిస్తూ సామాజికంగా నెలకొన్న వివాదంపై 1951లో కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది. 1955లో అస్పృశ్యత నివారణ చట్టం రూపొందించారు. ప్రస్తుతం దీని పేరును పౌరహక్కుల పరిరక్షణ చట్టం-1976గా మార్చారు. ఈ చట్టాన్ని ధిక్కరించిన వారికి 6 నెలలు జైలు శిక్ష లేదా రూ.500 జరిమానా లేదా రెండూ విధించవచ్చు.
- ఈ చట్టం ద్వారా శిక్షకు గురైన వ్యక్తులు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.

18వ నిబంధన

బిరుదుల రద్దుకు సంబంధించిన విషయాలు తెలుపుతుంది.

18(1): సైనిక లేదా విద్యా సంబంధమైనవి మినహా మరే ఇతర రకాల బిరుదులను ప్రభుత్వం ఎవరికీ ఇవ్వకూడదు.

18(2): విదేశాలు ప్రకటించే/ఇచ్చే ఎలాంటి బిరుదునైనా భారత పౌరులు స్వీకరించకూడదు.

18(3): ఒక వ్యక్తి భారత పౌరుడు కానప్పటికీ భారతదేశంలో ప్రభుత్వం ద్వారా ఆదాయం వచ్చే ఏదైనా ఉద్యోగం/పదవిలో ఉన్నప్పుడు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాలు ఇచ్చే ఎలాంటి బిరుదును స్వీకరించకూడదు.

18(4): భారత ప్రభుత్వం కింద ఆదాయాన్నిచ్చే ఏదైనా పదవి/ఉద్యోగంలో ఉన్న వ్యక్తి రాష్ట్రపతి అనుమతి లేకుండా ఇతర దేశాల నుంచి ఎలాంటి బహుమతి, భత్యం, ఉద్యోగ పదవిని స్వీకరించరాదు.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

901 Word of the Day

Gritty

Telugu meaning: ధైర్యవంతమైన, కఠినమైన

English meaning: The word gritty (గ్రిట్టి) is an adjective that describes someone who is courageous, determined, and able to endure difficult conditions.

Synonyms: Tough, Resilient; ***Antonyms:*** Weak, Timid

Usage: 1. The gritty determination of the athletes helped them perform exceptionally well despite harsh weather conditions.

2. Her gritty attitude towards competitive exams inspired many students to stay focused and disciplined.



కరెంట్ అఫైర్స్ - వీడియో లెసన్

పోటీపరీక్షల్లో కీలకమైన కరెంట్ అఫైర్స్‌ను ఈనాడు ఈప్రతిభ ఇప్పుడు **వీడియో లెసన్** రూపంలోనూ మీకు అందిస్తోంది. వారంలో జరిగిన ముఖ్య సంఘటనలను అంశాలవారీగా మీ ముందుకు తీసుకువచ్చింది. **2025, డిసెంబరు 24 నుంచి 31 వరకు** జరిగిన ముఖ్యమైన విషయాలకు సంబంధించిన వీడియో **'ఈనాడు ఈప్రతిభ' యూట్యూబ్ ఛానల్‌లో** అందుబాటులో ఉంది. చూసేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

పీజీఐఎంఈఆర్‌లో ఉద్యోగాలు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్) ఒప్పంద ప్రాతిపదికన గ్రూప్-ఎ, బీ, సీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 59. దరఖాస్తు ఫీజు రూ.1500. అర్హులైన అభ్యర్థులు 2026, ఫిబ్రవరి 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (జనవరి 25) చివరి తేదీ

- సమీర్‌లో 147 ఉద్యోగాలు. డిప్లొమా బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ ఓటర్ల దినోత్సవం

జనవరి 25 చరిత్రలో ఈనాడు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఓటు హక్కు ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని చట్టసభలకు ఎన్నుకుంటారు. దీన్ని ఉపయోగించుకోవడం ద్వారా పౌరులు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, నిర్బంధరహితంగా నిర్వహించడం ముఖ్యం. రాజ్యాంగ సూత్రాలను కచ్చితంగా అమలు చేస్తూ, న్యాయాధికారాలు చెలాయించే స్వయంప్రతిపత్తి ఉన్న రాజ్యాంగబద్ధ సంస్థతోనే ఇది సాధ్యమవుతుంది. అలా మన దేశంలో ఏర్పాటైందే 'భారత ఎన్నికల కమిషన్'. దీని స్థాపనకు గుర్తుగా ఏటా జనవరి 25న భారత్‌లో 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా (National Voters' Day) నిర్వహిస్తారు. ఎన్నికల సమయంలో ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ఓటుహక్కు ప్రాముఖ్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



కేంద్ర ఎన్నికల సంఘం

భారతదేశంలో రాజ్యాంగ నిబంధనలు, పార్లమెంట్ శాసనాలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆ పనిచేస్తుంది. ఇది 1950, జనవరి 25 నుంచి ఉనికిలోకి వచ్చింది.

- రాజ్యాంగంలోని 15వ భాగంలో 324-329 వరకు ఉన్న నిబంధనలు కేంద్ర ఎన్నికల సంఘం నిర్మాణం, అధికారాలు, విధుల గురించి తెలియజేస్తాయి.


చారిత్రక నేపథ్యం

భారత ఎన్నికల సంఘం ఏర్పడి 2010, జనవరి 25 నాటికి 60 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏటా జనవరి, 25న 'జాతీయ ఓటర్ల దినోత్సవం'గా నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. 2011 నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు. కొత్తగా ఓటు పొందే వయసు వచ్చిన యువతలో చైతన్యం నింపడం దీని ఆశయం. ఏటా జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారిని గుర్తించి, వారి పేర్లు ఓటరు జాబితాలో చేర్చి, జనవరి 25న ఓటరు గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు.

ఓటు హక్కు, కేంద్ర ఎన్నికల సంఘం అధికారాలు - విధులు, నియామకం, టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 2, ఏపీ పంచాయతీ సెక్రటరీస్ తదితర పోటీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

క్విట్ ఇండియా ఉద్యమం



రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల సహాయం కోరుతూ బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ప్రతిపాదన, క్రిప్స్ రాయబారం జరిపింది. తమ ముఖ్య ప్రతిపాదన అయిన స్వపరిపాలన అంశాన్ని బ్రిటిష్ వారు ప్రస్తావించకపోవడంతో భారతీయులు అసంతృప్తికి లోనయ్యారు. మరోవైపు యుద్ధంలో బర్మాను గెలిచిన అక్షరాజ్య కూటమి భారత్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమైంది. దాన్ని నిలువరించాలంటే ఆంగ్లేయులు దేశాన్ని విడిచి వెళ్లిపోవడమే పరిష్కారమని గాంధీజీ విశ్వసించారు. దీనిలో భాగంగానే క్విట్ ఇండియా ఉద్యమానికి ఆయన పిలుపునిచ్చారు.

భారత స్వాతంత్ర్యోద్యమంలో మహోన్నతమైందిగా, బ్రిటిష్ వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఉద్యమంగా క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రకెక్కింది.

- అక్ష రాజ్య కూటమిలోని జర్మనీ, ఇటలీ, జపాన్; మిత్ర రాజ్యాల కూటమిలోని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, రష్యాలు రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాయి.

ఉద్యమ తీవ్రత

బొంబాయి గోవాలియాటాంక్ వద్ద ప్రజాసభ కోసం పోగైన ప్రజలకు, అధికార యంత్రాంగం మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ పరిణామాలే అహ్మదాబాద్, పూనా, ఉత్తర, తూర్పు భారతదేశంలోని ఇతర పట్టణాల్లోనూ చోటుచేసుకున్నాయి.

ప్రభుత్వ చర్యలు - ప్రజల తిరుగుబాటు, పోటీ ప్రభుత్వాలు, వైఫల్యానికి కారణాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



PV Sindhu created badminton history on 22 January 2026 by becoming the first Indian shuttler to achieve 500 career wins in women's singles. She accomplished this milestone during the Indonesia Masters Super 500 tournament in Jakarta, defeating Denmark's Line Hojmark Kjaersfeldt in the round of 16.

✦ With this victory, Sindhu has joined an elite group as only the sixth women's singles player ever to hit the 500-win mark. The exclusive club includes legends like Ratchanok Intanon, Tai Tzu Ying, Akane Yamaguchi, Carolina Marin, and Petya Nedelcheva.

According to the latest TomTom Traffic Index 2025, Bengaluru was the second most congested city in the world in 2025. With an average speed of 16.6 km per hour, an average motorist spending 15 minutes to commute 4.2 km. TomTom is a Netherlands-based location technology firm. Bengaluru has been climbing the congestion ladder rapidly - it was the 6th most congested city in 2023, rose to 3rd in 2024, and has now surged to 2nd place in 2025.

✦ Mexico recorded the highest congestion levels globally.

Abu Dhabi has once again been named the world's safest city in the latest Numbeo Global Safety Index 2026. This marking the tenth consecutive year the UAE capital has topped the global rankings. The 2026 safety report evaluated 400 cities across more than 150 countries and placed Abu Dhabi at number one for overall safety, including walking alone safely in broad daylight and at night, consolidating its status as a global leader in urban security and quality of life.

For more Current Affairs: Scan QR code

Railway Exams

Reasoning

Blood Relations

Directions (Qs. 1 - 17): *Study the given Questions carefully and answer the given questions.*

1. In a family, A, C and D are brothers.
U is the daughter of A.
V is the son of C.
W is the daughter of D.
How is W related to V?
A) Sister B) Cousin
C) Aunt D) Mother

2. In a family, L is wife of C. They have two daughters M and N.
N is the mother of Q.
Also, Q is wife of T.
How is T related to C?
A) Son B) Son-in-law
C) Grandson D) Brother

3. In a family, G is the mother of K.
K is sister of M.
Also, L is the daughter of K.
How is G related to L?
A) Mother B) Grandmother
C) Aunt D) Sister

4. In a family, P is mother of two children C and Q.
Q is wife of R.
How is R related to C?
A) Brother B) Sister
C) Brother-in-law D) Son

5. In a family, J is wife of L. They have a daughter M and son C.
Also, Q is the daughter of C.
How is J related to Q?
A) Grandmother B) Aunt
C) Mother D) Sister

6. In a family, C and R are sisters. R is sister of P.
Q is the daughter of C. T is the son of R and M is the son of P.
How is T related to Q?
A) Brother B) Cousin
C) Uncle D) Son

7. Pointing to a woman, Gaurav said, "Her father is the only son of my grandfather." How is the woman related to Ravi?
A) Sister B) Cousin
C) Aunt D) Sister in law

8. In a function hall Pointing to a photograph of man Jagan said, "He is the son of the only son of my mother." How is Jagan related to that man?
A) Brother B) Uncle
C) Cousin D) Father

9. If P + Q means P is the mother of Q;
P – Q means P is the brother Q;
P % Q means P is the father of Q
P × Q means P is the sister of Q
Which of the following shows that A is the maternal uncle of B?
A) B – N + M × A B) A + S × N – B
C) A – M + N × B D) B – S % A

10. If P is the brother of Q; Q is the sister of R; and R is the father of S, how S is related to P?
A) Brother B) Sister
C) Nephew D) Cannot be determined

11. Introducing a man, a girl said, "He is the son of the daughter of the father of my uncle." How is the man related to the girl?
A) Brother B) Nephew
C) Uncle D) Son-in-law

12. In a family, L is married to M. They have two children Q and R.
R is father of C. Also, C is wife of D.
How is D related to Q?
A) Son B) Nephew
C) son-in-law D) Brother-in-law

13. In a family, G, M and C are sisters.
M is the mother of N.
N has two daughters Q and L.
How is C related to Q?
A) Aunt B) Sister
C) Grandmother D) Cousin

14. In a family function Pointing to a person Siri says, "He is the son of the only son of my grandfather." How is the man related to Siri?
A) Brother B) Uncle
C) Cousin D) Data is inadequate

15. Varma said to Mayank, "That boy playing with the hockey bat is the younger of the two brothers of the daughter of my father's wife." How is the boy playing with hockey bat related to Varma?
A) Son B) Brother
C) Cousin D) Brother-in-law

16. In a family, L, C and D are brothers.
M is the daughter of L and G is the daughter of C.
K is the son of D. Also, T is wife of K.
How is T related to G?
A) Sister-in-law B) Daughter-in-law
C) Aunt D) Cousin

17. In a family, M is wife of C. They have a daughter Q.
R is husband of Q.
L and T are the daughters of Q.
How is M related to T?
A) Mother
B) Grandmother
C) Aunt D) Sister

Scan the QR code for Key

These model questions were prepared by subject experts

కరెంట్ అఫైర్స్



★ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఇంటర్నేషనల్ ఐడియా) అధ్యక్ష పదవిని ఇటీవల ఏ దేశం చేపట్టింది? జ: భారత్ (మనదేశం తొలిసారి ఈ పదవికి ఎంపికైంది. 2026 వరకు ఈ పదవిలో కొనసాగుతుంది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఈ పదవిని నిర్వహిస్తారు.)

★ 2025 ప్రపంచ అథ్లెటిక్స్ అవార్డ్స్‌లో వరల్డ్

మాదిరి ప్రశ్నలు

అథ్లెట్స్ ఆఫ్ ది ఇయర్‌గా పురస్కారాలు గెలుచుకున్నవారు ఎవరు? జ: అర్మాండ్ డుప్లాంటిస్ (పురుషుల విభాగం పోల్ వాల్ట్-స్వీడన్), సిడ్నీ మెక్ లాఫ్లిన్ లెవ్రోన్ (మహిళల విభాగం-400 మీటర్ల స్ప్రింటర్- అమెరికా)

★ అంతర్జాతీయ బ్యాంకుల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (ప్రపంచ వ్యాప్తంగా స్థిరమైన అభివృద్ధిని సాధించడంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థల కీలక పాత్రను ఈ దినోత్సవం నొక్కి చెబుతుంది.) జ: డిసెంబరు 4

మరింత సమాచారం

★ నాగ్‌పుర్ విశ్వవిద్యాలయం మొదటి మహిళా వైస్ ఛాన్సెలర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (1923లో నాగ్‌పుర్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ఈమె ఈ పదవిలో ఐదేళ్లు కొనసాగుతారు.) జ: మనాలి మకరంద్ క్షీరసాగర్

JUNIOR INTER Chemistry
Chemical Bonding and Molecular Structure



1 mark

1. The valency shell of Calcium contains
1) 2 electrons 2) 4 electrons
3) 6 electrons 4) 8 electrons
A: 1) 2 electrons

2 Which of the following is ionic?
1) KI 2) CH_4 3) Diamond 4) H_2
A: 1) KI

Final Exams-2026 IMPORTANT Q & A

3 A covalent bond is formed
1) by the transfer of electrons
2) by sharing of electrons
3) by donating electrons 4) all of these
A: 2) by sharing of electrons

4 Hybridisation produced a set of …….. orbitals.
A: Hybrid

5 The shape of Ammonia molecule is ……..
A: Trigonal Pyramidal

6 How many electrons are shared during the formation of a double bond?
A: In the formation of a double bond, a total of 4 electrons are shared between two atoms. This sharing of electrons is represented by two parallel lines in chemical structures.

7 What is the bond angle in SO_2 molecule?
A: The bond angle in SO_2 is approximately 119°, slightly less than the ideal 120° for trigonal planar geometry due to the influence of the lone pair on Sulphur.

2 marks

1 What is Hybridisation?
A: Mixing of atomic orbitals of nearly same energy to give the same number of new set of orbitals of equal energy and shape is called hybridisation.

2 State Octet rule.
A: Every atom must possess 8 electrons in its outer most orbit for its stability. Atoms combine in two ways to get octet either by transfer of electrons or by mutual sharing of electrons. The tendency of an atom to achieve 8 electrons in their outer most orbit is known as octet rule.

3 What is meant by bond order?
A: Bond order is defined as one half the differences between the number of electrons present in the bonding and the anti-bonding orbitals.

More Imp Q & Ans



Writer: Trinadha Raja

ఇంధన భద్రతకు దిగుమతులే దిక్కు!

ఆధునిక యుగంలో ఒక దేశ పురోగతి అది వినియోగించే ఇంధన నిల్వలపైనే ఆధారపడి ఉంటోంది. ముఖ్యంగా రవాణా, పారిశ్రామిక రంగాలకు సంప్రదాయ ఇంధన వనరులైన పెట్రోలియం ప్రధాన అవసరంగా మారింది. క్లీన్ ఎనర్జీగా ప్రసిద్ధికెక్కిన సహజవాయువు పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా ఎదుగుతోంది. మరోవైపు పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌ను తక్కువ ఖర్చుతో, అధిక సామర్థ్యంతో తీర్చడంలో అణుశక్తి కీలకంగా నిలిచింది. భవిష్యత్తు ప్రయోజనాల రీత్యా ఈ వనరుల అన్వేషణ, ఉత్పత్తి, పొదుపుగా వాడటం దేశ వ్యూహాత్మక ఇంధన భద్రతలో భాగమైంది. ఈ నేపథ్యంలో ఆ ఇంధనాల స్వభావం, స్థానిక లభ్యతపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వీటి దిగుమతి, వినియోగం తీరుతెన్నుల గురించి తెలుసుకోవాలి.

పెట్రోలియం, సహజవాయువు, అణుశక్తి

(శక్తి వనరులు)

సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు, అణుశక్తి మొదలైన వాటిని చాలాకాలంగా దేశంలో వినియోగిస్తున్నారు. వీటి నిల్వలు పరిమితంగా ఉన్నాయి. ఒకసారి వాడితే తరిగిపోయే వాటిని పునర్వినియోగం కాని 'ఇంధన వనరులు' అంటారు. ప్రస్తుతం దేశం పునర్వినియోగ ఇంధన వనరులపై దృష్టి సారించినప్పటికీ ఇంకా సంప్రదాయ ఇంధన వనరులను వదులుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. దేశంలో బొగ్గు తర్వాత అత్యధికంగా వినియోగిస్తున్న ఇంధనాలు పెట్రోలు, సహజ వాయువు. వీటి లభ్యత చాలా పరిమితంగా ఉండటంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద చమురు దిగుమతిదారుల్లో భారత్ ఒకటి. ప్రతి రోజూ సుమారు 3 మిలియన్ బారెల్స్ అవసరమవుతుంది. ఎక్కువగా రవాణా, పరిశ్రమలు, ఎరువుల తయారీ, విద్యుత్తు ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారు. 2025-26లో మొత్తం ప్రాథమిక ఇంధన అవసరాల్లో 30% పైగా పెట్రోలియం, 15% సహజవాయువు తీరుస్తున్నాయి. దేశంలో వినియోగమయ్యే ముడిచమురులో 85% పైగా సుమారు 40 దేశాల నుంచి దిగుమతి అవుతోంది. ప్రధానంగా రష్యా, అమెరికా, బ్రెజిల్, గయానా నుంచి అధికంగా దిగుమతి అవుతోంది.



ముంబయి హై

పెట్రోలియం దేశంలోని మొత్తం 27 పెట్రోల్ బేసిన్లు ఉన్నాయి. కొన్ని సముద్ర గర్భంలో, ఇంకొన్ని ఖండాంతర ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రస్తుతం 9 బేసిన్లలో అన్వేషణ, వెలికితీత కొనసాగుతోంది. వీటిలో గల్ఫ్ ఆఫ్ కంబాట్, అస్సాం, ముంబయి హై లో ఎక్కువ ఉత్పత్తి జరుగుతోంది. ◆ దేశంలో మొదటి చమురు క్షేత్రాన్ని 1867లో అస్సాంలోని ముఖుమ్‌లో గుర్తించారు. ఆధునిక పద్ధతిలో పెట్రోలు ఉత్పత్తి చేసిన ప్రాంతం ఇదే రాష్ట్రంలోని దిగ్బాయ్ (1889). ఆ తర్వాత గుజరాత్‌లోని అంకలేశ్వర్. ◆ సముద్రం వెలుపల కనుక్కున్న తొలి చమురు క్షేత్రం గుజరాత్ (భావ్‌నగర్) సమీపంలోని అలియబెట్ ద్వీపం. దీని తర్వాత ముంబయి హైలో కనుక్కున్నారు. దేశంలో నిల్వల పరంగా చూస్తే పెట్రోలు నిక్షేపాలు పశ్చిమ తీర ప్రాంతంలో 37.30%, అస్సాంలో 26.10%, గుజరాత్‌లో 19.60%, తూర్పు తీర ప్రాంతంలో 7.20%, రాజస్థాన్‌లో 5.90% మేర ఉన్నాయి. ఉత్పత్తిపరంగా పశ్చిమ ఆఫ్‌షోర్‌లో అధికంగా 47.8%, రాజస్థాన్‌లో 17.4%, గుజరాత్‌లో 16.6%, అస్సాంలో 14.3%, తూర్పు ఆఫ్‌షోర్‌లో 1.9%, తమిళనాడులో 1.1%, ఆంధ్రప్రదేశ్‌లో 0.8% చొప్పున జరుగుతోంది. దేశంలో 1901లో అస్సాంలోని దిగ్బాయ్‌లో మొదటి చమురు శుద్ధి కర్మాగారాన్ని బర్మా కంపెనీ ప్రారంభించింది. కేరళలోని కొచ్చి రిఫైనరీ, కర్ణాటక-మంగళూరు, మహారాష్ట్ర-ముంబయి హై, తమిళనాడు-మనాలీ, నాగపట్టణం; ఆంధ్రప్రదేశ్-విశాఖపట్నం, తాటిపాక మొదలైన ప్రాంతాల్లో చమురుశుద్ధి కర్మాగారాలు ఉన్నాయి.



దిగ్బాయ్

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

భూమి లోపల లభించే ముడిచమురులో ఇంధనంతోపాటు, నీరు, ఇతర జీవపదార్థాలు కలిసి ఉంటాయి. వీటిని కర్మాగారాల్లో శుద్ధిచేస్తే పెట్రోలు, డీజిల్, కిరోసిన్, విమాన ఇంధనం, సింథటిక్ రబ్బరు, బెంజిన్, పాలిమర్స్, గ్రీజు మొదలైన పదార్థాలు వెలువడతాయి. ఒక బారెల్ ముడి చమురు నుంచి 42% పెట్రోల్, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% లూబ్రికెంట్స్, 4% లిక్విడ్ గ్యాస్, 18% ఇతర పదార్థాలు లభిస్తాయి.

సహజ వాయువు దేశంలో సహజ వాయువు నిక్షేపాలు పరిమితంగా ఉన్నాయి. వాటి అన్వేషణ, ఉత్పత్తిని ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా నిర్వహిస్తున్నాయి. సహజ వాయువులో ప్రధాన మూలకాలు ఈథేన్, మీథేన్. ఎల్‌పీజీలో ప్రొపేన్, బ్యూటేన్, పెంటేన్, హెక్సేన్ ఉంటాయి. సహజ వాయువులో ఎక్కువ మొత్తంలో హైడ్రోజన్ సల్ఫైడ్ లేదా ఇతర సేంద్రియ సల్ఫర్ సమ్మేళనాలు ఉండటంతో దీనిని 'పుల్లని వాయువు' అంటారు. హైడ్రోజన్ సల్ఫైడ్ లేని కోల్ బెడ్ మీథేన్‌ను 'తీపి వాయువు' అంటారు. ◆ సహజ వాయువును అత్యధికంగా రసాయన ఎరువుల ఉత్పత్తిలో దాదాపు 40%, విద్యుత్తు ఉత్పత్తిలో 30%, గృహావసరాలు, వంటకు 10% ఉపయోగిస్తున్నారు. ◆ దేశం 2022లో 31.028 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బీసీఎం) సహజ వాయువును, 2023లో 26.304 బీసీఎం, 2024లో 22.856 బీసీఎం దిగుమతి చేసుకుంది. 2050 వరకు ఈ దిగుమతి ఏటా 4.9% వృద్ధి చెందుతుందని అంచనా. ఇరాన్, సౌదీ, యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు సహజ వాయువు దిగుమతి అవుతోంది. ◆ దేశంలో 2023-24 నాటి లెక్కల ప్రకారం 1,094 బిలియన్ క్యూబిక్ మీటర్ల నిల్వలు ఉన్నట్లు అంచనా. వీటిలో పశ్చిమ ప్రాంతంలో 31.28%, తూర్పు వైపున 24.07%, అస్సాంలో 15.03% నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువులో రాష్ట్రాల వారీగా అస్సాం అగ్రభాగాన ఉండగా, తర్వాతి స్థానాల్లో రాజస్థాన్, గుజరాత్, త్రిపుర, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. ◆ దేశంలో ముంబయి హై అతిపెద్ద సహజవాయు కేంద్రం. దేశం మొత్తం నిల్వల్లో 23.7% ఇక్కడే ఉంది. ఇదే కాకుండా ముంబయికి దక్షిణంగా ఉన్న బేసిన్ గ్యాస్‌ఫీల్డ్‌లోనూ భారీగా నిల్వలు ఉన్నాయి. ◆ కృష్ణా-గోదావరి బేసిన్‌లో రిలయన్స్ కేజీ, ఆర్-క్లస్టర్, శాటిలైట్ క్లస్టర్ లాంటి ప్రాజెక్టులతో పాటు, ఓఎన్‌జీసీ కేజీ-98 సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అస్సాంలో డిగ్బాయ్, సహర్కతియ, మోరాన్ లాంటి క్షేత్రాలు, త్రిపుర బేసిన్, గుజరాత్‌లోని గల్ఫ్ ఆఫ్ కంబాట్‌లోని అంకలేశ్వర్ ప్రధాన గ్యాస్ కేంద్రాలు.

అణుశక్తి న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియ ద్వారా అణుశక్తి సృష్టించవచ్చు. ఇందులో యురేనియం, థోరియం, ఫ్లుటోనియం తదితర మూలకాలను ఉపయోగిస్తారు. యురేనియం న్యూక్లియస్ అణువు థర్మల్ పవర్ ప్లాంటులో ఒక కార్బన్ అణువు ఉత్పత్తిచేసే శక్తికి 10 మిలియన్ రెట్లు ఎక్కువ ఉత్పత్తిచేస్తుంది. శిలాజ ఇంధనాల తరిగిపోయే స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే దేశ ఆర్థికాభివృద్ధికి అణుశక్తి చాలా అవసరం. భారత్‌లో మొత్తం విద్యుత్తులో 2.8% వాటాతో అణుశక్తి నాలుగో అతిపెద్ద విద్యుత్తు వనరుగా మారింది. 2024, నవంబరు నాటికి 8,180 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసే 23కి పైగా అణు రియాక్టర్లు, 7 విద్యుత్తు ప్లాంట్లు ఉన్నాయి. 1954లో ట్రాంబే వద్ద అటామిక్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైంది. 1969లో ముంబయి దగ్గర తారాపుర్‌లో 320 మెగావాట్ల సామర్థ్య అణుశక్తి కేంద్రాన్ని స్థాపించారు. చివరిగా 2025లో రాజస్థాన్‌లోని రావత్‌భటాలో రాజస్థాన్ అణుశక్తి కేంద్రం-యూనిట్ 7 ప్రారంభమైంది (700 మెగావాట్ల సామర్థ్యం).



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

కంటిచూపునకు 'ఎ'.. సౌందర్య పోషణకు 'ఇ'!

మానవ శరీర పోషణకు, ఆరోగ్యానికి కావాల్సిన సూక్ష్మ పోషకాలే విటమిన్లు. అవయవాలన్నీ సక్రమంగా పని చేసేందుకు, రోగనిరోధక శక్తికి అవి చాలా అవసరం. కంటిచూపు సరిగ్గా ఉండాలన్నా, ఎముకలు దృఢంగా మారాలన్నా, చర్మం, జుట్టు అందంగా కనిపించాలన్నా రకరకాల విటమిన్లు ఆహారంలో భాగంగా మారాలి. శరీర రక్షణ, పోషణలో కీలకమైన విటమిన్లు, అవి లభించే ఆహార పదార్థాలు, వాటి లోపంతో వచ్చే ఆరోగ్య సమస్యలపై పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి. ఒక్కో విటమిన్ చేసే మేలు, వాటి రసాయన నామాలు, ప్రత్యామ్నాయ పేర్లనూ గుర్తుంచుకోవాలి.



జనరల్ స్టడీస్ - బయాలజీ

విటమిన్లు

1. విటమిన్-సి గురించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) దీని రసాయనిక నామం ఆస్కార్బిక్ ఆమ్లం.
బి) ఈ విటమిన్ లోపం వల్ల కలిగే వ్యాధి స్కర్వీ.
సి) రోజ్‌హిప్ ఫలాల్లో విటమిన్-సి అత్యధికంగా ఉంటుంది.
డి) అధిక వేడికి నశించిపోతుంది.



1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) ఎ, డి

2. కింది వాటిలో విటమిన్-సి కి సంబంధించి సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని 'యాంటీహిస్టమైన్ ఫ్యాక్టర్' అంటారు.
బి) రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రక్రియ అయిన అథిరోస్క్లీరోసిస్‌ను ఇది తగ్గిస్తుంది.
సి) చిన్నపేగులో ఇనుము శోషణకు ఈ విటమిన్ అవసరం.
డి) పాలలో ఎక్కువగా ఉంటుంది.
ఇ) కాలేయంలో నిల్వ ఉంటుంది.
1) డి, ఇ 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి

3. విటమిన్-సి మనకు ఏ విధంగా ఉపయోగపడుతుంది?
ఎ) గాయాలు మానడానికి
బి) వ్యాధి నిరోధక శక్తికి
సి) చర్మంలో కొల్లాజన్ తయారీకి
డి) అథిరోస్క్లీరోసిస్‌ను నిరోధించడానికి
1) ఎ, డి 2) బి, సి
3) సి, డి 4) ఎ, బి, సి, డి

4. కింది వాటిని జతపరచండి.

విటమిన్	రసాయన నామం
ఎ) విటమిన్-సి	1) సైనకోబాలమైన్
బి) విటమిన్-డి	2) టోకోఫెరాల్
సి) విటమిన్-ఇ	3) కాల్సిఫెరాల్
డి) విటమిన్-కె	4) ఫిల్లోక్వినోన్
ఇ) విటమిన్-బి12	5) ఆస్కార్బిక్ ఆమ్లం

1) ఎ-3, బి-2, సి-1, డి-4, ఇ-5
2) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1
3) ఎ-4, బి-3, సి-1, డి-2, ఇ-5
4) ఎ-1, బి-4, సి-3, డి-2, ఇ-5


5. విటమిన్-డి గురించి కింది వాక్యాలను పరిగణించండి.
ఎ) చిన్నపేగు నుంచి క్యాల్షియం శోషణకు ఇది అవసరం.
బి) శరీర ద్రవాల్లో క్యాల్షియం, ఫాస్ఫరస్ సమతుల్యతకు ఉపయోగపడుతుంది.
1) ఎ, బి సరైనవి.
2) ఎ, బి సరికావు.
3) ఎ, సరైంది బి, సరికాదు.
4) ఎ సరికాదు, బి సరైంది.

6. కింది వాటిని జతపరచండి.

విటమిన్	లభించే ఆహార పదార్థాలు
ఎ) విటమిన్-ఎ	1) ఆకుకూరలు, సోయా
బి) విటమిన్-సి	2) కాడ్ చేప కాలేయపు నూనె
సి) విటమిన్-డి	3) ఉసిరి
డి) విటమిన్-ఇ	4) గోధుమ బీజకవచ నూనె
ఇ) విటమిన్-కె	5) క్యారెట్, బొప్పాయి

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1
3) ఎ-3, బి-4, సి-1, డి-2, ఇ-5
4) ఎ-1, బి-3, సి-4, డి-2, ఇ-5

7. విటమిన్-డి కి సంబంధించి, కింది వాటిలో సరైనవి గుర్తించండి.
ఎ) దీన్ని లోపంతో చిన్నపిల్లల్లో రికెట్స్ వ్యాధి వస్తుంది.
బి) పెద్దవారిలో దీని లోపం వల్ల ఆస్టియో మలాసియా వ్యాధి వస్తుంది.
సి) కాడ్ చేప నూనె, వెన్న, కాలేయం లాంటి వాటిలో విటమిన్- డి ఉంటుంది.
డి) చర్మంలోని 7-డి హైడ్రో కొలెస్ట్రాల్ సూర్యరశ్మి సోకడం వల్ల విటమిన్-డి గా మారుతుంది.



రికెట్స్

1) ఎ, బి, సి, డి 2) బి, సి
3) సి, డి 4) ఎ, డి

8. కింది వాటిలో విటమిన్-ఎ వల్ల కలగని వ్యాధులను గుర్తించండి.
ఎ) రేచీకటి బి) స్కర్వీ
సి) క్సీరాప్థాల్మియా డి) రికెట్స్
ఇ) కెరాటోమలేసియా
1) ఎ, బి, సి 2) బి, డి 3) సి, ఇ 4) ఎ, ఇ


9. కింది వాటిని జతపరచండి.

విటమిన్	లోపం వల్ల కలిగే వ్యాధి
ఎ) విటమిన్-ఎ	1) రక్తం గడ్డకట్టడంలో ఆలస్యం
బి) విటమిన్-సి	2) వంధ్యత్వం
సి) విటమిన్-డి	3) స్కర్వీ
డి) విటమిన్-ఇ	4) రికెట్స్
ఇ) విటమిన్-కె	5) రేచీకటి

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-5, బి-3, సి-4, డి-2, ఇ-1
3) ఎ-1, బి-5, సి-4, డి-2, ఇ-3
4) ఎ-1, బి-2, సి-5, డి-4, ఇ-3

10. విటమిన్-ఎ కు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) దీని రసాయనిక నామం 'రెటినాల్'
బి) దీని లోపం వల్ల కలిగే వ్యాధి రేచీకటి
సి) దీన్ని 'విటమిన్ ఆఫ్ గ్రోత్' అంటారు
డి) కంటిలో అశ్రు గ్రంథుల పనితీరుకు ఇది అవసరం.
1) ఎ, డి 2) బి, సి
3) ఎ, బి 4) ఎ, బి, సి, డి

11. కింది వాక్యాలను పరిశీలించి, సరైన జవాబును ఎన్నుకోండి.



ఎ) క్యారెట్, బొప్పాయిలో ఉండే కెరొటిన్ మన కాలేయంలో విటమిన్-ఎ గా మారుతుంది.
బి) రేచీకటికి మరో పేరు 'నిక్టలోపియా'.
1) ఎ, బి సరైనవి; ఇవి ఒకదాంతో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి.
2) ఎ సరైంది, బి సరికాదు; ఇవి వేర్వేరు అంశాలు.
3) ఎ, బి సరికావు; ఇవి ఒకదాంతో ఒకటి సంబంధం లేని వాక్యాలు.
4) ఎ సరికాదు, బి సరైంది; ఇవి ఒకే అంశానికి చెందినవి.

12. కింది వాటిని జతపరచండి.

విటమిన్	ప్రత్యామ్నాయ పేరు
ఎ) విటమిన్-ఎ	1) కొయాగ్యులేషన్ విటమిన్
బి) విటమిన్-సి	2) యాంటీ రికెట్స్ విటమిన్
సి) విటమిన్-డి	3) యాంటీ స్కర్వీ విటమిన్
డి) విటమిన్-ఇ	4) యాంటీ స్టెరిలిటీ విటమిన్
ఇ) విటమిన్-కె	5) యాంటీ క్సీరాప్థాల్మిక్ విటమిన్

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1
3) ఎ-3, బి-4, సి-2, డి-1, ఇ-5
4) ఎ-1, బి-3, సి-2, డి-5, ఇ-4

13. విటమిన్-ఎ కు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) దీన్ని 'యాంటీ ఇన్‌ఫెక్టివ్ విటమిన్' అంటారు.
బి) ఈ విటమిన్ లోపంతో కళ్లు పొడి బారడంతో పాటు రేచీకటి కలుగుతుంది.
సి) చేప కాలేయపు నూనెలో ఈ విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, బి 4) ఏదీకాదు

14. విటమిన్-ఎ కు సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
ఎ) క్యారెట్, బొప్పాయిలో కెరొటిన్ రూపంలో ఉంటుంది.
బి) దీని లోపం వల్ల చిన్నారుల్లో పోషకాహార అంధత్వం కలుగుతుంది.
సి) జంతు సంబంధ ఆహార పదార్థాల్లో ఈ విటమిన్ ఉండదు.
డి) ఇది రక్తం గడ్డకట్టడానికి, ఎముకల పెరుగుదలకు అవసరం.
1) ఎ, బి 2) సి, డి 3) ఎ, డి 4) బి, డి

15. విటమిన్-కె గురించి కింది వాక్యాలను పరిశీలించి, తప్పుగా ఉన్నవాటిని గుర్తించండి.
ఎ) ఇది రక్తం గడ్డ కట్టడానికి పరోక్షంగా ఉపయోగపడుతుంది.
బి) పేగులోని బ్యాక్టీరియా దీన్ని కొంతవరకు తయారుచేస్తుంది.
సి) దీన్ని 'యాంటీ హెమరేజిక్ కారకం' అంటారు.
డి) ఆహారం నుంచి ఇది లభించదు.
1) సి, డి 2) ఎ 3) డి 4) బి

16. కింది వాటిని జతపరచండి.

విటమిన్	ఉపయోగం
ఎ) విటమిన్-కె	1) అశ్రు గ్రంథుల పనితీరుకు
బి) విటమిన్-ఇ	2) చిన్నపేగులో క్యాల్షియం శోషణకు
సి) విటమిన్-డి	3) బీజకోశాల పనితీరుకు
డి) విటమిన్-సి	4) చిన్నపేగులో ఇనుము శోషణకు
ఇ) విటమిన్-ఎ	5) రక్తం గడ్డ కట్టడానికి

1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
2) ఎ-5, బి-4, సి-3, డి-2, ఇ-1
3) ఎ-1, బి-4, సి-2, డి-5, ఇ-3
4) ఎ-5, బి-3, సి-2, డి-4, ఇ-1

17. కింది వాక్యాలను పరిగణించండి.
ఎ) విటమిన్ ఎ, సి, ఇ, కె లు యాంటీఆక్సిడెంట్‌లుగా పనిచేస్తాయి.
బి) యాంటీ ఆక్సిడెంట్‌లు కణాల్లో స్వేచ్ఛా అయాన్ల వల్ల కలిగే నష్టాన్ని అడ్డుకుంటాయి.
1) ఎ సరైంది, బి సరికాదు.
2) బి సరైంది, ఎ సరికాదు.
3) ఎ, బి సరైనవి. 4) ఎ, బి సరికావు.

18. విటమిన్-ఇ కు సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) దీన్ని 'సౌందర్య పోషక విటమిన్' అంటారు.
బి) క్రీడాకారులు, వ్యాయామం చేసేవారికి ఈ విటమిన్ అవసరం.
సి) అథిరోస్క్లీరోసిస్, వెరికోస్ వీన్స్ వ్యాధులను తగ్గిస్తుంది.
డి) గోధుమ బీజకవచ నూనెలో ఎక్కువగా ఉంటుంది.
1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) సి, డి 4) ఎ, సి, డి



19. మన శరీరంలో విటమిన్ల పనితీరుకు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
ఎ) కంటిలోని రెటినాలో ఉన్న దండ కణాల పనితీరుకు విటమిన్-ఎ అవసరం.
బి) చర్మంలో కొల్లాజన్ తయారీకి విటమిన్-సి కావాలి.
సి) క్యాల్షియం, ఫాస్ఫరస్‌ల సమతాస్థితికి విటమిన్-డి తప్పనిసరి.
డి) రక్తం గడ్డ కట్టడానికి కావాల్సిన కారకాల తయారీకి విటమిన్-కె ఉండాలి.
1) ఎ, డి 2) బి, సి
3) సి, డి 4) ఎ, బి, సి, డి



రచయిత: డాక్టర్ బి. నరేష్

సమాధానాలు

1-2, 2-1, 3-4, 4-2, 5-1, 6-2, 7-1, 8-2, 9-2, 10-4, 11-1, 12-2, 13-1, 14-2, 15-3, 16-4, 17-3 18-2, 19-4.

దిల్లీపై నిఘా కన్ను

- కలవరపెడుతున్న 1,000 పార్కింగ్ ప్రాంతాలు
- వదిలేసిన వాహనాల్ని తొలగించనున్న పోలీసులు
- పంజాబ్‌లో 2.5 కిలోల ఆర్డీఎక్స్ స్వాధీనం

దిల్లీ: గణతంత్ర వేడుకల నేపథ్యంలో ఉగ్రవాదులు విధ్వంస చర్యలకు పాల్పడవచ్చనే అనుమానాలతో బలగాలు దిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. దాదాపు వెయ్యి పార్కింగ్ ప్రదేశాలపై అవి ప్రత్యేకంగా దృష్టిసారించాయి. ఎవరూ తీసుకుపోని కార్లు అలాంటి ప్రదేశాల్లో కనిపిస్తే వాటిని తొలగిస్తున్నారు.



గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జమ్మూకశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద తనిఖీ చేస్తున్న సైనికులు

ఎలాంటి పర్యవేక్షణలేని ఈ ప్రదేశాలతో ముప్పు తలెత్తే ప్రమాదం ఉందని, పలుచోట్ల సీసీటీవీ కెమెరాలూ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. వీటిలో ఎక్కువ స్థలాలు మెట్రో స్టేషన్లకు సమీపంలో ఉన్నాయి. ఎవరూ తీసుకువెళ్లని వాహనాలను వెంటనే జప్తు చేయాలని జిల్లా విభాగాలకు పోలీసు శాఖ తెలిపింది. గతంలో ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుకు వాడిన కారు అక్కడే కొన్నిగంటలపాటు నిలిపి ఉంచినట్లు తర్వాత బయటపడటంతో అలాంటివి జరగకుండా ఈసారి నిఘాను మరింత ముమ్మరం చేశారు. భద్రత కోసం 30 వేల మంది పోలీసులను, 70 కంపెనీల పారామిలిటరీ బలగాలను ఉపయోగిస్తున్నారు. కవాతులో పాల్గొనే దళాలు, విభాగాలు శనివారం పూర్తిస్థాయి కసరత్తు చేశాయి. దీనిలో 2,500 మంది కళాకారులూ పాలుపంచుకున్నారు. ఈ బృందంలో ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ తదితరులు ఉన్నారు. విమాన విన్యాసాల అభ్యాసం కూడా పూర్తయింది. 150 ఏళ్ల వందేమాతరం అనే ఇతివృత్తంతో గంటన్నరసేపు కవాతు కొనసాగనుంది.

ఉగ్ర కుట్ర భగ్నం

రిపబ్లిక్ డే వేడుకల్లో దాడులకు కుట్ర పన్నిన బబ్బర్‌ఖల్సా ఇంటర్నేషనల్ ముఠాను నిఘా అధికారులు, పోలీసులు పంజాబ్‌లో పట్టుకొన్నారు. ఐదుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసి, వారి నుంచి 2.5 కిలోల ఆర్డీఎక్స్‌ను, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. అమెరికా నుంచి నడిపిస్తున్న కొంతమంది ఆదేశాల మేరకు నిందితులు పలు ప్రాంతాల్లో దాడులకు కుట్రలు చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఉగ్రవాద ముఠాలు మరిన్ని దాడులకు కుట్రలు చేస్తుండడంతో దేశ రాజధాని దిల్లీ సహా ముఖ్యనగరాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

పంజాబ్‌లో రైలు పట్టాలపై పేలుడు

పంజాబ్‌లోని ఫతేగఢ్‌సాహిబ్ జిల్లాలోని సర్‌హింద్‌లో సరకు రవాణా నడవాలో శుక్రవారం రాత్రి సంభవించిన పేలుడులో లోకో పైలట్ స్వల్పంగా గాయపడ్డారు. రైలింజిన్ దెబ్బతింది. దీనికి తామే పాల్పడినట్లు 'ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్' ప్రకటించుకుంది. ఇది ప్రారంభం మాత్రమేనని, ఖలిస్థాన్ కోసం పోరు కొనసాగుతుందని తెలిపింది. ప్రాణనష్టం నివారించడానికే ప్రయాణికుల రైళ్లలో కాకుండా గూడ్సురైలు మార్గంలో ఈ పని చేసినట్లు వెల్లడించింది.

తరాల వారసత్వ ప్రతీక..
గణతంత్ర కవాతు

- ఈసారి ఎన్నో ప్రత్యేకతలు
- నేడు దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి



దిల్లీ: గణతంత్ర వేడుకల సందర్భంగా సోమవారం దిల్లీలో కర్తవ్యపథ్ వద్ద జరిగే కవాతులో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాలవారు పాల్గొనడం ఒక ప్రత్యేకతగా నిలవనుంది. స్టాఫ్‌లో ఒక దళానికి విశ్రాంత లెఫ్టినెంట్ అమిత్ చౌదరి (అరుణాచల్‌ప్రదేశ్) నేతృత్వం వహించనున్నారు. "గణతంత్ర కవాతులో పాల్గొనాలనేది ఎప్పటినుంచో నా కల. చిన్నప్పుడు వీటిని టీవీలో చూసేవాడిని. ఇంట్లోనే కవాతు చేసేవాడిని. మా తండ్రి 1990లో ఇలాంటి కవాతులో గార్డుల బ్రిగేడ్ తరఫున పాల్గొన్నారు" అని ఆయన మీడియాకు తెలిపారు.

✦ కెప్టెన్ సమీరా జడ్ బుట్టర్ 'సమీకృత కార్యకలాప కేంద్రం' ప్రదర్శనకు ఒక దళానికి నాయకత్వం వహించనున్నారు. సైన్యంతో అనుబంధం పరంగా ఆమెది నాలుగో తరం. తన తండ్రి, తాత, ముత్తాత కూడా సైన్యంలో పనిచేశారని, తాను పరేడ్‌లో భాగం పంచుకోనుండటం ఎంతో గర్వంగా అనిపిస్తోందని ఆమె తెలిపారు. తన తాత బ్రిగేడియర్ సంపూరణ్ సింగ్‌కు మహా వీర్‌చక్ర, వీర్‌చక్ర శౌర్య పతకాలు లభించాయని చెప్పారు. తమ దళం ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తూ వీక్షకుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతుందన్నారు.

✦ ఈసారి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆదివారం రాత్రి 7 గంటలకు జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

గుర్రాలు.. ఒంటెలు.. డేగలు.. జాగిలాలు

కెప్టెన్ అహానకుమార్ (26) ఈసారి కవాతులో అశ్విక దళానికి నేతృత్వం వహించనున్నారు. ఆయన దిల్లీ ప్రాంత 'జనరల్ ఆఫీసర్ కమాండింగ్'గా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ మనవడు. రణ్‌వీర్ అనే గుర్రంతో గత ఏడాది కవాతులోనూ అహాన్ పాల్గొన్నారు.


✦ గుర్రాలు, రెండు మూపురాల ఒంటెలు, డేగలు, జాగిలాలు కూడా ఈసారి వీక్షకులకు కనువిందు చేయనున్నాయి. సైన్యంలో భాగంగా అవి గొప్ప సేవలు అందిస్తుంటాయని ఈ దళానికి నేతృత్వం వహించనున్న కెప్టెన్ హర్షిత రాఘవ్ చెప్పారు. తన తండ్రి కూడా వాయుసేనలో పనిచేశారని తెలిపారు.

✦ సైన్యంతో అనుబంధం ఉన్న కుటుంబంలో మూడో తరానికి చెందిన కెప్టెన్ వికాస్ యాదవ్ ఈసారి గూర్ఖారైఫిల్స్‌లో నాలుగో పటాలానికి నేతృత్వం వహిస్తారు. మానవరహిత వాహనాల దళమిది. సైన్యంలోని సైనికులకు, జంతువులకు ప్రాణహాని ఉందనుకున్నప్పుడు వీటిని వాడతారని యాదవ్ తెలిపారు.

తొలి వేడుకల ఖర్చు రూ.11,250

1950లో తొలిసారి గణతంత్ర వేడుకల్ని జరిపినప్పుడు దిల్లీ పరిపాలన యంత్రాంగం చేసిన ఖర్చు రూ. 11,250. పునరావాస శిబిరాలు, గ్రామీణ పాఠశాలల్లో పిల్లలకు బొమ్మలు, మిఠాయిలు పంచి ఆ వేడుకను ముగించారు. ఆ ఏడాది ఎక్కడా పెద్దగా హంగామా లేకుండా, ఖర్చుల భారం పడకుండా వేడుకలు పూర్తిచేశారని పురాతన పత్రాలు చెబుతున్నాయి.

తెల్లగా ఉంటాను.. వెన్నెల్లో మెరుస్తాను



మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ ప్రాంతంలో ఆకులన్నీ రాలిపోయి.. తెల్లని కాండంతో, కొత్త పూతతో కనిపిస్తున్న ఈ చెట్టు పేరు తపసి. ఈ చెట్ల నుంచి గమ్ కరయగా ప్రసిద్ధి చెందిన తపసి బంక (జిగురు)ను గిరిజనులు సేకరిస్తారు. ఈ జిగురును ఔషధాలు, కాస్మెటిక్స్ తయారీలో వాడతారు. తెల్లని బెరడును కలిగే ఉండే ఈ చెట్లు వెన్నెల రాత్రుల్లో మెరిసినట్లు కనిపిస్తాయని.. దీంతో ఘోస్ట్ ట్రీ అని కూడా పిలుస్తుంటారని జన్నారం అటవీ డివిజనల్ అధికారి రామ్‌మోహన్ వివరించారు. – న్యూస్‌టుడే, జన్నారం

ట్రంప్ చేతిపై గాయం..
అధ్యక్షుడి ఆరోగ్యంపై మరోసారి చర్చ



ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై మరోసారి చర్చ ప్రారంభమైంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన ఎడమ చేతిపై గాయం కన్పించడమే దానికి కారణం. దీనిపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. శాంతి మండలి కార్యక్రమంలో టేబుల్ చివరిభాగం తగలడంతో అధ్యక్షుడి చేతికి గాయమైందన్నారు. ట్రంప్ కూడా దీనిపై స్పందిస్తూ.. తాను ఆరోగ్యంగా ఉన్నానని, దెబ్బకు బిళ్ల తీసుకున్నానని వెల్లడించారు. గతంలో కూడా ట్రంప్ చేతికి ఇలాంటి గాయాలున్న ఫొటోలు కన్పించాయి. అప్పుడూ ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారన్న వార్తలు వచ్చాయి. శ్వేతసౌధం వాటిని వెంటనే ఖండించింది. రక్తనాళాల్లో సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయిందని, అది వృద్ధుల్లో సాధారణంగా కనిపించేదేనని వెల్లడించింది.

చైనాతో వాణిజ్య ఒప్పందమా.. కెనడాపై 100% సుంకాలు వేస్తాం: ట్రంప్

వాషింగ్టన్: చైనాతో వాణిజ్య ఒప్పందంపై కెనడా గానీ ముందుకు వెళ్తే...ఆ దేశం నుంచి తాము దిగుమతి చేసుకునే వస్తువులపై 100శాతం సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరించారు. అమెరికాలోకి చైనా వస్తువులను తీసుకురావడానికి కెనడాను ఓ వేదికగా మార్చవచ్చని కెనడా అధ్యక్షుడు మార్క్ కార్నీ భ్రమపడుతున్నారని సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. గ్రీన్‌లాండ్‌పై తాను ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థను కెనడా తిరస్కరించడంపై నిప్పులు చెరిగారు. దీనికి కెనడా తగిన మూల్యం చెల్లించుకుంటుందంటూ 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. "గోల్డెన్ డోమ్ నిర్మాణంతో కెనడాకు కూడా రక్షణ లభిస్తుంది. అయినా వారు మా ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. బదులుగా చైనాతో వ్యాపారం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఏడాదిలోపే చైనా వారిని తినేస్తుంది" అని ట్రంప్ రాసుకొచ్చారు. తాజాగా దావోస్ వేదికగా జరిగిన ప్రపంచ ఆర్థిక వేదికలో గ్రీన్‌లాండ్‌పై సుంకాలను కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో గాజా శాంతిమండలిలో చేరాలంటూ ఆ దేశానికి పంపిన ఆహ్వానాన్ని ట్రంప్ వెనక్కు తీసుకున్న విషయం తెలిసిందే.

పెంగ్విన్‌తో ట్రంప్..

గ్రీన్‌లాండ్‌పై వైట్‌హౌస్ పెట్టిన ఓ పోస్టు తీవ్ర చర్చకు దారితీసింది. ట్రంప్ పెంగ్విన్‌తో గ్రీన్‌లాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న ఏఐ ఫొటోను అది పోస్టు చేసింది. 'పెంగ్విన్‌ను ఆలింగనం చేసుకోండి' అని రాసుకొచ్చింది. ఇది సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతుండగా.. నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రీన్‌లాండ్‌లో పెంగ్విన్‌లు నివసించవంటూ నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు.



ఇమ్మిగ్రేషన్ అధికారుల కాల్పుల్లో ఒకరి బలి

మినియాపొలిస్: అమెరికాలోని మినియాపొలిస్‌లో ఫెడరల్ ఇమిగ్రేషన్ అధికారులు జరిపిన కాల్పుల్లో 51 ఏళ్ల వ్యక్తి ఒకరు చనిపోయారు. వలసలపై ట్రంప్ సర్కారు కొరడా ఝళిపిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. కాల్పులకు దారితీసిన పరిస్థితులు ఇంకా బహిర్గతం కాలేదు. ఆ వ్యక్తి వద్ద ఒక తుపాకీ, రెండు తూటా అరలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. తాజా ఘటనపై మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రం నుంచి హింసాత్మక, శిక్షణలేని అధికారులను తక్షణం వెనక్కి తీసుకోవాలని ట్రంప్ సర్కారును డిమాండ్ చేశారు. ఇటీవల రీనీ గుడ్ అనే మహిళ కాల్చివేత నేపథ్యంలో ఇక్కడ భారీగా నిరసనలు జరుగుతున్నాయి. తాజా కాల్పుల అనంతరం కూడా ప్రజలు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఫెడరల్ అధికారులపై మండిపడ్డారు.



మినియాపొలిస్‌లో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ప్రజలు

త్రివర్ణ సైనికుడు



మనం చేసే వృత్తి ద్వారానే దేశభక్తిని చాటవచ్చని నిరూపిస్తున్నారు హనుమకొండలోని మచిలీబజార్‌కు చెందిన యాకూబ్ పాషా. సాధారణంగా స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలప్పుడు జెండా గద్దెలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతుంటాం. పాఠశాలలు, కార్యాలయాల్లో సిబ్బంది ఆ పని చూసుకుంటారు. కొన్నిచోట్ల గద్దెలను ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి కళావిహీనంగా మారతాయి. వృత్తిరీత్యా పెయింటర్ అయిన యాకూబ్ పాషా రెండేళ్ల కిందట ఇలా ఓ గద్దె రంగులుపోయి ఉండడం చూసి సరికొత్తగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి ఇలాంటి గద్దెలను గుర్తించి సొంత ఖర్చుతో రంగులు వేస్తున్నారు. గత నాలుగు రోజులుగా 120 గద్దెల వరకు రంగులు వేశారు. – న్యూస్‌టుడే, వరంగల్ సాంస్కృతికం

బంగ్లాదేశ్ నుంచి చేపల పడవలో వక్కపొడి అక్రమ రవాణా

- 2,600 కేజీల సరకు పట్టివేత

దిల్లీ: బంగ్లాదేశ్ నుంచి చేపల పడవలో మన దేశానికి తీసుకువస్తున్న 2,600 కేజీల వక్కపొడిని భారత తీరగస్తీ దళం (కోస్టుగార్డ్) స్వాధీనం చేసుకుంది. నిఘా సమాచారం ఆధారంగా బలగాలు గాలింపు చేపట్టగా 'లక్ష్మీనారాయణ్' అనే పడవ కనిపించింది. దీనిలో ఎవరూ లేరు. పడవను క్షుణ్నంగా గాలించగా ఒక్కొక్కటి యాభై కిలోల బరువున్న 52 వక్కపొడి బస్తాలు లభ్యమయ్యాయి. పడవను పశ్చిమబెంగాల్‌లోని ఫ్రెజర్‌గంజ్‌కు తరలించారు.



హిమాచల్‌ప్రదేశ్‌లో మంచుతో నిండిన కల్కా-శిమ్లా మార్గంలో వెళ్తున్న రైలు



జమ్మూకశ్మీర్‌లోని బద్గాం జిల్లా ఖాగ్‌లో తాజాగా కురిసిన మంచు

సింగపూర్‌లో మెరవనున్న రాష్ట్ర హస్తకళా రూపాలు

ఈనాడు, అమరావతి: సింగపూర్‌లోని భారత హై కమిషనర్ కార్యాలయంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో రాష్ట్రానికి చెందిన హస్తకళా రూపాలు మెరవనున్నాయి. ఈ వేడుకల్లో పాల్గొనే అతిథులకు వాటిని బహుమతులుగా అందివ్వనున్నారు. ఇందుకోసం సింగపూర్‌లోని భారత హై కమిషనర్ కార్యాలయం 400 గిఫ్ట్ బాక్సులకు లేపాక్షి అధికారులకు ఆర్డర్ పెట్టింది. ఒక్కో బాక్సులో సీతాదేవి లెదర్ పప్పెట్రీ, ఏనుగు ఆకారపు బ్యాగేజ్ ట్యాగ్ తదితర కళారూపాలు ఉండనున్నాయి. ఏపీ హస్తకళా రూపాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంపై ఆ శాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో విదేశాల్లోనూ లేపాక్షి షోరూంలు ఏర్పాటు చేయనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

అంతరిక్ష వ్యర్థాలు నేలకూలే ప్రాంతాన్ని పసిగట్టొచ్చు

- సరికొత్త విధానం సిద్ధం

ఈటీవీ భారత్: భూమి చుట్టూ అనేక ఉపగ్రహాలు ఉంటున్నాయి. ఇంధనం ఖాళీ అయ్యాక అవి అంతరిక్ష వ్యర్థాలుగా మారుతున్నాయి. వాటిని సురక్షితంగా నియంత్రిత పద్ధతిలో భూ వాతావరణంలోకి తిరిగిరప్పించి, మండించడం లేదా 'శ్మశాన కక్ష్య'లోకి పంపడం చేస్తున్నారు. అయినా అవి భూ వాతావరణంలోకి అనూహ్యంగా తిరిగి ప్రవేశించే ముప్పు పొంచి ఉంటోంది. ఉపగ్రహం అర్ధాంతరంగా విఫలమై, భూమి నుంచి ఆదేశాలను అందుకోలేని పరిస్థితుల్లో ఈ ప్రమాదం ఎక్కువ. ఇలాంటి ఉపగ్రహాలు భూ వాతావరణంలో మండిపోలేని పరిస్థితి ఉంటే అవి నేలపై పడతాయి. అది మానవులకు ప్రమాదకరం. ఈ నేపథ్యంలో ఉపగ్రహాలు నేలకూలే ప్రదేశాలను ముందుగానే గుర్తించడానికి అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చారు. దీనివల్ల శకలాల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. నేలపై పడ్డాక వాటిని వేగంగా తొలగించడానికి వీలవుతుంది. కొన్నిసార్లు ఇవి విషతుల్యం కావొచ్చు. అందువల్ల వాటిని ప్రజలు తాకడానికి ముందే సురక్షితంగా తొలగించాల్సి ఉంటుంది.

శకలాలు పయనాన్ని గుర్తించడానికి శాస్త్రవేత్తలు.. భూకంపాన్ని లెక్కించే సైస్మోమీటర్లతో కూడిన నెట్‌వర్క్‌ను ఉపయోగించారు. అంతరిక్ష వ్యర్థాలు.. ధ్వని కన్నా వేగంగా భూ వాతావరణంలోకి దూసుకొస్తాయి. ఈ క్రమంలో అవి యుద్ధవిమానాల తరహాలో పెద్ద శబ్దాన్ని కలిగిస్తాయి. వీటిని సోనిక్ బూమ్స్‌ను అంటారు. ఈ తరంగాలు నేలపైనున్న సైస్మోమీటర్లను తాకి వాటిని క్రియాశీలం చేస్తాయి. ఇలా క్రియాశీలమైన సాధనాల తీరును మ్యాప్ చేయడం ద్వారా శకలాల ప్రయాణ మార్గాన్ని, అవి పడే ప్రదేశాన్ని నిర్ధారించొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. 2024 ఏప్రిల్ 2న చైనాకు చెందిన షెన్‌ఝౌ-15 వ్యోమనౌకకు సంబంధించిన శకలాల గమనాన్ని శాస్త్రవేత్తలు ఈ పద్ధతిలో ప్రయోగాత్మకంగా విశ్లేషించగలిగారు. ఇందుకోసం దక్షిణ కాలిఫోర్నియాలోని 125 సైస్మోమీటర్ల డేటాను ఉపయోగించారు. ప్రస్తుతం శాస్త్రవేత్తలు ఈ తరహా కసరత్తు కోసం రాడార్ డేటాపై ఆధారపడుతున్నారు. అయితే కొన్నిసార్లు ఈ అంచనాలు తప్పుతున్నాయి. అందువల్ల ప్రస్తుత రాడార్ డేటాకు సైస్మిక్ డేటా తోడైతే మెరుగైన ఫలితాలు ఉంటాయని పరిశోధకులు తెలిపారు.

త్రైపాక్షిక చర్చలు నిర్మాణాత్మకం: ఉక్రెయిన్

కీవ్: రష్యా, అమెరికాలతో అబుధాబీలో జరిగిన రెండ్రోజుల చర్చలు నిర్మాణాత్మకంగా ముగిశాయని ఉక్రెయిన్ వెల్లడించింది. యుద్ధం ముగింపునకు కావాల్సిన పరామితులను దీనిలో చర్చించామని, మరిన్ని చర్చలు వచ్చేవారం జరిగే అవకాశం ఉన్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. తమ తమ దేశాలకు తిరిగివెళ్లి, చర్చల్లో ప్రతి అంశం గురించి దేశాధినేతలకు వివరించి, తదుపరి చర్యలేమిటో నిర్ణయించాలని దేశాలన్నీ తీర్మానించినట్లు వెల్లడించారు. తదుపరి సమావేశంలో చర్చించాల్సిన అంశాలను సైనిక ప్రతినిధులు గుర్తించారని, ఇది వచ్చేవారమే జరిగే అవకాశం ఉందని చెప్పారు. యుద్ధాన్ని ముగించే ప్రక్రియను అమెరికా పర్యవేక్షించి, నియంత్రణలో తీసుకోవాల్సిన అవసరం ఉందనే ఏకాభిప్రాయం కుదిరిందని తెలిపారు. అమెరికా తరఫున స్టీవ్ విట్కాఫ్, జేర్డ్ కుష్నర్‌లు దీనిలో పాల్గొన్నారు.

✦ ఉక్రెయిన్ విద్యుత్తు వ్యవస్థలపై రష్యా గురిపెట్టడంతో బహుళ అంతస్తుల భవనాల్లో ఉంటున్నవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. లిఫ్టులు పనిచేయడం లేదు. కీళ్ల అరుగుదల వ్యాధితో సతమతం అవుతున్న ఓ మహిళ.. 19వ అంతస్తులోని తన ఫ్లాటుకు మెట్లెక్కి వెళ్లలేక అవస్థ పడుతున్నారు. చాలాచోట్ల ఇప్పుడు మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.



మధ్యప్రదేశ్ అడవిలో
అరుదైన రేచు కుక్క

మధ్యప్రదేశ్‌లోని రతాపానీ పులుల అభయారణ్యంలో అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సమితి (ఐయూసీఎన్) గుర్తించిన అరుదైన ఆసియాటిక్ వైల్డ్‌డాగ్ కనిపించింది. 'ఢోల్' అని కూడా పిలిచే ఈ రేచు కుక్కను అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేర్చగా.. రతాపానీ అభయారణ్యంలో కనిపించడం ఇదే మొదటిసారి. పెట్రోలింగు సమయంలో ఈ కుక్క కెమెరా ట్రాప్‌నకు చిక్కినట్లు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్) శుభరంజన్ సేన్ తెలిపారు. జీవవైవిధ్యానికి ఇది శుభసూచకమన్నారు.

కుక్క మృతికి సంతాపసభ.. గ్రామమంతా ఒకటై వీడ్కోలు

రాజస్థాన్‌లోని బ్యావర్ జిల్లా రాజియావాస్ గ్రామంలో 'డాగ్ సా' అనే కుక్క ఇటీవల చనిపోగా, గ్రామస్థులంతా ఒకటై సొంత కుటుంబసభ్యుడిలా బరువెక్కిన హృదయాలతో తుది వీడ్కోలు పలికారు. గ్రామ కమ్యూనిటీ హాలులో సంతాపసభ నిర్వహించారు. వీధికుక్కలకు రొట్టెలు, బిస్కెట్లు పెట్టారు. భజన, కీర్తనలు ఏర్పాటుచేసి చిన్న పిల్లలకు ప్రసాదం పంచారు. భాజా భజంత్రీల నడుమ ఓ వాహనంతో అంతిమయాత్ర జరిపి, దహన సంస్కారాలు చేశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'డాగ్ సా' గ్రామస్థులతో ప్రత్యేక అనుబంధాన్ని కలిగి ఉండేదని గ్రామ సర్పంచి బ్రిజ్‌పాల్ సింగ్ రావత్ తెలిపారు. "ఊళ్లో ఎవరు చనిపోయినా వారి అంతిమయాత్రలో పాల్గొనేది. ఉత్తర క్రియలు అయ్యే దాకా ఆ ఇంటి ముందే ఉండేది" అన్నారు. అందుకే ఈ కుక్క మరణానంతరం మనిషితో సమానమైన పూర్తి గౌరవంతో తుది వీడ్కోలు పలికామని చెప్పుకొచ్చారు.





మంచు కురిసే వేళలో.. ఏడు జంటల సప్తపది

ఉత్తరాఖండ్‌లో శివపార్వతుల వివాహ వేదికగా భక్తులు విశ్వసించే త్రియుగీ నారాయణ్ క్షేత్రంలో మంచు వాన కురుస్తుండగా ఏడు జంటలు వివాహబంధంలోకి అడుగు పెట్టాయి. వధూవరుల సంప్రదాయ వస్త్రధారణ అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని మరింత రమణీయంగా మార్చింది. శుక్రవారం 'వసంత పంచమి' సందర్భంగా ఈ ఏడు జోడీలు రుద్రప్రయాగ్ జిల్లాలోని ఆలయానికి చేరుకున్నాయి. ఇదే ముహూర్తానికి ఉత్తరాఖండ్‌లో హిమపాతం ప్రారంభమై ఆకాశమే దీవిస్తున్నట్లుగా కొత్త జంటలు మురిసిపోయాయి. ఈ సీజనుకు తొలి హిమపాతం వసంత పంచమి రోజునే మొదలవడం విశేషం. పర్యాటకులు బంధుమిత్రులుగా మారి కొత్త జంటలను దీవించారు. ఈ వివాహ వేడుకలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. త్రియుగీ నారాయణ్ ఆలయంలో ఏడాది పొడవునా వివాహాల కోసం బుకింగులు జరుగుతుంటాయని స్థానికుడైన దివాకర్ గౌరోలా తెలిపారు.



మంచులో మేరత్ జంట

విదేశీ ఉద్యోగానికి టాటా..
రేగు సాగుతో లాభాల బాట



ఈటీవీ భారత్: బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన అమేశ్ విశాల్‌కు కంప్యూటర్ సైన్సులో ఇంజినీరింగు చేశాక మంచి వేతనంతో విదేశాల్లో ఉద్యోగం రాగా.. వ్యవసాయంపై మక్కువతో ఆ ఉద్యోగాన్ని వదిలేసి సొంతూరికి వచ్చేశారు. థాయ్‌లాండ్‌కు చెందిన మూడు ప్రత్యేకరకాల రేగుపండ్ల తోటలను సాగుచేస్తూ రూ.లక్షల్లో లాభాలు గడిస్తున్నారు. ఎకరం జాగాలో అన్ని రకాలు కలుపుకొని 350కు పైగా రేగుచెట్లు ఉన్నాయి. 2023లో వీటిని నాటడానికి, ఎరువులకు ప్రారంభ పెట్టుబడిగా దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టారు. గత రెండు పంట సీజన్లలో కలుపుకొని రూ.6 లక్షలదాకా ఆదాయం వచ్చింది. మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించి దాదాపు ఏడాదిపాటు పరిశోధన చేశాక రేగుపండ్ల తోటను పెంచాలని అమేశ్ ఓ నిర్ణయానికి వచ్చారు. సీజనులో ఒక్కో రేగుచెట్టు నుంచి 50 కిలోల పండ్లు వస్తాయి. "ఈ సాగును ఇంకా విస్తరించాలని అనుకొంటున్నా. వాతావరణపరంగా కొన్ని సవాళ్లు ఉన్నా అధిగమిస్తాను. మిగతా రైతులు కూడా సంప్రదాయ పంటలకు బదులుగా ఇలా కొత్త పంటలతో ప్రయోగాలు చేస్తే బిహార్ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయవచ్చు" అని అమేశ్ అన్నారు. చూడటానికి యాపిల్‌లా కనిపిస్తున్న ఈ రేగుపండ్లలో ఆరోగ్యానికి మేలు చేసే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికమని ఉద్యాన కళాశాల పండ్ల నిపుణురాలు దివ్యా తివారీ తెలిపారు.





అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌తో భేటీ అయిన చంద్రబాబు. చిత్రంలో శివప్రకాశ్

కేంద్ర మంత్రితో సీఎం భేటీ

ఈనాడు, అమరావతి: కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గన్నవరం విమానాశ్రయంలోని వీవీఐపీ లాంజ్‌లో శనివారం జరిగిన ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై వారు చర్చించారు. భేటీలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేశ్, భాజపా జాతీయ సహ సంఘటన ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ ఉన్నారు.

మహిళలకు సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సమాజంలో మహిళలు, బాలికలు శక్తిమంతమైనప్పుడు, రక్షణ పొందినప్పుడు, సమాన అవకాశాలు లభించినపుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. బాలికలను సాధికారత వైపు నడిపించడం ద్వారా దేశ నిర్మాణంలో వారిని భాగస్వాములు చేయాలనే లక్ష్యానికి కట్టుబడదామని పిలుపునిచ్చారు.

బాలికల భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి: నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: బాలికల హక్కులు, విద్య, భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. "సరైన నైపుణ్యాలు, అవకాశాలు కల్పిస్తే ఆకాశమే హద్దుగా బాలికలు రాణిస్తారు. వారిపై వివక్షను విడనాడదాం. వారికి సమాన అవకాశాలు కల్పిద్దాం" అని లోకేశ్ పేర్కొన్నారు.

'చంద్రబాబు, లోకేశ్‌లకు సవాలు విసిరే స్థాయి జోగి రమేశ్‌కు లేదు'

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లను విమర్శించే స్థాయి మాజీ మంత్రి జోగి రమేశ్‌కు లేదని కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి అన్నారు. "కల్తీ మద్యం కుట్ర కేసులో అడ్డంగా దొరికి...ఇప్పుడు మీడియా ముందు ఆయన అసత్యాలు చెబుతున్నారు. ప్రమాణాలంటూ జోగి విసురుతున్న సవాళ్లు హాస్యాస్పదం" అని శనివారం ఓ ప్రకటనలో బ్రహ్మంచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫర్నిచర్ దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

సెల్లార్లో చిక్కుకున్న ఐదుగురు! ◆ పొగతీవ్రతతో సహాయక చర్యలకు ఆటంకం ◆ హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఘటన

ఈనాడు, హైదరాబాద్, అబిడ్స్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో భవనమంతా మంటలు వ్యాపించడంతో బయటకు రాలేక ఐదుగురు లోపలే చిక్కుకున్నారు. దట్టమైన పొగలు వ్యాపించటంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. నాంపల్లి స్టేషన్‌రోడ్‌లోని హిందీ ప్రచార్‌సభ భవనం పక్కన సాయి విశ్వాస్ చాంబర్స్ ఐదంతస్తుల భవనంలో బచ్చాస్ ఫర్నిచర్ దుకాణం ఉంది. శుక్రవారం రాత్రి కంటైనర్‌లో చైనా నుంచి భారీగా ఫర్నిచర్ వచ్చింది. దాన్ని రెండు సెల్లార్లలో భద్రపరిచారు. దుకాణంలో సుమారు 22 మంది పనిచేస్తున్నారు. అక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న యాదయ్య, లక్ష్మి దంపతులు. తమ ఇద్దరు పిల్లలు ప్రణీత్(11), అఖిల్(7)లతో కలసి సెల్లార్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లల్ని సెల్లార్‌లోనే ఆడుకోవాలని చెప్పి తల్లిదండ్రులు పనిమీద బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భవనంలోని రెండు సెల్లార్లలో అగ్నిప్రమాదం సంభవించింది. పొగలు రావడం గమనించి సిబ్బంది బయటకు పరుగులు తీశారు. దుకాణంలో పనిచేస్తున్న సుల్తాన్‌పూర్ నివాసి మహ్మద్ ఇంతియాజ్(27), శాస్త్రిపురం ప్రాంతానికి చెందిన సయ్యద్ హబీబ్(40)లు.. సెల్లార్‌లో చిక్కుకున్న ప్రణీత్, అఖిల్, బీబీ(55) అనే వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చేందుకు లోపలికి వెళ్లి.. తిరిగి రాలేదు. సెల్లార్‌లో మొత్తం ఐదుగురు ఉన్నారని అక్కడ పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. మధ్యాహ్నం 1.15 గంటలకు యజమాని సతీష్ అగ్నిమాపక కేంద్రం, పోలీసు అధికారులకు సమాచారమిచ్చారు. 1.30 గంటలకు అగ్నిమాపకశాఖ సిబ్బంది రంగంలోకి దిగి.. దాదాపు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. భవనంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు రెండు రోబో షైర్లను పంపారు. పొగ దట్టంగా వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. భవనం లోపల, పైఅంతస్తుల్లో ఎవరూ చిక్కుకోలేదని నిర్ధారించారు. సెల్లార్‌లోకి వెళ్లేందుకు అక్కడ నిల్వచేసిన ఫర్నిచర్ అడ్డంకిగా మారింది. నగర సీపీ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సమాచారం అందగానే అగ్నిమాపక, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది మంటలార్పడానికి చేపట్టిన చర్యలను సీపీ వివరించారు. మంటలు అదుపులోకి వచ్చినా పొగ తీవ్రత ఎక్కువగా ఉండటంతో సహాయక బృందాలు లోపలకు వెళ్లలేకపోతున్నాయని చెప్పారు. భవనం లోపల నలుగురు చిక్కుకున్నట్లు భావిస్తున్నామన్నారు. ఇది పెద్ద ప్రమాదమని, ఆక్సిజన్ మాస్క్ మీద మంటలను అదుపులోకి తెచ్చామని అగ్నిమాపకశాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో ఫర్నిచర్ నిల్వ చేశారన్నారు.



నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం సంభవించడంతో భారీ క్రేన్ సాయంతో సహాయక చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

పరిటాల రవి పోరాటాలు ఎప్పటికీ గుర్తుంటాయి

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి : మాజీ మంత్రి పరిటాల రవి పోరాటాలు ఎప్పటికీ గుర్తుంటాయని సీఎం చంద్రబాబు కొనియాడారు. రవి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. పేద ప్రజల కోసం నిరంతరం ఆయన కృషి చేశారని పేర్కొన్నారు.

◆ బలహీన వర్గాల ఉన్నతికి, పేదల హక్కుల పరిరక్షణకు తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర తన జీవితాన్ని అంకితం చేశారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు.

తెదేపా కేంద్ర కార్యాలయంలో పరిటాల రవీంద్ర వర్ధంతి

ఈనాడు, అమరావతి : మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పరిటాల రవీంద్ర వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో రాష్ట్రాల ఆవిర్భావ వేడుకలు

ఈనాడు, అమరావతి: విజయవాడలోని లోక్‌భవన్‌లో శనివారం ఉత్తర్‌ప్రదేశ్, దాద్రానగర్ హవేలీ, దమన్-దీవ్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. 'ఏక్ భారత్- శ్రేష్ఠ్ భారత్'లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొని మాట్లాడారు. 'ఉత్తర్‌ప్రదేశ్ భారతదేశ సాంస్కృతిక రాజధానిగా ప్రసిద్ధిగాంచింది. 3 వేల ఏళ్ల చరిత్ర కలిగి ప్రపంచంలోనే పురాతన నగరాల్లో ఒకటిగా నిలిచిన వారణాసి ఆ రాష్ట్రంలోనే ఉంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తాజ్‌మహల్, శ్రీరాముడు, శ్రీకృష్ణుడి జన్మస్థలాలైన అయోధ్య, మధుర, పవిత్ర నదులు గంగా-యమున-సరస్వతిల త్రివేణి సంగమం వంటి ఎన్నో చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాలకు నెలవు ఉత్తర్‌ప్రదేశ్' అని గవర్నర్ శ్లాఘించారు. 'దాద్రానగర్ హవేలీ ప్రకృతి సౌందర్యానికి నిలయం. పర్యాటక ప్రదేశాలు, పచ్చని అడవులు, అద్భుత జలతీరాలు, పర్వత శ్రేణులు, ప్రశాంత వాతావరణానికి ప్రసిద్ధిగాంచిన ప్రాంతం' అని చెప్పారు. దమన్, దీవ్ కేంద్ర పాలిత ప్రాంతం బహుముఖ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. అంతకుముందు ఉత్తర్‌ప్రదేశ్ శాసనమండలి సభ్యుడు అవనీశ్‌కుమార్ సింగ్ తన సందేశాన్నిచ్చారు. లేఖ్య భరణి కథక్ నృత్య ప్రదర్శనలు, పాలపర్తి నాగేశ్వరరావు, కుమార్ బాబు, మధుబాబుల హిందూస్థానీ సంగీత వాయిద్యాల జుగల్బందీ కార్యక్రమాలు అలరించాయి. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో భద్రతా సిబ్బంది టెండరుపై సందిగ్ధం

- బరిలో ఒక్క సంస్థ నిలవడమే కారణం

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ప్రైవేటు భద్రతా (సెక్యూరిటీ) సిబ్బంది కోసం పిలిచిన టెండరు ఖరారు విషయంలో సందిగ్ధత నెలకొంది. రెండు సంస్థలు మాత్రమే టెండర్లు వేయడం, అందులో ఓ సంస్థ మాత్రమే అర్హత సాధించడంతో.. దానికి టెండరు ఖరారు చేస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏడు ప్రధాన ఆలయాల్లో దాదాపు వెయ్యి మంది భద్రతా సిబ్బంది కోసం ప్రైవేటు ఏజెన్సీ ఎంపికకు టెండరు పిలిచారు. ఇందులో కార్తికేయ సెక్యూరిటీ, ఫస్ట్‌మ్యాన్ సెక్యూరిటీ అనే సంస్థలు బిడ్లు వేశాయి. ఇందులో ఫస్ట్‌మ్యాన్ సెక్యూరిటీ అర్హత సాధించలేదని అధికారులు తేల్చారు. దీంతో కార్తికేయ సెక్యూరిటీ సంస్థ ఒక్కటే బరిలో నిలిచింది. అయితే ఈ సంస్థ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఓ వైకాపా మాజీ ఎమ్మెల్యేకు సన్నిహిత సంబంధాలున్న వ్యక్తికి చెందినదిగా ఆరోపణలు వస్తున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ సంస్థ శ్రీశైలంలో సెక్యూరిటీ, హౌసింగ్ సిబ్బంది కాంట్రాక్టు నిర్వహించింది. ప్రస్తుతం శ్రీశైలంలో సెక్యూరిటీ ఏజెన్సీ కూడా ఆ సంస్థదే. ఓ మంత్రి బంధువు ఈ టెండరును ఖరారు చేయాలంటూ ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో టెండరు వ్యవహారంపై దేవాదాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. సర్కారు ఏం చెబితే, అలా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

అర్హత ఉన్నా.. పక్కన పెట్టారు

టెండరులో తమకు అన్ని అర్హతలు ఉన్నా సరే, అనర్హత కింద పక్కన పెట్టారంటూ ఫస్ట్ మ్యాన్ సెక్యూరిటీ సంస్థ పేర్కొంటోంది. టెండరు నిబంధనల్లో పేర్కొన్న పత్రాలు అందజేశామని, అయినా సరే ఎందుకు పక్కనపెట్టారో చెప్పడం లేదని తెలిపింది. ఏ కారణంతో అనర్హులుగా ప్రకటించారో.. ఆ వివరాలు తెలపాలంటూ దేవాదాయ కమిషనరేట్ అధికారులకు రెండు సార్లు మెయిల్ చేసినా.. స్పందించలేదని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

ఏపీజీఈఏ మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎన్టీఆర్ జిల్లాకు చెందిన పామర్తి లీలావతి, ప్రధాన కార్యదర్శిగా గుంటూరు జిల్లాకు చెందిన పి.హేమలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, రమేష్‌కుమార్ తెలిపారు. కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎం.గాయత్రి (గుంటూరు), కోశాధికారిగా ఇందిరాదేవి (ఎన్టీఆర్ జిల్లా)తో పాటు సహ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా 28 మందిని ఎన్నుకున్నారు. విజయవాడలో మార్చి 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించి, తగిన విధాన నిర్ణయాల కోసం మహిళా విభాగం పనిచేయాలని నిర్ణయించారు.





ఒడ్డుకు కొట్టుకువచ్చిన తాబేళ్ల కళేబరాలను డోలీలో మోసుకెళ్తున్న స్నేహ కళామండలి ప్రతినిధులు ★ కళేబరాలను పూడ్చేందుకు గొయ్యి తవ్వకం

యంత్రాల కోరల్లో.. కూర్మాల విలవిల


వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు సముద్ర తీరానికి కొన్నాళ్లుగా పెద్ద ఎత్తున ఆలివ్ రిడ్లే రకం సముద్ర తాబేళ్ల కళేబరాలు కొట్టుకొస్తున్నాయి. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. కళేబరాలను పక్షులు, కుక్కలు పీక్కుతుంటున్న దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కలచివేస్తున్నాయి. రథసప్తమి సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే యాత్రికులు ఇబ్బంది పడకుండా శనివారం స్థానిక శ్రీగంగాధర సేవా సంఘం, స్నేహకళా మండలి ప్రతినిధులు 120కి పైగా ఆలివ్ రిడ్లేల కళేబరాలను దూరంగా ఇసుక దిబ్బల్లో పూడ్చారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంతతిని పెంచుకోవడానికి ఏటా డిసెంబరు నుంచి మే వరకు గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. ఈ క్రమంలో మెకనైజ్డ్ బోట్ల ఇంజిన్ పంకాలు, నిషేధిత రంగు వలలు తగిలి గాయపడుతున్నాయి. చివరకు చనిపోయి తీరానికి కొట్టుకువస్తున్నాయి. తీరానికి దగ్గర్లో మెకనైజ్డ్ బోట్లు తిరగకుండా అటవీ, మత్స్య శాఖల సిబ్బంది పర్యవేక్షించాల్సి ఉంది. జీవ వైవిధ్యానికి దోహదపడే ఆలివ్ రిడ్లను కాపాడేందుకు సంరక్షణ కేంద్రాలతో పాటు గాయపడిన వాటికి చికిత్స అందించేలా ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉంచాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

'300 మంది అమరావతి రైతుల చావుకు జగనే కారణం'

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో మూడు రాజధానుల పేరుతో జగన్ ఆడిన మూడు ముక్కలాటతో సుమారు 300 మంది అమరావతి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య ధ్వజమెత్తారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేకపోతే... మీ దృష్టిలో రాజధాని అంటే ఏంటో చెప్పాలని జగన్‌ను నిలదీశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "కూటమి ప్రభుత్వంలో అమరావతి నిర్మాణ పనులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరాయంగా జరుగుతున్నాయి. సుమారు 13 వేల మంది కార్మికులు అహర్నిశలూ శ్రమిస్తున్నారు' అని బాలకోటయ్య పేర్కొన్నారు.

చట్టబద్ధపాలన ప్రధాన కాపలాదారు హైకోర్టే

- వ్యవస్థాగత వైఫల్యాలపై అప్రమత్తంగా ఉండాలి
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి



ముంబయి: న్యాయపాలనలోని వ్యవస్థాగత వైఫల్యాలపై హైకోర్టులు అప్రమత్తంగా ఉండటంతో పాటు క్రియాశీలంగానూ వ్యవహరించాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. చట్టబద్ధపాలన ప్రధాన కాపలాదారులు హైకోర్టులేనని తెలిపారు. ముంబయిలో శనివారం ఫాలి నారిమన్ స్మారకోపన్యాసం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. న్యాయం పొందడమనేది క్రియాశూన్యమైన హక్కు కాదు.. రాజ్యం వాగ్దానం చేసిన సేవగా ప్రతి ఒక్కరూ భావించేలా చేయడమే కోర్టుల లక్ష్యం కావాలని తెలిపారు. న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయాన్ని తిరస్కరించడమే కాదు...దానిని ధ్వంసం చేయడం కూడా అని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత బాంబే హైకోర్టు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలోనూ సీజేఐ ఉపన్యసించారు. న్యాయస్థానాల వెలుపలే వివాదాలను పరిష్కరించుకునే ప్రక్రియలు బలోపేతం కావాలని ఆకాంక్షించారు. 'ఎంత నైపుణ్యంతో వివాదాలపై తీర్పులు వెలువరించామన్నది కాదు..ఎంత తెలివిగా వాటిని పరిష్కరించామన్న దానిపైనే న్యాయవ్యవస్థ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మధ్యవర్తిత్వం, రాజీ, సంప్రదింపులు మన సౌలభ్యం కోసం ఏర్పాటుచేసుకున్న ప్రత్యామ్నాయాలు కాదు..పరిణత చెందిన న్యాయవ్యవస్థకు అవి ఉపకరణాలు' అని తెలిపారు. మధ్యవర్తిత్వ ప్రక్రియ... మానవ సంబంధాలను పరిరక్షించడంతో పాటు ఖర్చులను తగ్గించి, జాప్యాన్ని నివారిస్తుందన్నారు. ఎక్కడైతే న్యాయవ్యవస్థ శక్తియుక్తులు వాస్తవంగా అవసరమవుతాయో అక్కడ దృష్టిని కేంద్రీకరించేలా చేయటానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

పార్టీతో కొన్ని సమస్యలున్నాయి.. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా: శశిథరూర్



కోళికోడ్: పార్టీతో తనకు కొన్ని సమస్యలున్నాయని, వాటిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. పార్లమెంటులో తాను ఎప్పుడూ కాంగ్రెస్ నియమావళిని ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. అంతర్గత విభేదాలను పార్టీతోనే చర్చిస్తానని, మీడియాతో కాదని స్పష్టం చేశారు. కేరళ లిటరేచర్ ఫెస్టివల్(కేఎల్ఎఫ్)లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పైనే తనకు పార్టీతో అభిప్రాయభేదాలు ఉన్నాయన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు విదేశాలకు వెళ్లిన దౌత్యబృందాల్లో థరూర్ ఉన్న విషయం తెలిసిందే. అప్పుడు ఆయన వ్యవహారశైలిపై సొంత పార్టీ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తన వైఖరిని సమర్థించుకున్నారు. ఈ విషయంలో ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు పహల్గామ్‌పై తాను రాసిన ఆర్టికల్ గురించి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రదాడులకు తగినవిధంగా సైనిక ప్రతిస్పందన ఉండాలని స్పష్టంచేసినట్టు తెలిపారు. ఆర్టికల్‌లో తాను చెప్పినట్లుగా.. కేంద్ర ప్రభుత్వం ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయడం ఆశ్చర్యపరిచిందన్నారు. దేశ భద్రత అంశంలో మనకు దేశమే ప్రాధాన్యమన్నారు.

మృతదేహాన్ని 8 కి.మీ. ఈడ్చుకెళ్లిన కారు



ఇంటర్నెట్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని జిల్లా కేంద్రమైన బదాయూలో దారుణం చోటుచేసుకుంది. కారు కింద చిక్కుకుపోయిన మృతదేహాన్ని ఓ వ్యక్తి 8 కిలోమీటర్లకు పైగా ఈడ్చుకెళ్లాడు. రోడ్డు పక్కన వెళ్తున్నవారు చూసి వాహనం ఆపడంతో ఆయనకు విషయం తెలిసివచ్చింది. శుక్రవారం రాత్రి సదర్ కొత్వాలి ప్రాంతంలో స్థానికులు కారును ఆపి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారు నడుపుతున్న పర్వేంద్ర ప్రతాప్‌సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహం కారు కింద ఎలా చిక్కుకుందో తనకు తెలియదని, కారును ఏదో ఢీకొన్నట్లు అనిపించిందని.. దిగి చూద్దామంటే వర్షం వల్ల సాధ్యపడలేదని అతడు పోలీసుల విచారణలో తెలిపాడు. అసలేం జరిగింది?.. మృతదేహం కారు కింద ఎలా చిక్కుకుందనే వివరాలు తెలుసుకోడానికి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మృతుడిని ఇదే జిల్లాలోని బిల్సీ ప్రాంతానికి చెందిన ఘలేంద్ర (50)గా గుర్తించారు.

గుజరాత్‌లో పక్కాగా ఓట్ల చోరీ: రాహుల్

దిల్లీ: గుజరాత్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ(సర్) పేరిట జరుగుతున్నది పక్కా ఓట్ల చౌర్యమని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ శనివారం 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ చోరీ కుట్రలో ఎన్నికల సంఘం కీలక భాగస్వామి అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసే కుల, మత వర్గాల ఓట్లను పద్ధతి ప్రకారం తొలగించారని రాహుల్ ఆరోపించారు. భాజపా ఓడిపోతానని భావించిన చోట్ల పెద్దఎత్తున ఓటర్ల పేర్లను గల్లంతు చేశారని తెలిపారు. ఈ అక్రమం ఒక్క గుజరాత్ లోనే కాదు, సర్ కార్యక్రమం నడుస్తున్న రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోనూ జరుగుతోందని అన్నారు.

గిరిజనుల గొంతు నొక్కుతున్నారు..

నికోబార్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ విమర్శలు

దిల్లీ: పర్యావరణానికి పెను ముప్పుగా మారే గ్రేట్ నికోబార్ ప్రాజెక్టును కేంద్రం మొండిగా ముందుకు తీసుకెళ్తోందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. ఈ అంశంపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నా, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఇవన్నీ నిర్లక్ష్య మోదీ ప్రభుత్వంపై ప్రభావం చూపడంలేదంటూ కేంద్రం తీరును 'ఎక్స్' వేదికగా ఎండగట్టారు. కోల్‌కతా హైకోర్టులో దీనిపై పిటిషన్లు విచారణలో ఉన్నాయని, జాతీయ హరిత ట్రైబ్యునల్ కూడా ఈ కేసును పరిశీలిస్తోందని తెలిపారు. లిటిల్, గ్రేట్ నికోబార్ దీవుల్లోని ఆదివాసీ గిరిజనుల హక్కులను కాలరాస్తున్నారని, వారసత్వంగా వచ్చిన భూముల్ని వదులుకునేలా వారిపై పాలనా వ్యవస్థ ఒత్తిడి తీసుకువచ్చిందని ఆరోపించారు.

మెటాలో టీనేజర్లకు 'ఏఐ పాత్రలు' దూరం

శాన్ ఫ్రాన్సిస్కో: కృత్రిమ మేధ (ఏఐ) పాత్రలు టీనేజర్లకు తాత్కాలికంగా అందుబాటులో ఉండబోవని మెటా సంస్థ ప్రకటించింది. దీనికి సంబంధించి సరికొత్త వ్యవస్థ సిద్ధమయ్యేవరకూ ఈ నిర్ణయం అమలవుతుందని తెలిపింది. మెటాకు అందించిన డేటా ప్రకారం మైనర్లుగా ఉన్నవారికి, వయసు అంచనా పరిజ్ఞానం ఆధారంగా తాము టీనేజర్లుగా గుర్తించిన వారికి అది అమలవుతుందని పేర్కొంది. మెటా, టిక్‌టాక్, యూట్యూబ్‌ల యాప్‌ల వల్ల చిన్నారులకు హాని జరుగుతోందన్న ఆరోపణలపై ఈ సంస్థలు అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో విచారణను ఎదుర్కొనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం వెలువడింది. అయితే టీనేజర్లు మెటాకు చెందిన ఏఐ అసిస్టెంట్ సేవలను పొందొచ్చు.

ఎవరో తరుముకొస్తున్నట్లు ఎస్ఐఆర్ ప్రక్రియ

- ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదం
- ఈసీ తీరుపై నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ అసంతృప్తి



కోల్‌కతా: ఎన్నికల సంఘం (ఈసీ) చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎవరో తరుముకొస్తున్నట్లు ఈ ప్రక్రియను చేపడుతున్నారని, ఇది ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేసే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. అమెరికాలో ఉంటున్న సేన్.. ఓ వార్తా సంస్థతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. 'ఎస్ఐఆర్ లాంటి కీలక పనులకు తగిన సమయం కేటాయించి, అత్యంత శ్రద్ధతో, నిబద్ధతతో పనిచేయాలి. పశ్చిమ బెంగాల్‌లో అది కనపడటం లేదు. ధ్రువపత్రాలు సమర్పించడానికి సమయం ఇవ్వకుండా ఓటర్లను ఇబ్బంది పెడుతున్నారు. ఎప్పుడో గ్రామీణ ప్రాంతాల్లో జన్మించిన వారిని ఇప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురమ్మంటే ఎలా?' అని ప్రశ్నించారు. సేన్ జన్మించినప్పుడు ఆయన తల్లి వయసు.. నమ్మదగినదిగా లేదంటూ ఆయనకు ఎన్నికల సంఘం ఇటీవల నోటీసు పంపింది. దాని గురించీ అమర్త్యసేన్ ప్రస్తావించారు.

'నా సొంత నియోజకవర్గం శాంతినికేతన్. అక్కడ నా వ్యక్తిగత వివరాలన్నీ రికార్డుల్లో ఉన్నాయి. అయినా అధికారులు నా అర్హతలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. నేను పుట్టినప్పుడు మా అమ్మగారి వయస్సు ఎంత అని అడిగారు. మా అమ్మ కూడా ఓటరుగా ఉంటే, ఆమె వివరాలు వారి వద్దే ఉంటాయి కదా?' ప్రశ్నించారు. స్నేహితుల సాయంతో ఈసీకి వివరణ ఇచ్చానని, ఈ వ్యవహారం సమసిపోయిందని సేన్ తాజాగా వెల్లడించారు. అయితే తనకున్న వనరులు, సహకారం పేదవారికి ఎలా ఉంటాయని ఆయన ప్రశ్నించారు.

రాజకీయ ప్రయోజనాల మాటేమిటి?

ఎస్ఐఆర్ వల్ల ఏదైనా రాజకీయ పార్టీకి లబ్ధి చేకూరుతుందా? అనే ప్రశ్నకు అమర్త్యసేన్ బదులిస్తూ.. 'భాజపా ప్రయోజనం పొందుతుందని కొంత మంది అంటున్నారు. అది నిజమో, కాదో నాకు తెలియదు. కానీ ఈసీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి. ఎవరు లాభపడతారనేది ముఖ్యం కాదు' అని అభిప్రాయపడ్డారు.



ఇండోనేసియాలోని పాసిర్‌లాంగూ గ్రామంలో విరిగిన మట్టిచరియలు

ఇండోనేసియాలో విరిగిన మట్టిచరియలు

- 8 మంది మృతి
- మరో 82 మంది గల్లంతు

జకార్తా: ఇండోనేసియాలోని జావా ద్వీపంలో దుర్ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షాలు, వరదలకు మట్టిచరియలు విరిగిపడి 8 మంది మృతి చెందారు. మరో 82 మంది గల్లంతయ్యారు. కొన్ని రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు ఇక్కడి వెస్ట్ బాండుంగ్ జిల్లాలోని పాసిర్‌లాంగూ గ్రామంలో వరదలు పోటెత్తాయి. ఆ ధాటికి శనివారం ఉదయం 34 ఇళ్లపై ఒక్కసారిగా మట్టిచరియలు విరిగిపడటంతో ఈ విషాదం చోటుచేసుకుంది. బురద, శిథిలాల కింద చిక్కుకుపోయిన వారికోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ప్రమాదం నుంచి 24 మంది సురక్షితంగా బయటపడ్డారని ఆ దేశ విపత్తు నిర్వహణ సంస్థ అధికార ప్రతినిధి అబ్దుల్ ముహరి తెలిపారు. గతేడాది డిసెంబరులో సైతం సుమత్రా ద్వీపంలో వరదలు, మట్టిచరియలు విరిగిపడి 1,200 మంది మరణించగా, 7 వేల మందికి పైగా గాయపడ్డారు.



శబరిమల ఆలయంలో సినిమా షూటింగ్!

పథనంథిట్ట: కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయ సన్నిధానంలో సినిమా షూటింగ్ జరిగిందనే ఆరోపణలు రావడంతో అక్కడ మరోసారి వివాదం రాజుకుంది. దీనిపై శనివారం స్పందించిన ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ)...ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు చేపట్టనున్నట్లు వెల్లడించింది. నిషిద్ధ దేవాలయ సన్నిధానం ప్రాంతంలో మలయాళ దర్శకుడు అనురాజ్ మనోహర్ షూటింగ్ చేసినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. "వీడియోలు తీయడానికి అనుమతి కావాలని మనోహర్ బోర్డును కోరినా అందుకు నిరాకరించాం. గుర్తింపు ఉన్న మీడియా వ్యక్తులకు మాత్రమే అనుమతినిచ్చాం. అది కూడా శబరిమల యాత్ర సీజన్‌కు ముందే. ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తును ప్రారంభిస్తాం. డైరెక్టర్ ఎక్కడ షూటింగ్ చేశారో మాకు తెలియదు" అని టీడీబీ నిఘా, భద్రతాధికారి సునీల్ కుమార్ తెలిపారు. ఇదిలాఉండగా... తాను సన్నిధానం ప్రాంతంలో వీడియో తీయలేదని, పంపానది వద్ద తీశానని డైరెక్టర్ మనోహర్ వెల్లడించారు. సన్నిధానం పరిసర ప్రాంతాల్లో ముందస్తు అనుమతి లేకుండా వీడియోలు తీయడం నిషిద్ధం.

ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్

పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకే...

దిల్లీ: ఉగ్రవాదులకు నిధులు సమకూర్చాడన్న ఆరోపణపై అరెస్టయి, ఇక్కడి తిహార్ జైలులో ఉన్న లోక్‌సభ సభ్యుడు ఇంజినీర్ రషీద్ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరు కావడానికి వీలుగా.. దిల్లీ అదనపు సెషన్స్ జడ్జి ప్రశాంత్ శర్మ ఆయనకు శనివారం కస్టడీ పెరోల్ ఇచ్చారు. దీంతో పోలీసులే రషీద్‌ను ఆయన వెళ్లాల్సిన ప్రదేశానికి తీసుకెళతారు. అందుకయ్యే ప్రయాణ ఖర్చులను రషీదే భరించాలి. నిరుడు నవంబరులో కూడా రషీద్ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరు కావడానికి వీలుగా కోర్టు కస్టడీ పెరోల్ ఇచ్చింది. అంతకుముందు జులై-ఆగస్టు వర్షాకాల సమావేశాలకూ ఇదే పద్ధతి అవలంబించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గంలో రషీద్ పోటీ చేయడానికీ కోర్టు తాత్కాలిక బెయిలు ఇచ్చింది. అక్కడ ఇండిపెండెంటుగా పోటీ చేసిన రషీద్ నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపై 2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచారు.